

'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 8.00 | సంపుటి: 16 | సంచిక: 294

SUNDAY Special

ఆదివారం 7-7-2024



కుర్రాళ్లు నిలవలేకపోయారు

జింబాబ్వే గడ్డపై అడుగు పెట్టిన భారత యువ బృందం మెరుపులు చూపించలేకపోయింది. జింబాబ్వేతో జరిగిన తొలి టి20లో 13 పరుగుల తేడాతో పరాజయం పాలైంది.

- వివరాలు 12లో



కుక్క కాటా..?

ఇటీవల వీధి కుక్కలు కాటు వేస్తున్న కేసులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. కుక్కకాటుకు గురైనప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ప్రథమ చికిత్స, తదుపరి చికిత్సలను తెలుసుకుందాం.

- వివరాలు 11లో

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | VIJAYAWADA | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



23న బడ్జెట్

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈనెల 23న లోక్‌సభలో పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు.

వివరాలు 6లో ▸



నీట్‌–యూజీ కౌన్సెలింగ్ వాయిదా

దేశవ్యాప్తంగా వైద్య విద్యా సంస్థల్లో ప్రవేశానికి ఉద్దేశించిన నీట్‌–యూజీ–2024 కౌన్సెలింగ్ వాయిదా పడింది.


వివరాలు 6లో ▸



విరిగిపడిన కొండచరియలు

ఉత్తరాఖండ్‌లోని చమోలి జిల్లాలో కొండచరియలు విరిగిపడడంతో హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు.

వివరాలు 6లో ▸



ఇరాన్ అధ్యక్షుడిగా పెజెష్కియాన్

ఇరాన్ అధ్యక్ష ఎన్నికల్లో మతవాది సయీద్ జలిలిపై సంస్కరణాభిలాషి మసూద్ పెజెష్కియాన్ విజయం సాధించారు.

వివరాలు 6లో ▸

ఉసూరుమనిపించారు

ఏపీ, తెలంగాణ సీఎంలు చంద్రబాబు, రేవంత్ 1.40 గంటల పాటు భేటీ

రాష్ట్ర విభజన అంశాలపై నామమాత్రంగా చర్చ

- డ్రగ్స్, సైబర్ క్రైమ్, మూసీ నది పరిరక్షణ, తదితర అంశాలపై అధిక సమయం కేటాయింపు
- అపరిష్కృత విభజన అంశాలపై చర్చలకు ఇరు రాష్ట్రాలు రెండు కమిటీలు
- రెండు రాష్ట్రాల సీఎస్‌లు, ముగ్గురు చొప్పున అధికారులతో ఒక కమిటీ
- రెండు వారాల్లోగా ఈ కమిటీ భేటీ.. వారి స్థాయిలోని అంశాలకు పరిష్కారం
- సమస్యలు కొలిక్కి రాకపోతే రెండు రాష్ట్రాల మంత్రులతో మరో కమిటీ
- మంత్రుల నిర్ణయాలను అంగీకరించనున్న రెండు రాష్ట్రాల సీఎంలు
- మంత్రుల స్థాయిలో కూడా పరిష్కారం కాని అంశాలపై మరోమారు సీఎంల భేటీ
- డ్రగ్స్, సైబర్ క్రైమ్‌పై పరస్పర సహకారం కోసం కో ఆర్డినేషన్ కమిటీ
- సీఎంల భేటీ వివరాలు వెల్లడించిన ఇరు రాష్ట్రాల మంత్రులు భట్టి విక్రమార్క, సత్యప్రసాద్

10లో


తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని సత్కరిస్తున్న సీఎం చంద్రబాబు

కాలయాపనకే తప్ప.. కార్యాచరణ లేదు

- రెండు రాష్ట్రాల సీఎంల సమావేశం తీరుపై వైఎస్సార్‌సీపీ స్పందన
- కేంద్ర ప్రభుత్వం లేకుండా కమిటీ ఏర్పాటుతో అనేక ప్రశ్నలు
- విద్యుత్ బకాయిలు సాధించే ప్రయత్నం జరిగినట్లు లేదు
- నీటి ప్రాజెక్టుల నిర్వహణపై నిర్ణయం తీసుకోకపోవడం రాష్ట్రానికి అన్యాయం చేసినట్లే.. విలీన మండలాలు, పోర్టులు, టీటీడీ ఆస్తుల మీద వచ్చిన వార్తలపై ప్రకటన లేకపోవడం ప్రజల్లో అనుమానాలు
- మాజీ మంత్రి పేర్ని నాని, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

10లో

ఏపీ పరువు తీసిన బాబు

- రాష్ట్రం నుంచి డ్రగ్స్ రవాణా అవుతున్నాయట!
- కొకైన్, హెరాయిన్ వంటి డ్రగ్స్ కూడా ఇక్కడి నుంచే వెళుతున్నాయా?
- డ్రగ్ కల్చర్‌తో హైదరాబాద్ వణికిపోవడంలో ఏపీ పాత్ర ఉందా?
- విభజన సమస్యల పరిష్కారాన్ని వదిలేసి అనవసర విషయాలపై చర్చ

10లో


కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న అజయ్‌కుమార్‌రెడ్డిని పరామర్శిస్తున్న వైఎస్ జగన్

> ఇదివరకెన్నడూ లేని రీతిలో తమకు ఓటు వేయలేదని వైఎస్సార్‌సీపీ శ్రేణులపై, అభిమానులపై దాడులు చేస్తున్నారు. చంద్రబాబు ప్రోత్సహిస్తున్నందువల్లే నెల రోజులు దాటినా దాడులు, విధ్వంసాలు, దౌర్జన్యాలు ఇంకా కొనసాగుతున్నాయి. మీ వైఖరిలో మార్పు రాకపోతే ఈ చెడు సంప్రదాయ బీజం రేపు చెట్టుగా ఎదిగి మీకూ చుట్టుకుంటుందని గుర్తుంచుకోండి. ఎన్నికల వరకే రాజకీయాలని, ఆ తర్వాత అంతా కలిసి మెలిసి పనిచేసుకునే మంచి వాతావరణాన్ని మీరు కలుషితం చేస్తున్నారు. ఇది మంచి పద్ధతి కాదు. వెంటనే ఆపేయాలని డిమాండ్ చేస్తున్నా.. హెచ్చరిస్తున్నా.
>
> - వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

అరాచకం ఆపండి

సీఎం చంద్రబాబుకు వైఎస్ జగన్ మరోమారు హెచ్చరిక

- కూటమి అధికారంలోకి వచ్చాక చెడు సంప్రదాయానికి తెరలేపారు
- గతంలో ఎన్నికల తర్వాత అందరూ కలిసి ఉండే పరిస్థితి
- ఇప్పుడు భయాందోళన సృష్టిస్తున్నారు.. దాడులతో ఆనందం పొందుతున్నారు
- పులివెందులలో ఇలాంటి సంప్రదాయం మునుపెన్నడూ లేదు
- మీ మోసపూరిత వాగ్దానాల వల్ల 10% ఓట్లు టీడీపీకి షిఫ్ట్ అయ్యాయి
- ఎల్లకాలం అధికారం ఉండదని గుర్తుంచుకోండి.. ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చండి
- మధ్యాహ్న భోజన పథకం సరిగా అందక విద్యార్థుల ఆందోళనలు
- రైతులకు భరోసాలేక.. తల్లులకు అమ్మ ఒడి అందక అల్లాడిపోతున్నారు
- అక్కచెల్లెమ్మలకు ప్రతి నెలా ఇస్తానన్న రూ.1,500 చెల్లించండి
- టీడీపీ దాడిలో గాయపడిన అజయ్‌కుమార్‌రెడ్డికి రిమ్స్‌లో పరామర్శ
- అండగా ఉంటామని భరోసా

2లో

రక్తమోడిన రహదారులు

14లో

ఆ ఇళ్లన్నీ.. బాబు ఖాతాలోకి!

గత ప్రభుత్వంలో దాదాపు పూర్తయిన పేదల ఇళ్లను తమ ఘనతగా చెప్పుకునేలా కూటమి ప్రభుత్వం స్కెచ్

- వంద రోజుల్లో 1.28 లక్షల ఇళ్లు పూర్తిచేస్తామని గొప్పలు
- నిజానికి ఈ ఇళ్లు గత ప్రభుత్వంలోనే శ్లాబ్ దశ దాటిన పరిస్థితి
- ఇందులో చాలా ఇళ్లు ఇప్పటికే పూర్తి
- ఎన్నికల కోడ్ నేపథ్యంలో స్టేజ్ అప్‌గ్రేడేషన్‌కు బ్రేక్

- వివరాలు 5లో



పింఛన్లపై ఫిర్యాదు చేస్తే దాడి చేస్తారా?

- లబ్ధిదారులకు ఇళ్ల వద్ద పింఛన్లు ఇవ్వమనడం తప్పా?
- టీడీపీపై సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు ఆగ్రహం
- శ్రేణులను అదుపులో పెట్టుకోవాలని చంద్రబాబుకు హెచ్చరిక
- పింఛన్లపై పల్నాడు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసిన సీపీఎం నేత రామారావుపై టీడీపీ నేతల దాడి
- చికిత్స పొందుతున్న రామారావును పరామర్శించిన శ్రీనివాసరావు
- దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్

2లో



బిక్కుబిక్కు మంటూ.. రాత్రంతా అడవిలోనే..

టీడీపీ కూటమి అరాచకానికి బెంబేలెత్తిన సుబ్రమణ్యం రెడ్డి కుటుంబం


టీడీపీ కార్యకర్తల ఆధీనంలో ఉన్న సుబ్రమణ్యంరెడ్డి టమాటా పంట

- ఆయన్ని తీవ్రంగా హింసించిన టీడీపీ గూండాలు
- ఇటుకల బట్టీ ధ్వంసం.. ఇటుకల తరలింపు
- టమాటా పంట మార్కెట్‌కు తీసుకెళ్లకుండా అడ్డు
- పోలీసులూ స్పందించకపోవడంతో ప్రాణ రక్షణ కోసం అడవిలోకి
- రాత్రంతా క్రూరమృగాల మధ్య అడవిలోనే..
- టీడీపీ కూటమి దాడులతో వణుకుతున్న చిత్తూరు జిల్లా
- వైఎస్సార్‌సీపీ వారు శరణు కోరి తమ పార్టీలో చేరితే వదిలేస్తామంటున్న టీడీపీ నేతలు

- 10లో

ఈ నెలలో వరుస అల్పపీడనాలు!

- తూర్పు మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం
- అల్పపీడనంగా బలపడితే నేటి నుంచి వర్షాలకు ఆస్కారం
- 15న వాయువ్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం
- 23న తూర్పు బంగాళాఖాతంలో మరొకటి ఏర్పడే అవకాశం.. వీటివల్ల విస్తారంగా వర్షాలు

- 13లో



వైఎస్సార్ జిల్లా పులివెందులలో ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి





వైఎస్సార్ జిల్లా కడపలోని రిమ్స్ ఆస్పత్రిలో ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

అరాచకం ఆపండి

సీఎం చంద్రబాబుకు వైఎస్ జగన్ మరోమారు హెచ్చరిక



రిమ్స్ ఆస్పత్రి వెలుపల ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, కడప: 'రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ వర్గీయులు అరాచకాలు సృష్టిస్తున్నారు. వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారనే కసితో కొందరిని టార్గెట్ చేసి దాడులు చేస్తున్నారు. ఎన్నికల్లో టీడీపీకి ఎదురొడ్డి నిలిచి బాగా పని చేసిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై భౌతిక దాడులకు దిగుతున్నారు. ఆస్తులు ధ్వంసం చేస్తున్నారు. ఇది మంచి సంప్రదాయం కాదు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులను ప్రోత్సహించడం తగదు. ఇప్పటికైనా సీఎం చంద్రబాబు టీడీపీ దుశ్చర్యలను ఆపాలి' అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హెచ్చరించారు. టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన పులివెందుల నియోజకవర్గం వేంపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త అజయ్‌కుమార్‌రెడ్డిని శనివారం మధ్యాహ్నం ఆయన వైఎస్సార్ జిల్లా కడప రిమ్స్ ఆస్పత్రిలో పరామర్శించారు. తాము అండగా ఉంటామని, ఆందోళన చెందొద్దని ధైర్యం చెప్పారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. పులివెందులలో ఇంత వరకు ఇలాంటి సంప్రదాయం లేదన్నారు. గతంలో ఎన్నికల అనంతరం అందరూ కలిసిపోయి పని చేసుకునే వాళ్లని చెప్పారు. ఎన్నికల తర్వాత తమకు ఓటు వేయని వారిపై దాడి చేసి కొట్టే కార్యక్రమం ఎప్పుడూ జరగలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒక భయానక వాతావరణం సృష్టించడానికే ఈ తరహా దాడులు దగ్గరుండి చేయిస్తున్నారని మండిపడ్డారు. ఈ తరహా దాడులతో ఏం సాధిస్తారని తెలుగుదేశం పార్టీని, సీఎం చంద్రబాబును నిలదీశారు. ఈ రకమైన దాడులను ప్రోత్సహించడం ద్వారా చంద్రబాబు చెడు సంప్రదాయానికి బీజం వేస్తున్నారని, రేపు టీడీపీ కార్యకర్తలకూ ఇది చుట్టుకుంటుందని హెచ్చరించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసిన వారిపై దాడులకు పాల్పడటం ద్వారా చంద్రబాబు నాయుడు తెలియని ఆనందం పొందుతున్నారన్నారు. వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

ఎల్లకాలం అధికారం ఉండదు

- ఎల్లకాలం మీరే అధికారంలో ఉండరు. అధికారం మారిన రోజు చంద్రబాబు నాయుడు చేస్తున్న ఈ అన్యాయాలు శిశుపాలుని పాపాలు మాదిరిగా పండే రోజు వస్తుంది. ఆ రోజు ఇవాళ చేస్తున్న చెడు సంప్రదాయం ఆయనకూ చుట్టుకుంటుంది. ఇవాళ అధికార తెలుగుదేశం పార్టీ చేతిలో దెబ్బలు తిన్న ప్రతి ఒక్కరూ రేపొద్దున తిరిగి అదే రీతిన బదులిచ్చేందుకు మీ అంతట మీరే బీజం వేస్తున్నారు. ఇది సరైన పద్ధతి కాదు.
- నాయకులుగా ఉన్న మనలాంటి వాళ్లం ఇలాంటివి ప్రోత్సహించకూడదు. ఈ తరహా దాడులకు పాల్పడే సంప్రదాయం సరికాదు. వీటిని తక్షణం ఆపాలని చంద్రబాబును మరోసారి హెచ్చరిస్తున్నా.

వాగ్దానాల అమలుపై దృష్టి పెట్టండి

- రాష్ట్రంలో మధ్యాహ్న భోజన పథకం నీరుగారిపోతోంది. విద్యార్థులు రోడ్లపైకి వస్తున్నారు. ఏ వ్యవస్థ సరిగా లేదు. తొలుత ఆ వ్యవస్థలను గాడిలో పెట్టడంపై దృష్టి పెట్టండి. తెలుగుదేశం పార్టీ చేసిన మోసపూరిత వాగ్దానాల వల్ల మాకు రావాల్సిన పది శాతం ఓట్లు మీకు వచ్చాయి. మీరిచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని ప్రజలు ఆశిస్తున్నారు. రైతు భరోసా డబ్బులు అందక అన్నదాతలు, అమ్మఒడి అందక పిల్లల తల్లులు ఆశగా ఎదురు చూస్తున్నారు. నెలనెలా అక్కచెల్లెమ్మలకు రూ.1500 ఇస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నా.
- ఇంటింటికీ ఉద్యోగం, అది ఇవ్వలేకపోతే రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామన్న విషయాన్ని గుర్తించుకోవాలి. వాటి కోసం చదువుకున్న పిల్లలందరూ ఎదురు చూస్తున్నారు. ఇటువంటి మంచి కార్యక్రమాలు ఏపీ చేయకుండా రాష్ట్ర వ్యాప్తంగా భయాందోళనలు మాత్రమే క్రియేట్ చేసే దుశ్చర్యలను ఆపాలి. వైఎస్సార్‌సీపీ శ్రేణులెవ్వరూ అధైర్య పడాల్సిన పని లేదు. మేము అండగా ఉంటాం.

ఈ కార్యక్రమంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి, పార్టీ వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల అధ్యక్షులు కె.సురేష్‌బాబు, గడికోట శ్రీకాంత్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్.రమేష్ కుమార్ రెడ్డి, ఆర్టీసీ మాజీ చైర్మన్ ఎ.మల్లికార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పులివెందులలో అక్కచెల్లెమ్మలతో ఆప్యాయంగా మాట్లాడుతున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి





పులివెందులలో అభిమానులతో సెల్ఫీ దిగుతూ..



రిమ్స్ ఆస్పత్రి లోపల ప్రజలకు అభివాదం చేస్తూ...



ఓ చెల్లెమ్మ సమస్యను తెలుసుకుంటూ..



మీడియాతో మాట్లాడుతున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

కడప-పులివెందుల.. నాలుగు గంటలు

మూడు రోజుల జిల్లా పర్యటన నిమిత్తం కడప ఎయిర్‌పోర్టుకు చేరుకున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పార్టీ శ్రేణుల నుంచి ఘన స్వాగతం లభించింది. అక్కడి నుంచి వైఎస్ జగన్ రిమ్స్‌కు బయలుదేరారు. ఈ విషయం తెలుసుకున్న పార్టీ నేతలు, యువకులు, అభిమానులు పెద్ద ఎత్తున రిమ్స్‌కు చేరుకుని స్వాగతం పలికారు. తమ అభిమాన నేతను చూసేందుకు పోటీపడ్డారు. రిమ్స్ ఐపీ విభాగంలో రెండవ అంతస్తులోని సర్జికల్ ఐసీయూలో చికిత్స పొందుతున్న అజయ్‌కుమార్‌రెడ్డిని పరామర్శించి బయటకు రాగానే, రిమ్స్‌లో పని చేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది, ఎంఎన్‌ఓలు, స్టాఫ్ నర్సులు, హెడ్ నర్సులు, వైద్య సిబ్బంది అంతా సెల్ఫీ తీసుకునేందుకు పోటీపడ్డారు. తాము ఎన్నో రోజులుగా మీతో ఫోటో తీసుకునేందుకు ఎదురు చూస్తున్నామని చెప్పారు. వారందరినీ వైఎస్ జగన్ ఆప్యాయంగా పలకరిస్తూ వారితో సెల్ఫీ దిగారు. అక్కడి నుంచి క్యాజువాలిటీ వద్దకు వచ్చారు. ఆ సమయంలో జై జగన్.. నినాదాలతో రిమ్స్ ఆవరణం హోరెత్తిపోయింది. అనంతరం పులివెందులకు రోడ్డు మార్గాన వెళ్తున్నారని తెలుసుకొని.. దారి పొడవునా ప్రజలు గ్రామ గ్రామాన ప్రధాన రహదారిపైకి వచ్చారు. పలువురు పలు సమస్యలపై జగన్‌కు విన్నవించారు. యువతీ యువకులు సెల్ఫీ దిగారు. ఇలా అభిమానం అడ్డుకోవడంతో గంట పాటు సాగాల్సిన ప్రయాణం ఏకంగా నాలుగు గంటలు పట్టింది. అంతకు ముందు గన్నవరం విమానాశ్రయంలో వైఎస్ జగన్‌కు ఎమ్మెల్సీ తలశిల రఘురాం, మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, పెద్దాపురం పార్టీ ఇన్‌చార్జ్ దావులూరి దొరబాబు, విజయవాడ పశ్చిమ పార్టీ ఇన్‌చార్జ్ షేక్ ఆసిఫ్, గొల్లపూడి ఏఎంసీ మాజీ చైర్మన్ కొమ్మా కోట్లు, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ గౌసాని, విజయవాడ రూరల్ జెడ్పీటీసీ సభ్యుడు కాకర్లమూడి సువర్ణరాజు, పార్టీ నాయకులు కొత్తపల్లి రజని, దేవభక్తుని చక్రవర్తి, అవుతు శ్రీనివాసరెడ్డి, శీలం రంగారావు, రామిశెట్టి వెంకటేశ్వరరావు, పలువురు విజయవాడ కార్పొరేటర్లు, పార్టీ నేతలు, కార్యకర్తలు వీడ్కోలు పలికారు.

పింఛన్లపై ఫిర్యాదు చేస్తే దాడి చేస్తారా?

సీఎం చంద్రబాబుపై సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు ఆగ్రహం



ప్రభుత్వాస్పత్రిలో రామారావును పరామర్శిస్తున్న శ్రీనివాసరావు

గుంటూరు/భీమవరం: 'పింఛన్లపై ఫిర్యాదు చేస్తే దాడి చేస్తారా? ఇళ్ల వద్ద పింఛన్లు ఇవ్వమనడం తప్పా?' అంటూ టీడీపీ నాయకత్వంపై సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేట నియోజకవర్గం పరగటిచర్లలో ఇటీవల లబ్ధిదారులకు ఇళ్ల వద్దే ఇవ్వాల్సిన ఎన్టీఆర్ భరోసా పింఛన్లను.. తమ ఇళ్ల వద్దకు వచ్చి తీసుకోవాలంటూ టీడీపీ నేతలు చాటింపు వేయించారు. దీనిపై సీపీఎం నాయకుడు కామినేని రామారావు పల్నాడు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కక్ష పెంచుకున్న టీడీపీ నేతలు శుక్రవారం మూకుమ్మడిగా రామారావు ఇంటిపై దాడి చేశారు. వృద్ధురాలైన ఆయన తల్లిని విచక్షణారహితంగా పక్కకు నెట్టేసి.. దాడి చేయడంతో రామారావు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు ఆయన్ని నరసరావుపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శనివారం రామారావును పరామర్శించి మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కోరారు. ఆస్పత్రి నుంచి డీఎస్పీ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి అదనపు ఎస్పీ లక్ష్మీపతికి శ్రీనివాసరావు వినతిపత్రమిచ్చారు. నిందితులను అరెస్ట్ చేయాలని, బాధితుడికి రక్షణ కల్పించాలని కోరారు. శ్రీనివాస రావు మీడియాతో మాట్లాడుతూ.. 'టీడీపీ నేతలు 70 ఏళ్ల వయసున్న రామారావుపై దాడి చేయడం దారుణం. అడ్డువచ్చిన ఆయన తల్లి(90)ని కూడా పక్కకు నెట్టేశారు. ఈ దాడిని ఖండిస్తున్నాం. సీఎం చంద్రబాబు వెంటనే స్పందించి తమ పార్టీ వర్గీయులను అదుపులో పెట్టుకోవాలి. దాడులు ఆపకపోతే ఏం చేయాలో మాకు తెలుసు' అంటూ హెచ్చరించారు.

ప్రత్యేక హోదాపై ఎందుకు ప్రశ్నించట్లేదు?

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని కేంద్రాన్ని అడిగే అవకాశమున్నా ఎందుకు జంకుతున్నారని సీఎం చంద్రబాబును శ్రీనివాసరావు ప్రశ్నించారు. శనివారం పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, విశాఖ ఉక్కు పరిరక్షణ గురించి ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు అడుగుతారని చంద్రబాబును ప్రశ్నించారు.

హత్యాయత్నం కేసులో నలుగురి అరెస్ట్



నిందితులతో సీఐ చాంద్‌బాషా, పోలీసు సిబ్బంది

వేంపల్లె: శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి అనుచరుడు వేంపల్లె అజయ్‌కుమార్‌రెడ్డిపై దాడి కేసులో 10 మందిపై హత్యాయత్నం కేసు నమోదైంది. సీఐ చాంద్‌బాషా శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. వేంపల్లె టీడీపీ మండల పరిశీలకుడు అజ్జుగట్టు రఘునాథ్‌రెడ్డి, అజ్జుగట్టు రవితేజారెడ్డిలను అసభ్య పదజాలంతో తిట్టడం, సోషల్ మీడియాలో అవహేళన చేశారనే కోపంతో అజయ్‌కుమార్‌రెడ్డిని చంపాలని నిందితులు ప్రయత్నించినట్టు ఫిర్యాదు అందిందన్నారు. అజయ్‌కుమార్‌రెడ్డి సోదరుడు మానీధర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై విచారణ చేపట్టామన్నారు. ఈ కేసులో వైఎస్సార్ జిల్లా పులివెందుల శివారు శిల్పారామం వద్ద గండూరు హిదయతుల్లా, కొండాపురం మండలం డోంకుపల్లి గ్రామానికి చెందిన పందిర్ల శివకుమార్‌రెడ్డి, సింహాద్రిపురం మండలం కోవరంగుట్టపల్లె గ్రామానికి చెందిన మల్లెల మహేశ్వర్, వేముల మండలం నల్లచెరువుపల్లె గ్రామానికి చెందిన రామిరెడ్డి ధరణీశ్వరరెడ్డిని అరెస్ట్ చేశామన్నారు. పులివెందుల రోడ్డులోని స్కూల్ సమీపంలో అజయ్‌కుమార్‌రెడ్డిని హాకీ స్టిక్స్, బండరాళ్లతో కొట్టి గాయపరిచామని నిందితులు చెప్పినట్టు సీఐ తెలిపారు. మిగిలిన వారిని త్వరలో అరెస్ట్ చేస్తామని సీఐ తెలిపారు.

బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం

నివాళులర్పించిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: స్వాతంత్య్ర సమరయోధుడు, దేశ మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం ఘన నివాళులర్పించారు. 'అట్టడుగు వర్గాల అభివృద్ధి కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు బాబూ జగ్జీవన్‌రామ్. స్వాతంత్య్ర సమరయోధుడిగా, కేంద్ర మంత్రిగా, దేశ ఉప ప్రధానిగా దేశానికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయం. ఆయన జీవితం అందరికీ ఆదర్శనీయం. నేడు బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా మనస్ఫూర్తిగా నివాళులర్పిస్తున్నాను' అంటూ వైఎస్ జగన్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

సుప్రీంకోర్టు తీర్పును పరిగణనలోకి తీసుకోవాలి

ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల పదోన్నతులపై ప్రభుత్వానికి కేవీపీఎస్ వినతి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల పదోన్నతుల్లో సుప్రీంకోర్టు తీర్పును పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామికి కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఒ.నల్లప్ప, ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి రాసిన లేఖను శనివారం మీడియాకు విడుదల చేశారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల పదోన్నతుల్లో సంపూర్ణత, సమర్థత చేరిన తర్వాత జనరల్ కేటగిరీలో పదోన్నతులు కల్పించాలని కోరారు. దీని అమలుకు జర్నీల్ సింగ్-2 కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా 'గ్రూప్' యూనిట్ కాకుండా 'కేడర్' యూనిట్‌గా లెక్కించాలని కోరారు. దళిత, గిరిజన ఉద్యోగుల పదోన్నతుల కోసం వేసిన ఐఏఎస్ అధికారుల కమిటీని రద్దు చేయాలన్నారు. 85వ రాజ్యాంగ సవరణ ఆర్టికల్ 16(4) ఎస్సీ, ఎస్టీ ఉద్యోగస్తుల పదోన్నతులతోపాటు తదనంతర సీనియారిటీ కొనసాగుతుందని స్పష్టం చేసిందని దీన్ని దృష్టిలో పెట్టుకుని దళిత, గిరిజన ఉద్యోగులకు పదోన్నతి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎమ్మెల్యే ఇంట్లోనే నన్ను తీవ్రంగా కొట్టారు

- గాయపడిన నేను మంచినీళ్లు అడిగితే అరవింద్‌బాబు బయటకు నెట్టేశారు
- 4న నరసరావుపేట ఎమ్మెల్యే ఇంట్లో జరిగిన దాడిలో బాధితుడి ఆవేదన



గుంటూరు: నరసరావుపేట టీడీపీ ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు గృహంలోనే తనపై మారణాయుధాలతో దాడిచేశారని ఆ పార్టీ కార్యకర్త అల్లూరి హరికృష్ణ తెలిపారు. తీవ్రంగా గాయపడిన తనకు కనీసం తాగేందుకు మంచినీళ్లు కూడా ఇవ్వకుండా ఎమ్మెల్యే బయటకు నెట్టేశారని చెప్పారు. 4న నరసరావుపేటలోని ఎమ్మెల్యే అరవింద్‌బాబు గృహంలో తెలుగు తమ్ముళ్లు వర్గాలుగా విడిపోయి తన్నుకున్నారు. ఈ ఘర్షణలో తీవ్రంగా గాయపడిన హరికృష్ణ నరసరావుపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన నుంచి శుక్రవారం రాత్రి వన్‌టౌన్ పోలీసులు ఫిర్యాదు స్వీకరించి 43మందిపై కేసు నమోదు చేశారు. హరికృష్ణ శనివారం ఆస్పత్రిలో మీడియాతో మాట్లాడారు. 'నా సొంత ఊరు నరసరావుపేట మండలం ఇసప్పాలెం. నరసరావుపేట శ్రీనివాసనగర్‌లో ఉంటూ పల్నాడు రోడ్డులో బ్లడ్ బ్యాంకు నిర్వహిస్తున్నాను. 4న సాయంత్రం ఎమ్మెల్యేతో డీఎంహెచ్‌వోకు ఒక ఫోన్ చేయించుకోవాలనే ఉద్దేశంతో ప్రకాష్‌నగర్‌లోని ఆయన ఇంటికి వెళ్లగా... ప్రసాద్, సురేష్, సాయి, రాజేష్, అంకమ్మరాజు, కాళీ, ప్రేమ్‌కుమార్, నవీన్, బొట్టు సాయితోపాటు మరో 40మంది కర్రలు, కత్తులు, ఇనపరాడ్లు పట్టుకుని బైక్‌లపై ఎమ్మెల్యే గృహంలోకి వచ్చి పూలకుండీలు, కుర్చీలు పగలగొట్టారు. అక్కడే నిలబడి ఉన్న నాపై మారణాయుధాలతో దాడి చేయడంతో నా ఎడమ చేయి మోచేతి కిందభాగంలో ఎముక విరిగింది. తల, వీపుపై గాయాలయ్యాయి. అక్కడకు వచ్చిన వారిలో సురేష్ అనే వ్యక్తి నన్ను గుర్తుపట్టి తెలిసిన వాడే అనడంతో వదిలేశారు. ఇంట్లో నుంచి బయటకు వచ్చిన ఎమ్మెల్యేను తీవ్రంగా గాయపడిన నేను తాగేందుకు మంచినీళ్లు ఇవ్వాలని అడిగితే బయటకు నెట్టివేసి లోపలికి వెళ్లిపోయారు. మా గ్రామం టీడీపీకి కంచుకోట. నేను కూడా అరవిందబాబు గెలుపు కోసం తీవ్రంగా కృషి చేశా. అయినా నాకు తాగేందుకు మంచినీళ్లు ఇవ్వలేదు. రెండు రోజులుగా ఆస్పత్రిలో ఉన్నా పరామర్శించేందుకు కూడా ఎమ్మెల్యే రాలేదు.' అని చెప్పారు.

పింఛన్లకు కొర్రీ

రాష్ట్రవ్యాప్తంగా 30 వేల మందికి పైగా అందని పింఛన్

- లాగిన్ గడువు రెండ్రోజులకు కుదింపు ఫలితం
- గత ప్రభుత్వంలో ఇది ఐదు రోజులు
- దూరప్రాంతాల నుంచి వచ్చేవారికీ వెసులుబాటు ఉండేది
- రూ.40.67 కోట్లు ప్రభుత్వానికి జమచేసిన సచివాలయ సిబ్బంది



సాక్షి, భీమవరం : పింఛన్ల పంపిణీలో టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి ప్రభుత్వం తనదైన శైలిలో కొర్రీ పెట్టింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఐదు రోజుల లాగిన్ గడువును ప్రస్తుత ప్రభుత్వం రెండ్రోజులకు కుదించేసింది. దీంతో తర్వాత వచ్చిన వారికి సాయం అందకుండా చేసింది. ఇలా రాష్ట్రవ్యాప్తంగా 30 వేల మందికి పైగా లబ్ధిదారులకు పింఛన్లు అందలేదని అంచనా. జూలై నెలకుగాను రాష్ట్రంలోని వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ తదితర 65,18,496 సామాజిక పింఛన్లకుగాను ఏప్రిల్ నుంచి పెంచిన సాయంతో కలిపి రాష్ట్ర ప్రభుత్వం రూ.ఏడు వేలు చొప్పున రూ.4,400.67 కోట్లు విడుదల చేసింది. రెండ్రోజుల్లో సచివాలయ ఉద్యోగుల ద్వారా 64,58,367 మంది లబ్ధిదారులకు రూ.4,360 కోట్ల సాయాన్ని పంపిణీ చేయించారు. తర్వాత లాగిన్ నిలిపివేయడంతో ఆ తర్వాత వచ్చిన వారికి పింఛన్ అందలేదు. సాయం అందాల్సిన 60,129 మందిలో 30–40 శాతం వరకు మృతులు ఉండగా మిగిలిన వారిలో జీవనోపాధి నిమిత్తం ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారు, బంధువుల ఇళ్లకు వెళ్లిన వారు, అనారోగ్యంతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారే అధిక శాతం మంది ఉన్నారు.

ఇతర ప్రాంతాల్లోని వారికి నిరాశ..

గత ప్రభుత్వంలో ఒకటో తేదీ నుంచి ఐదో తేదీ వరకు పింఛన్ల పంపిణీ చేసేందుకు సచివాలయ ఉద్యోగులకు లాగిన్ గడువు ఉండటంతో మూడు, నాలుగు తేదీల్లో దూర ప్రాంతాల్లో ఉంటున్నవారు వచ్చి పింఛన్ సాయం తీసుకుని వెళ్లేవారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ పింఛన్ తీసుకునేందుకు రాలేని వారి వద్దకు వలంటీర్లు వెళ్లి అందించి వచ్చేవారు. ఇతర జిల్లాలతో పాటు హైదరాబాద్ వరకు కూడా వెళ్లి ఆస్పత్రుల్లోని లబ్ధిదారులకు పింఛన్ సాయం అందించిన వలంటీర్లు ఎంతోమంది ఉన్నారు. కానీ, ప్రస్తుతం సచివాలయ ఉద్యోగుల ద్వారా సాయం అందించినప్పటికీ రెండ్రోజులు మాత్రమే గడువివ్వడంతో చాలావరకు స్థానికంగా అందుబాటులో ఉన్నవారికి మాత్రమే వారు పింఛన్లు ఇచ్చారు. గత ప్రభుత్వంలో నిర్ణీత ఐదో తేదీ దాటిన తర్వాత మిగిలిన మొత్తాన్ని జమచేసేవారు. కానీ, ఈసారి మూడో తేదీనే రూ.40.67 కోట్ల మేర మిగిలిన సొమ్మును సచివాలయ సిబ్బంది ప్రభుత్వానికి జమచేసేశారు. గతంలో మాదిరి ఐదో తేదీ వరకు గడువు ఉంటుందని రూ.7,000 పింఛన్ తీసుకునేందుకు దూరప్రాంతాల నుంచి ఎంతో ఆశగా వచ్చిన లబ్ధిదారులు నిరాశతో వెనుదిరగాల్సి వస్తోంది. వచ్చే నెలలో ఈ సాయాన్ని కలిపి అందిస్తారా లేదా? అన్నదానిపై తమకు స్పష్టతలేదని సచివాలయ ఉద్యోగులు అంటున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో మూడువేల మందికి పైగా లబ్ధిదారులకు ఇలా పింఛన్ సాయం అందలేదు.

పింఛన్ల నిలిపివేతపై కోర్టుకు..

బత్తలపల్లి : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేశారన్న కారణంతో పింఛన్లు ఇవ్వకపోవడంపై బాధితులు శనివారం శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం కోర్టును ఆశ్రయించారు. ధర్మవరం నియోజకవర్గం బత్తలపల్లి మండలం మాల్యవంతం పంచాయతీ పరిధిలోని 40 మందికి పైగా అర్హులకు పింఛన్లు ఇవ్వకుండా టీడీపీ నేతలు అడ్డుపడ్డారు. దీంతో లబ్ధిదారులు తమకు ఎందుకు పింఛన్లు ఇవ్వడంలేదంటూ ఈనెల మూడున బత్తలపల్లి ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకుని నిరసన తెలిపారు. ఇదే విషయంపై ఎంపీడీఓ శివనాగప్రసాద్, పంచాయతీ కార్యదర్శి గంగరత్న, వెల్ఫేర్ అసిస్టెంట్ ఫ్రాన్సిస్‌ను ప్రశ్నించారు. పింఛన్లు పంపిణీ చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నప్పటికీ అధికార పార్టీ నేతలు అడ్డుపడటమే కాకుండా ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, కావున తామేమీ చేయలేకపోతున్నామని నిస్సహాయత వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి సత్యకుమార్ దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకుండాపోయిందని అధికారులు అనడంతో విధిలేని పరిస్థితుల్లో లబ్ధిదారులు కోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, మండల మాజీ కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, నాయకులు ప్రతాప్‌రెడ్డి తదితరులతో కలిసి సుమారు 20 మంది లబ్ధిదారులు శనివారం ధర్మవరం కోర్టులో పిటిషన్ వేశారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పింఛన్ పంపిణీ చేయకపోవడం విచారకరమన్నారు. బాధితులకు న్యాయం జరిగేవరకు తాము పోరాటం ఆపేదిలేదని వైఎస్సార్‌సీపీ నాయకులు స్పష్టంచేశారు.

క్లుప్తంగా...

మంత్రిని రానివ్వండి... అప్పుడే సమావేశం

అడ్డుకున్న టీడీపీ వర్గీయులు



శిలాఫలకానికి పెయింట్ వేసిన దృశ్యం

టాస్క్ ఫోర్స్: అన్నమయ్య జిల్లా, సంబేపల్లె మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నాగ శ్రీలక్ష్మి అధ్యక్షతన శనివారం నిర్వహిస్తున్న మండల సర్వసభ్య సమావేశాన్ని టీడీపీ వర్గీయులు అడ్డుకున్నారు. మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డి వస్తేనే మండల సర్వసభ్య సమావేశం నిర్వహించాలని, లేదంటే వద్దంటూ హుకుం జారీ చేశారు. అనంతరం సభాభవనం ముందు భాగంలో ఉన్న శిలాఫలకానికి పెయింట్ వేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. చేసేది లేక సమావేశం ఆదివారానికి వాయిదా వేసినట్లు అధికారులు ప్రకటించారు.

శ్యామాప్రసాద్ ముఖర్జీకి బీజేపీ ఘన నివాళి

సాక్షి, అమరావతి: బీజేపీ సిద్ధాంతకర్త డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రి సత్యకుమార్, పార్టీ నాయకులు చంద్రమౌళి, అడ్డూరి శ్రీరాం, పాతూరి నాగభూషణం, షేక్ బాజీ, సామంచి శ్రీనివాస, బబ్బూరి శ్రీరాం, కిలారు దిలీప్, మువ్వల వెంకట సుబ్బయ్య, పియూష్ తదితరులు పాల్గొన్నారు.

ఒలింపిక్ క్రీడాకారులకు మంత్రి మడిపల్లి అభినందన

సాక్షి, అమరావతి: ప్యారిస్ ఒలింపిక్స్–2024లో భారతదేశం తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర క్రీడాకారులను ఆంధ్రప్రదేశ్ క్రీడాశాఖ మంత్రి మడిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, శాప్ వైస్ చైర్మన్ అండ్ ఎండీ ప్రద్యుమ్న అభినందిస్తూ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 26 నుంచి ఆగస్టు 11 వరకు ఒలింపిక్స్‌తో పాటు ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు ప్యారిస్‌లోనే పారా ఒలింపిక్స్ జరగనున్నాయి. ఇక్కడ జరిగే వివిధ క్రీడాంశాల్లో ఏపీకి చెందిన పీవీ సింధు, ఆర్.సాత్విక్ సాయిరాజ్, (బ్యాడ్మింటన్), బొమ్మదేవర ధీరజ్ (ఆర్చరీ), యర్రాజి జ్యోతి (100 మీటర్ల అథ్లెటిక్స్), దండి జ్యోతికశ్రీ (400 మీటర్ల రిలే అథ్లెటిక్స్), కె.నారాయణ (పారా రోయింగ్), షేక్ అర్షద్ (పారా సైక్లింగ్) పాల్గొంటున్నారు.

మిర్చి విత్తన తయారీ కంపెనీపై దాడి

రూ 5,80,500 విలువగల విత్తనాలు సీజ్



రికార్డులు తనిఖీలు చేస్తున్న స్క్వాడ్

గుంటూరు రూరల్: గుంటూరు జిల్లాలోని ఓ మిర్చి విత్తన తయారీ కంపెనీపై దాడి చేసి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న విత్తన నిల్వలను స్టేట్ అగ్రికల్చర్ అండ్ విజిలెన్స్ స్క్వాడ్ శనివారం సీజ్ చేసింది. స్క్వాడ్ ఏడీఏ డి.బాలాజీనాయక్ తెలిపిన వివరాల మేరకు.. రాష్ట్ర కమిషనర్ ఆదేశాలతో పెదపలకలూరు గ్రామంలోని శ్రీ సత్య అగ్రిబయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ మాన్యుఫ్యాక్చరింగ్, అండ్ ప్రాసెసింగ్ యూనిట్‌పై దాడి చేసి తనిఖీలు చేశామన్నారు. స్టాక్ బోర్డు ప్రకారం ఉన్న మిర్చి విత్తనాల్లో ఎస్‌సీపీహెచ్ 279 అనే హైబ్రిడ్ రకానికి చెందిన విత్తన నిల్వల్లో తేడా ఉందని చెప్పారు. స్టాక్ కంటే ఎక్కువగా ఉన్న రూ.5,80,500 విలువ చేసే 645 ప్యాకెట్ల విత్తన నిల్వలను సీజ్ చేశామని తెలిపారు. కంపెనీపై 6ఏ కేసు నమోదు చేసి స్టాకును జేసీ కోర్టుకు అందజేయాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. తనిఖీల్లో గుంటూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.సునీల్, విజిలెన్స్ సీఏ ఎం. శ్రీనివాసులురెడ్డి, మండల వ్యవసాయ అధికారి ఐ.సుబ్రమణ్యం, అర్బన్ 1 వ్యవసాయ అధికారి సునీల్ పాల్గొన్నారు.

టీడీపీ వేధింపులు తాళలేక స్వచ్ఛందంగా షాపు తొలగింపు



షాపు తొలగించుకుంటున్న వెంకటరెడ్డి

నెహ్రూనగర్: ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులే లక్ష్యంగా వారిని అన్ని రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. గుంటూరు 42వ వార్డులో వైఎస్సార్‌సీపీ సానుభూతి పరుడైన పులుసు వెంకటరెడ్డి తన జీవనోపాధి కోసం వార్డులో ఓ దుకాణం ఏర్పాటు చేసుకున్నాడు. స్థానిక టీడీపీ నాయకులు కావాలనే ఆయనను టార్గెట్ చేస్తూ దుకాణంపై నగరపాలక సంస్థకు ఫిర్యాదు చేయించారు. టౌన్ ప్లానింగ్ సిబ్బంది సహకారంతో షాపును కూల్చేందుకు చర్యలకు ఉపక్రమించారు. ఈ క్రమంలో లక్షలు పెట్టి నిర్మాణం చేసుకున్న షాపును కూల్చేస్తే మరింత నష్టపోయే పరిస్థితి ఉందని గ్రహించి..తానే స్వచ్ఛందంగా షాపును తొలగించుకున్నాడు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఆర్థిక సాయం

కూటమి నేతల దాడుల్లో గాయపడ్డవారికి భరోసా



పశ్చిమగోదావరి జిల్లా, వీరవాసరంలో బాధితుడికి సాయం అందిస్తున్న దృశ్యం



కృష్ణాజిల్లా, మచిలీపట్నంలో రూ.50వేల చెక్కును బాధిత కుటుంబానికి అందజేస్తున్న పేర్ని కిట్టు, మేయర్ వెంకటేశ్వరమ్మ

తెనాలి/మచిలీపట్నం టౌన్/వీరవాసరం: టీడీపీ, జనసేన జరిపిన దాడుల్లో గాయపడిన ముగ్గురు కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆర్థిక సాయం అందించి ఆ కుటుంబాలకు అండగా నిలబడ్డారు. ఎన్నికల ఫలితాల అనంతరం కూటమి నేతలు జరిపిన దాడిలో తీవ్రంగా గాయపడి, ప్రస్తుతం కోలుకుంటున్న వైఎస్సార్‌సీపీ తెనాలి 16వ వార్డు ఇన్‌చార్జి కాళిదాసు సత్యనారాయణను శనివారం మాజీ ఎమ్మెల్యే శివకుమార్, పార్టీ జిల్లా అధ్యక్షుడు మండపాటి శేషగిరిరావు పరామర్శించారు. ఆయనకు రూ.లక్ష ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు. కాగా.. కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని చిలకలపూడి ఎన్టీఆర్ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మిద్దె బాబీ, అతని భార్యపై టీడీపీ శ్రేణులు దాడికి పాల్పడ్డాయి. ఇంట్లోని సామగ్రి, ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. గాయపడిన బాబీ దంపతులు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నా టీడీపీ శ్రేణులు బెదిరించాయి. ఈ ఘటనపై స్పందించిన మాజీ ఎమ్మెల్యే పేర్ని నాని, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కిట్టు బాధిత కుటుంబాన్ని పరామర్శించి, వారి పరిస్థితిని పార్టీ అధిష్టానానికి వివరించారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పంపిన రూ.50 వేల చెక్కును పేర్ని కిట్టు, నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ.. బాధితుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ శీలం భారతి, కార్పొరేటర్లు పాల్గొన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరంలో జనసేన నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలో ఆ పార్టీ నాయకులు దాడులకు పాల్పడ్డారు. దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త లింగంపల్లి సాల్మన్‌రాజును ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాలదుర్గా నాగమల్లేశ్వరరావుబాబు, నాయకులు శనివారం పరామర్శించారు. బాధితుడు సాల్మన్‌రాజుకు రూ.50 వేల చెక్కును సాయంగా అందజేశారు.

సికింద్రాబాద్ - గోవా మధ్య కొత్త బైవీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు

- ప్రధాని, రైల్వేశాఖ మంత్రులకు ధన్యవాదాలు తెలిపిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాలనుంచి గోవా వెళ్లే ప్రయాణికులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. సికింద్రాబాద్ నుంచి వాస్కోడగామా (గోవా) వెళ్లేందుకు కొత్త ఎక్స్‌ప్రెస్ రైలును (17039/17040) ప్రారంభించనుంది. ఈ బై వీక్లీ రైలు బుధ, శుక్రవారాల్లో సికింద్రాబాద్ నుంచి బయల్దేరి గోవా నుంచి గురువారం, శనివారం తిరుగు ప్రయాణం అవుతుంది. ఇప్పటివరకు వారానికి ఒక రైలు 10 కోచ్‌లతో సికింద్రాబాద్ నుంచి బయల్దేరి గుంతకల్‌కు చేరుకుని అక్కడ తిరుపతి నుంచి గోవా కు వెళ్లే మరో 10 కోచ్‌లతో కలుపుకుని గోవాకు చేరకునేది. ఇది కాకుండా కాచిగూడ –యలహంక మధ్య వారానికి 4 రోజులు ప్రయాణం సాగించే రైలుకు గోవాకు వెళ్లే 4 కోచ్‌లను కలిపేవారు. ఈ 4 కోచ్‌లను తిరిగి గుంతకల్ వద్ద షాలిమార్ – గోవా మధ్య తిరిగే రైలుకు కలిపి ప్రయాణం సాగించేవారు. అయితే సికింద్రాబాద్ – గోవా మధ్య రైళ్లన్నీ 100 ఆక్యుపెన్సీతో వెళ్లడం, చాలామంది సీట్లు దొరక్క ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ప్రస్తావిస్తూ...రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ఈ ఏడాది మార్చి 16న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి లేఖ రాశారు. మళ్లీ కేంద్రంలో మూడోసారి మోదీ సర్కారు అధికారంలోకి రావడంతో..ఈ ప్రాజెక్టు విషయాన్ని ఇటీవల రైల్వేశాఖ మంత్రిని కలిసిన సందర్భంగా కిషన్‌రెడ్డి గుర్తు చేశారు. దీనిపై అశ్వినీ వైష్ణవ్ సానుకూలంగా స్పందించారు. దీంతో సికింద్రాబాద్–వాస్కోడగామా (గోవా) మధ్య బైవీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభిస్తున్నట్లు రైల్వేశాఖ ప్రకటించింది. త్వరలో ఇది అందుబాటులోకి రానుంది. ఈ రైలు సికింద్రాబాద్, కాచిగూడ, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, గద్వాల్, కర్నూల్ సిటీ, డోన్, గుంతకల్, బెళ్లారి, హోస్పేట, కొప్పల్, గడగ్, హుబ్బళ్లి, ధార్వాడ్, లోండా, క్యాసిల్ రాక్, కులెం, సాన్వోర్‌డెమ్, మడగావ్ జంక్షన్లలో ఆగుతూ వాస్కోడగామా చేరుకుంటుంది. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంపై జి.కిషన్‌రెడ్డి ప్రధాని మోదీ, రైల్వే శాఖ మంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

హామీల అమలు ఎప్పుడు?

- మహిళలు, విద్యార్థులు, రైతులు ఎదురుచూస్తున్నారు
- నిధుల విడుదలతోపాటు నిర్దేశిత తేదీలను ప్రకటించండి
- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు వరుదు కళ్యాణి డిమాండ్

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తుందో చెప్పాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి డిమాండ్ చేశారు. 18 నుంచి 60 ఏళ్ల మహిళలకు నెలకు రూ.1,500, ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి 3 ఉచిత సిలిండర్ల హామీల అమలు కోసం వారంతా ఎదురుచూస్తున్నారన్నారు. విశాఖపట్నంలోని పార్టీ కార్యాలయంలో ఆమె శనివారం మీడియాతో మాట్లాడారు. హామీల అమలుకు కార్యాచరణ ఏదని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై నెలవుతోందని.. పథకాల అమలు ఎప్పుడని నిలదీశారు. ప్రభుత్వ ధోరణి చూస్తుంటే పరిపాలన మీద కంటే కక్ష సాధింపులపైనే ఎక్కువ దృష్టి పెట్టినట్టు అర్థమవుతోందన్నారు. రెడ్ బుక్ అమలు మీద కంటే హామీల అమలు మీద దృష్టి పెట్టాలని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా కళ్యాణి ఇంకా ఏమన్నారంటే..



2014లోనూ ఇలాగే మాటతప్పారు..

కూటమి ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చినప్పుడు కూడా రైతులకు రుణమాఫీ, మహిళలకు డ్వాక్రా రుణమాఫీ చేయలేదు. 2016 నుంచి సున్నా వడ్డీ ఆపేశారు. ఆడబిడ్డ పుడితే రూ.25 వేలు ఇస్తామని ఇవ్వలేదు. మహిళల సొంతింటి కల నెరవేరుస్తామని ఆ హామీనీ నిలబెట్టుకోలేదు. ఇప్పుడు మహిళలకు నెలకు రూ.1,500 ఇస్తామన్నారు. రాష్ట్రంలో మొత్తం మహిళల్లో పెన్షన్ దారులను తీసేస్తే ఈ పథకానికి అర్హత ఉన్న మహిళలు 1.72 కోట్ల మంది ఉన్నారు. ప్రభుత్వం నిజంగా ఈ పథకాన్ని అమలు చేస్తుందా, లేదా అని అందరికీ అనుమానం కలుగుతోంది.

ఆయా పథకాల చెల్లింపులేవి?

మా ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్.. అమ్మ ఒడి, చేయూత, ఆసరా, విద్యాదీవెన, వసతి దీవెన, పెన్షన్లు అన్నీ ఠంచనుగా ప్రకటించిన తేదీనే ఇచ్చారు. చివరలో చేయూత కోసం రూ.4 వేల కోట్లు సిద్ధం చేసి ఉంచారు. అయితే ఆ డబ్బులను మహిళల ఖాతాల్లో వేయనీయకుండా టీడీపీ అడ్డుకుంది. జగనన్న ముఖ్యమంత్రిగా ఉండి ఉంటే ఈ పాటికే డబ్బులు జమై ఉండేవి. ఆ నగదును వెంటనే ప్రభుత్వం మహిళల ఖాతాల్లో వేయాలి. మా ప్రభుత్వంలో అమ్మఒడి కింద ఏటా 44.5 లక్షల మంది మహిళలకు ఐదేళ్లలో రూ.25,809 కోట్లు ఇచ్చాం. స్కూలుకు వెళ్లే ప్రతి బిడ్డకూ తల్లికి వందనం పథకం కింద రూ.15 వేలు ఇస్తామని చంద్రబాబు చెప్పారు. దాదాపు రాష్ట్రంలో కోటి మందికి పైగా స్కూలుకు వెళ్తున్న పిల్లలు న్నారు. కానీ ఇప్పటివరకు ఇవ్వలేదు. అలాగే విద్యాదీవెన, వసతి దీవెన నిధులను ఇవ్వకపోవడంతో విద్యార్థులు అప్పులు చేసి స్కూళ్లు, కళాశాలల ఫీజులు చెల్లించాల్సి వస్తోంది.

అన్నదాతలు అప్పులపాలు

జగనన్న ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రైతులకు పెట్టుబడి సాయం కింద ఏటా రూ.13,500 చొప్పున 50 లక్షల మందికి పైచిలుకు రైతుల ఖాతాల్లో జమ చేశారు. చంద్రబాబు ఏటా రూ.20 వేలు రైతులకు ఇస్తామని చెప్పారు. ఖరీఫ్ ప్రారంభమైపోయినా ఇంతవరకు రైతులకు పెట్టుబడి సాయం అందని దుస్థితి. దీంతో నూటికి రూ.10, రూ.20 వడ్డీలకు అప్పులు తెచ్చి రైతులు వ్యవసాయం చేస్తున్నారు. అలాగే ప్రతి మహిళకు ఇంటికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని కూటమి నేతలు చెప్పారు. రాష్ట్రంలో 2.5 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం కోసం చూస్తున్నారు. అలాగే 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పారు.. ఇవ్వకపోతే నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తామన్నారు. ఇవన్నీ నెరవేర్చడానికి నిర్దేశిత తేదీలు ప్రకటించి నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.

మంత్రి గారి కోసం బంకు ప్రారంభం వాయిదా

బద్వేలులో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంకు ఏర్పాటు

నేడు ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తి

- హఠాత్తుగా వాయిదా వేయించిన టీడీపీ నేతలు
- మున్సిపల్ మంత్రి వచ్చి ప్రారంభిస్తారంటున్న కమిషనర్
- మండిపడుతున్న హెచ్‌పీసీఎల్ అధికారులు

బద్వేలు అర్బన్: బద్వేలు పట్టణానికి ఆదాయాన్నిచ్చే పెట్రోలు బంకు ప్రారంభోత్సవానికి అధికార టీడీపీ నేతలు మోకాలడ్డారు. ఆదివారం జరగాల్సిన ప్రారంభోత్సవాన్ని టీడీపీ నేతల ఒత్తిడితో అధికారులు శనివారం హఠాత్తుగా వాయిదా వేశారు. వైఎస్సార్‌సీపీ నేతృత్వంలోని బద్వేలు మున్సిపాలిటీ పాలకవర్గం పాత గుంతపల్లె పంచాయతీ కార్యాలయం స్థలంలో ఈ బంకు ఏర్పాటు చేసింది. మున్సిపాలిటీకి నెలకు అద్దె కింద రూ.45 వేలు, లీటరు పెట్రోలుకు రూ.3 కమిషన్ ఇచ్చేలా హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ (హెచ్‌పీసీఎల్)తో ఒప్పందం చేసుకుంది. హెచ్‌పీసీఎల్ ఇక్కడ 1.5 కోట్లతో బంకు ఏర్పాటు చేసింది. 5 వేల లీటర్ల పెట్రోలు, 10 వేల లీటర్ల డీజిల్ కూడా సిద్ధం చేసిది. ఆదివారం బంకును ప్రారంభించేందుకు సంస్థ ప్రతినిధులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ తరుణంలో టీడీపీ నేతలు అడ్డుపడ్డారు. దీనిని మున్సిపల్ శాఖ మంత్రితో ప్రారంభించాలని, కమిషనర్ స్వయంగా ఆయన లెటర్‌పాడ్‌పై మంత్రికి ఆహ్వానం పంపాలని వారు హుకుం జారీ చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో బద్వేలు నియోజకవర్గానికి చెందిన టీడీపీ ముఖ్య నాయకురాలు కీలకపాత్ర పోషించినట్లు తెలుస్తోంది. దీంతో బంకు ప్రారంభోత్సవాన్ని కమిషనర్ హఠాత్తుగా వాయిదా వేశారు. ఈ మేరకు హెచ్‌పీసీఎల్‌కు, పాలకవర్గ సభ్యులకు సమాచారమిచ్చారు. ఈ విషయం తెలిసిన వెంటనే హెచ్‌పీసీఎల్ సీనియర్ రీజనల్ మేనేజర్, రిటైల్ మేనేజర్ బద్వేలుకు చేరుకుని మున్సిపల్ కమిషనర్‌తో చర్చించారు. అన్ని ఏర్పాట్లు చేసుకున్నాక ఇలా అర్ధంతరంగా ఆపివేయడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. మున్సిపాలిటీతో లీజు ఒప్పందం రద్దు చేసుకుని సొంతంగా సంస్థే నిర్వహించేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం. అయితే, టీడీపీ నేతలు ఈ బంకు లీజును తామే తీసుకోవాలన్న దురుద్దేశంతోనే వాయిదా వేయించారన్న ఆరోపణలు వస్తున్నాయి. మున్సిపల్ శాఖ మంత్రితో బంకును ప్రారంభించే ఉద్దేశంతోనే ప్రారంభోత్సవాన్ని వారం రోజులు వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఎం. క్రిష్ణ చెప్పారు.

ఆ 'టీడీపీ డీలర్' పై చర్యలు తీసుకోండి

ఎన్‌టీఏ, వైఎస్సార్‌టీఏ డిమాండ్

సాక్షి, అమరావతి: నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం కోరుమానిపల్లె ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడి విధులకు ఆటంకం కలిగించిన టీడీపీ నాయకుడు, రేషన్ డీలర్ విజయభాస్కర్‌రెడ్డి పై కేసు నమోదు చేయాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) డిమాండ్ చేసింది. విధుల్లో ఉన్న ఉపాధ్యాయుడిని అసభ్య పదజాలంతో దూషించిన విజయభాస్కర్‌రెడ్డిని కఠినంగా శిక్షించాలని ఎన్‌టీఏ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కరణం హరికృష్ణ, మాగంటి శ్రీనివాసరావు శనివారం ప్రభుత్వాన్ని కోరారు. ఎంఈవో అనుమతిలేకుండా రేషన్ బియ్యాన్ని పాఠశాల గదుల్లో పెట్టవద్దన్న ఉపాధ్యాయుడిపై టీడీపీ నేత దుర్భాషలాడటాన్ని తీవ్రంగా ఖండించారు. ఘటన జరిగి 6 రోజులు అవుతున్నా బాధిత ఉపాధ్యాయుడికి రక్షణ కల్పించకుండా అధికారులు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. కాగా, ఉపాధ్యాయుడిపై దురుగా ప్రవర్తించి, దుర్భాషలాడిన టీడీపీ నేత, రేషన్‌డీలర్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్(వైఎస్సార్‌టీఏ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.అశోక్ కుమార్‌రెడ్డి, గెడ్డం సుధీర్ డిమాండ్ శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న వ్యక్తిని పాఠశాలకు వచ్చి మరీ అసభ్య పదజాలంతో తిట్టటం సమాజానికి మంచిది కాదన్నారు. రాబోయే రోజుల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే వెంటనే డీలర్ విజయభాస్కర్‌రెడ్డిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రాష్ట్రాభివృద్ధికి సహకరిస్తాం

ఏపీ సహకార సేవల అసోసియేషన్

సాక్షి, అమరావతి: రాష్ట్రాభివృద్ధిలో అన్ని విధాలుగా సహకరిస్తామని ఏపీ కో–ఆపరేటివ్ సర్వీస్ అసోసియేషన్ ప్రకటించింది. అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం రాష్ట్రశాఖ అధ్యక్షుడు ఫణి పేర్రాజు అధ్యక్షతన విజయవాడలోని సహకార భవన్‌లో శనివారం జరిగింది. గత నెలలో పదవీవిరమణ చేసిన జనరల్ సెక్రటరీ స్థానంలో కొత్త జనరల్ సెక్రటరీగా గుంటూరు జిల్లాకు చెందిన జి.సురేశ్ నాయుడిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆర్గనైజింగ్ సెక్రటరీగా కె. వెంకటేశ్వర్లు(ప్రకాశం), జోనల్ సెక్రటరీగా ఎం.శ్యాంప్రకాష్ రెడ్డి (అన్నమయ్య), వైస్ ప్రెసిడెంట్‌లుగా వి.సత్యనారాయణ (రాజమహేంద్రవరం), హెడ్ ఆఫీస్‌కు చెందిన కె.శివయ్య, సెక్రటరీలుగా హెడ్ ఆఫీస్‌కు చెందిన కె.రాజు, బి. గీతావాణి (అనకాపల్లి), కేడర్ సెక్రటరీలుగా కె.సుభాష్ చంద్ర అజాద్, జి. హుస్సేన్ బాషా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఫణి, సురేష్‌నాయుడు మాట్లాడుతూ సహకార వ్యవస్థ నిర్వీర్యం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

డ్రగ్స్ నిర్మూలనకు జాయింట్ యాక్షన్ ప్లాన్

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్



మాట్లాడుతున్న కేసలి అప్పారావు, జిల్లా ఉన్నతాధికారులు

ఎంవీపీకాలనీ(విశాఖతూర్పు): డ్రగ్స్ నిర్మూలనకు పోలీసు, ఎక్సైజ్, విద్య, వైద్య, రైల్వే, మహిళ, శిశు సంక్షేమ శాఖలు సంయుక్తంగా పటిష్ట చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ స్పష్టం చేసింది. ఈ దిశగా జిల్లాల వారీగా ఉన్నతాధికారులు జాయింట్ యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని సూచించింది. రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యుడు గొండు సీతారాం ఆధ్వర్యంలో ''బాలలపై మత్తు పదార్థాల ప్రభావం, మాదక ద్రవ్యాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలు'' అనే అంశంపై విశాఖ జిల్లా ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంవీపీ కాలనీలోని డీఆర్‌డీఏ కార్యాలయంలో మహిళ, శిశు సంక్షేమం, సాధికారత శాఖ ఆధ్వర్యంలో శనివారం ఈ సమావేశం జరిగింది. చైర్మన్ కేసలి అప్పారావు మాట్లాడుతూ సమాజంలో చిన్నారులు డ్రగ్స్ బారిన పడుతున్నారని, గంజాయితో పాటు ఇతర మాదక ద్రవ్యాలు సమాజంలోకి చొరబడకుండా అడ్డుకోవాలని ఆయన కోరారు. ఆయా శాఖల వారీగా మాదక ద్రవ్యాల నివారణ, పిల్లల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని శాఖల అధికారులు నిర్లక్ష్య ధోరణి అవలంబించడాన్ని అప్పారావు తప్పుబట్టారు. కమిషన్ సభ్యుడు గొండు సీతారాం మాట్లాడుతూ చిన్నారుల సంరక్షణను ప్రతి అధికారి సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా డ్రగ్స్ వ్యతిరేక ప్రచారానికి ప్రభుత్వ శాఖలు ప్రాధాన్యమివ్వాలన్నారు. ఈ తరహా సమీక్షలను అన్ని జిల్లా కార్యాలయాల్లో నిర్వహించి చిన్నారులు మాదక ద్రవ్యాల బారిన పడకుండా అడ్డుకట్ట వేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమం, సాధికారతాధికారి జి.జయదేవి, దిశా ఏసీపీ వివేకానంద, జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ వి.సుధీర్ పాల్గొన్నారు.

చార్జిషీట్ నుంచి అమిత్‌షా, కిషన్‌రెడ్డి పేర్లు తొలగింపు

హైదరాబాద్: ఎన్నికల కేసుకు సంబంధించి కేంద్ర మంత్రులు అమిత్‌షా, కిషన్‌రెడ్డిలకు ఊరట లభించింది. ఎన్నికల సమయంలో దాఖలైన కేసులో మొఘల్‌పురా పోలీసులు చార్జిషీట్ నుంచి అమిత్‌షా, కిషన్‌రెడ్డిల పేర్లు తొలగించారు. ఈ నేపథ్యంలో విచారణలో భాగంగా ఈ నెల 10న కోర్టుకు హాజరుకావాలని నాంపల్లి 7వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు గోపిశెట్టి నిరంజన్‌కు నోటీసులు జారీ చేసింది. ఎన్నికల ప్రచారంలో నిబంధనలకు విరుద్ధంగా గత అక్టోబర్ 1న హైదరాబాద్‌లోని శాలిబండ ప్రాంతంలో జరిగిన అమిత్‌షా సభలో చిన్నపిల్లలను వేదికపైకి పిలిచి వారితో బీజేపీ గుర్తును ప్రదర్శింపజేయడమేకాక, నినాదాలు ఇప్పించారని గోపిశెట్టి నిరంజన్ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో అక్టోబర్ 2న మొఘల్‌పురా పోలీస్ స్టేషన్‌లో అమిత్‌షా, కిషన్‌రెడ్డిలతో పాటు మరికొంత మంది బీజేపీ నాయకులపైన పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యర్థాల నుంచి సంపద సృష్టి

డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్



సాక్షి, అమరావతి: వ్యర్థాల నుంచి సంపద సృష్టి చేయవచ్చని.. తద్వారా పారిశుద్ధ్య సమస్యను కూడా అధిగమించవచ్చని డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ అన్నారు. ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణలో అనుసరించాల్సిన విధానాలపై సాలిడ్ అండ్ లిక్విడ్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో 'గార్బేజ్ టూ గోల్డ్' పేరుతో శనివారం మంగళగిరిలోని పవన్‌కళ్యాణ్ నివాసంలో ఒక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థలకు వ్యర్థాల నిర్వహణ, పారిశుద్ధ్య కార్యక్రమాల అమలు ఒక సవాల్‌గా మారిందన్నారు. ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణపై అధ్యయనాలు జరుగుతున్నాయని చెప్పారు. ఇందులో అనుభవమున్న నిపుణులతో ఒక వర్క్‌షాప్ నిర్వహించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించారు. ఇందులో పంచాయతీరాజ్ ప్రతినిధులతోపాటు, వివిధ వర్గాల ప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులను భాగస్వాములు చేయాలని పవన్ సూచించారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఎస్.ఎల్.ఆర్.ఎం ప్రాజెక్ట్ డైరెక్టర్ సి.శ్రీనివాసన్, ఎమ్మెల్సీ పి.హరిప్రసాద్ పాల్గొన్నారు.



ఆయన హెచ్చవలసియున్నది.
నేను తగ్గవలసి యున్నది.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీక్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు: ఆషాఢ మాసం: **తిథి:** శు.విదియ తె.4.25 వరకు (తెల్లవారితే సోమవారం) తదుపరి తదియ
నక్షత్రం: పుష్యమి (పూర్తి 24 గంటలు)
వర్జ్యం: ప.1.29 నుండి 3.09 వరకు
దుర్ముహూర్తం: సా.4.50 నుండి 5.42 వరకు
అమృత ఘడియలు: రా.11.32 నుండి 12.34 వరకు

సూర్యోదయం : 5.34
సూర్యాస్తమయం : 6.35
రాహుకాలం : సా.4.30 నుండి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుండి 1.30 వరకు

ఓం బిర్లా (లోక్‌సభ స్పీకర్)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

ఒకరికి తల వంచటం, తలవంచి ఒకరికి అభివాదం చెయ్యటం రెండూ ఒకటే అవుతాయా?!

మోదీజీకి నేను తలవంచి అభివాదం చేశానని, అది తల వంచటమేనని, స్పీకర్ అంతటి వ్యక్తి ప్రధానికి తల వంచటం ఏమిటని రాహుల్ ప్రశ్న!

నిండు సభలో రాహుల్ నన్నలా ప్రశ్నించి వారం రోజులు కావస్తున్నా, లోక్‌సభ సమావేశాలు ముగిసిపోయినా నన్నింకా ఆ ప్రశ్న వెంటాడుతూనే ఉంది!

నిజానికి నన్ను వెంటాడవలసిన గొప్ప విషయాలు, విశేషాలు చాలానే జరిగాయి. కొత్త లోక్‌సభ తొలి సమావేశాలు గొప్పగా ప్రారంభమై గొప్పగా ముగిశాయి. శ్రీమతి ముర్ము చాలా గొప్పగా ప్రసంగించారు. శ్రీ మోదీజీ అంతకు మించిన గొప్ప ప్రసంగ పాటవాన్ని ప్రదర్శించారు. సభ 103 శాతం సామర్థ్యంతో గొప్పగా పని చేసింది. ఇవే కాదు, గతంలో ఏ లోక్‌సభలోనూ, ఏ ప్రతిపక్ష నాయకుడి మీదా జరగనంత గొప్పగా రాహుల్ ప్రసంగాన్ని ప్రధాన మంత్రి, ఇతర మంత్రులు తిప్పికొట్టడం జరిగింది!



"సభలో ఎలా ఉండాలో అతడికి తెలీదు..." అన్నారు మోదీజీ. "సభలో ఎలా ఉండకూడదో అతడికి తెలీదు..." అన్నారు అమిత్‌షా. "సభలో ఎలా మాట్లాడాలో అతడి తెలీదు" అన్నారు రాజ్‌నాథ్ సింగ్. "సభలో ఎలా మాట్లాడకూడదో అతడికి తెలీదు..." అన్నారు శివ్‌రాజ్ చౌహాన్, భూపేందర్ యాదవ్, కిరణ్ రిజిజు.

ఇవి కదా నాకు గుర్తుకు రావలిసింది. వీటిని కదా నేను మళ్లీ మళ్లీ గుర్తు చేసుకోవలసింది. కానీ రాహుల్ ప్రశ్న ఒక్కటే నాలో మిగిలిపోయింది.

సభలో చాలా పెద్ద విషయాలే మాట్లాడారు రాహుల్! స్పీకర్ స్థానం అన్నది దేశ శాసన వ్యవస్థలో కీలకమైన భాగం అన్నారు! అది కార్యనిర్వాహక వ్యవస్థకు, లేదా ప్రభుత్వానికి ప్రాతినిధ్యం వహించే ప్రధాన మంత్రి అనే వ్యక్తికి లోబడి ఉండదు అన్నారు! అవన్నీ కాదు... "బిర్లాజీ, నేను మీకు కరచాలనం చేసినప్పుడు మీరు నిటారుగా నిలబడ్డారు. మోదీజీ మీకు కరచాలనం చేసినప్పుడు వంగి మీరు ఆయనతో కరచాలనం చేశారు. సభలో ప్రధాని కన్నా స్పీకర్ గొప్ప అని రాజ్యాంగం అంటోంది. అలాంటిది మోదీజీకి మీరు తల వంచటం ఏమిటి? " అన్నారు.

ఆ రోజు నుంచీ అదే ఆలోచిస్తున్నాను. ఒకరికి తల వంచటం, తలవంచి ఒకరికి అభివాదం చెయ్యటం రెండూ ఒకటే అవుతాయా?

రాజ్యాంగంలో స్పీకర్ స్థానం ఎంత ఉత్కృష్టమైనదైనా కావచ్చు, స్పీకర్ స్థానంలోకి రావటానికి కారణమైన వారికి తలవంచి అభివాదం చేయటం రాజ్యాంగ విరుద్ధమా, పార్లమెంటరీ సంస్కృతీ సంప్రదాయాలను మంట కలపటమో అవుతుందా?

"ఆ..! దొరికింది డాడీ..." అంటూ వచ్చింది అంజలి. ఐపీఎస్ తను. యూపీఎస్సీలో ర్యాంకర్. రైల్వే మినిస్ట్రీలో చేస్తోంది. "స్పీకర్ పదవి ఔన్నత్యం గురించి గొప్పవాళ్లు ఎవరైనా గొప్పగా ఎక్కడైనా గొప్పగా ఏవైనా రెండు మాటలు చెప్పారా కాస్త చూసి చెప్పు తల్లీ..." అని అంతక్రితమే నా కూతుర్ని అడిగాను. ఆ గొప్ప వాళ్లు దొరికినట్లున్నారు.

"చెప్పారు డాడీ! గాంధీజీ చెప్పారు. నెహ్రూజీ చెప్పారు. ప్రధాని కంటే స్పీకర్ గొప్ప అని గాంధీజీ 1938 జూలై 17 'హరిజన్' పత్రికలో 'స్పీకర్స్ అండ్ పాలిటిక్స్' వ్యాసంలో రాశారు. ఇక మన తొలి ప్రధాని నెహ్రూజీ... 'స్వేచ్ఛకు చిహ్నం స్పీకర్ హోదా...' అని ఒక సందర్భంలో అన్నారు..." అని చెప్పింది అంజలి.

నవ్వాన్నేను.

"ఏంటి డాడీ?" అంది అంజలి నవ్వుతూ.

"ఏం లేదమ్మా ..." అన్నాను.

స్పీకర్ ఎలా ఉండాలో గాంధీజీ చెప్పారు. నెహ్రూజీ చెప్పారు. ఇన్నేళ్లకు మళ్లీ ఇప్పుడు రాహుల్ చెబుతున్నారు!!

స్వరం మార్చిన బ్రిటన్!

జనతంత్రం



వర్ధెల్లి మురళి

జనాభాపరంగా చూస్తే బ్రిటన్ దేశం ఇంచుమించుగా మన కర్ణాటక రాష్ట్రంతో సమానం. కానీ ఒకప్పుడు రవి అస్తమించనంత మేర విశాల భూభాగాలను తన సింహాసన ఛత్ర ఛాయలోకి తెచ్చుకున్న దేశం బ్రిటన్. ఈ ఘనత (?) న భూతో న భవిష్యతి. భారతదేశ చరిత్రలో మహా సామ్రాజ్యాలను స్థాపించిన మౌర్య, మొఘల్ చక్రవర్తుల ఆధీనంలోని భూఖండాల కంటే బ్రిటిష్ సామ్రాజ్యం తొమ్మిది, పది రెట్లు పెద్దది. అంతేకాకుండా బ్రిటిష్ వాళ్లు మనదేశాన్ని కూడా రెండు శతాబ్దాలు పాలించి పీడించి దేశ సంస్కృతిపై బలమైన ముద్రనే వేశారు. కనుక బ్రిటన్ పార్లమెంట్ ఎన్నికలపై భారతీయులు ఆసక్తి చూపడం చాలా సహజం.

పైపెచ్చు నిన్నటి దాకా ప్రధానిగా ఉన్న రిషి సునాక్ భారతీయ మూలాలున్న వ్యక్తి. భారత జాతీయతనూ, హిందూ మతాన్నీ పర్యాయపదాలుగా మార్చుకున్న మన ఎగువ మధ్య తరగతి శిష్ట వర్గాలకు సునాక్ మరింత ప్రీతిపాత్రుడు. ఆయన కుటుంబం టెన్ డౌనింగ్ స్ట్రీట్ వాకిట్లో దీపావళి కాకరపువ్వొత్తులు కాలిస్తే మనవాళ్లు పులకించిపోవడం కూడా తాజా జ్ఞాపకమే! మన 'ఇన్ఫోసిస్' నారాయణమూర్తి, ఆయన సతీమణి – మోటివేషనల్ స్పీకర్ హోదాలో రాజ్యసభలో అడుగుపెట్టిన సుధామూర్తిల ఏకైక అల్లుడు. అందువల్ల సునాక్ మళ్లీ ప్రధాని అవుతాడా లేదా అనే ఉత్కంఠ భారతీయులకు ఉండటంలో ఆశ్చర్యం లేదు.

సునాక్ ప్రాతినిధ్యం వహిస్తున్న కన్సర్వేటివ్ పార్టీ దారుణంగా ఓడిపోయింది. అయితే ఆయన మాత్రం తన నియోజకవర్గం నుంచి పార్లమెంట్‌కు ఎన్నికయ్యారు. భారతీయ మూలాలున్న వ్యక్తులు 29 మంది ఈ ఎన్నికల్లో గెలుపొందారు. సునాక్ మళ్లీ ప్రధాని కానందుకు బాధపడే భారతీయులెవరైనా ఉంటే వారికి ఈ సంఖ్య పెద్ద ఊరట. ఇటీవల జరిగిన ఇండియన్ పార్లమెంట్ దిగువ సభ ఎన్నికల్లో గెలిచిన ముస్లిం అభ్యర్థుల కంటే బ్రిటన్ దిగువ సభకు ఎక్కువమంది భారతీయులు ఎన్నికయ్యారు.

భారతదేశంతో సంబంధాల విషయంలో కన్సర్వేటివ్, లేబర్ పార్టీల మధ్యనున్న ప్రధాన తేడా కశ్మీర్ అంశంపైనే! ఈ అంశంపై రెఫరెండం జరగాలన్నది లేబర్ పార్టీ పాత విధానం. అయితే ఇప్పుడు అది పెద్దగా పట్టింపులకు పోవడం లేదంటున్నారు. అట్లాగే సునాక్ హయాంలో రెండు దేశాల మధ్య చర్చకు వచ్చిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) పట్ల కొత్త ప్రధాని కెయిర్ స్టార్మర్ కూడా ఆసక్తిగానే ఉన్నట్టు సమాచారం. సునాక్ ప్రధాని కాలేదన్న లోటును ఎక్కువమంది భారతీయ సంతతివారు ఎన్నికల్లో గెలిచి భర్తీ చేశారు. కనుక భారత్‌కు సంబంధించినంత వరకు బ్రిటన్‌లో జరిగిన అధికార బదిలీ ఎటువంటి మార్పులకూ దారితీయకపోవచ్చు.

స్టార్మర్ గెలుపు ఇండియా విషయంలో యథాతథ స్థితి కొనసాగింపే కావచ్చు. కానీ ప్రపంచ రాజకీయ వేదికపై ఓ పెద్ద మార్పు. ఒక గొప్ప ఊరట. మితవాద (రైటిస్టు) భావాల ఉప్పెన పాన్ అట్లాంటిక్ దేశాల రాజకీయాలను కుదిపేస్తున్న తరుణంలో ఒక మధ్యేవాద – వామపక్షంగా గుర్తింపు పొందిన లేబర్ పార్టీ బ్రిటన్‌లో ఆ ఉప్పెనను తట్టుకొని నిలవడం, భారీ విజయాన్ని నమోదు చేయడం విశేషంగానే చెప్పుకోవాలి. ఈమధ్యనే జరిగిన యూరోపియన్ యూనియన్ పార్లమెంట్ ఎన్నికల్లో మితవాద పార్టీలు వాటి తడాఖాను చూపెట్టాయి. ఇటలీ, నెదర్లాండ్స్ ఎన్నికల్లో మితవాద శక్తులు విజయం సాధించాయి. ఫాసిస్టు నేత బెనిటో ముస్సోలినికి అసలు సిసలైన సైద్ధాంతిక వారసురాలు జోర్జా మెలోని ఇటలీ అధ్యక్షురాలయ్యారు. ఇండియన్ రైటిస్టు నాయకుడు మోదీతో సెల్ఫీలు దిగి 'మెలోడీ' పేరుతో ఆమె ట్వీట్ చేసిన సంగతి తెలిసిందే!

ఈ ఏడాది చివర్లో జరగనున్న అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ప్రపంచ మితవాద శక్తులకు సూపర్ బాస్ లాంటి డోనాల్డ్ ట్రంప్ విజయం దాదాపు ఖాయంగా కనిపిస్తున్నది. బ్రిటన్ ఎన్నికల్లో కరుడుగట్టిన మితవాద నాయకుడు నైజెల్ ఫరాజ్ నేతృత్వంలోని 'రిఫార్మ్ యూకే' పార్టీ ఎన్నడూ లేని విధంగా 14



సునాక్ ప్రాతినిధ్యం వహిస్తున్న కన్సర్వేటివ్ పార్టీ దారుణంగా ఓడిపోయింది. అయితే ఆయన మాత్రం తన నియోజకవర్గం నుంచి పార్లమెంట్‌కు ఎన్నికయ్యారు. భారతీయ మూలాలున్న వ్యక్తులు 29 మంది ఈ ఎన్నికల్లో గెలుపొందారు. సునాక్ మళ్లీ ప్రధాని కానందుకు బాధపడే భారతీయులెవరైనా ఉంటే వారికి ఈ సంఖ్య పెద్ద ఊరట. ఇటీవల జరిగిన ఇండియన్ పార్లమెంట్ దిగువ సభ ఎన్నికల్లో గెలిచిన ముస్లిం అభ్యర్థుల కంటే బ్రిటన్ దిగువ సభకు ఎక్కువమంది భారతీయులు ఎన్నికయ్యారు.
భారతదేశంతో సంబంధాల విషయంలో కన్సర్వేటివ్, లేబర్ పార్టీల మధ్యనున్న ప్రధాన తేడా కశ్మీర్ అంశంపైనే! ఈ అంశంపై రెఫరెండం జరగాలన్నది లేబర్ పార్టీ పాత విధానం. అయితే ఇప్పుడు అది పెద్దగా పట్టింపులకు పోవడం లేదంటున్నారు. అట్లాగే సునాక్ హయాంలో రెండు దేశాల మధ్య చర్చకు వచ్చిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) పట్ల కొత్త ప్రధాని కెయిర్ స్టార్మర్ కూడా ఆసక్తిగానే ఉన్నట్టు సమాచారం. సునాక్ ప్రధాని కాలేదన్న లోటును ఎక్కువమంది భారతీయ సంతతివారు ఎన్నికల్లో గెలిచి భర్తీ చేశారు. కనుక భారత్‌కు సంబంధించినంత వరకు బ్రిటన్‌లో జరిగిన అధికార బదిలీ ఎటువంటి మార్పులకూ దారితీయకపోవచ్చు.

శాతం ఓట్లను సాధించింది. ఎన్నో దండయాత్రల తర్వాత ఫరాజ్ పార్లమెంట్‌కు ఎన్నికయ్యారు. ఆ వెంటనే ఫరాజ్‌ను డొనాల్డ్ ట్రంప్ అభినందనల్లో ముంచెత్తడాన్ని చూస్తుంటే ప్రపంచవ్యాప్తంగా మితవాద శక్తుల ఐక్యత అల్లుకుంటున్న సంగతి బోధపడుతుంది. ట్రంప్‌కు అనుకూలంగా మన ప్రధాన మంత్రి ఎన్నికల ప్రచారం చేసిపెట్టిన వైనాన్ని కూడా ఈ కోణంలోంచే చూడాలి.

ఫ్రాన్స్‌లో కూడా ఒక మితవాద సునామీ వేగంగా సన్నద్ధమవుతున్న సూచనలు వెలువడుతున్నాయి. మెరైన్ లీపెన్ నాయకత్వంలోని ఆర్ఎన్ (నేషనల్ ర్యాలీ) అనే పార్టీ అనూహ్యంగా బలం పుంజుకుంటున్నది. ఆమె గతంలో మూడుసార్లు ఫ్రెంచి అధ్యక్ష పదవికి పోటీచేసి ఓడిపోయారు. యూరోపియన్ పార్లమెంట్ ఎన్నికల్లో 32 శాతం ఓట్లు సాధించి లీపెన్ పార్టీ అధ్యక్షుడు... మేక్రాన్ అలయెన్స్‌ను మూడో స్థానానికి నెట్టివేశారు. దీంతో అప్రమత్తమైన మేక్రాన్ పార్లమెంట్ ఎన్నికలకు ఇంకో మూడేళ్ల గడువు ఉన్నప్పటికీ మధ్యంతర ఎన్నికలకు వెళ్లారు. ఈ ఎన్నికలు రెండు దశల్లో జరుగుతాయి.

జూన్ 30న తొలి రౌండ్ జరిగింది. మితవాద ఆర్ఎన్ పార్టీకి 34 శాతం ఓట్లు వచ్చాయి. వామపక్ష కూటమి న్యూ పాపులర్ ఫ్రంట్ 28 శాతం ఓట్లను సాధించింది. మేక్రాన్ నాయకత్వంలోని మధ్యేవాద కూటమికి 21 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. మొదటి రౌండ్ ఎన్నికల్లో 12.5 శాతం (ఎనిమిదో వంతు) ఓట్ల కంటే తక్కువ వచ్చిన వాళ్లను తొలగిస్తారు. ఈ ఆదివారం నాడు రెండో రౌండ్ పోలింగ్ జరుగుతున్నది. తొలి రౌండ్‌లో ప్రజానాడిని గమనించిన మధ్యేవాద – వామపక్ష కూటములు ఈ ఎన్నికల్లో ఏకమయ్యాయి. ఓట్ల బదిలీ జరిగి మితవాద శక్తులను ఈ కూటమి ఓడిస్తుందా, లేదా అన్న సంగతి తేలిపోనున్నది. ఒకవేళ ఆర్ఎన్ పార్టీయే పైచేయి సాధిస్తే మేక్రాన్ అధ్యక్ష పాలనకు ఒడుదొడుకులు తప్పవు.

మేక్రాన్ అధ్యక్ష పదవికి ఇంకో మూడేళ్ల గడువున్నది. సాంకేతికంగా చూస్తే ఆయన తప్పుకోవలసిన అవసరం ఉండదు. మిగిలిన యూరప్ దేశాలతో పోలిస్తే ద్రవ్యోల్బణ ప్రభావాన్ని తగ్గించడంలో మేక్రాన్ సాపేక్షంగా విజయం సాధించినట్టే లెక్క. రాజకీయంగా కూడా మేక్రాన్ మధ్యేవాద మితవాదే (రైట్ ఆఫ్ ది సెంటర్). ఆసియా, ఆఫ్రికా దేశాల నుంచి కొనసాగుతున్న వలసలను నిరోధించడంలో ప్రభుత్వాధినేతలు విఫలమవడం పట్ల యూరప్ ప్రజల్లో అసహనం వ్యక్తమవుతున్నది. అన్ని దేశాల్లోనూ నిరుద్యోగం, ద్రవ్యోల్బణం కవల పిల్లల్లా పెరుగుతున్నాయి. ఈ ఆర్థిక కారణాలు మితవాద రాజకీయ శక్తులకు ఆక్సిజన్ మాదిరిగా పనిచేస్తున్నాయి.

వలసల పట్ల స్థానిక ప్రజల్లో పెరుగుతున్న అసహనాన్ని తగ్గించడానికి రిషి సునాక్ కొంత ప్రయత్నం చేశారు. అక్రమ వలసదారులను గుర్తించి, వారిని మధ్య ఆఫ్రికాలోని రువాండా దేశానికి తరలించి, పునరావాస ఏర్పాట్లు చేయాలని భావించారు. ఈ మేరకు రువాండాతో బ్రిటన్‌కు ఒప్పందం కూడా కుదిరింది కానీ ఎందుకనో అది కార్యరూపం దాల్చలేదు. యూరప్ దేశాలు ఎదుర్కొంటున్న సవాలక్ష సమస్యలకు వలసలే కారణమనే వాదాన్ని కూడా పలువురు వ్యతిరేకిస్తున్నారు. కొన్ని తరాల ముందే వలస వచ్చి ఆ యా దేశాల ఆర్థిక, సాంస్కృతిక అభ్యున్నతిలో భాగస్వాములైన వారిపై కూడా వివక్షాపూరిత దృక్కులు ప్రసరిస్తున్నాయనే ఆందోళన వ్యక్తమవుతున్నది.

ప్రస్తుతం జరుగుతున్న ఫుట్‌బాల్ యూరో కప్ పోటీల ప్రారంభం ముందు ఫ్రాన్స్ స్టార్ ఆటగాడు కిలియన్ ఎంబప్పే చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టించాయి. ''మితవాద రాజకీయ భావాలు అధికారపు వాకిట్లోకి వచ్చి కూర్చున్నాయి. మా విలువల్నీ, మనోభావాల్నీ గౌరవించని దేశం తరఫున ఆడేందుకు మేం సిద్ధంగా లేము''. ఆఫ్రో – యూరోపియన్‌ల మనోభావాలను ఆయన బలంగా వెళ్లగక్కారు. అక్రమ వలసదారులు వస్తున్నారని యూరప్ ప్రజలు నిందిస్తున్న దేశాలన్నీ ఒకప్పుడు యూరప్ దేశాల వలసలే! వంద నుంచి రెండొందల ఏళ్ల పాటు యూరోపియన్లు ఈ దేశాల వనరుల్ని యథేచ్ఛగా దోపిడీ చేశారు. ఆ దేశాల ఆర్థిక మూలుగల్ని పీల్చి పిప్పి చేశారు. ఫలితంగా వలస దేశాల అభివృద్ధి చరిత్ర శతాబ్దాల పర్యంతం ఘనీభవించిపోయింది.

వలస దేశాల సంపదతోనే యూరప్ దేశాలు చాలా కాలంపాటు వైభవోజ్జ్వల అధ్యాయాలను లిఖించుకున్నాయి. ఇప్పుడు ఈ దేశాల్లోకి వలస వస్తున్న ప్రజలకు ప్రతీకారం తీర్చుకునే ఉద్దేశం లేదు. పొట్టకూటి కోసం వారు వస్తున్నారు. ప్రతిభకు తగిన గుర్తింపు కోసం వస్తున్నారు. ఉన్నత విద్య కోసం, అవకాశాల కోసం వారు వస్తున్నారు. వలసలపై యూరప్ దేశాల మితవాదుల వైఖరి ఇట్లా వుంటే... అమెరికా మితవాదుల ధోరణి మరింత ఆశ్చర్యకరంగా ఉన్నది. అమెరికా నిర్మాణానికి వలసలే పునాది. అక్కడి భూమి పుత్రుడెవరు మిగిలారు అమెరికాలో! వాళ్లందరినీ యూరప్ వలసదారులు ఎప్పుడో వేటాడి నిర్మూలించారు. యూరప్ దేశాల ఆశాజీవులు, ఆఫ్రికా నుంచి బంధించి తెచ్చిన బానిసల సహాయంతో పెరిగిన అమెరికా ఒక వలసదారుల దేశం. వలసలకు కేరాఫ్ అడ్రస్. ఆ దేశంలోని ట్రంపిస్టులు కూడా వలసలకు వ్యతిరేకంగా మాట్లాడటం న్యూయార్క్ నగరంలోని స్వేచ్ఛా ప్రతిమ పాద పీఠిక మీద చెక్కిన ఎమ్మా లాజరస్ కవితా పంక్తుల స్ఫూర్తికి విరుద్ధం.

వలస దేశాల సంపదతోనే యూరప్ దేశాలు చాలా కాలం పాటు వైభవోజ్జ్వల అధ్యాయాలను లిఖించుకున్నాయి. ఇప్పుడు ఈ దేశాల్లోకి వలస వస్తున్న ప్రజలకు ప్రతీకారం తీర్చుకునే ఉద్దేశం లేదు. పొట్టకూటి కోసం వారు వస్తున్నారు. ప్రతిభకు తగిన గుర్తింపు కోసం వస్తున్నారు. ఉన్నత విద్య కోసం, అవకాశాల కోసం వారు వస్తున్నారు. వలసలపై యూరప్ దేశాల మితవాదుల వైఖరి ఇట్లా వుంటే... అమెరికా మితవాదుల ధోరణి మరింత ఆశ్చర్యకరంగా ఉన్నది. అమెరికా నిర్మాణానికి వలసలే పునాది. అక్కడి భూమి పుత్రుడెవరు మిగిలారు అమెరికాలో! వాళ్లందరినీ యూరప్ వలసదారులు ఎప్పుడో వేటాడి నిర్మూలించారు. యూరప్ దేశాల ఆశాజీవులు, ఆఫ్రికా నుంచి బంధించి తెచ్చిన బానిసల సహాయంతో పెరిగిన అమెరికా ఒక వలసదారుల దేశం. వలసలకు కేరాఫ్ అడ్రస్. ఆ దేశంలోని ట్రంపిస్టులు కూడా వలసలకు వ్యతిరేకంగా మాట్లాడటం న్యూయార్క్ నగరంలోని స్వేచ్ఛా ప్రతిమ పాదపీఠిక మీద చెక్కిన ఎమ్మా లాజరస్ కవితా పంక్తుల స్ఫూర్తికి విరుద్ధం. ఆ స్వేచ్ఛా ప్రతిమ వలస జీవులను రారమ్మని పిలుస్తున్నట్టుగా ఆ కవితా పంక్తులు ఉంటాయి. ''డస్సిపోయిన మీ జనాలనూ, మీ నిరుపేదలనూ, / స్వేచ్ఛా వాయువులు పీల్చేందుకు తహతహలాడుతున్న మీ సకల కూటములనూ, / మీ తీరాలలో కిక్కిరిసిన తిరస్కృతులనూ, / నిరాశ్రయులనూ, తుపానుల్లో చిక్కుకుపోయిన అభాగ్యులనూ నా దరికి పంపండి. / బంగారు ద్వారం పక్కన దారిదీపాన్ని పైకెత్తి నిలుచున్నాను.'' – (తెలుగు అనువాదం).

మితవాద శక్తుల ప్రభంజనం నేపథ్యంలో బ్రిటన్‌లో లేబర్ పార్టీ గెలుపునకు చాలా ప్రాధాన్యం ఉన్నది. ప్రపంచవ్యాపితంగా వున్న మితవాద రాజకీయ పక్షాలన్నిటికీ మతవాద, జాతివాద సారూప్యతలే కాకుండా ఆర్థిక విధానాల సారూప్యతలు కూడా ఉన్నాయి. కొంతమందే సంపద సృష్టించి, దాన్ని వారే సొంతం చేసుకునే ఆర్థిక కార్యక్రమం వారిది. బ్రిటన్ కొత్త ప్రధాని కెయిర్ స్టార్మర్ భిన్నమైన గళాన్ని ఎన్నికలకు ముందే వినిపించారు. కార్మిక వర్గం కోసం సంపద సృష్టించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజలందరికీ నాణ్యమైన విద్య, వైద్య సేవలను ప్రధాన ఎజెండాగా ప్రకటించారు. న్యాయమైన ఈ ఎజెండాకు బ్రిటన్ ప్రజలు జైకొట్టడం ఆహ్వానించదగిన పరిణామం. వలసదారుడిని ప్రధానిగా చేసిన పార్టీని శిక్షించడానికే ప్రజలు లేబర్ పార్టీని గెలిపించారని కొంతమంది ప్రచారం చేస్తున్నారు. ఇది బ్రిటన్ ప్రజల విజ్ఞతనూ, చైతన్యాన్నీ శంకించడమే!

vardhelli1959@gmail.com

మిగిలేది... మానవత్వ పరిమళమే!

అభిప్రాయం




డాక్టర్ దేవరాజు మహారాజు

సమాజం భ్రష్టు పట్టిపోయింది. మనుషులు జంతువుల్లా ప్రవర్తిస్తున్నారు. నిజమే! కాని, మానవత్వం గల మనుషులు కొందరైనా ఉన్నారు. కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా ప్రవర్తిస్తున్నారు. అయితే, సమాజంలో వీరి శాతాన్ని బాగా పెంచుకోవాల్సిన అవసరం ఉంది.

న్యూజిలాండ్ లోని గ్రేమోత్ లోకల్ మార్కెట్‌లో ఒక దయార్ద్ర హృదయుడు తిరుగుతుంటాడు. రొయ్యల, చేపలూ లాగా అక్కడ ఫుడ్ మార్కెట్‌లో తాబేళ్లను కూడా అమ్ముతారు. మనం చెప్పుకుంటున్న దయార్ద్ర హృదయుడు తాబేలు మాంసం కోసం రాడు. తాబేళ్లను రక్షించడానికి వస్తుంటాడు. బేరమాడి మార్కెట్‌లో బతికి ఉన్న తాబేళ్లన్నింటినీ కొంటాడు. వాటిని ట్రక్కులో వేసుకుని పోయి సముద్రంలోకి వదులుతాడు. అక్కడ తాబేళ్లు అంతరించిపోయే దశలో ఉన్నాయి. అందుకే ఈ పని! ఏదో విధంగా తమ పని గడిస్తే చాలుననుకుంటూ కాలుష్యాలు పెంచుతున్న మనుషుల మధ్య ఎంతో బాధ్యతతో 'మనిషి'లా ప్రవర్తించే వారున్నారు. 'ప్రపంచమేమీ గొడ్డుపోలేదు' అని అన్నది అందుకే! పాపువా న్యూ గినియా – మార్కెట్ల దగ్గరా ఇలాంటి జీవ పరిరక్షకులు ఉన్నారు.

ఇటీవల రాజస్థాన్ జైపూర్‌లో మానవత్వం మతాన్ని గెలిచింది. మధూలిక అనే ఒక 48 ఏళ్ల హిందూ మహిళ 13 మంది ముస్లింల ప్రాణాలు కాపాడింది. భర్త చనిపోయి, ఇద్దరు పిల్లలతో ఒక బట్టల కొట్టు నడుపుకుంటూ జీవిస్తోంది. ఆమె బట్టల కొట్టు ఉన్న ఆ వీధిలో ముస్లింలే ఎక్కువ మంది ఉన్నారు. ఒకరోజు హిందూ వర్గానికి చెందిన గుంపు – శోభాయాత్ర ఊరేగింపు తీస్తూ అల్లర్లు సృష్టించింది. అందులో భాగంగా అక్కడ ఉన్న 13 మంది ముస్లింలపై దాడిచేయడానికి వారి వెంట పడ్డారు. ఇదంతా గమనించిన మధూలిక ప్రాణభయంతో పరిగెత్తుకొచ్చిన ముస్లింలను తన కొట్టులోకి పంపి వెంటనే షట్టర్ వేసేసింది. తర్వాత హిందూ దుండగుల్ని ధైర్యంగా ఎదుర్కొని, చాకచక్యంగా వారిని



వెనక్కి పంపించింది. 'మానవత్వం అన్నిటికన్నా గొప్పదని భావించి, ముస్లిం సోదరులకు ఆశ్రయమిచ్చాన'ని– ఆ తర్వాత ఆమె పత్రికల వారికి చెప్పింది. ఒక సామాన్య మహిళ ఆచరణాత్మకంగా, ఎంతో గొప్ప సందేశం ఇచ్చింది.

హైదరాబాదు పాత బస్తీలో గాజుల అంజయ్య అందరికీ తెలిసినవాడు. అతని మిత్రులలో చాలా మంది ముస్లింలే. 2022, ఏప్రిల్ 17న తన కొడుకు పెళ్ళికి మిత్రులందరినీ ఆహ్వానించాడు. అవి రంజాన్ రోజులు గనుక 'రోజా' పాటించే తన ముస్లిం మిత్రులెవరూ ఇబ్బంది పడకూడదని వారి కోసం నమాజ్ చేసుకోవడానికి ఏర్పాట్లు చేశాడు. ఇఫ్తార్ విందూ ఏర్పాటు చేశాడు. వారంతా మరునాడు ఉపవాసం పాటించేందుకు 'సహారీ' ఏర్పాటు చేశాడు. స్వార్థప్రయోజనాల కోసం విద్వేషాలు నూరిపోసే వారి వలలో పడకూడదనీ, గంగా జమునా తహజీబ్‌ను కాపాడుకోవడం అందరి బాధ్యత అనీ పాతబస్తీ అంజయ్య ఎప్పుడూ చెబుతుంటాడు. ఇలాంటిదే మరో సంఘటన కేరళలో జరిగింది. ఒక ముల్లాగారు తమ మసీదులో హిందూ అమ్మాయి వివాహం జరిపించి అందరికీ ఆదర్శప్రాయుడయ్యాడు.

ముస్లింల, క్రైస్తవుల సఖ్యత గూర్చి కూడా ఒక సంఘటన గుర్తు చేసుకుందాం. ఇది 2022 ఏప్రిల్ 21న మహారాష్ట్రలో జరిగింది. మహారాష్ట్రలోని నాసిక్‌లో ముస్లింలు చర్చిలో నమాజు చదివారు. ఇఫ్తార్ విందుకోసం అజ్మల్ ఖాన్ అనే వ్యక్తి అన్ని మతాల మత పెద్దల్ని ఆహ్వానించాడు. అయితే, అక్కడ చర్చి ఫాదర్ ఆ విందు ఆహ్వానాన్ని అంగీకరించడమే కాకుండా, ఆ ఇఫ్తార్ విందు తమ చర్చిలోనే నిర్వహించాలని సూచించాడు. ఆ రకంగా తొలిసారి ఇఫ్తార్ విందు చర్చిలో, ఫాదర్ పర్యవేక్షణలో జరిగింది. పరమత సహనం, సహకారం అంటే ఇదే కదా! అసలైన భారతదేశపు 'ఆత్మ' అక్కడ తొణికిసలాడింది. ఆత్మ అంటే... ఆత్మ – పరమాత్మలు కావు. అంతరంగంలోని ఒక సమర్పణ భావం! ఆలోచనల ఐక్యత!! గౌరవం ఇచ్చిపుచ్చుకోవడం. మనిషి మనిషిని మనిషిగా గుర్తించి ప్రేమించడం. ఇక్కడ చెప్పుకున్న సంఘటనలన్నింటికీ ఒక అంతస్సూత్రం ఉంది. 'దేవుడు లేడు – మతం అనేది వ్యక్తిగతం – మన చివరి గమ్యం – మానవవాదం' అనేది సాధించడానికి... ఇలా మెల్లమెల్లగా అడుగులు పడుతున్నాయేమో!

క్రమంగా తరతమ భేదాలు మరిచి, మనుషులంతా ఒక్కటే అనే విషయం జీర్ణించుకునేందుకు ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయేమో? మనిషికి మనిషే ముఖ్యం – దేవుళ్ళు కాదు, అనే భావనలోకి సమాజం ప్రయాణిస్తోంది. ఈ సందర్భంగా 'మన మార్గం సుదీర్ఘమైంది. రాబోయే కాలం ఎలా ఉంటుందో తెలియదు. మన పరిమితులు మనకు తెలుసు. ఇరవై ఒకటవ శతాబ్దపు స్త్రీ – పురుషుల్ని అంటే మనల్ని మనం కొత్తగా తయారు చేసుకోవడానికి రోజు వారీగా కృషి చేస్తూనే ఉండాలి' అన్న చే గువేరా మాటలు గుర్తు చేసుకుంటూ ఉండాలి. నిజమే– బూజు పట్టిన భావజాలాన్ని వదిలి, కొంచెం కొంచెంగా పైపైకి ఎదుగుతూనే ఉండాలి. పైకి ఎదిగితేనే (ఎగిరితేనే) అద్భుతమైన మానవత్వ దృశ్యాలు కనబడతాయి.

నువ్వు బతికి ఉన్నావంటే...
నీ జీవితపు విజయోత్సవాన్ని పంచుకో
స్వర్గమనేది ఎక్కడైనా ఉంటే...
దాన్ని భూమి మీదికి దింపుకో–
అని ఎలుగెత్తి చెబుతూ ముందుకు సాగాల్సి ఉంది.

వ్యాసకర్త కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత

బాల్యంలోని భావనలే...

ధృతరాష్ట్రుడికి భీముడంటేనే ఎక్కువ భయం. మిగతా ఎవ్వరి బల పరాక్రమాలను గురించి అంత దిగులుపడేవాడు కాదు. 'భీము దలంచినన్ మనము భీతి గలంగుచు నుండు నాకు, రేలేమియు నిద్ర రాదు' – భీముడిని తలచుకుంటేనే నాకు భయం కలుగుతూ ఉంటుంది. రాత్రులు ఏమీ నిద్ర రాదు – అని ఏ దాపరికమూ లేకుండా భీముడిని గురించిన తన భయాన్ని సంజయుడితో చెబుతాడు. తన ప్రియపుత్రుడైన దుర్యోధనుడి ప్రాణానికి ఆపద పొంచి ఉన్నదంటే అది భీముడి నుంచే అని ధృతరాష్ట్రుడికి వాళ్ళు చిన్నపిల్లలుగా ఉన్నప్పటి నుండీ తెలుసు. 'కౌరవులతో యుద్ధానికి ధర్మరాజు ఏయే బలాలను సమకూర్చుకుంటున్నాడో ఒకసారి చెప్పు' అని అడిగిన ప్రశ్నకు సంజయుడు చెప్పినదంతా విని, 'వాళ్ళందరూ కాదులే! అసలు ప్రమాదం భీముడి నుంచే ఉంది. అతడిని ఎదిరించి నిలబడగల వీరుడు మనవైపు సేనలో ఎవడూ లేడం'టాడు. అంధుడైనప్పటికీ అది ధృతరాష్ట్రుడి నిజమైన అంచనా. కారణం ఏమంటే ధృతరాష్ట్రుడికి ఎవరేమైపోయినా ఫరవాలేదు. దుర్యోధనుడు ఒక్కడు క్షేమంగా ఉంటే చాలు. మనసులో ఆ దిగులుతోనే ఒకనాడు సంజయుడితో ఇలా అంటాడు (ఉద్యోగపర్వం, ద్వితీయాశ్వాసం, 186 తేటగీతి):

జ్యోతిర్మయం

చిఱుతనాడును వాడు నా శిక్ష బోడు;
వీరు చివ్వకు జొత్తురు వైర మెత్తి;
వానిచే బీడ వడియును మాన; రిదియ
కాదె ఈ భేదమున కెల్ల గారణంబు.

'చిన్నప్పటినుండీ వాడింతే! నా మాటను ఏమాత్రం లక్ష్యపెట్టేవాడు కాదు. వీళ్ళు (దుర్యోధనాదులు) వాడిని కదిలించి కయ్యానికి దిగేవారు. అందులోఎప్పుడూ వాడిచేత తన్నులు తినేవారు. అయినా వాడితో గొడవ పడడం మానేవారు కాదు. ఈ కౌరవ పాండవ కలహానికి ఆ తన్నులేగా అసలు కారణం!' అని కురుక్షేత్ర సంగ్రామానికి కారణం రాజ్యంలో సగభాగం అన్న ఆస్తి తగాదా కన్నా, కౌరవ పాండవుల చిన్నప్పటి తగాదాల్లోనే దాని మూల బీజం దాగి ఉందన్న సత్యాన్ని గుర్తించి చెప్పాడు ధృతరాష్ట్రుడుపై పద్యంలో. బాల్యదశలో హృదయంలో నాటుకునే శత్రుత్వ భావనలను పెద్దలు గుర్తించి కూడా పట్టించుకోకుండా వదిలేస్తే, ఆ భావనలే వయసుతో పాటు పెరిగి పెద్దవై మహా సంగ్రామాలకు దారితీస్తాయన్న నిజాన్ని ఒప్పుకోవడానికి ఇంతకంటె మంచి నిదర్శనం చూపలేము.

– భట్టు వెంకటరావు

క్లుప్తంగా...

ఇంద్రకీలాద్రిపై వారాహి నవరాత్రులు ప్రారంభం



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై వేంచేసిన శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఆషాఢ మాసోత్సవాలు, వారాహి నవరాత్రులు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో తొలి రోజున ఆలయ అర్చకులు, వేద పండితులు కుటుంబ సమేతంగా అమ్మవారికి తొలి సారె సమర్పించారు. అమ్మవారికి పట్టుచీర, పూజా సామగ్రితో పాటు శ్రీగంగ, పార్వతీ(దుర్గ) ఉత్సవ మూర్తులకు బంగారపు గొలుసులు, మంగళ సూత్రాలను కానుకగా ఇచ్చారు. మహామండపం ఆరో అంతస్తులో ఆలయ ఈవో కె.ఎస్.రామారావు దంపతులు పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. మరో వైపున ఇంద్రకీలాద్రిపై ఈ ఏడాది తొలి సారిగా వారాహి నవరాత్రులు ప్రారంభమయ్యాయి. ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తి వద్ద కలశ స్థాపన, పూజా కార్యక్రమాలతో పాటు అమ్మవారి ప్రధాన ఆలయంలో మూలవిరాట్ వద్ద వారాహి పూజలను ఆలయ అర్చకులు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.

ఎయిడెడ్ పండిట్స్, పీఈటీలకు పదోన్నతి కల్పించండి

- ప్రభుత్వానికి ఏపీ టీచర్స్ గిల్డ్ విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానంగా రాష్ట్రంలోని ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న 200 మంది తెలుగు, హిందీ పండిట్లతో పాటు పీఈటీలకు పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ శనివారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చొరవ చూపాలని గిల్డ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.చిట్టిబాబు, ఎల్కే చిన్నప్ప, ప్రతినిధి ప్రభాకర్‌రెడ్డి కోరారు.

కోటబొమ్మాళి కేజీబీవీలో ఫుడ్ పాయిజన్

- 22 మంది విద్యార్థినులకు అస్వస్థత



కోటబొమ్మాళి: శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి కేజీబీవీలో కలుషిత ఆహారం తిని 22 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. వీరికి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందజేస్తున్నారు. విద్యార్థినులు వాంతులు, విరేచనాలతో బాధ పడుతున్నారని, ఫుడ్ పాయిజన్ వల్ల ఇలా జరిగి ఉండవచ్చని తిలారు పీహెచ్‌సీ వైద్యాధికారి మెండ మనీషా తెలిపారు. శనివారం ఉదయం ఒక్కొక్కరుగా విద్యార్థినులు అనారోగ్యం బారిన పడడంతో ఆమె కేజీబీవీలోనే వైద్యశిబిరం నిర్వహించారు. పరిస్థితి అదుపు తప్పుతుండడంతో విద్యార్థినులను కోటబొమ్మాళి ఆస్పత్రికి తరలించారు. కేజీబీవీలో ఎక్కువ రోజులు నిల్వ ఉంచిన గుడ్లు, కూరగాయలు, పాలు సరఫరా చేస్తున్నారని విద్యార్థినుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం కొందరు కోలుకుంటున్నారని, మిగిలిన వారికి చికిత్స అందిస్తున్నామని సామాజిక ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పొన్నాడ గణేష్ తెలిపారు.

నకిలీ ఆధార్ తో గదులు పొందుతున్న దళారీ అరెస్ట్

తిరుమల: నకిలీ ఆధార్ కార్డుతో గదులు పొంది భక్తులకు విక్రయిస్తున్న దళారీని టీటీడీ విజిలెన్స్ అధికారులు పట్టుకుని పోలీసులకు అప్పగించిన ఘటన శనివారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. పురానికి చెందిన నాగవంశీ నకిలీ ఆధార్ కార్డులు అందజేసి తిరుమలలో గదులు పొందేవాడు. అనంతరం గదుల కోసం వేచి ఉన్న భక్తుల వద్దకు వెళ్లి తాము రెండు గదులను తీసుకున్నామని అందులో ఒక గదిలో తమ వారు రాలేదని మీకు కావాలంటే ఇస్తానని చెప్పేవాడు. అనంతరం వారి వద్ద అధిక మొత్తం వసూలు చేసి వారికి గది ఇచ్చేవారు. గది ఖాళీ చేసే సమయంలో తాళాలు తనకు ఇవ్వాలని చెప్పేవాడు. ఈ వ్యవహారంపై నిఘా పెట్టిన విజిలెన్స్ అధికారులు శనివారం నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం తిరుమల టూటౌన్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసును నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఇద్దరు మావోయిస్టుల అరెస్ట్

చింతూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఛత్తీస్‌గఢ్‌కు చెందిన సెక్షన్ కమాండర్ సోడె బామన్, చింతూరు మండలం నారకొండకు నకు చెందిన మావోయిస్టు సానుభూతిపరుడు జడ్డి నాగేశ్వరరావును శనివారం స్థానిక పోలీసులు అరెస్ట్ చేశారని రంపచోడవరం ఓఎస్‌డీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. సోడె బామన్‌పై ఆంధ్రా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో జరిగిన 24 ఘటనల్లో ప్రమేయం ఉందన్నారు. వీరిని కూంబింగ్ నిర్వహిస్తున్న పోలీసు బలగాలు ఆంధ్రా, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు చింతూరు మండలం మల్లంపేట అటవీ ప్రాంతంలో అరెస్ట్ చేసినట్లు ఓఎస్డీ తెలిపారు. వీరివద్ద నుంచి రెండు గ్రనేడ్లు, ప్రెషర్‌కుక్కర్ బాంబ్, రెండు మీటర్ల కార్‌టెక్స్ వైర్ తదితర సామగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు. సీఐ గజేంద్రకుమార్, ఎస్‌ఐ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆ ఇళ్లన్నీ.. బాబు ఖాతాలోకి!

గత ప్రభుత్వంలో దాదాపు పూర్తయిన పేదల ఇళ్లను తమ ఘనతగా చెప్పుకునేలా బాబు ప్రభుత్వం స్కెచ్



సాక్షి, అమరావతి: 'మేం అధికారంలోకి వస్తే పేదల ఇంటి నిర్మాణానికి పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు చొప్పున స్థలాలు మంజూరు చేస్తాం. ఇంటి నిర్మాణం కోసం సీఎం జగన్ ప్రభుత్వం చేసిన దానికంటే ఇంకా ఎక్కువ సాయం చేసి చూపిస్తాం'.. అని సార్వత్రిక ఎన్నికలకు ముందు చంద్రబాబు హామీలిచ్చారు. ఇప్పుడాయన సీఎం కూడా అయ్యారు. ఇక తమ సొంతింటి కల సాకారం చేయడానికి బాబు ఎంత పెద్ద సాయం చేస్తారోనని ఇళ్లులేని పేదలు ఓ పక్క ఎదురు చూస్తుంటే చంద్రబాబు ప్రభుత్వం మాత్రం పేదలకు మెరుగైన సాయం చేయడం అటుంచి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్మించిన ఇళ్లను తమ ఖాతాలో వేసుకునేందుకు పెద్ద స్కెచ్చే వేసింది. ఇందులో భాగంగా వంద రోజుల్లో 1.28 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తిచేస్తాం అని గొప్పగా ప్రకటించింది.

అండగా నిలిచిన సీఎం జగన్..

గడిచిన ఐదేళ్లలో సొంతింటి కల సాకారం చేస్తూ పేదలకు సీఎం జగన్ అన్ని విధాలుగా అండగా నిలిచారు. ఏకంగా 31 లక్షల మందికి పైగా పేద అక్కచెల్లెమ్మల పేరిట రూ.76 వేల కోట్లకుపైగా మార్కెట్ విలువ చేసే స్థలాలు పంపిణీ చేశారు. ఇంటి నిర్మాణానికి యూనిట్‌కు రూ.1.80 లక్షలు బిల్లు మంజూరు చేయడంతో పాటు, స్వయం సహాయక బృందాల ద్వారా లబ్ధిదారులైన మహిళలకు పావలా వడ్డీకి రూ.35 వేలు రుణ సాయం అందించింది. ఉచితంగా ఇసుకను పంపిణీ చేయడం ద్వారా రూ.15 వేలు, స్టీల్, సిమెంట్, ఇలా 12 రకాల నిర్మాణ సామగ్రిని సబ్సిడీపై సరఫరా చేయడం ద్వారా మరో రూ.40 వేలు చొప్పున మొత్తంగా రూ.2.70 లక్షల చొప్పున ప్రయోజనం చేకూర్చారు.

స్టేజ్ అప్‌గ్రేడ్ చేసి ఈ ప్రభుత్వ ఖాతాలోకి..

నిజానికి.. గత ప్రభుత్వ హయాంలో 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకం కింద గత ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 31 లక్షల మందికి పైగా పేదలకు ఉచితంగా ఇళ్ల స్థలాలు పంపిణీ చేసింది. స్థలాలు పొందిన వారిలో 19 లక్షల మందికి పైగా ఇళ్ల నిర్మాణానికి అనుమతులిచ్చారు. ఎన్నికలు ముగిసే నాటికి 1,28,058 ఇళ్లు శ్లాబ్ దశను పూర్తిచేసుకున్నాయి. వీటిలో చాలావరకూ తుదిదశ పనులు కూడా పూర్తిచేసుకున్నాయి. అయితే, ఎన్నికల కోడ్ నేపథ్యంలో గృహ నిర్మాణ కార్యకలాపాలు నిలిచిపోవడంతో పాటు, ఆన్‌లైన్‌లో స్టేజ్ అప్‌డేట్ ప్రక్రియకు బ్రేక్ పడింది. దీంతో చివరి దశ బిల్ కోసం ఇళ్లు పూర్తయినట్లు స్టేజ్ అప్‌డేట్ చేయలేదు. ఈ ఇళ్లనే వంద రోజుల్లో మేం నిర్మాణం పూర్తిచేస్తామని ప్రభుత్వం ప్రకటన చేసింది. దీంతో పాటు గత ప్రభుత్వంలోనే ప్రారంభించి వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న 6.08 లక్షల ఇళ్లనే స్టేజ్ కన్వర్షన్స్ చేపడతామని చెబుతున్నారు కానీ, తాము పేదలకు స్థలాలు పంపిణీ చేస్తామని, కొత్తగా ఇళ్లు మంజూరు చేస్తామని ఇప్పటి వరకూ ప్రస్తుత ప్రభుత్వం చెప్పలేదు. ఆ దిశగా ఎక్కడా చర్చించనూ లేదు.

మల్లన్నను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం శ్రీభ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.వి. రవీంద్రబాబు దంపతులు శనివారం దర్శించుకున్నారు. మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన న్యాయమూర్తి దంపతులకు ఆలయ రాజగోపురం వద్ద ఈవో డి.పెద్దిరాజు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. ఆ తర్వాత న్యాయమూర్తి స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన జరిపించుకున్నారు. అనంతరం ఆశీర్వచన మండపంలో న్యాయమూర్తి దంపతులకు వేదపండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేసి సత్కరించారు.



మల్లన్న దర్శనానికి వెళ్తున్న జస్టిస్ రవీంద్రబాబు దంపతులు

వీరేశ్వరస్వామి సన్నిధిలో జస్టిస్ మల్లికార్జునరావు

ఐ.పోలవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మురమళ్ల క్షేత్రంలోని శ్రీభద్రకాళీ సమేత శ్రీవీరేశ్వర స్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు దంపతులు శనివారం దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత వీరికి స్థానిక ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పుష్ప గుచ్ఛం అందజేశారు. అర్చకుడు యనమండ్ర సుబ్బారావు ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శన అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, ఆలయ ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ పట్టు వస్త్రాలు, స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించి సత్కరించారు. అనంతరం జస్టిస్ మల్లికార్జునరావు దంపతులు స్వామివారి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ముమ్మిడివరం న్యాయమూర్తి మహ్మదుల్లా పాల్గొన్నారు.



జస్టిస్ మల్లికార్జునరావు దంపతులను సత్కరిస్తున్న ఈవో

సైనిక లాంఛనాలతో జవాన్ అంత్యక్రియలు

ఈనెల 4న గుండెపోటుతో మృతి చెందిన జవాన్ రజ్జు బాషా

బాపట్ల టౌన్: దేశ రక్షణ కోసం సరిహద్దులో విధులు నిర్వర్తిస్తూ గుండెపోటుతో మృతి చెందిన షేక్ రజ్జు బాషా (42) భౌతిక కాయానికి బాపట్ల పట్టణ ప్రజలు శనివారం అశ్రునయనాలతో వీడ్కోలు పలికారు. పట్టణంలోని భావపురి కాలనీకి చెందిన బాషా జమ్మూ కశ్మీర్‌లో విధులు నిర్వర్తిస్తూ గుండెపోటుతో ఈనెల 4న మృతి చెందిన విషయం తెలిసిందే. మృతదేహం శనివారం తెల్లవారుజామున పట్టణానికి చేరుకుంది. మృతునికి భార్య షాహేరా, ముగ్గురు పిల్లలున్నారు. కుటుంబ సభ్యుల సందర్శన అనంతరం ఉదయం 10:30 గంటలకు సైనిక లాంఛనాలతో అంతిమ యాత్ర ప్రారంభించారు. 'జై జవాన్, వందేమాతరం, భారత్‌మాతాకీ జై, జయహో బాషా' అంటూ పట్టణ ప్రజలు నినదించారు. కుటుంబసభ్యులు, బంధువులు, సన్నిహితులు, అభిమానులు, ప్రజలు, అశ్రునయనాలతో బాషా అంత్యక్రియల్ని సైనిక లాంఛనాలతో నిర్వహించారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, బాపట్ల ఆర్డీవో జి. రవీందర్, బాపట్ల డీఎస్పీ మురళీకృష్ణ బాషా పార్థీవ దేహానికి నివాళి అర్పించారు. 851 లైట్ రెజిమెంట్ బెటాలియన్ సైనికులు, సికింద్రాబాద్ ఆర్మీ బెటాలియన్ నుంచి వచ్చిన జవాన్లు గౌరవసూచికంగా గాల్లోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపారు.



బాషా భౌతిక కాయానికి సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న జవాన్లు

నిర్ణయించిన ధరలకే విక్రయించాలి

నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు • దుకాణదారులకు టీటీడీ హెచ్చరిక

తిరుమల: తిరుమల శ్రీవారి దర్శనార్థం విచ్చేసే భక్తులకు టీటీడీ నిర్ణయించిన ధరలకే వస్తువులను దుకాణదారులు విక్రయించాలని, అధిక ధరలు విక్రయిస్తే చట్టపరంగా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని టీటీడీ ఒక ప్రకటనలో హెచ్చరించింది. టీటీడీ ఈవో ఆదేశాల మేరకు జేఈవో వీరబ్రహ్మం పర్యవేక్షణలో శనివారం టీటీడీ ఉద్యోగులు భక్తుల వలె శ్రీవారి మెట్టు వద్ద ఉన్న షాప్ నంబర్–3లో గాజు సీసా నీటి బాటిల్ రూ.50/– కొనుగోలు చేశారు. అనంతరం ఖాళీ గ్లాస్ బాటిల్ తిరిగి షాపు యజమానికి ఇవ్వగా రూ.20 వెనుకకు ఇచ్చారు. వాస్తవంగా రూ.30 తిరిగి ఇవ్వాలి. వస్తువులను అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. అదేవిధంగా వీరు కొనుగోలు చేసిన దుకాణంలో తక్కువ నాణ్యత కలిగిన ప్లాస్టిక్ బాటిళ్లు కూడా నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్నట్లు గమనించారు. గతంలో ఇదే షాపు యజమాని టీటీడీ నిబంధనలకు వ్యతిరేకంగా అనుసరిస్తున్న విధానాలకు ఇదివరకే షాప్ నెంబర్–3 వినోద్ కుమార్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేసి రూ. 25,000 జరిమానా విధించారు. అయినా ఆ షాపు యజమాని తన ధోరణి మార్చుకోలేదని, ధరల పట్టిక ప్రదర్శించడం లేదని పైఅధికారులకు నివేదిక అందజేశారు. టీటీడీ నిబంధనలకు విరుద్ధంగా దుకాణదారులు వస్తువులను భక్తులకు అధిక ధరలకు విక్రయించి వారిని మోసం చేసినా, టీటీడీ టెండర్ నిబంధనలు అతిక్రమించినా, అట్టి దుకాణదారుల లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

భారతీయ విజ్ఞాన పరంపరను కొనసాగించాలి

జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య కృష్ణమూర్తి

తిరుపతి(అలిపిరి): శ్రీవేంకటేశ్వర భక్తి చానల్‌లో భారతీయ విజ్ఞాన పరంపరను కొనసాగించాలని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య కృష్ణమూర్తి అన్నారు. పూర్వీకులు అందించిన జ్ఞానాన్ని ప్రచారంలోకి తీసుకురావాలంటే ఎస్వీబీసీతో మాత్రమే సాధ్యమని స్పష్టం చేశారు. శనివారం ఎస్వీబీసీ 16వ వార్షికోత్సవం తిరుపతిలోని చానల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులను ఆకట్టుకునేలా చక్కటి కార్యక్రమాలను రూపొందించి ప్రసారం చేస్తున్న ఎస్వీబీసీకి అభినందనలు తెలిపారు. ఎస్వీ వేద విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య రాణి సదాశివ మూర్తి మాట్లాడుతూ ఎస్వీబీసీ పురాణాలు, భౌగోళిక, భక్తి, మోక్ష సంబంధిత విశేషాలు ప్రపంచానికి అందిస్తుందన్నారు. ఎస్వీబీసీ సీఈవో షణ్ముఖ్‌కుమార్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో రూపొందించనున్న కార్యక్రమాలను వివరించారు. అనంతరం వార్షికోత్సవం సందర్భంగా ఉద్యోగులకు నిర్వహించిన వివిధ క్రీడాపోటీల విజేతలకు బహుమతులు అందించారు. అంతకుముందు శ్రీవారి విగ్రహానికి పూజలు నిర్వహించారు.



ఎస్వీబీసీ కార్యాలయంలో పూజల్లో జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ ఆచార్య కృష్ణమూర్తి

శిలాఫలకాలు ధ్వంసం

టీడీపీ శ్రేణుల దుశ్చర్య
ఏలూరు జిల్లా తుక్కులూరులో ఘటన

నూజివీడు: ఎన్నికల ఫలితాలు వెల్లడై నెల దాటిపోయినా టీడీపీ శ్రేణులు విధ్వంసం కొనసాగిస్తూనే ఉన్నాయి. ఏలూరు జిల్లా నూజివీడు మండలం తుక్కులూరులో పలు సిమెంట్ రోడ్లకు సంబంధించిన శిలాఫలకాలను శుక్రవారం అర్ధరాత్రి టీడీపీ శ్రేణులు ధ్వంసం చేశాయి. ట్రాక్టర్‌తో గుద్దించి ఈ దుశ్చర్యకు పాల్పడ్డాయి. గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వెల్‌నెస్ కేంద్రాల వద్ద ఉన్న శిలాఫలకాలపై ఎమ్మెల్యే, ఎంపీ పేర్లను కనిపించకుండా టీడీపీ కార్యకర్తలు నల్ల రంగు పూశారు. కాగా గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన సిమెంట్ రోడ్లకు సంబంధించి ఈ శిలాఫలకాలను ఏర్పాటు చేశారు. టీడీపీ శ్రేణుల దాష్టీకంపై వైఎస్సార్‌సీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ధ్వంసమైన శిలాఫలకం

దర ఆశాజనకం.. దిగుబడి నిరాశాజనకం

- కోకో గింజలకు రెట్టింపు ధర లభిస్తున్నా.. దిగుబడి తగ్గటంతో రైతుల గగ్గోలు
- గింజల కిలో ప్రస్తుత ధర రూ.475
- గతంలో గరిష్ట ధర కిలో రూ.240
- కనీస మద్దతు ధర రూ.600 చెల్లించాలంటున్న రైతులు



సాక్షి, అమలాపురం: కోకో గింజల ధర ఆశాజనకంగా ఉన్నా రైతులకు పెద్దగా సంతోషాన్ని ఇవ్వడం లేదు. మూడు, నాలుగేళ్ల క్రితం కోకో గింజల ధర కేజీ రూ.180 నుంచి రూ.240 వరకు ఉండేది. అత్యధికంగా కిలోకు రూ.280 లభించేది. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో గింజల ధర రూ.475 పలుకుతోంది. అయినా.. రైతులకు గిట్టుబాటు కావడం లేదు. దిగుబడులు సగానికి సగం తగ్గిపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. మరోవైపు పెట్టుబడులు అంచనాలకు మించి పెరగడంతో కోకో సాగు రైతులకు గిట్టుబాటు కాకుండా పోయింది.

నాటి ఉత్సాహం.. నేడు లేదు

'గతంలో ఎకరాకు 4 క్వింటాళ్ల కోకో గింజల దిగుబడి వస్తే.. సగటున కేజీ రూ.240 చొప్పున రూ.96 వేల వరకు ఆదాయం వచ్చేది. ప్రస్తుత ధర రూ.475కు పెరిగింది. కానీ.. ఎకరానికి దిగుబడి 2 క్వింటాళ్లకు పడిపోవడంతో ఇప్పుడు ధరను బట్టి రూ.95 వేల వరకు మాత్రమే ఆదాయం వస్తోంది' అని అమలాపురం మండలం ఇమ్మిడివరప్పాడుకు చెందిన కోకో రైతు ప్రకాష్ చెప్పారు. ఉభయ గోదావరి జిల్లాల్లోని రైతులందరి పరిస్థితి ఇలాగే తయారైంది. గతంలో పశ్చిమ గోదావరి జిల్లాలో ఎకరా తోట నుంచి 4 నుంచి 6 క్వింటాళ్ల వరకు కోకో గింజల దిగుబడిగా రాగా.. ఇప్పుడు మూడు క్వింటాళ్లకు తగ్గిపోయింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 3 నుంచి 4 క్వింటాళ్ల దిగుబడి రాగా.. ఇప్పుడు సగటున 2 క్వింటాళ్లకు తగ్గింది. ఈ పరిస్థితుల్లో చాలామంది కొబ్బరి, ఆయిల్‌పామ్ రైతులు కోకో పంటను తొలగిస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి నుంచి కోకో గింజల ధర పెరుగుతూ వచ్చింది. మే నెలలో రికార్డు స్థాయిలో కేజీ రూ.960కి చేరింది. ఒకానొక సమయంలో దీని ధర రూ.వెయ్యికి చేరుతుందని రైతులు ఆశించారు. తరువాత ధర తగ్గుతూ వచ్చి ప్రస్తుతం కిలో గింజల ధర రూ.475కు చేరింది.

రూ.600కు కొంటే గట్టెక్కుతాం

అంతర్జాతీయంగా కోకో గింజలకు డిమాండ్ ఉన్నప్పటికీ స్థానికంగా ధర తగ్గించి కొనుగోలు చేయడం వల్ల నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. ఇప్పుడున్న మార్కెట్ డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుంటే స్థానికంగా కిలో గింజలకు కనీసం రూ.600 చెల్లిస్తే గట్టెక్కుతామని సాగుదారులు చెబుతున్నారు. ఇటీవల కోకో రైతులు అమలాపురంలో సమావేశమై కోకో గింజలకు కనీస మద్దతు ధర రూ.600 చేయాలని కోరారు. కోకో గింజలను స్థానికంగా ఒక ప్రైవేట్ చాక్లెట్ కంపెనీకి చెందిన ప్రతినిధులు కొనుగోలు చేస్తుంటారు. ఒకే సంస్థ కొనుగోలు చేయాల్సి రావడం వల్ల వాళ్ల గుత్తాధిపత్యం కొనసాగుతోంది. దీనివల్ల ధర ఆశించిన స్థాయిలో పెంచడం లేదని రైతుల ఆరోపణ. కొనుగోలు విషయంలో కూడా పెద్ద రైతుకు అదనంగా కేజీకి రూ.50 వరకు బోనస్ ఇస్తూ.. చిన్న రైతుకు ఇవ్వడం లేదు. రైతుల శ్రేయస్సు దృష్ట్యా సంస్థ ప్రతినిధులు కోకో గింజలను అంతర్జాతీయ మార్కెట్ ధరలకు అనుగుణంగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. లేదంటే కోకో సాగును మానుకోవడం తప్ప మరో మార్గం లేదని చెబుతున్నారు.

ముగ్గురు 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్ట్

53 దుంగలు స్వాధీనం

తిరుపతి మంగళం: వైఎస్సార్ జిల్లా ఖాజీపేట మండలంలోని పొద్దుటూరు అటవీ ప్రాంతంలో శనివారం 53 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, ఒక మోటారు సైకిల్ సహా ముగ్గురు స్మగ్లర్లను టాస్క్‌ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. తిరుపతిలోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో శనివారం అధికారులు వివరాలు వెల్లడించారు. టాస్క్ ఫోర్స్ ఇన్‌చార్జి, తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కడప సబ్ కంట్రోల్‌కు చెందిన ఆర్ఎస్ఐ పి.నరేష్ బృందం శుక్రవారం రాత్రి పొద్దుటూరు రేంజిలోని ఖాజీపేట ఫారెస్టు డివిజన్ నుంచి కూంబింగ్ చేపట్టారు. శనివారం తెల్లవారుజామున నాగసానిపల్లి రేంజిలోని పోతభక్తుని బావి ప్రాంతం చేరుకునే సరికి కొందరు వ్యక్తులు మోటారు సైకిల్‌తో అనుమానాస్పదంగా కనిపించారు. వారిలో ముగ్గురిని పోలీసులు పట్టుకుని విచారించారు. వారిచ్చిన సమాచారం మేరకు 53 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ముగ్గురు స్మగ్లర్లను అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో వైఎస్సార్ జిల్లాకు చెందిన దాడిబోయిన గురుప్రసాద్ (37), తమ్మిశెట్టి వెంకటేష్ (24), బత్తల శివ (25 ఉన్నారు. పారిపోయిన మరో ముగ్గురి కోసం గాలిస్తున్నారు. ఎర్రచందనం దుంగల విలువ సుమారు రూ.20లక్షల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు.



ఎర్రచందనం దుంగలు, స్మగ్లర్లతో పోలీసులు

ముగ్గురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల అరెస్ట్

టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి ఘటనలో అదుపులోకి

మంగళగిరి: గతంలో టీడీపీ కేంద్ర కార్యాలయంపై జరిగిన దాడి ఘటనకు సంబంధించి అరెస్టులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే తప్పుడు కేసులతో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను అరెస్ట్ చేసేందుకు రంగం సిద్ధం చేసిన పోలీసులు తాజాగా శనివారం మరో ముగ్గురు కార్యకర్తలను అరెస్ట్ చేశారు. ఇప్పటికే ఐదుగురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తాజాగా గుంటూరు చెందిన జింకా సత్యం, రెడ్డిపాలెంకు చెందిన తియ్యగూర గోపిరెడ్డి, విజయవాడకు చెందిన లంకా అబ్బినాయుడులను అరెస్ట్ చేశారు.

నేలకేసి కొట్టి పసికందు హత్య

- మద్యం మత్తులో తండ్రి ఘాతుకం
- చిత్తూరు మండలం దిగువ మాసాపల్లిలో ఘటన


చిత్తూరు రూరల్: ఏడాదిన్నర పసికందును తండ్రే నేలకేసి కొట్టి చంపిన ఉదంతం చిత్తూరు మండలం దిగువ మాసాపల్లిలో శనివారం వెలుగుచూసింది. బీఎన్ఆర్ పేట ఎస్‌ఐ వెంకట సుబ్బమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. తవణంపల్లి మండలం మాధవరం సమీపంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన ఓ మహిళకు ఐరాల మండలం జంగాలపల్లికి చెందిన ఓ వ్యక్తితో వివాహమైంది. మూడేళ్ల క్రితం భర్త వదిలేయడంతో ఆమె చిత్తూరు జిల్లా దిగువ మాసాపల్లికి వచ్చి ప్రదీప్ (34) అనే వ్యక్తితో సహజీవనం చేస్తోంది. ఈ నేపథ్యంలో వారికి ఏడాదిన్నర క్రితం కుమారుడు పుట్టాడు. కాగా.. ఆ మహిళ ఇటీవల దిగువ మాసాపల్లిలోనే ఓ కోళ్లఫారంలో పనికి కుదిరింది. కాగా.. ప్రదీప్ శుక్రవారం మద్యం సేవించి ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో పసికందు ఏడుస్తుండటంతో బిడ్డను నేలకేసి కొట్టి చంపేశాడు. ఆ తరువాత తేరుకుని ఇంటిపై నుంచి పడి బిడ్డ మృతి చెందాడని చిత్రీకరించే ప్రయత్నం చేశాడు. బంధువులకు అనుమానం రావడంతో మహిళ సోదరుడు బీఎన్ఆర్ పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి.. పసికందు మరణానికి కారణమైన తండ్రి ప్రదీప్‌ను అరెస్ట్ చేశారు.



చిన్నారి దినేష్ మృతదేహం

ఆర్థిక ఇబ్బందులతో ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఆత్మహత్య

మృతురాలి స్వస్థలం రాజమహేంద్రవరం




రాజుస్వప్న వర్మ (ఫైల్)

హైదరాబాద్: ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక టాలీవుడ్‌లో ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా పనిచేస్తోన్న యువతి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన హైదరాబాద్‌లోని మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాల మేరకు..ఏపీలోని రాజమహేంద్రవరానికి చెందిన డి.రాజుస్వప్న వర్మ (30) పదేళ్ల క్రితం సినీ పరిశ్రమలో పనిచేసేందుకు హైదరాబాద్‌కు వచ్చింది. మాదాపూర్‌లోని కావూరి హిల్స్‌లో తీగల హౌస్ ఫ్లాట్ నంబర్ 102లో ఏడాదిగా ఒంటరిగా ఉంటోంది. గతేడాది నుంచి చేతిలో ఎటువంటి ప్రాజెక్టులు లేకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురైంది. శుక్రవారం తన గదిలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దుర్వాసన రావడంతో ఇంటి యజమాని పెట్రోలింగ్ పోలీసులకు సమాచారమిచ్చాడు. వారు మృతదేహాన్ని పోస్టుమార్టానికి గాను గాంధీ ఆసుపత్రికి తరలించారు. స్వప్న వర్మ ఆత్మహత్య చేసుకోవాలనుకున్న 2 రోజుల ముందు తనకు ఆర్థికంగా ఇబ్బంది ఉందని, కొంత డబ్బు ఇవ్వమని తన స్నేహితురాలు సోనీకి ఫోన్‌లో చెప్పడంతో ఆమె కొంత డబ్బును ఇచ్చింది. రెండు రోజుల తరువాత సోనీకి మేసేజ్ ద్వారా తనకు ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని, బ్రతకాలని లేదు, చనిపోతున్నానని మెసేజ్ చేసింది. స్వప్న తల్లి సుధ ముంబైలో ఉంటుండటంతో పోలీసులు ఆమెకు సమాచారమిచ్చారు. స్వప్న విడాకులు తీసుకోవడంతో ఒంటరిగా ఉంటున్నట్లు పోలీసులకు సుధ తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బలహీన పడుతున్న వామపక్షాలు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

నూజివీడు: దేశంలో వామపక్షాల బలం క్రమేణా తగ్గిపోతున్నదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. 543 సీట్లు ఉన్న లోక్‌సభలో వామపక్షాల నుంచి కేవలం తొమ్మిదిమంది ఎంపీలు మాత్రమే ఎన్నికయ్యారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చని చెప్పారు. ఏలూరు జిల్లా నూజివీడులోని అమర్‌భవన్‌లో రెండు రోజుల పాటు నిర్వహించే ఏఐటీయూసీ రాష్ట్ర సమితి మేధోమధన సమాలోచన సదస్సు శనివారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రామకృష్ణ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో వామపక్షాలు, కాంగ్రెస్ కూటమిగా ఏర్పడి ఎన్నికల్లో పోటీ చేసినా ఏమాత్రం ప్రభావం చూపలేదన్నారు. వామపక్షాలు ఎవరి సమస్యల కోసం అయితే పోరాటాలు చేస్తున్నాయో..ఆయా వర్గాల వారు ఆ తరువాత వామపక్షాల వెంట నిలబడడం లేదని చెప్పారు. దేశంలో ప్రస్తుతం ఉన్నది బీజేపీ ప్రభుత్వం కాదని, ఎన్డీఏ ప్రభుత్వమని, ఈ ప్రభుత్వం చంద్రబాబు, నితీష్‌కుమార్‌పై ఆధారపడి నడుస్తున్నదన్నారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ప్రత్యేక హోదా తెచ్చుకోవాలన్నారు.



మాట్లాడుతున్న రామకృష్ణ

మతవాద పాలనకు ఎదురుదెబ్బ



ఇరాన్ అధ్యక్షునిగా సంస్కరణవాది పెజెష్కియాన్

అతివాద జలిలిపై ఘనవిజయం • ఖమేనీకి మింగుడుపడని ఫలితం

టెహ్రాన్: ఇరాన్ అధ్యక్ష ఎన్నికల్లో సంస్కరణవాదులదే పైచేయి అయింది. కరడుగట్టిన మతవాది సయీద్ జలిలిపై మితవాది, సంస్కరణాభిలాషి మసూద్ పెజెష్కియాన్ ఘనవిజయం సాధించారు. జూన్ 28న జరిగిన తొలి విడత ఎన్నికల్లో ఆరుగురు అభ్యర్థుల్లో ఎవరికీ మెజారిటీ రాలేదు. దాంతో దాంతో విజేతను తేల్చేందుకు తొలి రెండు స్థానాల్లో నిలిచిన జలిలి, పెజెష్కియాన్ మధ్య శుక్రవారం తిరిగి ఎన్నిక అనివార్యమైంది. శనివారం ఫలితాలు వెల్లడయ్యాయి. పోలైన దాదాపు 3 కోట్ల ఓట్లలో పెజెష్కియాన్‌కు 1.64 కోట్లు వచ్చాయి. సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ అనుచరునిగా పేరుబడ్డ జలిలి 1.35 కోట్ల ఓట్లు మాత్రమే సాధించారు. దేశ తొమ్మిదో అధ్యక్షునిగా పెజెష్కియాన్ ఎన్నికైనట్టు అంతర్గత మంత్రిత్వ శాఖ అధికారికంగా ప్రకటించింది. ఇరాన్‌పై దశాబ్దాలుగా ఆధిపత్యం చలాయిస్తూ వస్తున్న మతవాద కూటమికి ఈ ఫలితాలు గట్టి షాకివ్వడమే గాక సంస్కరణవాదుల్లో జోష్ నింపాయి. నిజానికి ఈసారి అధ్యక్ష ఎన్నికల ప్రక్రియనే బహిష్కరిస్తున్నట్టు ప్రకటించిన ప్రజలు శుక్రవారం రాత్రి దాకా జరిగిన ఓటింగ్‌లో అనూహ్యంగా భారీ సంఖ్యలో పాల్గొనడం విశేషం. దాంతో 53 శాతానికి పైగా ఓటింగ్ నమోదైంది. తద్వారా ఖమేనీ ఏకపక్ష పోకడలపై ప్రజలు స్పష్టమైన వ్యతిరేకత వ్యక్తం చేశారని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఫలితాల వెల్లడి మొదలవుతూనే రాజధాని టెహ్రాన్, పశ్చిమ ఇరాన్‌లోని పెజెష్కియాన్ సొంత నగరం తబ్రీజ్‌తో పాటు దేశవ్యాప్తంగా ఆయన మద్దతుదారులు, అభిమానులు భారీగా వీధుల్లోకి వచ్చి డ్యాన్సుల సంబరాలు చేసుకున్నారు. దేశాన్ని కాపాడేందుకు ఓటర్లు భారీ సంఖ్యలో బూత్‌లకు తరలారంటూ నినాదాలు చేశారు. పెజెష్కియాన్ ఎన్నికల నినాదమైన 'సేవ్ ఇరాన్' సందేశాలతో సోషల్ మీడియా హోరెత్తిపోయింది. దేశంలో మెజారిటీలపై మైనారిటీల పెత్తనానికి మొత్తానికి తెర పడ్డట్టేనంటూ సంస్కరణవాదులు సంబరపడుతున్నారు. అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ మేలో హెలికాప్టర్ ప్రమాదంలో దుర్మరణం పాలవడంతో ఎన్నిక అనివార్యమైంది. ఎన్నికల ఫలితాలను ఖమేనీ లాంఛనంగా ఆమోదముద్ర వేశాక 30 రోజుల్లో పెజెష్కియాన్ బాధ్యతలు స్వీకరిస్తారు. నాలుగేళ్ల పాటు పదవిలో కొనసాగుతారు. ఆయనకు ప్రధాని నరేంద్ర మోదీతో పాటు పలువురు దేశాధినేతలు శుభాకాంక్షలు తెలిపారు.

పోలింగ్ శాతం పెరగడం వెనక...

- నిజానికి ఏళ్లుగా తామెదుర్కొంటున్న పలు కీలక సమస్యల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై ఇరానీలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.
- ఖమేనీ యంత్రాంగం తీరుకు నిరసనగా ఈసారి అధ్యక్ష ఎన్నికల ప్రక్రియను మూకుమ్మడిగా బహిష్కరించారు. దాంతో తొలి రౌండ్‌లో దేశ చరిత్రలోనే అత్యల్పంగా కేవలం 40 శాతం పోలింగ్ నమోదైంది.
- అత్యంత మితవాదిగా పేరొందిన పెజెష్కియాన్ అనూహ్యంగా తుది పోరులో బరిలో నిలవడంతో ఆయనకు మద్దతుగా వారంతా భారీ సంఖ్యలో పోలింగ్ బూత్‌లకు తరలారు.
- పోలింగ్‌కు ముందు నుంచీ పెజెష్కియాన్ ప్రచార సరళికి, 'సేవ్ ఇరాన్' నినాదానికి దేశ యువత బాగా ఆకర్షితులయ్యారు. దాంతో ఆయన ర్యాలీలకు, సభలకు జనం పోటెత్తారు.
- ఇస్లామిక్ పాలనకు తెర పడాల్సిందేనని యువతతో పాటు విద్యావంతులు కూడా తొలిసారిగా బాహాటంగానే వ్యాఖ్యలు చేస్తూ వచ్చారు. కరడుగట్టిన మతవాది అయిన జలిలి ఇరాన్‌ను ఎప్పటికీ ఏకం చేయలేరని మైకుల సాక్షిగా చెప్పుకొచ్చారు.
- జలిలిని ఓడించడం ద్వారా నిరంకుశ మతవాద పాలనకు వ్యతిరేకంగా ఇరానీలు స్పష్టమైన తీర్పు వెలువరించారు.
- ఖమేనీ మతవాద పాలన, హిజాబ్‌ను తప్పనిసరి వంటి కఠినతరమైన సామాజిక నిబంధనలు, ఇరాన్‌పై ఆర్థిక ఆంక్షలను ఎత్తేసేలా అంతర్జాతీయ సమాజంతో చర్చలకు ముందుకు రాని పోకడలపైనా ప్రజలు తమ వ్యతిరేకతను ఓటు రూపంలో స్పష్టంగా వ్యక్తం చేశారంటున్నారు.

హార్ట్ సర్జన్‌పై ఆశలెన్నో...!




మహిళలపై అత్యంత కఠినమైన ఆంక్షలుండే ఇరాన్‌లో ప్రచారం పొడవునా పెజెష్కియాన్ ఇలా తన కూతురికి భాగస్వామ్యం కల్పించడం ద్వారా ప్రాధాన్యమిచ్చారు (ఫైల్)

69 ఏళ్ల పెజెష్కియాన్‌కు హార్ట్ సర్జన్‌గా దేశవ్యాప్తంగా అపారమైన పేరు ప్రఖ్యాతులున్నాయి. ఆయన ఇరాక్–ఇరాన్ యుద్ధంలో పాల్గొన్న వార్ వెటరన్ కూడా. 16 ఏళ్లుగా పార్లమెంటు సభ్యునిగా ఉన్నారు. డిప్యూటీ స్పీకర్‌గా, నాలుగేళ్ల పాటు ఆరోగ్య మంత్రిగా కూడా చేశారు. ఆయన భార్య కారు ప్రమాదంలో చనిపోయారు. మళ్లీ పెళ్లి చేసుకోకుండా సింగిల్ పేరెంట్‌గా పిల్లలను అన్నీ తానై పెంచారు. మతపరమైన మైనారిటీ అయిన అజెరీ సామాజికవర్గానికి చెందిన వ్యక్తి కావడం ఈ ఎన్నికల్లో పెజెష్కియాన్‌కు మరింత కలిసొచ్చింది. ప్రచారం పొడవునా కూతురిని వెంట ఉంచుకోవడం ద్వారా మహిళలకు మరింత స్వేచ్ఛ ఇవ్వాల్సిన అవసరాన్ని ఆయన చెప్పకనే చెప్పారు. దాంతో పార్టీలకు అతీతంగా ప్రజలు ఆయనకు భారీగా ఓటేశారు.

సవాళ్ల స్వాగతం...

లెక్కలేనన్ని సమస్యలు పెజెష్కియాన్‌కు స్వాగతం పలుకుతున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థ అత్యంత దయనీయంగా ఉంది. ఇరుగుపొరుగుతో సంబంధాలు దారుణంగా దిగజారాయి. యెమన్, లెబనాన్ గుండా ఇజ్రాయెల్‌పై సాయుధ పోరుకు ఇరాన్ అన్నివిధాలా సాయపడుతూ అంతర్జాతీయ సమాజం నుంచి మరింత ఆగ్రహం చవిచూస్తోంది. ఆ క్రమంలో గత ఫిబ్రవరిలో అమెరికాతో, అనంతరం ఏప్రిల్లో ఇజ్రాయెల్‌తో ఇరాన్ యుద్ధం ముంగిటి దాకా వెళ్లొచ్చింది. ఈ రుగ్మతలకు పెజెష్కియాన్ ఎలాంటి వైద్యం చేస్తారో చూడాలి. అయితే ఆ దిశగా ఇప్పటికే అడుగులు వేస్తున్నట్టు ఆయన స్పష్టమైన సంకేతాలిచ్చారు. దేశ ప్రగతి కోసం ప్రత్యర్థులతో కూడా కలిసి పని చేస్తానని ఫలితాల అనంతరం ప్రకటించారు. ''ఎన్నికలు ముగిశాయి. ఇది మనమంతా సహకరించుకుంటూ ముందుకు సాగాల్సిన సమయం. నేను మిమ్మల్ని ఏకాకులను చేయను. మీరూ నన్ను ఏకాకిని చేయొద్దు'' అంటూ పిలుపునిచ్చారు. తద్వారా అందరినీ కలుపుకుని పోతానంటూ అతివాద వర్గానికి స్పష్టమైన సందేశమిచ్చారు. అదే సమయంలో, 'ఇరాన్ ఇరానీలందరిదీ' అంటూ పునరుద్ఘాటించడం ద్వారా ప్రజల సంక్షేమానికే ప్రథమ తాంబూలమని చెప్పకనే చెప్పారు. ఈ నేపథ్యంలో ఇరాన్‌కు సర్వం సహా చక్రవర్తి అయిన ఖమేనీతో అధ్యక్షునిగా ఆయన సంబంధాలు ఏ మేరకు సజావుగా సాగుతాయన్నది ఆసక్తికరం.

– సాక్షి, నేషనల్ డెస్క్



ప్రజల తీర్పును అంగీకరిస్తున్నా. దేశ ప్రగతి కోసం పెజెష్కియాన్‌కు మనమంతా దన్నుగా నిలవాల్సిన అవసరముంది.

- ఫలితాల అనంతరం సయీద్ జలిలి

నీట్ కౌన్సెలింగ్ వాయిదా

జూలై నెలాఖరులో ప్రారంభమయ్యే అవకాశం

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా వైద్య విద్యా సంస్థల్లో ప్రవేశానికి ఉద్దేశించిన జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష–అండర్ గ్రాడ్యుయేట్(నీట్–యూజీ)–2024 కౌన్సెలింగ్ వాయిదా పడింది. జూలై నెలాఖరులో కౌన్సెలింగ్ ప్రారంభమయ్యే అవకాశం ఉందని అధికార వర్గాలు శనివారం వెల్లడించాయి. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 6 నుంచే కౌన్సెలింగ్ ప్రారంభం కావాల్సి ఉంది. చివరి నిమిషంలో వాయిదా వేస్తూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నిర్ణయం తీసుకుంది. నీట్–యూజీ పరీక్షలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని, ప్రశ్నపత్రం లీకయిందని, గ్రేసు మార్కుల కేటాయింపులో భారీగా డబ్బు చేతులు మారిందని ఆరోపణలు రావడం తెలిసిందే. పరీక్షను వాయిదా వేసి, మళ్లీ నిర్వహించాలన్న డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. ఇందుకు కేంద్రం అంగీకరించడం లేదు. ఈ నేపథ్యంలో కౌన్సెలింగ్ వాయిదా ప్రాధాన్యం సంతరించుకుంది. నీట్–యూజీ కౌన్సెలింగ్ వాయిదాకు సుప్రీంకోర్టు నిరాకరించినా ఎన్‌టీఏ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

దేవుడు తప్ప నన్నెవరూ... తప్పించలేరు: బైడెన్

వాషింగ్టన్: తన ఆరోగ్యంపై వ్యక్తమవుతున్న ఆందోళనలను అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ (81) కొట్టిపారేశారు. అధ్యక్ష రేసు నుంచి వైదొలగాలని దేవుడు తప్ప తననెవరూ ఒప్పించలేరని ఏబీసీ ఛానల్ ఇంటర్వ్యూలో అన్నారు. గత వారం రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌తో చర్చలో బైడెన్ పదే పదే తడబడటం, ఆగి ఆగి మాట్లాడటంతో ఆయన మానసిక సంతులతపై డెమొక్రాట్లలో తీవ్ర ఆందోళన నెలకొంది. బైడెన్ వైదొలగాలని వారు డిమాండ్ చేస్తున్నారు. సర్వేల్లోనూ ఆయనకు ప్రజాదరణ పడిపోయింది. విరాళాలు ఇచ్చే దాతలు కూడా బైడెన్ తప్పుకుంటేనే తమ ఆర్థిక సహకారం కొనసాగుతుందని స్పష్టం చేస్తున్నారు. ఒత్తిళ్లు పెరుగుతున్నా బైడెన్ మాత్రం వెనక్కి తగ్గే ప్రసక్తే లేదంటున్నారు. ప్రపంచాన్ని నడుపుతున్నానని, అధ్యక్షుడిగా ఉండటానికి తనకంటే మరెవరికీ యోగ్యత లేదన్నారు. మెదడు పనితీరుపై పరీక్ష చేయించుకొని ఫలితాలను ప్రజల ముందు పెడతారా అని ప్రశ్నించగా తాను రోజూ పరీక్ష ఎదుర్కొంటున్నానని బదులిచ్చారు.

23న కేంద్ర బడ్జెట్

22 నుంచి ఆగస్టు 12 దాకా పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్రంలో వరుసగా మూడోసారి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మోదీ సర్కారు తొలి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. ఇందుకోసం పార్లమెంటు సమావేశాలను పిలవాలన్న ప్రభుత్వ ప్రతిపాదనకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం తెలిపారు. జూలై 22న ప్రారంభమయ్యే పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ఆగస్టు 12 వరకు జరుగనున్నాయి. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ జూలై 23న లోక్‌సభలో పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ మేరకు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెణ్ రిజిజు శనివారం ట్వీట్ చేశారు. బడ్జెట్‌కు ముందు ప్రభుత్వం ఆర్థిక సర్వేను సమర్పించనుంది. ఆర్థిక మంత్రిగా నిర్మలకు ఇది ఏడో బడ్జెట్ కానుంది. ఆరుసార్లు ప్రవేశపెట్టిన మొరార్జీ దేశాయ్ రికార్డును ఆమె బద్దలు కొట్టనున్నారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు నిర్మలా సీతారామన్ ఈ ఏడాది ఫిబ్రవరిలో మధ్యంతర బడ్జెట్‌ను సమర్పించిన విషయం తెలిసిందే. బడ్జెట్లో భారీ సామాజిక, ఆర్థిక నిర్ణయాలుంటాయని రాష్ట్రపతి తన ప్రసంగంలో పేర్కొన్న నేపథ్యంలో అంచనాలు పెరుగుతున్నాయి.

భోలే బాబాపై కేసు

పట్నా/నోయిడా: ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్ జిల్లాలో సత్సంగ్‌లో 121 మంది మరణానికి కారకుడైన భోలే బాబా అలియాస్ సూరజ్ పాల్ సింగ్‌పై తొలి కేసు నమోదైంది. ప్రజల ఫిర్యాదు మేరకు బిహార్ రాజధాని పట్నా చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో శనివారం కేసు నమోదు చేశారు. తొక్కిసలాటలో చాలా మంది బిహారీలు మృతిచెందారు. భోలే బాబాపై గతంలో అత్యాచారం కేసులు నమోదయ్యాయి. ఒకసారి జైలుకు వెళ్లొచ్చాడు. ప్రధాన నిందితుడు, సత్సంగ్ ముఖ్య సేవాదార్ దేవప్రకాశ్ మధుకర్(42)ను యూపీ పోలీసులు శుక్రవారం రాత్రి ఢిల్లీలో అరెస్టు చేశారు. భోలే బాబా సత్సంగ్‌లకు ఓ పార్టీ నిధులు సమకూరుస్తున్నట్లు అనుమానాలున్నట్టు చెప్పారు. మరో ఇద్దరు నిందితులు రామ్‌ప్రకాశ్ శాక్య(61), సంజూ యాదవ్(33)నూ అదుపులోకి తీసుకున్నారు.

మీడియా ముందుకు భోలే బాబా

హత్రాస్ తొక్కిసలాట ఘటన తననెంతో తీవ్రంగా బాధించిందని భోలే బాబా అన్నారు. ఈ దుర్ఘటన మిగిల్చిన విషాదాన్ని భరించే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. తొక్కిసలాట కారకులకు శిక్ష పడుతుందనే విశ్వాసం తనకు ఉందని తెలిపారు. న్యాయ వ్యవస్థపై నమ్మకం ఉంచాలని బాధితులను సూచించారు. తొక్కిసలాటలో 121 మంది మరణించిన తర్వాత పరారీలో ఉన్న భోలే బాబా తాజాగా ఓ మీడియా సంస్థతో మాట్లాడారు. మరణించివారి కుటుంబాలకు, క్షతగాత్రులకు అండగా నిలవాలని, వారికి తగిన సాయం అందించాలని సత్సంగ్ నిర్వహణ కమిటీ సభ్యులను తన న్యాయవాది ద్వారా కోరానని వెల్లడించారు. తొక్కిసలాటలో మృతి చెందిన వారి పిల్లల చదువులు, ఇతర ఖర్చులను నారాయణ్ సకార్ హరి ట్రస్టు భరిస్తుందని భోలే బాబా న్యాయవాది ఎ.సి.సింగ్ చెప్పారు. గత ఐదు నెలలుగా భోలే బాబా సత్సంగ్‌లు నిర్వహించలేదని, అందుకే హత్రాస్ జిల్లాలో జరిగిన కార్యక్రమానికి జనం లక్షల సంఖ్యలో హాజరయ్యారని వెల్లడించారు. భోలే బాబా పరారీలో లేరని, విచారణకు సహకరిస్తారని తెలిపారు.

గుజరాత్‌లోనూ మోదీని ఓడిస్తాం

ఓటమి భయంతోనే అయోధ్యలో పోటీకి వెనకడుగు: రాహుల్



అహ్మదాబాద్‌లో పీసీసీ కార్యాలయ కిటికీ నుంచి రాహుల్ ప్రసంగం

అహ్మదాబాద్: ఉత్తరప్రదేశ్‌లో అయోధ్య ఉన్న లోక్‌సభ స్థానంలో బీజేపీని ఓడించినట్టే గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఓడించబోతున్నామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జోస్యం చెప్పారు. అయోధ్య పరాభవమే అక్కడా ఎదురవుతుందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీని సైతం ఓడిస్తామన్నారు. ''నేను చెబుతున్నది చాలా పెద్ద విషయం. అయోధ్యలో బీజేపీని మట్టికరిపించడం ద్వారా అద్వానీ ప్రారంభించిన రామ మందిర ఉద్యమాన్ని కూడా ఇండియా కూటమి ఓడించింది'' అని పేర్కొన్నారు! శనివారం అహ్మదాబాద్‌లోని కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో రాహుల్ మాట్లాడారు. ''కొన్ని రోజుల క్రితం గుజరాత్ బీజేపీ నేతలు మనల్ని బెదిరించారు. మన కార్యాలయాన్ని ధ్వంసం చేశారు. మనం గుజరాత్‌లో బీజేపీ ప్రభుత్వాన్నే ధ్వంసం చేయబోతున్నాం. బీజేపీని, మోదీని చిత్తుగా ఓడిస్తాం. ఇది రాసి పెట్టుకోవాలి. నూతన ఆరంభం ఇక్కడి నుంచే మొదలవుతుంది. మోదీ విజన్ అనే గాలి బుడగ గుజరాత్‌లో ఇప్పటికే బద్దలైంది. వారణాసి లోక్‌సభ స్థానంలోనూ మోదీ తక్కువ మెజార్టీతోనే గెలిచారు. అక్కడ మనం కొన్ని పొరపాట్లు చేశాం. లేదంటే మోదీ కచ్చితంగా ఓడేవారు. తొలుత అయోధ్యలో పోటీ చేయాలని మోదీ భావించారు. అక్కడ గెలిచే అవకాశం లేదని, రాజకీయ కెరీర్‌కే తెర పడవచ్చని బీజేపీ సర్వేయర్లు చెప్పడంతో వారణాసికే పరిమితమయ్యారు'' అని ఎద్దేవా చేశారు. దైవాంశసంభూతుడైన మోదీకి సామాన్య మానవుల కష్టాలు అర్థం కావడం లేదన్నారు. అయోధ్య ఆలయ నిర్మాణానికి పేదల భూములు లాక్కున్నారని, పరిహారం ఇవ్వలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల గుర్తు 'హస్తం' ప్రతి మతంలోనూ ప్రముఖంగా కనిపిస్తుందన్నారు.

ఆ డ్రెస్సేంటి?

సునాక్ భార్య అక్షతా మూర్తిపై సోషల్ మీడియాలో విసుర్లు



బ్రిటన్ ఎన్నికల్లో ఓటమి అనంతరం శుక్రవారం ప్రధాని నివాసం 10, డౌనింగ్ స్ట్రీట్‌ను ఖాళీ చేసి వెళ్తున్న రిషి సునాక్ దంపతులు

లండన్: బ్రిటన్ పార్లమెంట్ ఎన్నికల్లో కన్జర్వేటివ్ పార్టీ ఓడిపోయింది. ఆ పార్టీ నేత రిషి సునాక్ ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేశారు. లండన్‌లోని తన అధికారిక నివాసమైన 10 డౌనింగ్ స్ట్రీట్ గుమ్మం ఎదుట మీడియాతో మాట్లాడారు. ప్రధానిగా చివరి మాటలు చెప్పేసి వెళ్లిపోయారు. ఆయన భార్య అక్షతా మూర్తి వ్యవహారమే ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఆమెను విమర్శిస్తూ సోషల్ మీడియాలో చాలామంది పోస్టులు పెడుతున్నారు. జోకులు సైతం విసురుతున్నారు. ఆమె ధరించిన డ్రెస్సు ధర్‌పై కూడా చర్చ జరుగుతోంది. రిషి సునాక్ మీడియాతో మాట్లాడుతున్న సమయంలో అక్షతా మూర్తి ఆయన వెనుకే గొడుగు పట్టుకొని నిల్చున్నారు. నీలం, తెలుపు, ఎరుపు రంగులతో కూడిన నిలువు, అడ్డం చారల డ్రెస్సును ధరించారు. ఈ డ్రెస్సు చాలామందికి నచ్చలేదు. ఆ సందర్భానికి అలాంటి వస్త్రాలు నప్పలేదని అంటున్నారు. చూడడానికి ఎబ్బెట్టుగా ఉందని చెబుతున్నారు. డ్రెస్సుపై క్యూఆర్ కోడ్ మాదిరిగా ఆ చారలేంటి అని ప్రశ్నిస్తున్నారు. అంతేకాదు అక్షతా మూర్తి డ్రెస్సు ఖరీదు 395 పౌండ్లు(రూ.42,000). రిషి సునాక్ వెనుక ఆమె అలా గొడుగు పట్టుకొని నిల్చోవడం అస్సలు బాగా లేదని నెటిజన్లు విమర్శిస్తున్నారు. అక్షతా మూర్తి ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి, భారత రాజ్యసభ సభ్యురాలు సుధామూర్తి దంపతుల కుమార్తె అనే సంగతి తెలిసిందే.

10న ఏడు రాష్ట్రాల్లోని 13 అసెంబ్లీ సీట్లకు ఉప ఎన్నికలు

న్యూఢిల్లీ: పశ్చిమబెంగాల్ సహా ఏడు రాష్ట్రాల్లోని 13 అసెంబ్లీ స్థానాలకు ఈ నెల 10వ తేదీన ఉప ఎన్నికలు జరగనున్నాయి. పశ్చిమబెంగాల్‌లోని నాలుగు సీట్లకు గాను మూడు బీజేపీ ఎమ్మెల్యేలు టీఎంసీలో చేరడంతో ఖాళీ కాగా, మిగతావి ఎమ్మెల్యేల మృతితో ఖాళీ అయ్యాయి. ఉప పోరు జరిగే స్థానాలివే..బిహార్‌లోని రుపౌలి, బెంగాల్‌లోని రాయ్‌గంజ్, రాణాఘాట్ దక్షిణ్, బాగ్దాహ్, మనిక్తల ఉన్నాయి. ఇంకా తమిళనాడులోని విక్రవండి, మధ్యప్రదేశ్‌లోని అమర్వార, ఉత్తరాఖండ్‌లోని బద్రీనాథ్ మంగ్లౌర్, పంజాబ్‌లోని జలంధర్ వెస్ట్, హిమాచల్ ప్రదేశ్‌లోని డెహ్రా, హమీర్‌పూర్, నాలాగఢ్.హిమాచల్ సీఎం సుఖ్‌వీందర్ సింగ్ సుఖు భార్య కమ్లేశ్ ఠాకూర్ డెహ్రా స్థానంలో బరిలో ఉన్నారు. ఆయా స్థానాలకు ఈ నెల 13వ తేదీన ఓట్ల లెక్కింపు చేపడతారు.

టీఎంసీ నేత ముకుల్ రాయ్ పరిస్థితి విషమం

కోల్‌కతా: తృణమూల్ కాంగ్రెస్ సీనియర్ నేత ముకుల్ రాయ్(70) ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. కోల్‌కతాలోని తన నివాసంలోని బాత్‌రూంలో ఈ నెల 4న ముకుల్ రాయ్ జారిపడ్డారు. తలకు తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలోకి జారుకోవడంతో కోల్‌కతాలోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. మూడు రోజులుగా వైద్యుల బృందం ఆయన ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తోంది. శనివారం ఆయన ఆరోగ్యం విషమించినట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. కొంతకాలంగా ఆయన డిమెన్షియా(మతిమరుపు వ్యాధి)తో బాధపడుతున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ముకుల్ రాయ్ టీఎంసీ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరు.

కశ్మీర్‌లో నలుగురు ఉగ్రవాదులు హతం

నేలకొరిగిన ఇద్దరు ఆర్మీ జవాన్లు

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని కుల్గాం జిల్లాలో రెండు వేర్వేరు ప్రాంతాల్లో శనివారం భద్రతా బలగాలు, ఉగ్రవాదుల మధ్య కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనల్లో నలుగురు ముష్కరులు హతం కాగా, ఇద్దరు జవాన్లు నేలకొరిగారు. జిల్లాలోని మారుమూల ప్రాంతంలో ఉన్న ఫ్రిసాల్ చిన్నిగామ్ వద్ద భద్రతా బలగాలు కార్డన్‌సెర్చ్ చేపట్టాయి. ఈ సందర్భంగా ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయి. ఘటనలో నలుగురు ఉగ్రవాదులు హతమైనట్లు కశ్మీర్ ఐజీ వీకే బిర్ది చెప్పారు. కాల్పులు కొనసాగుతున్నాయని, ఘటనాస్థలిలోనే మృతదేహాలు పడి ఉన్నాయన్నారు. మరో ఘటన.. ఉగ్రవాదుల కదలికలపై సమాచారం అందుకున్న బలగాలు మొదెర్‌గావ్‌లో శనివారం ఉదయం కార్డన్ సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి. పొంచి ఉన్న ఉగ్రవాదులు ఒక్కసారిగా బలగాలపై కాల్పులకు దిగారు. బలగాలు కూడా దీటుగా స్పందించాయి. కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన ఇద్దరు జవాన్లు నేలకొరిగారు. ముష్కరుల కోసం గాలింపు చేపట్టారు.

ఉత్తరాఖండ్‌లో విరిగిపడిన కొండచరియలు.. ఇద్దరు హైదరాబాద్ వాసుల మృత్యువాత

గోపేశ్వర్: ఉత్తరాఖండ్‌లోని చమోలి జిల్లాలో కొండచరియలు విరిగి పడిన ఘటనలో హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. గౌచర్– కర్ణప్రయాగ్ మార్గంలోని బద్రీనాథ్ జాతీయ రహదారిపై చట్వాపీపల్ వద్ద శనివారం ఈ దుర్ఘటన చోటుచేసుకుందని పోలీసులు తెలిపారు. బద్రీనాథ్ ఆలయాన్ని దర్శించుకుని మోటారు సైకిల్‌పై వస్తున్న నిర్మల్ షాహి(36), సత్యనారాయణ(50)లపై పర్వత ప్రాంతం నుంచి బండరాళ్లు దొర్లుకుంటూ వచ్చి పడటంతో చనిపోయారన్నారు. ఇద్దరి మృతదేహాలను బయటకు తీశామని చెప్పారు. గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో బద్రీనాథ్ హైవేపై సుమారు డజను చోట్ల రహదారి మూసుకుపోయిందని పోలీసులు వివరించారు. కొండచరియలు విరిగి పడటంతో రుద్రప్రయాగ్– కేదార్‌నాథ్ జాతీయ రహదారిలో కూడా రాకపోకలు నిలిచిపోయాయన్నారు. రాష్ట్రంలోని కుమావ్, గఢ్వాల్ ప్రాంతాల్లో శని, ఆదివారాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయంటూ వాతావరణ విభాగం రెడ్ అలెర్ట్ జారీ చేసింది.

ఫ్రాన్స్‌లో నేడే రెండో దశ ఎన్నికలు

501 స్థానాలకు పోలింగ్ • విపక్ష కూటమిదే దూకుడు

పారిస్: ఫ్రాన్స్‌లో ముందస్తు ఎన్నికల్లో కీలక దశకు సర్వం సిద్ధమైంది. పార్లమెంటులో దిగువ సభ అయిన నేషనల్ అసెంబ్లీలోని 577 స్థానాలకు గాను 501 చోట్ల ఆదివారం రెండో రౌండ్‌లో భాగంగా పోలింగ్ జరగనుంది. తొలి రౌండ్‌లో 76 స్థానాలకు జరిగిన ఓటింగ్‌లో విపక్ష నేషనల్ ర్యాలీ, దాని మిత్ర పక్షాలు స్పష్టమైన ఆధిక్యం కనబరిచాయి. పోలైన 68 శాతం ఓట్లలో అతివాద నేషనల్ ర్యాలీ కూటమి ఏకంగా 33.14 శాతం ఓట్లతో విజయం సాధించింది. మరో విపక్ష కూటమి న్యూ పాపులర్ ఫ్రంట్ 27.99 శాతం ఓట్లతో రెండో స్థానంలో నిలిచింది. అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మాక్రాన్ సారథ్యంలోని మితవాద సెంట్రిస్ట్ ఎన్‌సెంబల్ కూటమి కేవలం 20.04 శాతం ఓట్లతో మూడో స్థానానికి పరిమితమైంది. జూన్‌లో జరిగిన యూరోపియన్ యూనియన్ ఎన్నికల్లో మెరీన్ లీ పెన్‌కు చెందిన నేషనల్ ర్యాలీ పార్టీ విజయం నేపథ్యంలో విపక్షాలు పుంజుకుంటున్న సంకేతాలు స్పష్టమయ్యాయి. దాంతో మేక్రాన్ ముందస్తు ఎన్నికలకు వెళ్లడం తెలిసిందే. రెండో రౌండ్‌లో కూడా నేషనల్ ర్యాలీ కూటమి హవాయే కొనసాగవచ్చంటున్నారు. అదే జరిగి 289 పై చిలుకు స్థానాలతో అది పూర్తి మెజారిటీ సాధిస్తే రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఈ ఘనత సాధించిన తొలి రైటిస్టు కూటమి అవుతుంది. ప్రభుత్వాన్ని కూడా ఏర్పాటు చేస్తుంది. అప్పుడు కూటమి అధ్యక్షుడు జోర్డాన్ బార్డెల్లా ప్రధాని అవుతారు. ఆయనతో మాక్రాన్ అధికారాన్ని పంచుకోవాల్సి ఉంటుంది.

అమెరికాలో కాల్పులు.. నలుగురు మృతి

ఫ్లోరెన్స్: అమెరికాలో కెంటకీ రాష్ట్రం ఫ్లోరెన్స్‌లోని ఓ ఇంట్లో బర్త్ డే పార్టీ సందర్భంగా జరిగిన కాల్పుల ఘటనలో నలుగురు చనిపోగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. శనివారం వేకువజామున ఘటన చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కాల్పులకు కారకుడిగా భావిస్తున్న యువకుడిని పోలీసులు వెంటాడారు. ఛేజింగ్ సమయంలో అతడు కారు సహా లోయలో పడిపోయాడని పోలీసులు తెలిపారు. అతడు తనను తాను కాల్చుకున్నాడని, గాయాలతో ఆస్పత్రిలో మృతి చెందాడని చెప్పారు.ఘటనకు కారణాలు తెలియాల్సి ఉందన్నారు.

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి సిద్ధం

మోదీతో బ్రిటన్ నూతన ప్రధాని స్టార్మర్ ఫోన్ సంభాషణ

లండన్: భారత్– బ్రిటన్‌ల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని (ఎఫ్‌టీఏ) ఆచరణలోకి తెచ్చేందుకు సిద్ధమని బ్రిటన్ నూతన ప్రధాని కియర్ స్టార్మర్ తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీతో శనివారం ఆయన ఈ మేరకు ఫోన్లో చర్చలు జరిపినట్టు బ్రిటన్ ప్రకటించింది. ఆర్థిక బంధాన్ని బలోపేతం చేయడానికి, ఇరు దేశాల ప్రజల వికాసానికి కట్టుబడి ఉన్నామని మోదీ ట్వీట్ చేశారు. వాతావరణ మార్పులు, ఆర్థికాభివృద్ధి అంశాల్లో మోదీ నాయకత్వాన్ని స్టార్మర్ స్వాగతించారని ప్రధాని కార్యాలయం తెలిపింది. 2030 రోడ్‌మ్యాప్‌పై ప్రధానులు చర్చించారని, పలు రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని బలోపేతం చేసుకోవడానికి అంగీకరించారని వెల్లడించింది. త్వరలో భేటీ అవాలని నేతలిద్దరూ నిర్ణయించారు. 38.1 బిలియన్ పౌండ్ల ద్వైపాక్షిక వాణిజ్య భాగస్వామ్యంపై భారత్, బ్రిటన్ 2022 నుంచి సంప్రదింపులు జరుపుతున్నాయి.

అద్వాణీకి పొరపాటున మంత్రి శ్రద్ధాంజలి!

తుమకూరు: బీజేపీ దిగ్గజ నేత ఎల్‌కే అద్వానీ చనిపోయారంటూ కేంద్రమంత్రి వి.సోమణ్ణ ఏకంగా ఆయనకు శ్రద్ధాంజలే ఘటించారు! కర్ణాటకలోని తుమకూరులో శనివారం ఈ ఘటన జరిగింది. అద్వానీ అనారోగ్యంతో రెండుసార్లు ఆస్పత్రిలో చేరి చికిత్స అనంతరం కోలుకోవడం తెలిసిందే. మంత్రి మాత్రం బీజేపీ, జేడీ(ఎస్) కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ, ''నాకిప్పుడే సమాచారం అందింది. అద్వానీ మరణించారు'' అంటూ శ్రద్ధాంజలి ఘటించారు. అద్వానీ క్షేమంగా ఉన్నారని తేలడంతో సభికులంతా కంగుతిన్నారు.

సూరత్‌లో కూలిన ఆరంతస్తుల భవనం

సూరత్: గుజరాత్‌లోని సూరత్‌లో శనివారం మధ్యాహ్నం ఆరంతస్తుల భవనం కూలిన ఘటనలో ఒకరు చనిపోయారు. శిథిలాల కింద నలుగురు చిక్కుకున్నట్లు అనుమానిస్తున్నారు. ఒక మహిళను రక్షించామని, ఒక మృతదేహాన్నివెలికి తీశామని పోలీసులు తెలిపారు.

మైనర్ చేతిలో స్కూటర్.. తల్లికి జరిమానా

మండ్య: ఇంట్లో పిల్లలకు, లేదా పక్కింటి బాలలు అడిగారు కదా అని బైక్‌లు ఇచ్చే తల్లిదండ్రులు పారా హుషార్. ఓ మైనర్ బాలుడు స్కూటర్ నడుపుతూ దొరికిన కేసులో అతని తల్లికి కోర్టు రూ. 25 వేల జరిమానా విధించింది. వివరాలు...స్కూటర్ మీద ఓ మైనర్ బాలుడు రామనగర జిల్లా నుంచి మండ్య వైపుగా వెళుతున్నాడు. ఈ సమయంలో ట్రాఫిక్ పోలీసులు అతన్ని ఆపి స్కూటీని సీజ్ చేశారు. వాహన యజమానిగా రామనగర జిల్లా బిడది నగర మధువంతి పేరు ఉంది. ఆమె కొడుకే ఆ బాలుడు. కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. న్యాయస్థానం విచారణ చేసి మధువంతికి రూ. 25 వేల జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. 18 ఏళ్లలోపువారు వాహనాలు నడపడం చట్టవిరుద్ధం.

న్యూస్‌రీల్

రాజకాలువలో పడి బైకిస్టు గల్లంతు


హేమంత్‌కుమార్

దొడ్డబళ్లాపురం: వేగంగా వెళ్తున్న బైక్ డివైడర్‌ను ఢీకొనగా బైకిస్టు ఎగిరి పక్కనే ఉన్న రాజకాలువలో పడి కొట్టుకుపోయిన సంఘటన బెంగళూరులోని జ్ఞానభారతి మెట్రో స్టేషన్ వద్ద చోటుచేసుకుంది. బ్యాటరాయనపురకు చెందిన డెలివరి బాయ్ హేమంత్ (23) శుక్రవారం రాత్రి పని ముగించుకుని బైక్‌పై ఇంటికి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో మైసూరు రోడ్డులోని జ్ఞానభారతి మెట్రో స్టేషన్ వద్ద ఉన్న డివైడర్‌ను ఢీకొన్నాడు. ఆ వేగానికి హేమంత్ పక్కనే ఉన్న రాజకాలువలోకి ఎగిరిపడ్డాడు. వర్షాల వల్ల కాలువలో నీరు జోరుగా ప్రవహిస్తుండడంతో కొట్టుకుపోయాడు. ఫైర్ సిబ్బంది ఎంత గాలించినా జాడ తెలియలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

రూ. 66 లక్షలు సైబర్ దొంగలపాలు

క్రిష్ణగిరి: క్రిప్టో కరెన్సీ ద్వారా మీ డబ్బును రెండింతలు పెంచుకోవచ్చునని భ్రమపెట్టి ప్రైవేట్ కంపెనీ ఉద్యోగి వద్ద రూ. 66.87 లక్షలు కాజేసిన సైబర్ దొంగల ఉదంతమిది. వివరాల మేరకు క్రిష్ణగిరి జిల్లా ఊత్తంగేరి ప్రాంతానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగి సెల్‌ఫోన్‌కు గత ఏప్రిల్ 3వ తేదీ వచ్చిన మెసేజ్‌పై స్పందించాడు. వారు పంపిన లింక్ ద్వారా తన చిరునామాను పూర్తి చేశాడు. ఈ లింక్ ద్వారా డబ్బులు జమ చేయడం ద్వారా ఇబ్బడిముబ్బడిగా లాభాలు వస్తాయని అతనికి నమ్మించారు. దీంతో ముందు వెనుకా ఆలోచించకుండా అతడు రూ. 66.87 లక్షల డబ్బును జమ చేశాడు. తరువాత లింక్‌ను మూసివేయడంతో మోసగాళ్లకు కాల్ చేయగా స్విచాఫ్ అని వచ్చింది. మోసపోయినట్లు తెలుసుకున్న ఉద్యోగి క్రిష్ణగిరి క్రైం బ్రాంచ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కేఆర్‌ఎస్ పరిధిలో గనులను తవ్వరాదు



మండ్య: నాల్వడి కృష్ణరాజ ఒడెయార్ రైతుల కోసం ముందుచూపుతో నిర్మాణం చేసిన కృష్ణరాజసాగర జలాశయం సంరక్షణ కోసం డ్యాం నుంచి 20 కిలోమీటర్ల పరిధిలో ఎలాంటి గనుల తవ్వకాలు నిర్వహించకూడదని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఈ మేరకు మంత్రి ఎన్.చెలువరాయస్వామిని కోరారు. కలెక్టరేట్‌లో అధికారులు, మంత్రి కలిసి రైతు నేతలతో సమావేశం నిర్వహించారు. రైతులు మాట్లాడుతూ బేబి బెట్టలో ట్రయల్ బ్లాస్టకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని, వాటిని నిలిపివేయాలని కోరారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి జిల్లాలోని గనులను లూటీ చేయడానికి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. జలాశయం చుట్టుపక్కల 20 కిలోమీటర్ల పరిధిలో గనులను తవ్వరాదని కోరారు.

జగ్జీవన్‌కు ఘన నివాళి



మైసూరు: హరిత విప్లవానికి మారుపేరు అయిన మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ 38వ వర్ధంతి సందర్భంగా మైసూరు నగరంలోని రైల్వేస్టేషన్ ముందు భాగంలో ఉన్న సర్కిల్‌లో విగ్రహానికి ప్రముఖులు నివాళులర్పించారు. జిల్లా కలెక్టర్ జీ.లక్ష్మీకాంత్‌రెడ్డి పూలహారం వేసి నివాళి అర్పించారు. జడ్పీ సీఈఓ కె.ఎం.గాయత్రి, పాలికె కమిషనర్ అసదుల్ రెహమాన్ పాల్గొన్నారు.

అటు డెంగీ, ఇటు జికా దాడి

- హాసన్, బెంగళూరులో డెంగీ తీవ్రం
- పలువురు బాలల మృత్యువాత
- శివమొగ్గలో జికాతో వృద్ధుడు..
- దోమల నివారణ తక్షణావసరం


డెంగీపై బెంగళూరులో ఆరోగ్య సిబ్బంది జాగృతి జాతా (ఫైల్)


దోమ కాటుకు గురికాకుండా ఉంటే డెంగీ బాధ తప్పుతుంది

బనశంకరి: రాష్ట్రంలో డెంగీ విషజ్వరం రోజురోజుకూ విజృంభిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా విచ్చలవిడిగా డెంగీ కేసులు పెరగడంతో ప్రజలు భయభ్రాంతులకు గురి అవుతున్నారు. హాసన్‌లో 6 మంది పిల్లలు డెంగీ బారిన పడి మృత్యువాత పడ్డారు. బెంగళూరులో 11 ఏళ్ల బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. దీనికి తోడు మరణాంతక జికా వైరస్ కూడా వెలుగులోకి రావడంతో ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. డెంగీ, జికా రెండు కూడా దోమలు కుట్టడం వల్ల వ్యాపిస్తాయి.

బెంగళూరులో బాలుడు..


బెంగళూరు అంజనాపురలో గగన్ (11) అనే బాలుడు చైతన్య స్కూల్‌లో 5వ తరగతి చదువుతూ డెంగీ బారినపడ్డాడు. ఆ పాఠశాలలో సరైన రీతిలో స్వచ్ఛత పాటించలేదని, దీంతో రోగాలు వస్తున్నాయని తల్లిదండ్రులు ఆరోపించారు. బాలున్ని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా పరిస్థితి విషమించి శుక్రవారం రాత్రి చనిపోయాడు.

హాసన్‌లో వారంలో నలుగురు..

హాసన్ జిల్లాలో డెంగీ కోరలు చాచింది. జిల్లాలో ఒకేవారంలో డెంగీ వల్ల నలుగురు పిల్లలు మృత్యుఒడికి చేరారు. జిల్లాసుపత్రిలో ముగ్గురు పిల్లలు మరణించారు. జూన్ 30 తేదీన హొళెనరసిపుర తాలూకా దొడ్డమగ్గెయలో 8 ఏళ్ల వర్షిక, జూలై 1 తేదీన అరకలగూడు తాలూకావాసి అక్షత (13) చనిపోయారు. 3వ తేదీన గుడ్డేనహళ్లిలో కళాశ్రీ (11), 5వ తేదీ రాత్రి హొళెనరసీపుర దొడ్డమళ్లికి చెందిన సమృద్ధి (8) అనే బాలిక కన్నుమూశారు. రామనగరలోనూ డెంగీ కోరలు చాస్తోంది, బాధితులకు జిల్లాసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. 773 మంది రోగులకు రక్తపరీక్షలు నిర్వహించగా అందులో 58 మందికి డెంగీ సోకినట్లు నిర్ధారణ అయ్యింది. వీరిలో ఇద్దరు ఐసీయులో చికిత్స పొందుతున్నారు. చిక్కబళ్లాపుర జిల్లాలో గుడిబండ నివాసి వేణు డెంగీతో మృతిచెందారు.

కోవిడ్ తరహాలో చికిత్స కేంద్రాలు కావాలి

అంటురోగాలపై సమరం సాగించడానికి ప్రధానంగా స్వచ్ఛత కాపాడాలి. అంతేగాక కోవిడ్ తరహాలో డెంగీ రోగులకు వార్డులను ఏర్పాటు చేసి ఉచిత చికిత్స అందించాలని పలువురు వైద్య నిపుణులు తెలిపారు. డెంగీకి కారణమయ్యే ఈడిస్ ఈజిప్టై దోమలను అరికట్టాలని సూచించారు. వర్షాకాలం ప్రారంభంలో దోమలు ప్రబలి ఇటువంటి రోగాలు వస్తాయని తెలిపారు. డెంగీని నియంత్రించకపోతే చికెన్ గున్యా, జికా వైరస్ కూడా రావచ్చునని, అందుకే మెడికల్ ఎమర్జెన్సీ ప్రకటించి సత్వర వైద్యసేవలను అందించాలని డిమాండ్ చేశారు. వర్షాకాల సమస్యలను పరిష్కరించాలి, జపాన్, సింగపూర్, అమెరికాలో డెంగీకి తగిన ఔషధాలు ఉన్నాయి, వాటిని రాష్ట్ర ప్రభుత్వం తెప్పించుకోవాలని తెలిపారు. ప్రత్యేకించి బాలలను కాపాడాలని, బస్తీలు, పాఠశాలల్లో పారిశుధ్య చర్యలను ముమ్మరం చేయాలని కోరారు.



శివమొగ్గలో జికా వైరస్, ఒకరు మృతి



శివమొగ్గ: ఇప్పటికే ఎటుచూసినా డెంగీ జ్వరాలు విస్తరిస్తుండగా, మరోవైపు జికా జ్వరం కూడా వ్యాపిస్తోంది. శివమొగ్గ నగరంలో ఒక వృద్ధుడు చికిత్స పొందుతూ చనిపోయాడు. జిల్లాలో జికాతో మరణించిన మొదటి వ్యక్తి ఇతడేనని వైద్యులు తెలిపారు. వివరాలు.. శివమొగ్గ గాంధీ నగరలో నివాసం ఉంటున్న 74 సంవత్సరాల వృద్ధుడు జూన్ 19వ తేదీన తీవ్రమైన జ్వరంతో బాధపడసాగాడు. జ్వరం తగ్గకపోవడంతో కుటుంబ సభ్యులు ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ 21వ తేదీన అతనికి పలు టెస్టులు చేయగా, జికా వైరస్ సోకినట్లు తేలింది. దాంతో శివమొగ్గ నగరంలోని మరో పెద్ద ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొంది కోలుకున్న బాధితుడు గురువారం డిశ్చార్జ్ అయ్యాడు. కానీ శుక్రవారం మృతి చెందాడు. కాగా, సాగర పట్టణంలోనూ ఒకరికి జికా జ్వరం సోకినట్లు తేలింది.

12 గంటలు విమానంలోనే బందీలు


ఢిల్లీలో విమానంలో పడిగాపులు


దొడ్డబళ్లాపురం: స్పైస్‌జెట్ విమానయాన సంస్థ నిర్వాకం వల్ల ప్రయాణికులు 12 గంటలపాటు నరకయాతన అనుభవించినట్లు వాపోయారు. ప్రయాణికులు తెలిపిన మేరకు ఢిల్లీ నుంచి బెంగళూరుకు శుక్రవారం సాయంత్రం 7–45కి టేకాఫ్ తీసుకోవాల్సిన స్పైస్‌జెట్ విమానం మరుసటిరోజు ఉదయం 7 గంటలకు టేకాఫ్ తీసుకుంది. సుమారు 12 గంటలపాటు ప్రయాణికులు భోజనం లేకుండా విమానంలోనే నకయాతన పడ్డారు. పిల్లలు, వృద్ధులు మరింత ఇబ్బందికి గురయ్యారు. చివరకు శనివారం ఉదయం బెంగళూరులో విమానం ల్యాండ్ కాగానే ప్రయాణికులు స్పైస్‌జెట్ సంస్థకు వ్యతిరేంగా నినాదాలు చేసి ధర్నా చేశారు. అసలు విమానంలో పైలట్ లేనేలేడని, ఉదయం పైలట్ వచ్చాక విమానం బయలుదేరిందని, తాము అనేక తిప్పలు పడ్డామని ప్రయాణికులు తెలిపారు. స్పైస్‌జెట్ సిబ్బంది మాత్రం సాంకేతిక సమస్య అని చెప్పారు.

దుబాయ్ నుంచి తల్లీకూతుళ్ల డ్రగ్స్ దందా

బనశంకరి: దుబాయ్‌లో ఉంటూనే బెంగళూరు నగరంలో డ్రగ్స్ దందాలో సాగిస్తున్న తల్లీ కుమార్తెతో పాటు ముగ్గురిపై సీసీబీ పోలీసులు కేసు నమోదుచేశారు. తన కుమారుడు (23)కి డ్రగ్స్ సరఫరా చేసి మత్తు పదార్థాలకు బానిసను చేశారని నగరానికి చెందిన పారిశ్రామికవేత్త సీసీబీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో విచారణ జరిపి యూఏఈలో ఉంటున్న నతాలియా విర్లాని, లీనా విర్లాని, బెంగళూరువాసి రంజన్ అనే ముగ్గురిపై కేసు నమోదుచేశారు. విర్లానీలు ఇద్దరూ దుబాయ్‌లో స్థిరపడ్డారు. రంజన్ అనే వ్యక్తి ద్వారా హైడ్రో గంజా, ఎండీఎంఏ డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్నారు. వారు తరచూ బెంగళూరుకు వచ్చి వెళ్లేవారు. డ్రగ్స్‌తో సంపాదించిన డబ్బును ఓ ప్రైవేటు బ్యాంకులో జమ చేసేవారు. తల్లీకూతుళ్ల విచారణకు హాజరుకావాలని నోటీస్ జారీచేస్తామని సీసీబీ పోలీసులు తెలిపారు.

గృహలక్ష్మి పెండింగ్ నగదు పడుతుంది: మంత్రి

సాక్షి, బళ్లారి: ఐదు గ్యారెంటీల్లో ఒకటైన గృహలక్ష్మీ పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు జూన్ నెల నగదు పెండింగ్‌లో ఉండగా, త్వరలో ఖాతాల్లోకి జమ అవుతుందని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖా మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ చెప్పారు. ఆమె శనివారం బళ్లారిలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కనక దుర్గమ్మ ఆలయంలో ఆమె ప్రత్యేక పూజలు చేశారు. గృహలక్ష్మీ పథకం మొదలయ్యాక గత మే నెల వరకు ఆయా మహిళల ఖాతాల్లోకి నగదు జమ అవుతోందన్నారు. జూన్ నెల మొత్తం మాత్రం పెండింగ్‌లో ఉందన్నారు. ఈ మొత్తాన్ని కూడా త్వరలో జమ చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. లబ్ధిదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చామని, వాటిని ఎట్టి పరిస్థితుల్లోను ఆపబోమన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు కోడిగుడ్ల సరఫరా నిలిచిపోవడానికి చాలా కారణాలు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి మార్పు గురించి తనకు తెలియదని మంత్రి అన్నారు. అలాంటిదేమీ జరగడం లేదన్నారు. ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, బుడా అధ్యక్షుడు జే.ఎస్.ఆంజనేయులు పాల్గొన్నారు.


జోగ్ సొగసు

ఎగువన భారీ వర్షాలతో శనివారం శివమొగ్గ జిల్లా సాగర వద్ద ఉరకలెత్తిన జోగ్ జలపాతం

మొబైల్ చార్జర్ షాక్, యువకుడు మృతి

బనశంకరి: మొబైల్‌ఫోన్‌కి చార్జింగ్ పెడుతుండగా చార్జర్ షాక్ కొట్టి యువకుడు చనిపోయాడు. ఈ సంఘటన బెంగళూరు బసవేశ్వర నగర పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి జరిగింది. బీదర్ కు చెందిన శ్రీనివాస్ (24) మంజునాథ నగరలో ప్రైవేటు హాస్టల్‌లో ఉంటూ, ఐటీ కోర్సు చేసేవాడు. మొబైల్‌కు చార్జింగ్ పెడుతుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. కొంతసేపటికి అతని స్నేహితులు భోజనానికి పిలవడానికి రాగా అతడు కిందపడి ఉండటాన్ని గమనించారు. అతన్ని లేపడానికి ప్రయత్నించగా స్నేహితునికి కూడా విద్యుత్‌షాక్ కొట్టింది. కానీ అదృష్టవశాత్తూ స్నేహితుడు ప్రాణాలతో బయటపడ్డాడు.

తీర ప్రాంతాల్లో వరుణ ఘోష


చార్మాడి ఘాట్‌లో ప్రమాదకర ప్రదేశాల్లో పోలీసుల గస్తీ


ఉడుపి జిల్లాలో ఇంకా శాంతించని సౌపర్ణిక నది


శనివారం కలబుర్గిలో వర్షం తరువాత..

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- జన జీవనానికి అవస్థలు

దొడ్డబళ్లాపురం: మలెనాడు, కోస్తా, ఉత్తర కన్నడ జిల్లాల్లో భారీ వర్షాలకు జన జీవనం అతలాకుతలమైంది. పంటపొలాలు, తగ్గు ప్రదేశాలు జలమయమయ్యాయి. భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. పలుచోట్ల ప్రధాన రహదారులు సైతం మునిగిపోయాయి. దీంతో పాఠశాల, కళాశాలలకు ఆయా జిల్లాల కలెక్టర్లు సెలవులు ప్రకటించారు. దక్షిణ కన్నడ, ఉడుపి, ఉత్తర కన్నడ జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించారు. వరద, కొండచరియలు విరిగిడే ప్రదేశాలలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరికలు జారీచేశారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకూడదని, పర్యాటకులు అపాయం ఉన్న ప్రదేశాలకు వెళ్లవద్దని పోలీసులు ప్రకటించారు. చిక్కమగళూరు జిల్లా మూడిగెరె, కొట్టిగెహారలో రికార్డు స్థాయిలో వర్షపాతం కురిసింది. తుంగభద్ర, హేమావతి నదుల్లో నీటిప్రవాహం గణనీయంగా పెరిగింది. చిక్కమగళూరు జిల్లాలో పలు గ్రామాలు వరద నీటితో ద్వీపాల్లా మారాయి.

ప్రమాదకరంగా చార్మాడి రోడ్డు

భారీ వర్షాల వల్ల రాకపోకలకు ముఖ్యమైన చార్మాడి ఘాట్ ప్రమాదకరంగా మారింది. అనేక చోట్ల మట్టి, రాళ్లు రోడ్డుకి అడ్డంగా విరిగిపడ్డాయి. మరికొన్ని చోట్ల భూమి కుంగిపోయింది. ఘాట్‌లో నిత్యం బెంగళూరు– మంగళూరు మధ్య వేల సంఖ్యలో వాహనాలు సంచరిస్తుంటాయి. గూడ్స్ వాహనాలు, ఇంధన వాహనాలు, టూరిస్టుల వాహనాలు ఇందులో ఉంటాయి. రోడ్డు ఎక్కడైనా కూలిపోతే మొత్తం ట్రాఫిక్ స్తంభించే ప్రమాదముంది. కొన్నిచోట్ల డివైడర్‌లు వర్షాలకు దెబ్బతిన్నాయి. దీంతో వాహనదారులకు నిదానంగా ప్రయాణించాలని పోలీసులు హెచ్చరికలు జారీ చేసారు. ఈ రోడ్డులో పోలీసులు 24 గంటలు గస్తీ తిరుగుతున్నారు. జూలై 5 నుండి చిక్కమగళూరు జిల్లావ్యాప్తంగా ప్రధాన రహదారి మార్గాల్లో 12 టన్నులకు పైబడిన లోడుతో తిరిగే వాహనాల సంచారాన్ని నిషేధించారు.

ఉప లోకాయుక్తగా జస్టిస్ వీరప్ప


ప్రమాణం చేయిస్తున్న గవర్నర్ గెహ్లాట్

శివాజీనగర: రాష్ట్ర ఉప లోకాయుక్తగా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బీ.వీరప్ప శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్ ఆవరణలో గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్, ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. సీఎం సిద్ధరామయ్య, డీసీఎం డీ.కే.శివకుమార్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జస్టిస్ వీరప్ప గతంలో జరిగిన ఎస్ఐ నియామకాల కుంభకోణంపై నివేదిక సిద్ధం చేసి సీఎం సిద్ధరామయ్యకు సమర్పించారు.

డెవిల్ దర్శకునికి నోటీసులు

దొడ్డబళ్లాపురం: రేణుకాస్వామి హత్య కేసుకు సంబంధించి డెవిల్ సినిమా డైరెక్టర్ కం ప్రొడ్యూసర్ అయిన మిలన ప్రకాశ్‌కు పోలీసులు మరోసారి విచారణకు హాజరవ్వాలని నోటీసులు ఇచ్చారు. శుక్రవారంనాడు ప్రకాశ్ విజయనగర ఏసీపీ ముందు హాజరయ్యారు. మరోసారి విచారణకు రావాలని శనివారం పోలీసులు ప్రకాశ్‌కు నోటీసులు ఇచ్చారు. రేణుకాస్వామి హత్య తరువాత హీరో దర్శన్ మైసూరులో డెవిల్ సినిమా షూటింగ్‌లో పాల్గొన్నారు. ఈ అంశాలపై సమాచారం కోసం ప్రకాశ్‌ను విచారించారు.

66 వస్తువుల సీజ్

రేణుకాస్వామి హత్యకేసుకు సంబంధించి దర్యాప్తు చేసిన పోలీసులు మొబైల్‌ఫోన్లో కలిపి మొత్తం 66 వస్తువులను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు తరలించారు. రేణుకాస్వామి దుస్తులు, సీసీ కెమెరాల ఫుటేజీ, మొబైల్ ఫోన్లు, దాడికి వాడిన వస్తువులు తదితరాలను సేకరించారు.

కరావళి నుంచి దర్శన్ ఔట్?

పరప్పన అగ్రహార జైలులో ఊచలు లెక్కిస్తున్న దర్శన్‌కు మరో షాక్ తగిలింది. కొత్తగా నిర్మిస్తున్న కరావళి సినిమా నుంచి దర్శన్‌ను తొలగిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రజ్వల్ దేవరాజ్ హీరోగా నటిస్తున్న కరావళిలో దర్శన్ ముఖ్య పాత్రలో నటిస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఇటీవల విడుదలైన పోస్టర్‌లో దర్శన్ కనిపించలేదు. దర్శన్ స్థానంలో కిచ్చ సుదీప్ నటిస్తున్నట్లు సమాచారం. ఇది దర్శన్ ఫ్యాన్స్‌కు మింగుడుపడడం లేదు.

రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

- ఎంపీ డాక్టర్ మంజునాథ్ డిమాండ్



శివాజీనగర: రాష్ట్రంలో డెంగీ కేసులు పెరుగుతున్న దృష్ట్యా హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించి, చికిత్సకు అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరించాలని ఎంపీ డాక్టర్ సీ.ఎస్.మంజునాథ్ డిమాండ్ చేశారు. శనివారం మల్లేశ్వరం బీజేపీ రాష్ట్ర కార్యాలయం జగన్నాథ భవన్‌లో విలేకరులతో మాట్లాడిన ఆయన, దోమల నియంత్రణతోనే డెంగీ సాధ్యమని, చికున్ గున్యా, జికా వైరస్‌లు వంటి వాటివి కూడా రావచ్చని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్ధారించిన చార్జీల కంటే అధిక ఫీజు తీసుకుంటే అటువంటి ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలన్నారు. డెంగీ నియంత్రణకు టాస్క్‌ఫోర్స్ నియమించాలని తెలిపారు. డెంగీతో ఒక వైద్యుడితో పాటు ఆరేడు మంది మృతి చెందారని, ఎంతో మంది డెంగీతో చికిత్స పొందుతున్నారన్నారు. వెంటనే అన్ని విద్యా సంస్థలకు సర్క్యులర్ పంపించి, పాఠశాల పాలక మండలితో సమావేశం జరపాలన్నారు. విలేకరుల సమావేశంలో అశ్వత్థనారాయణ, చలవాది నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

రైతును తొక్కి చంపిన అడవి ఏనుగు

దొడ్డబళ్లాపురం: పొలంలో నీరు కట్టడానికి వెళ్లిన రైతుపై అడవి ఏనుగు దాడిచేసి తొక్కి చంపిన సంఘటన కనకపుర తాలూకా తిప్పూరు గ్రామంలో చోటుచేసుకుంది. శివరుద్ర (42) ఏనుగు దాడిలో మృతి చెందిన రైతు. శివరుద్ర మల్బరీ పంటకు నీరు కడుతుండగా హఠాత్తుగా వచ్చిన అడవి ఏనుగు దాడిచేసి తొక్కి చంపింది. ఇంటి నుండి పొలానికి వెళ్లిన శివరుద్రప్ప ఎంతసేపటికీ రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా శివరుద్రప్ప మృతదేహం కనిపించింది.

సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు సంఘటనాస్థలానికి వచ్చి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. అడవి ఏనుగును వెంటనే అడవిలోకి తరిమికొట్టాలని డిమాండు చేసారు. కోడిహళ్లి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

జేడీఎల్పీ పగ్గాలు ఎవరికో?

దొడ్డబళ్లాపురం: విధానసభలో జేడీఎస్ శాసనసభాపక్ష నేత (జేడీఎల్పీ) ఎవరు అనేది సస్పెన్స్‌గా మారింది. ఇప్పటివరకు ఈ పదవిలో ఉన్న హెచ్‌డీ కుమారస్వామి మండ్య ఎంపీగా ఎన్నిక కావడంతో రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో శనివారంనాడు పార్టీ ఆఫీసులో తమ ఎమ్మెల్యేలతో చర్చించారు. సీనియర్ శాసనసభ్యుడు జీటీ దేవేగౌడకు లేదా హెచ్‌డీ రేవణ్ణకు ఈ పదవినివ్వాలని సూచించారు ఎమ్మెల్యేలు. దేవేగౌడ, కుమారస్వామిల నిర్ణయమే అంతిమం కానుంది. రాబోయే వర్షాకాల అసెంబ్లీ సమావేశాల్లో అసెంబ్లీలో ఏ విధంగా పోరాడాలి అనేదానిపైనా చర్చించారు.

క్లుప్తంగా

పుస్తకాల పంపిణీ


నోటు పుస్తకాల వితరణ దృశ్యం

గౌరిబిదనూరు: ప్రభుత్వ పాఠశాలలను దాతలు తమ విరాళాలతో అభివృద్ధి పరచి విద్యార్థులకు తోడ్పడాలని కన్నడ సాహిత్య పరిషత్తు మాజీ అధ్యక్షుడు డిజె చంద్రమోహన్ తెలిపారు. శనివారం సోనగానహళ్ళిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలను, పఠన సామగ్రిని అందజేశారు. గ్రామీణ ప్రదేశ విద్యార్థులను సమాజ సేవకులు ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దాతలు కెవి రమణాచారి దంపతులు, తారానాథ్, కోటి భాస్కర్,రాఘవేంద్రాచారి పాల్గొన్నారు.

మహిళా నేతలతో డీకే భేటీ

శివాజీనగర: మహిళలను రాజకీయ శక్తిగా మార్చాలనేది కాంగ్రెస్ లక్ష్యమని డిప్యూటీ సీఎం డీ.కే.శివకుమార్ అన్నారు. శనివారం కేపీసీసీ కార్యాలయం మహిళా కాంగ్రెస్ నాయకుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పార్టీలో మహిళలకు సమాన అవకాశం కల్పించే దృష్టితో 100కు పైగా మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లను నేడు ఆహ్వానించాం. వారు తమ అనుభవాన్ని పంచుకున్నారు. మహిళలు రాజకీయ నాయకత్వం, రాజకీయాలలో రాణించాలి, గ్యారంటీ పథకాల అమలులో భాగస్వాములు కావాలి, కాంగ్రెస్ పార్టీ సేవకు సిద్ధం కావాలని డీకే సూచించారు.

నీటి కోసం చెరుకు రైతుల ధర్నా

మైసూరు: కబిని జలాశయం పరిధిలో ఉన్న కాలువలకు, చెరువులకు, నీటి కుంటలకు వెంటనే నీటిని వదలాలని రాష్ట్ర చెరుకు రైతుల సంఘం నాయకులు, రైతులు శనివారం మైసూరులోని కావేరి నీటిపారుదల కార్యాలయం (కాడా)ని ముట్టడించారు. గన్ హౌస్‌లోని కువెంపు పార్క్ వద్దకు చేరి రాష్ట్ర ప్రభుత్వానికి, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ర్యాలీగా కాడా ఆఫీసుకు వచ్చి అక్కడ ధర్నా చేశారు. రైతు నేత హళ్ళికెరెహుండి భాగ్యరాజ్ మాట్లాడుతూ మైసూరు, చామరాజనగర జిల్లాల కాలువలకు, చెరువులకు వెంటనే కబిని జలాశయం నుంచి నీటిని విడుదల చేయాలని, రైతులు చెరుకు పంట సాగు చేయడానికి అవకాశమివ్వాలని కోరారు.

యువశక్తే దేశ సంపద


డిగ్రీ పట్టభద్రులతో డీఆర్.విజయసారథి, ఆర్.సర్వమంగళ తదితరులు

బనశంకరి: యువ సమాజం దేశ సంపదని, విద్యావంతులను సమాజం గౌరవిస్తుందని వాసవి విద్యాసంస్థ కార్యదర్శి డీఆర్.విజయ సారథి అన్నారు. శనివారం వాసవిజ్ఞానపీఠ డిగ్రీ కాలేజీ సభాంగణంలో ఏర్పాటు చేసిన పట్టభద్రులకు డిగ్రీపట్టాలు ప్రదానం కార్యక్రమంలో డీఆర్.విజయసారథి మాట్లాడారు. విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. ప్రతిభావంత విద్యార్థులుగా తీర్చిదిద్దడమే తమ సంస్థ లక్ష్యమని తెలిపారు. బెంగళూరు యూనివర్శిటీ వాణిజ్య నిర్వహణ విభాగ ప్రొఫెసర్ ఆర్.సర్వమంగళ మాట్లాడుతూ... విద్యార్థులు విహరించే పక్షులని డిగ్రీ సమయంలో జవాబుదారీని గుర్తించాలని, మార్కులు అన్నింటికీ కొలమానం కాదని, జీవితంలో విజయం సాధించాలనే లక్ష్యం ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మా, అధ్యాపకులు డాక్టర్ రంగస్వామి, రచన, సౌభాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

లోకాయుక్త వలలో ఏడీఎల్ఆర్, ఆర్ఐ

మాలూరు: సర్వే, భూ మాపన శాఖ ఏడీఎల్ఆర్ అశ్విని, ఆర్ఐ మంజునాథ్ భూమి ఖాతా మార్పిడికి రూ.10 వేల లంచం తీసుకుంటూ శనివారం లోకాయుక్తకు చిక్కారు. తాలూకాలోని దొడ్డకడతూరు గ్రామ సర్వే నెంబరు 201-2లో కామణ్ణ అనే వ్యక్తికి భూమి ఖాతా మార్పిడికి రూ.30 వేల లంచం డిమాండ్ చేసి ఇందులో రూ.10 వేలను ఇప్పటికే తీసుకున్నారు. ఈ విషయంపై కామణ్ణ లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. దీంతో మిగిలిన మొత్తాన్ని ఏడీఎల్ఆర్ అశ్వినికి శనివారం ఇవ్వడానికి వచ్చిన సమయంలో అశ్విని ఆర్ఐ మంజునాథ్, సిబ్బంది నాగప్పలకు ఇవ్వాల్సిందిగా సూచించింది. ఆమె సూచనల మేరకు సాయంత్రం ఇస్తుండగా ముందుగా వేసుకున్న పథకం ప్రకారం లోకాయుక్త డీఎస్పీ ఉమేష్ నేతృత్వంలోని అధికారులు దాడి చేసి పట్టుకుని కేసు దర్యాప్తు చేపట్టారు.

హాస్టల్ భోజనం వికటించి 30 మందికి అస్వస్థత

రాయచూరు రూరల్: హాస్టల్‌లో భోజనం వికటించి 30 మంది ఆస్పత్రి పాలైన ఘటన జిల్లాలోని మాన్వి పట్టణంలో శనివారం చోటు చేసుకుంది. సంగాపుర రోడ్డులోని రాజలబండ మొరార్జి దేశాయి(గురుకుల) పాఠశాలలో 199 మంది విద్యార్థులున్నారు. తాగునీటి ట్యాంకులో అధికంగా బ్లీచింగ్, క్లోరిన్ పౌడర్లు కలిపిన నీటితో వంట చేశారు. అనంతరం బాలబాలికలు భోజనం తిన్న తరువాత అస్వస్థతకు గురై వాంతులు, విరోచనాలు కావడంతో విద్యార్థులను ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స కోసం చేర్పించారు.

పాతికేళ్ల నాటి పథకం పూర్తయ్యేదెన్నడో?

- నత్తనడకన గిణిగేరా-మహబూబ్‌నగర్ రైలు మార్గ పనులు
- ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా నిర్మాణ వైనం

రాయచూరు రూరల్ : కర్ణాటకలోని కొప్పళ జిల్లా గిణిగెరా నుంచి తెలంగాణలోని మహబూబ్‌నగర్ వరకు రైలు మార్గ నిర్మాణ పనులు పాతికేళ్ల నుంచి నత్తనడకన సాగుతున్నాయి. రైలు మార్గ నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు తయారైంది. పట్టాల మీద రైలు పోతే చూద్దామన్న ఈ ప్రాంత ప్రజల ఆశలు ఇక్కడి లోక్‌సభ సభ్యుల నిర్లక్ష్యంతో ఎండమావిగానే ఉండి పోయింది. మొదట్లో మునిరాబాద్-మహబూబ్ నగర్ వరకు అనుకున్న రైలుమార్గ నిర్మాణం మూడొంతులు పూర్తయింది. 1998లో రూ.498.98 కోట్లతో భారీ ప్రాజెక్టును రూపొందించారు. ఆ స్థాయిలో నిధులు విడుదల చేయాల్సి ఉండగా కేంద్ర రైల్వే శాఖ పేరుకు మాత్రమే గతంలో బడ్జెట్‌లో రూ.4 కోట్లు మంజూరు చేసి చేతులు దులుపుకుంది. ఈ రైలు మార్గం నిర్మాణానికి 1060 హెక్టార్ల భూమి



రాయచూరులోని జంక్షన్ రైల్వే స్టేషన్


నిర్మాణం పూర్తయిన ప్రతిపాదిత రైలు మార్గం

స్వాధీనం చేసుకున్నా రైతులకు పరిహారం అందించలేదు. 33 పెద్దవి, 234 చిన్న వంతెనలను నిర్మించాల్సి ఉంది. 40 ఏళ్ల నుంచి ఎంపీలు ఈ విషయంలో శ్రద్ధ కనబరచలేక పోయారు. దేవెగౌడ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు రాయచూరు ఎంపీ రాజా రంగప్ప నాయక్, కొప్పళ ఎంపీ బసవరాజ రాయరెడ్డిలతో 1998లో రూ.30 కోట్లతో ప్రారంభమైన పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. కొప్పళ జిల్లాలోని బూదగుంప, జబ్బలగుడ్డ, చిక్కబెణకల్, గంగావతి, కారటగి, సింధనూరు వరకు తాజాగా పనులు పూర్తయ్యాయి. అయితే సింధనూరు నుంచి మాన్వి మీదుగా రాయచూరు వరకు మరో 87 కి.మీ.మేర రైలు మార్గ నిర్మాణ పనులు పూర్తి కావాల్సి ఉంది.

> **నిర్మాణ పనులు వేగం పుంజుకోవాలి**
>
> కొప్పళ జిల్లా గిణిగెరా నుంచి తెలంగాణలోని మహబూబ్ నగర్ వరకు ప్రతిపాదిత రైలు మార్గ నిర్మాణపు పనులు త్వరగా చేపట్టాలి. 1998లో ప్రారంభమై నత్తనడకన సాగుతున్న ఈ రైలు మార్గ నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలి.
>
> – బాబూరావ్, మాజీ రైల్వే బోర్డు సభ్యుడు

సమస్యలు సత్వరం పరిష్కరించండి


హొసపేటె: అవసరమైన చోట డ్రైనేజీ, సీసీ రోడ్లు నిర్మించాలని, తాగునీటి ఇబ్బంది తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే హెచ్ఆర్ గవియప్ప ఆదేశించారు. తాలూకాలోని నాగేనహళ్లి గ్రామంలో శనివారం తన అధ్యక్షతన జరిగిన జనసంపర్క సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా ఎమ్మెల్యే గ్రామాన్ని సందర్శించి మౌలిక వసతులను పరిశీలించారు. ఇదే సందర్భంగా ప్రభుత్వ సీనియర్ ప్రాథమిక పాఠశాల భవనాలను ప్రారంభించారు. అంగన్‌వాడీలను సందర్శించి చిన్నారులకు చిరుధాన్యాల ముద్దలు తినిపించారు. అనంతరం ఎమ్మెల్యే గ్రామంలో జనసంపర్క సమావేశాన్ని ప్రారంభించి ప్రజల సమస్యలను ఆలకించి మాట్లాడారు. అంతకు ముందు గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకు గ్రామస్తుల నుంచి ఘన స్వాగతం లభించింది. జీపీ అధ్యక్షుడు ఎం.దుర్గప్ప, ఉపాధ్యక్షురాలు డీ.సవితా, టీపీ ఈఓ హరీశ్, చంద్రశేఖర్, అల్లాభక్షి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గవియప్ప

విద్యార్థులకు మొక్కల పంపిణీ

పర్యావరణ సంరక్షణకు విద్యార్థులు విరివిగా మొక్కలను నాటి పెంచాలని ఎమ్మెల్యే గవియప్ప తెలిపారు. శనివారం నగరంలో డాక్టర్ పునీత్ రాజ్‌కుమార్ జిల్లా స్టేడియంలో విద్యార్థులతో మొక్కలు నాటించిన అనంతరం మాట్లాడారు. పూర్వ ప్రాథమిక పాఠశాలలో ప్రత్యేక వనమహోత్సవం సందర్భంగా చిన్నారుల పేరిట మొక్కలు నాటించడం అభినందనీయం అని తెలిపారు. అనంతరం వివిధ మొక్కలను నాటి నీరు పోశారు. పాఠశాల ఉపాధ్యాయులు, అటవీ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపండి


పోలీసు అధికారులతో ముఖ్యమంత్రి, హోం మంత్రుల గ్రూప్ ఫొటో

- పోలీస్ అధికారులకు ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఆదేశం

బనశంకరి: సమాజంలో అసాంఘిక శక్తులను ఉక్కుపాదంతో అణచి వేయాలని పోలీస్ అధికారులను సీఎం సిద్దరామయ్య ఆదేశించారు. శనివారం నగరంలోని రాష్ట్ర పోలీస్ డైరెక్టరేట్ ప్రధాన కార్యాలయంలో 2024 సీనియర్ పోలీస్ అధికారుల సమావేశాన్ని ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రారంభించి మాట్లాడారు. ఐజీపీలు, ఎస్పీలు, డీసీపీలు పోలీస్ మ్యాన్యువల్ ప్రకారం తమ పరిధిలో ప్రతి పోలీస్‌స్టేషన్‌ను తప్పనిసరిగా సందర్శించాలని తెలిపారు. మీ పరిధిలో క్లబ్‌లు, పేకాట, బెట్టింగ్, డ్రగ్స్ నియంత్రించకపోతే ఎస్పీ, ఐజీ స్థాయి అధికారులే బాధ్యులను చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. దేశంలోనే కర్ణాటక పోలీస్‌శాఖకు ఉండే గౌరవం కాపాడాలన్నారు.

అసత్య ప్రచారాలకు అడ్డుకట్టవేయండి

అబద్ధపు ప్రచారాలు నియంత్రించకపోతే సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని, వీటి నియంత్రణకు ఫ్యాక్ట్‌చెక్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. నకిలీ వార్తపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసులు అంటే రౌడీలకు భయం ఉండాలని, కొందరు పోలీసులకు ఇ-బీట్ వ్యవస్థ అమల్లో ఉందో లేదో తెలియడంలేదంటే సిగ్గుపడాలని వీటిని సరిదిద్దుకోవాలని సలహా ఇచ్చారు.

హోంమంత్రి పరమేశ్వర్‌కు అభినందన

ఏడాదిలో రాష్ట్రంలో మతకలహాలు లేకుండా శాంతిభద్రతలు కాపాడిన హోంమంత్రి పరమేశ్వర్, కర్ణాటక పోలీస్‌శాఖను సీఎం సిద్దరామయ్య అభినందించారు. ఈ సందర్భంగా సీఎం రాజకీయ కార్యదర్శి నసీర్ అహ్మద్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రజనీశ్ గోయల్, హోం శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి ఎస్ఆర్.ఉమాశంకర్, డీజీపీ అలోక్‌మోహన్, ప్రభుత్వ కార్యదర్శి కేవీ.త్రిలోక్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

టమాటా క్రేట్ల దొంగల అరెస్టు

కోలారు: నగరంలోని ఏపీఎంసీ మార్కెట్‌లో టమాటా క్రేట్‌లను దొంగతనం చేస్తున్న ముగ్గురిని పోలీసులు పట్టుకున్నారు. నగరంలోని మహాలక్ష్మీ లే అవుట్‌కు చెందిన మజుక్ రబ్బాని, దర్గా శాహి మొహల్లాకు చెందిన హసీబ్, షేక్ మొహిద్దీన్ నగర్‌కు చెందిన వసీం పోలీసులు అరెస్టు చేసిన నిందితులు. వీరు మార్కెట్ బయట ఉన్న మండీల్లో టమాటా క్రేట్‌లను దొంగతనం చేసి విక్రయించే వారు. నిందితుల నుంచి రూ.1.30 లక్షల విలువ చేసే 820 టమాటా క్రేట్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఖాళీ క్రేట్‌లు తక్కువ అవుతుండడాన్ని గమనించిన మండీ యజమానులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనిఖీ నిర్వహించిన పోలీసులు 150కి పైగా సీసీ కెమెరాల ఫుటేజీను పరిశీలించిన అనంతరం నిందితులను కనుగొని అరెస్టు చేశారు.


అరెస్టయిన నిందితులతో పోలీసులు

ఎన్నికల కోసమే భారత్ బియ్యం పథకం

- మోదీ ప్రభుత్వంపై సీఎం సిద్దు ధ్వజం

శివాజీనగర: ఎన్నికల కోసమే కేంద్ర ప్రభుత్వం భారత్ బియ్యం పథకాన్ని ప్రవేశపెట్టిందని, ఆ తరువాత పథకం పూర్తిగా నిలిపివేసిందని సీఎం సిద్దరామయ్య ధ్వజమెత్తారు. శనివారం విధానసౌధలో ఆయన మాట్లాడుతూ.. తమ అన్నభాగ్య పథకానికి బియ్యం ఉంచుకుని లేదని చెప్పారని, రాజకీయ దురుద్దేశ్యంతో తమ ప్రభుత్వానికి చెడ్డపేరు రావాలని చేశారు. నిల్వ ఉన్నా కూడా బియ్యం ఇవ్వలేదని మండిపడ్డారు. బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పుష్పాంజలి భారత మాజీ ఉప ప్రధాని దివంగత డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకొని విధానసౌధ పశ్చిమ ద్వారంలో ఆయన ఫోటోకు ముఖ్యమంత్రి సిద్దరామయ్య పుష్పాంజలి ఘటించారు. ఆయన మాట్లాడుతూ... హరిత విప్లవకారుడని, స్వాతంత్ర్యం వచ్చినపుడు ఆహార మంత్రిగా, సమర్థత కలిగిన పరిపాలనా దక్షుడని, కార్మిక చట్టాలను చేసేందుకు కారకులయ్యారని సీఎం కొనియాడారు. హోంమంత్రి జీ.పరమేశ్వర్, ఆహార పౌరసరఫరాల మంత్రి కే.హెచ్.మునియప్ప, సాంఘిక సంక్షేమ మంత్రి డాక్టర్ హెచ్.సీ.మహదేవప్ప, ఎక్సైజ్ శాఖ మంత్రి ఆర్.బీ.తిమ్మాపురతో పాటుగా ఇతర ప్రముఖులు హాజరయ్యారు.

దళిత నాయకుల నినాదాలు

సీఎం సిద్దరామయ్య పుష్పాంజలి ఘటించే సమయంలో అక్కడికి చేరుకున్న కొందరు దళిత నాయకులు పీటీసీఎల్ చట్టం సక్రమంగా జారీ కావటం లేదు. ఖాళీ చేయించిన భూమిని వెనక్కి ఇప్పించాలని డిమాండ్ చేశారు. సీఎం వెళ్లిన తరువాత మంత్రులు హెచ్.సీ.మహదేవప్ప, కే.హెచ్.మునియప్పను ముట్టడించారు. ఈ సమయంలో కొంత సమయం వాగ్వివాదం జరిగింది.

విద్యా, ఆరోగ్య, ఉద్యోగ రంగాలకు పెద్దపీట


మాట్లాడుతున్న నితీష్

రాయచూరు రూరల్: జిల్లాలో విద్యా, ఆరోగ్య, ఉద్యోగ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తామని జిల్లాధికారి కె.నితీష్ పేర్కొన్నారు. శనివారం జిల్లాధికారి కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించి విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మహత్తర పథకం మేరకు జిల్లాను ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దడమే తన కర్తవ్యమన్నారు. జిల్లాలో వెనుకబడిన, మైనార్టీలు, ఎస్సీ, ఎస్టీ జనాభా అధికంగా ఉన్నారన్నారు. చిత్రదుర్గ నవోదయలో విద్యనభ్యసించానని, యూపీఎస్సీలో 8వ ర్యాంక్ పొందానన్నారు. జిల్లాలో సమస్యల పరిష్కారానికి ప్రామాణిక ప్రయత్నం చేస్తామని, ప్రజల సహకారం అవసరమన్నారు.

108 సిబ్బంది ఔదార్యం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గాయపడిన వ్యక్తి

రాయచూరు రూరల్: రైలు నుంచి జారి పడి గాయపడిన వ్యక్తిని ఆస్పత్రిలో చేర్పి 108 అంబులెన్స్ సిబ్బంది ఉదారత చాటారు. శుక్రవారం రాత్రి సైదాపుర నుంచి రాయచూరుకు రైలులో వచ్చిన వ్యక్తి దిగుతూ కాలు జారి కింద పడి గాయపడ్డాడు. ఈ నేపథ్యంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తిని అంబులెన్స్ సిబ్బంది రిమ్స్ ఆస్పత్రిలో చేర్చారు. క్షతగాత్రుని లగేజీ, ఇతర వస్తువులను రిమ్స్ అధికారులకు పైలెట్ ఖాసిం అలీ, ఈఎంటీ ఎండీ హైమద్ అలీ అప్పగించారు.

తుంగభద్రకు జలకళ

హొసపేటె: రైతుల జీవనాడి తుంగభద్ర ఇప్పుడిప్పుడే జలకళ సంతరించుకుంటోంది. రుతుపవనాల కారణంగా ఇప్పటికే నదీ పరివాహక ప్రాంతాల్లో జోరుగా వర్షాలు కురుస్తుండటంతో శనివారం డ్యాంకు 46,300 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరడంతో నీటి నిల్వ 13.901 టీఎంసీలకు చేరుకుంది. జలాశయానికి ఎగువన శివమొగ్గ, శృంగేరి, తీర్థహళ్లి, ఆగుంబే తదితర ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో తుంగభద్రకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. డ్యాంలోకి వరద ప్రవాహం పెరుగుతుండటంతో తుంగభద్ర ఆయకట్టు రైతుల్లో ఖరీఫ్ ఆశలు చిగురిస్తున్నాయి. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ సారి జలాశయానికి ముందుగానే వరద నీరు వచ్చి చేరుతోంది. ఈ సారైన పంటల సాగుకు అవసరమైన సాగునీరు లభిస్తుందని ఆయకట్టు రైతులు ఆశిస్తున్నారు. ప్రస్తుతం జలాశయం నీటిమట్టం 1593.19 అడుగులకు చేరుకుంది. మరి కొద్ది రోజుల పాటు డ్యాంలోకి వరద నీరు భారీగా వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే శివమొగ్గ జిల్లాలో తుంగా డ్యాం నుంచి దిగువకు నీటిని విడుదల చేసిన విషయం తెలిసిందే. గత ఏడాది ఇదే సమయంలో జలాశయానికి కేవలం 193 క్యూసెక్కుల వరద వచ్చేదని అధికారులు తెలిపారు.

కోలారు వార్తలు...

ధర తగ్గింపు నిర్ణయం పాడి రైతులకు శరాఘాతం

కోలారు: రైతుల నుంచి ఖరీదు చేసే పాల ధరను రూ.2 తగ్గిస్తూ కోచిముల్ తీసుకున్న నిర్ణయం పాడి రైతులకు శరాఘాతమైంది. కోచిముల్ ఆదేశాలు 5వ తేదీ శుక్రవారం నుంచే అమలులోకి వచ్చాయి. ఇది కోలారు, చిక్కబళ్లాపుర ఉభయ జిల్లాల పాడి రైతులకు ఆర్థికంగా ఇబ్బంది కల్గించేదిగా ఉంది. గతంలో పాడి రైతులకు లీటర్‌కు రూ.33.40 చెల్లించి పాలు కొనుగోలు చేసేది. ప్రస్తుతం లీటర్‌పై రూ.2 తగ్గించడం వల్ల పాడి రైతుకు రూ.31.40 ధర మాత్రమే లభిస్తుంది. పాల సంఘాలకు రూ.35.85 ధర లభిస్తుండగా ఇకపై రూ.33.85 లభిస్తుంది. కోచిముల్ పాలక మండలి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. శుక్రవారం నుంచి కొత్త ధరలు అమలులోకి వచ్చాయి. వర్షాకాలంలో పాల ఉత్పత్తి ఎక్కువగా ఉండడం వల్ల కొనుగోలు ధర తగ్గించడం సహజమేనని కోచిముల్ అధికారులు ధర తగ్గించడాన్ని సమర్థించుకుంటున్నారు. పాల పాడి ధర తగ్గి కొనుగోలు చేసే వారు లేరని, అందువల్ల పాల ధర తగ్గించడం తప్పసరైందని అంటున్నారు.


కోలారులోని కోచిముల్ కార్యాలయం

ధర తగ్గింపునకు కారణాలు వివరించాలి

పాల సేకరణ ధర తగ్గించడానికి గల కారణాలను పాడి రైతులకు అర్థమయ్యేలా వివరించాలని, పాల సేకరణ, నాణ్యత పెంపునకు చర్యలు తీసుకోవాలని కోచిముల్ ఎండీ గోపాలమూర్తి ఆదేశాల్లో సూచించారు. పాడి రైతుల నుంచి పాల సేకరణ ధరను రూ.2 తగ్గించడం పట్ల పాడి రైతులు, రైతు సంఘం ప్రముఖులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాల ధర తగ్గింపు ఆదేశాలను వెంటనే వెనక్కు తీసుకోవాలని కోచిముల్‌లో దుబారా ఖర్చులను తగ్గించుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. జిల్లాలో అధిక శాతం మంది రైతులు పాడి పరిశ్రమపైనే ఆధారపడి జీవిస్తున్నారన్నారు. పశువులకు పెట్టే దాణా ధరలు గణనీయంగా పెరిగిన సమయంలో ధరలు తగ్గించడం వల్ల రైతులకు ఏ మాత్రం గిట్టుబాటు కాదని, రైతులు ఇక పాడిని మరచిపోవాల్సి వస్తుందన్నారు. జిల్లాలో పాడి పరిశ్రమ వెనకడుగు వేయడానికి ధరల తగ్గుదల ప్రముఖ కారణం అంటున్నారు. పాడి రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రూ.5 ప్రోత్సాహధనం కూడా అందడం లేదంటున్నారు.

ధర తగ్గుదల తాత్కాలికమే :

పాడి రైతుల నుంచి పాల సేకరణ ధరను రూ.2 తగ్గించడం తాత్కాలికమేనని, ఎండాకాలం పాల సేకరణ తగ్గి మళ్లీ ధర పెంచుతామని కోచిముల్ ఎండీ గోపాలమూర్తి అంటున్నారు. రాష్ట్రంలోని ఇతర పాల సమాఖ్యలు ఇప్పటికే పాలసేకరణ ధరలను తగ్గించాయి. ఇదే మార్గంలో కోచిముల్ కూడా తగ్గించిందని అన్నారు.

మొక్కలను పిల్లల్లా పెంచాలి

మాలూరు: ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పిల్లల్లా పెంచాలని ఎమ్మెల్యే కేవై నంజేగౌడ అన్నారు. శనివారం కుడియనూరులోని బసవేశ్వర ప్రాథమిక పాఠశాలలో అటవీ, విద్యాశాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన వన మహోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. మొక్కలను ఎక్కడ పడితే అక్కడ నాటడం కంటే సరైన స్థలంలో నాటడం ద్వారా అవి యేళ్ల తరబడి ఉండడానికి సాధ్యమవుతుందని, సమాజానికి ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. అభివృద్ధి చెందుతున్న సమాజంలో అనేక రకాలుగా జరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించడానికి మొక్కలు నాటడం తప్పనిసరి అన్నారు. మొక్కలు నాటడం ద్వారా ఆరోగ్యకర వాతావరణం, పశుపక్ష్యాదులకు నీడ, ఆహారం లభిస్తుందన్నారు. కార్యక్రమ ఉద్దేశం, ప్రాధాన్యత గురించి అటవీ అధికారులు ప్రజలకు తెలపాలన్నారు. బీఈఓ చంద్రకళ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ నరసింహ, సంతెహళ్లి నారాయణస్వామి, జీపీ సభ్యుడు రవి పాల్గొన్నారు.


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నంజేగౌడ

కుంభకోణంలో పాల్గొంటే సర్వనాశనమే

కోలారు: వాల్మీకి మండలి కుంభకోణంలో పాలపంచుకున్న వారు సర్వనాశనం అయి పోతారని ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్ అన్నారు. శనివారం వాల్మీకి కుభకోణంపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు ఆయన స్పందించారు. వాల్మీకి అభివృద్ధి మండలిలో రూ.వందల కోట్ల అవినీతి, అక్రమాలు జరిగినట్లు మీడియా ద్వారా తెలుస్తోందన్నారు. కుంభకోణంలో ఎవరు ఉన్నా వారికి కఠిన శిక్ష పడాలన్నారు. సీఐడీ తనిఖీ సరిగా లేదనిపిస్తే ప్రభుత్వం సీబీఐతోనైనా తనిఖీ చేయించి దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ముడా కుంభకోణం గురించి తాను వ్యాఖ్యానించేది లేదన్నారు. దీనిపై మాజీ మంత్రి హెచ్.విశ్వనాథ్ చేసిన వ్యాఖ్యలపై తాను స్పందించబోనన్నారు. ముడా కానీ వాల్మీకి మండలి కానీ సరైన తనిఖీ నిర్వహించి వాస్తవాలను వెలికి తీయాలన్నారు. డీకే శివకుమార్‌కు ముఖ్యమంత్రి స్థానం ఇవ్వాలని స్వామీజీ అన్ని వ్యాఖ్యలపై స్పందించిన ఎమ్మెల్యే స్వామీజీలు, మఠాధీశులు రాజకీయ వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. దీని వల్ల వారి గౌరవం తగ్గుతుందన్నారు. కోచిముల్ పాడి రైతులకు అందిస్తున్న పాలసేకరణ ధరను రూ.2 తగ్గించడాన్ని తాను వ్యతిరేకిస్తున్నానన్నారు. కోచిముల్ నిర్ణయం సరికాదన్నారు. దీనిపై సోమవారం పాలక మండలి సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. పాల సమాఖ్యకు నష్టమైనా పాడి రైతులకు ఇబ్బంది కలుగకూడదన్నారు.

రూ.5 లక్షల ధర పలికిన యేడాది వయసు ఎద్దు


రూ.5 లక్షల ధరకు విక్రయమైన ఎద్దు

కేజీఎఫ్: యేడాది వయసున్న ఎద్దును ఏకంగా రూ.5 లక్షలకు విక్రయించి మొతుకపల్లికి చెందిన రైతు రికార్డు సృష్టించాడు. తాలూకాలోని కంగాండ్లపల్లి జీపీ మొతుకపల్లికి చెందిన యువ రైతు పరంధామకు చెందిన ఎద్దును తమిళనాడుకు చెందిన ఓ రైతుకు రూ.5 లక్షలకు విక్రయించాడు. యేడాది వయసున్న ఈ ఎద్దు ఆంధ్రప్రదేశ్‌లో పశువుల పరుగు పందెంలో పాల్గొని మొదటిసారి రూ.50 వేల నగదు, రెండో సారి 20 గ్రాముల బంగారు పతకాన్ని సాధించింది. ఈ రెండు పందేల్లో ఎద్దు వేగాన్ని గమనించిన తమిళనాడుకు చెందిన రైతు పరంధామ వద్ద నుంచి అధిక మొత్తాన్ని చెల్లించి కొనుగోలు చేశాడు. రైతు పరంధామ ఆరు నెలల క్రితమే కేవలం రూ.35 వేలకు రెండు ఎద్దు(గిత్త)లను ఖరీదు చేశాడు. ప్రస్తుతం ఒక ఎద్దును రికార్డు స్థాయిలో రూ.5 లక్షలకు విక్రయించాడు. మరో ఎద్దును తన వద్దే ఉంచుకున్నాడు. తమ పూర్వీకుల నుంచి తాము పశువులను పెంచి విక్రయిస్తుంటామన్నారు. ఈమధ్య ఎద్దులను పెంచడానికి ఆసక్తి కనబరుస్తున్నానని తెలిపాడు. ప్రస్తుతం ఒక ఎద్దు రూ.5 లక్షలకు విక్రయం కావడం ఎంతో సంతోషం కలిగిస్తోందన్నారు.

బాబూ జగ్జీవన్‌రాం వర్ధంతి

చిక్కబళ్లాపురం: దేశ మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా కలెక్టర్ పీఎన్ రవీంద్ర జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళి అర్పించారు. బిహార్‌లో జన్మించిన జగ్జీవన్ రామ్ దేశానికి ఎనలేని సేవలు అందించారని గుర్తు చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాధ్యాపకులు డాక్టర్ నాగరాజు జగ్జీవన్ రామ్ జీవిత చరిత్రను వివరించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ప్రకాశ్ నిట్టాలి, ఏడీసీ భాస్కర్, అదనపు ఎస్పీ ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

పాల ధర తగ్గింపు నిరసిస్తూ ధర్నా


ధర్నా చేస్తున్న రైతు సంఘం పదాధికారులు

కోలారు: పాల సేకరణ ధరను రూ.2 తగ్గించడాన్ని ఖండిస్తూ రైతు సంఘం పదాధికారులు శనివారం నగరంలో తలపై బండరాయితో వినూత్న రీతిలో ధర్నా నిర్వహించారు. తగ్గించిన పాల సేకరణ ధరను పెంచాలని, లేకుంటే ఉభయ జిల్లాల్లో సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. జిల్లాలో అధిక శాతం మంది రైతులు పాడిపైనే ఆధారపడి జీవిస్తున్నారన్నారు. పాడి రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని తగ్గించిన పాల సేకరణ ధరను తిరిగి పెంచాలని ఒత్తిడి చేశారు. అంతేకాకుండా పాడి రైతులకు బకాయి ఉన్న ప్రోత్సాహ ధనాన్ని కూడా అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం పాల సమాఖ్య డిప్యూటీ డైరెక్టర్ ద్వారా రాష్ట్ర సహకార శాఖా మంత్రికి వినతి పత్రం సమర్పించారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.నారాయణగౌడ, జిల్లా అధ్యక్షుడు ఈకంబళ్లి మంజునాథ్, మరగల్ శ్రీనివాస్, వక్కలేరి హనుమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆ నిర్ణయం తగదు


అమరేష్

కోలారు: కోలారు – చిక్కబళ్లాపుర పాల సమాఖ్య పాడి రైతుల పాల సేకరణ ధరను రూ.2 తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయం తగదని తాలూకాలోని చిక్కనహళ్లి పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షుడు సి.అమరేష్ పేర్కొన్నారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ అవిభజిత కోలారు జిల్లాలో రైతులు పాడి పైనే ఆధారపడి జీవిస్తున్నారన్నారు. పాల సేకరణ ధరను తగ్గించడం వల్ల వారి ఆర్థిక స్థితిగతులు దెబ్బ తింటాయన్నారు. ఇప్పటికే పశువుల దాణా ధరలు బాగా పెరిగి పోయి పాడి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కోచిముల్ పాల సేకరణ ధరను తగ్గిస్తే పాడిని వదిలి రైతులు పట్టణాలకు వలస వెళ్లాల్సి వస్తుందన్నారు. అందువల్ల పాడి రైతుల శ్రేయస్సు దృష్ట్యా వెంటనే ఆ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

డెంగీ నియంత్రణకు సహకరించాలి



డెంగీ జాగృతి జాతాలో విద్యార్థులు

గౌరిబిదనూరు: డెంగీ నియంత్రణకు ప్రజల సహకారం అవసరమని, దోమలు ఉత్పత్తి చేసే ప్రదేశాలను నాశనం చేసి పరిశుభ్రంగా ఉంచుకోవాలని తా.పం ఈఓ హొన్నయ్య తెలిపారు. శనివారం తాలూకా చిక్కకురుగోడు, దొడ్డకురుగోడు, హుదగూరు తదితర గ్రామ పంచాయతీల పరిధిలో డెంగీ వ్యాధి నియంత్రణ, ప్లాస్టిక్ నిషేధంపై ప్రజల్లో అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రత్యేకంగా అంగనవాడి, ఆశా కార్యకర్తలు ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రజల్లో డెంగీపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో గ్రామాలలో జాతా నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య అధికారి చంద్రమోహన్, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి వేధింపులతోనే రాజీనామా

మైసూరు: రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి వెంకటేష్ వేధింపులు భరించలేక మైసూరు పాల సమాఖ్య అధ్యక్ష పదవికి రాజీనామా చేసినట్లు ప్రసన్న తెలిపారు. శనివారం ఆయన మైసూరు నగరంలో మీడియాతో మాట్లాడుతూ..మంత్రి వెంకటేశ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారని, లేదంటే పదాధికారుల పదవులను తొలగిస్తానని బెదిరించారని, దీంతో రాజీనామా చేశానని అన్నారు.

కేంద్రమంత్రి జిల్లా అభివృద్ధికి కృషి చేస్తే చాలు



మాట్లాడుతున్న మంత్రి చెలువరాయస్వామి

మండ్య: కేంద్రమంత్రి గాని, ఎంపీ గాని ఎవరైనా సరే స్థానిక అధికారులను పిలిపించుకుని జనతా దర్శన్ నిర్వహించాలని చట్టంలో ఎక్కడా లేదని, వారు మండ్య జిల్లాను అభివృద్ధి చేస్తే చాలని మంత్రి చెలువరాయస్వామి అన్నారు. మండ్య నగరంలోని జిల్లా పంచాయతీలోని కావేరి సమావేశం హాల్లో శనివారం రైతు నాయకులతో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ...జనతా దర్శన్ నిర్వహించి ప్రజా సమస్యలు పరిష్కారం చేయడానికి స్థానిక ఎమ్మెల్యేలు, అధికారులు ఉన్నారని, కేంద్రమంత్రి కుమారస్వామి జనతా దర్శన్ గురించి ఒక మాట కూడా చర్చించలేదన్నారు. తనపై ఆరోపణలు చేయడం కాదని, అధికారంలో ఉన్నప్పుడు జిల్లా అభివృద్ధికి పనిచేయాలన్నారు. కుమారస్వామి చాలాసార్లు ఎంపీగా పనిచేసిన అనుభవం ఉందని, అలాంటి వ్యక్తికి తాము చెప్పాల్సిన అవసరం లేదన్నారు.

ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయండి



బ్యాంకు అధికారులను సన్మానిస్తున్న విశ్రాంత ఉద్యోగుల సంఘం సభ్యులు

గౌరిబిదనూరు: ఎస్‌బీఐ (స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా)లో విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సౌకర్యార్థం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు దస్తగిరి సాబ్ విజ్ఞప్తి చేశారు. వీరు శుక్రవారం సాయంత్రం తా.పం ఆవరణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆవరణంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. సంఘ సభ్యులు బ్యాంకుల నుండి లభించే సౌలభ్యాలను సద్వినియోగం చేసుకోవాలని, తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారులు దుర్గేశ్ కుమార్, సందీప్, అభిలాశ్‌లు బ్యాంకు నుండి విశ్రాంత ఉద్యోగులకు లభించనున్న సౌలభ్యాలను వివరించారు. ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు కోసం సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో కోశాధికారి గంగాధరయ్య, కార్యదర్శి సంజీవరాయప్ప, సుబ్బారెడ్డి, చిక్క నారాయణప్ప తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి



విజయపుర: పిల్లలతో ఎవరైనా పనులు చేయిస్తే చట్టప్రకారం శిక్షిస్తామని అధికారులు హెచ్చరించారు. శనివారం విజయపుర పట్టణంలో జిల్లా బాలకార్మిక యోజన, బాలల సహాయవాణి అధికారులు వివిధ ప్రాంతాల్లో సోదాలు చేసి 8 మందిని గుర్తించారు. వారిలో నలుగురిని బాలల సంక్షేమ సమితి ఎదుట హాజరు పరిచారు. 14 ఏళ్ల లోపు పిల్లలను పనుల్లో పెట్టుకుంటే కేసులు నమోదు చేస్తామని, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

చల్లపిల్ల రాయ కృష్ణా.. ఇటు రావయ్యా !

- సుల్తాన్ కుమార్తె మనసు దోచిన కృష్ణయ్య
- రాష్ట్రంలోని పవిత్ర క్షేత్రాల్లో మేల్కొటే ఒకటి
- రామానుజుడు ప్రతిష్టించిన శ్రీకృష్ణుడి విగ్రహం

బనశంకరి: మేల్కొటే చరిత్ర సాధారణంగా ఎవరికీ అంతుపట్టదు. దీని చరిత్ర అంత సామాన్యమైనది కాదు. గొప్ప వైష్ణవ భక్తుడైన శ్రీ రామానుజాచార్యతో ఈ ప్రదేశం ముడిపడి ఉంది. ఇక్కడే భగవాన్ రామానుజాచార్యులు సంఘసంస్కర్తగా రూపం దాల్చాడు. కర్ణాటకలోని మండ్య జిల్లా పాండవపుర తాలూకాలో మేల్కొటే క్షేత్రం కలదు. ఇక్కడ ప్రసిద్ధి చెందిన శ్రీకృష్ణ దేవస్థానం ఉంది. ఇందులో విగ్రహాన్ని శ్రీ రామానుజుడు ప్రతిష్టించారని ప్రశస్తి. ఇక్కడ స్వామి వారిని చల్ల పిల్లరాయుడు అంటారు. బహుసుందరుడులెండీ. ఢిల్లీ సుల్తానులు తమ సామ్రాజ్యాన్ని విస్తరిస్తున్న కాలం. దండయాత్రలు, యుద్ధాలు చేస్తూ మండ్య జిల్లాలోని మేల్కొటేను సైతం జయించారు. వీరు ఆక్రమించిన స్థలంలో శ్రీకృష్ణుడి విగ్రహం కంటపడటంతో తమ వెంట తీసుకెళ్లారు. శ్రీకృష్ణుడు రామానుజాచార్యుల కలలో కనబడి ఈ విషయం గురించి చెప్పగా వెంటనే రామానుజుడు ఢిల్లీ సుల్తాన్ వద్దకు పయనమవుతాడు. ఎంత బతిమలాడిన సుల్తాన్ ఈ విగ్రహాన్ని ఇవ్వడానికి నిరాకరించాడు. పైగా ఆయన గారాలపట్టి ఆ విగ్రహంతో ఆడుకుంటూ దానిపై మనసు పారేసుకుంది. అప్పుడు రామానుజాచార్యులు ధ్యానముద్రలో కూర్చుని చల్లపిళ్లరాయా కృష్ణా ఇటు రావయ్యా అంటూ ఆర్తిగా పిలవగానే శ్రీకృష్ణుడి విగ్రహం నృత్యం చేసుకుంటూ వచ్చి ఆయన ఒడిలోకి చేరుకుంది. సుల్తాన్ అతని సిబ్బంది ఇదంతా చూస్తూ ఆశ్చర్యపోతారు. భక్తితో సుల్తాన్ రామానుజాచార్యుల వారికి శ్రీకృష్ణుడి



వైరముడి ఉత్సవం ఊరేగింపు దృశ్యం

విగ్రహం అందజేస్తారు. ఆ విగ్రహాన్ని తీసుకుని మేల్కొటేకు వచ్చి దేవస్థానంలో ఉత్సవమూర్తిగా ప్రతిష్టించారు. సుల్తాన్ బిడ్డ అప్పటికే కృష్ణ భక్తిలో మునిగిపోయింది. కృష్ణుడి మీద పెంచుకున్న ఆ విరహమే మేల్కొటే రప్పించింది. జీవితాంతం కృష్ణుడిని సేవిస్తూ ఆయనలో లీనమైపోయింది.

దేవస్థాన ప్రత్యేకతలు..

దేవస్థానంలో వైరముడి అనే వజ్రాల కిరీట ఉత్సవం ప్రసిద్ధిచెందింది. రామానుజాచార్యులు మొట్టమొదట దేవస్థానంలో హరిజనులకు ప్రవేశం కల్పించారు. ఎందుకంటే ఢిల్లీ సుల్తాన్ వద్దకు వెళ్లి విగ్రహాన్ని వెనక్కు తీసుకురావడంలో ఆయన వెంట ఉన్నది సహాయపడింది వీరే.

వైరముడి ఉత్సవాలు

ఆలయంలో ఏటా నిర్వహించే ఉత్సవాల కంటే వైరముడి ఉత్సవాలు ఎంతో ప్రసిద్ధిచెందాయి. ఇవి 13 రోజులపాటు నిర్వహిస్తారు. ఏడాదికి ఒకసారి నిర్వహించే ఈ ఉత్సవాలకు 5–6 లక్షల మంది భక్తులు హాజరవుతారు. వైరముడి అంటే స్వామివారికి అలంకరించే కిరీటం. దీనిని పాలసముద్రం మీద పడుకున్న సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడి కిరీటంగా భావి



కొండపై మేల్కోటె ఆలయం


స్తారు భక్తులు. కిరీటానికి సూర్యకిరణాలు తాకకుడదు స్వామివారికి అలంకరించిన తరువాత సూర్యాస్తమయం అయ్యాక ఉత్సవ మూర్తిని నగరపుర వీధుల్లో ఊరేగిస్తారు. స్వామివారికి కిరీట అలంకరించే వరకు ప్రధాన అర్చకుడు సైతం కిరీటం చూడరాదు. కళ్లకు గంతలు కట్టుకుని అలంకరించిన తరువాత చూడాలి. గర్భగుడిలో రామానుజాచార్య విగ్రహానికి ఎదురుగా ఉత్సవ మూర్తి చల్లపిల్ల రాయుడికి విగ్రహం అలంకరించడం అనాదిగా వస్తుంది.

వైరముడి పురాణగాథ

పాల సముద్రం మీద శయనించి ఉన్న శ్రీమన్నారాయనుడి కిరీటాన్ని భక్త ప్రహ్లాద కుమారుడు రాక్షస రాజైన విరోచనుడు తస్కరించి పారిపోతాడు. స్వామివారి కిరీటాన్ని తీసుకొచ్చే బాధ్యత గరుత్మంతుడి మీద పెడతాడు. అప్పుడు గరుత్మంతుడు ముల్లోకాలు గాలించి అతనితో యుద్ధం చేసి వైరముడి కిరీటాన్ని స్వామివారికి అప్పగిస్తాడు. ఏరోజైతే స్వామివారు కిరీటాన్ని ధరించారో ఆరోజు నుంచి ఇప్పటివరకు వైరముడి సేవచేస్తున్నారు. ఉత్సవాలకు ముందు స్వామివారిని బంగారు గరుడవాహనంపై ఊరేగిస్తారు. శ్రీదేవి, భూదేవి సమేతుడైన స్వామివారిని చూడటానికి వేల సంఖ్యలో భక్తులు తరలివస్తారు. సూర్యాస్తమయం నుంచి సూర్యోదయం వరకు ఉత్సవమూర్తిని తిరువీధుల్లో ఊరేగిస్తారు. చలువనారాయణస్వామి ఆలయంతో పాటు కొండపై వెలసిన యోగా నరసింహస్వామి ఆలయం, తొండనూర్‌లో గల నంబినారాయణ ఆలయం, పార్థసారథి ఆలయం. రామానుజ ఆలయం, మేల్కొటే ఆలయ అభయారణ్యం, ఇస్కాన్‌వనప్రస్థాన ఆశ్రమం మొదలైనవి వీక్షించవచ్చు.


మేల్కొటే ఎలా వెళ్లాలంటే....

మేల్కొటికు రోడ్డుమార్గంలో బెంగళూరు, మండ్య, మైసూరు తదితర ప్రాంతాల నుండి మేల్కొటేకు ప్రభుత్వ, ప్రైవేటు బస్సుల్లో వెళ్లవచ్చు. మండ్య సమీప రైల్వేస్టేషన్ ఇది మేల్కొటే నుండి 55 కిలోమీటర్ల దూరంలో ఉంది.





ఆలయంలో పురాతన మంటపం



దేవస్థానం వద్ద సువిశాలమైన కొలను

350 కేజీల ప్లాస్టిక్ స్వాధీనం



విజయపుర: పర్యావరణంపై దుష్ప్రభావం చూపే ప్లాస్టిక్‌ను నిషేధించేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని విజయపుర సభ ముఖ్య అధికారి జీఆర్ సంతోశ్ కుమార్ తెలిపారు. శనివారం ఆరోగ్య అధికారి లావణ్య నేతృత్వంలో పలు దుకాణాలపై దాడులు చేసి 352 కేజీల ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు స్వాధీనం చేసుకుని రూ. 4 వేల జరిమానా విధించారు. క్యారీబ్యాగ్‌లు, ప్లేట్లు తదితర వాటిని పూర్తిగా నిషేధించాలని దుకాణాల యజమానులకు సూచించారు.

బట్ట బ్యాగుల పంపిణీ

మైసూరు: మైసూరు నగరంలోని కృష్ణరాజ పరిధిలో లక్ష్మన్నర ఇళ్లకు బట్ట బ్యాగులను పంపిణీ చేశారు. ప్లాస్టిక్ బ్యాగులు వాడకూడదని, గుడ్డ బ్యాగులు వాడాలని బీజేపీ నాయకులు అన్నారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే శ్రీవత్స ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి బట్ట బ్యాగులను పంపిణీ చేశారు.

శ్యామప్రసాద్ ముఖర్జి జయంతి



శ్యామప్రసాద్ ముఖర్జి జయంతి కార్యక్రమంలో విజయేంద్ర తదితరులు

శివాజీనగర: జన్‌సంఘ్ సంస్థాపకులు శ్యామప్రసాద్ ముఖర్జి జయంతిని నగరంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు, ఎమ్మెల్యే బీ.వై.రాఘవేంద్ర ముఖర్జీ చిత్రపటానికి నివాళి అర్పించి మాట్లాడారు. కశ్మీర్ కోసమే ఆయన బలి అయ్యారని గుర్తు చేసుకున్నారు. కాశ్మీర్‌లో నరేంద్ర మోదీ నేతృత్వంలో అమిత్ షా 370వ ఆర్టికల్‌ను తొలగించే పని చేశారు. అందుకు డాక్టర్ శ్యామప్రసాద్ ముఖర్జియే ప్రేరేపణ అని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఇన్‌చార్జి డాక్టర్ రాధామోహన్ దాస్ అగర్వాల్, కేంద్ర మాజీ మంత్రి భగవంత ఖుబా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రీతంగౌడ, విధాన పరిషత్ సభ్యుడు ఛలవాది నారాయణస్వామి, ఎమ్మెల్యేలు శరణు సలగర్, శైలేంద్ర బల్దాళ, రాష్ట్ర కార్యదర్శి లోకేశ్ అంబెకల్లు, మహిళా మోర్చా రాష్ట్రాధ్యక్షురాలు మంజుల, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాల ధరను యథావిధిగా కొనసాగించాలి

చిక్కబళ్లాపురం: రాష్ట్ర ప్రభుత్వం పాల ధరను పెంచి పాడి రైతులకు ఇస్తున్న ధరను తగ్గించడం తగదని ఎంపీ సుధాకర్ అన్నారు. శనివారం ఆయన చిక్కబళ్లాపురం నగరంలో విలేకరులతో మాట్లాడుతూ...పాడి రైతులకు ఇస్తున్న ధరను యథావిధిగా కొనసాగించాలని, వెంటనే ఆదేశాలను ఉపసంహరించుకోవాలన్నారు. కోచిముల్ అధ్యక్ష అవధి ముగిసినా ఎన్నికలు జరపకుండా జాప్యం చేస్తున్నారని అన్నారు. చిక్కబళ్లాపురం నగర సర్వతోముఖాభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శివానంద్, బీజేపీ నాయకులు కృష్ణమూర్తి, మునేగౌడ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ సుధాకర్

రాజకాలువలో మృతదేహం

విజయపుర: పట్టణంలోని చెన్నరాయపట్టణ రోడ్డులోని నందిని పాఠశాల వెనుక ఉన్న రాజకాలువలో శుక్రవారం పూర్తిగా కుళ్లిన స్థితిలో ఉన్న ఒక మృతదేహం బయటపడింది. పౌర కార్మికులు జేసీబీ సహాయంతో రాజకాలువలోని చెత్తను తీస్తున్న సమయంలో ఈ మృతదేహం కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి జేబులోని గుర్తింపు కార్డు సాయంతో అతన్ని రహ్మత్ నగరకు చెందిన సెబాస్టిన్ (63)గా గుర్తించారు. 20 రోజుల క్రితమే తన తండ్రి కనిపించడం లేదని మృతుడి కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఒక్కలిగల అభివృద్ధికి కృషి



తుమకూరు: రాష్ట్రంలోని ఒక్కలిగ సామాజిక వర్గ విద్య, సామాజిక, ఆర్థిక ప్రగతికి కృషి చేస్తామని ఆ సంఘం అధ్యక్షుడు శ్రావణ బెళగొళ సీఎన్ బాలకృష్ణ తెలిపారు. శనివారం ఆయన సిరా తాలూకా పట్టనాయకనహళ్లి స్ఫటికపురి మహా సంస్థాన్ మఠానికి చేరుకుని పీఠాధ్యక్షుడు శ్రీ నంజావధూత మహాస్వామీజీ ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం మాట్లాడుతూ...ప్రతి జిల్లాలో స్థలం కొనుగోలు చేసి అందులో విద్యార్థులకు హాస్టల్, కమ్యూనిటీ హాల్స్, కాలేజీ ఏర్పాటు చేస్తామని చెప్పారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



కృష్ణరాజపురం: బెంగళూరు నగరంలోని మహాదేవపుర నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే మంజుల లింబావళి అన్నారు. నియోజక వర్గంలోని కాడుగోడి వార్డులో వివిధ అభివృద్ధి పనులకు ఆమె భూమిపూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

బంగారు గొలుసు చోరీ

మండ్య: ఓ వృద్ధ భక్తురాలి మెడలోని బంగారు గొలుసు చోరీ జరిగిన ఘటన మళవల్లి తాలూకా బెళకవాడి సమీపంలోని సరగూరు హ్యాండ్ పోస్టు మహదేశ్వర దేవస్థానంలో జరిగింది. శుక్రవారం దైవ దర్శనానికి వృద్ధురాలు మహదేవమ్మ కుటుంబ సభ్యులతో కలసి వచ్చింది. అమవాస్య కావడంతో పెద్ద ఎత్తున భక్తులు కూడా ఉన్నారు. ఈ సమయంలో ఆమె మెడలో ఉన్న రూ. 1.35 లక్షల విలువ చేసే బంగారు గొలుసును ఎవరో తస్కరించారు. బాధిత మహిళ బెళకవాడి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

- ఐదుగురికి తీవ్ర గాయాలు



వాహనంలో ఇరుక్కుపోయిన మృతదేహం



ధ్వంసమైన వాహనాలు

శివమొగ్గ: శివమొగ్గ నగర సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు... త్యావరకొప్ప సింహధామం ట్రీపార్కు వద్ద జాతీయ రహదారిలో సాగరవైపు వెళ్తున్న ఇన్నోవా కారు, సాగర నుంచి శివమొగ్గ వైపు వస్తున్న సిఫ్ట్ కారు రెండు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో స్విఫ్ట్ కారులో ప్రయాణిస్తున్న వారు మృతి చెందారు. మృతులను చిత్రదుర్గ జిల్లా చెళ్లకెరెకు చెందిన సిద్దన్న, చంద్రు, బెళగెరెకు చెందిన ఇమామ్‌సాబ్‌లుగా గుర్తించారు. మరో కారులోని ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను మెగ్గాన్ ఆస్పత్రికి తరలించారు. శివమొగ్గ గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హోసూరు వార్తలు..

హత్య కేసులో నిందితుని కోసం గాలింపు

హోసూరు: ప్రైవేటు హాస్టల్ నిర్వహణపై గొడవ ఒకరి హత్యకు దారితీసినట్లు అనుమానాలున్నాయి. వివరాల మేరకు వైఎస్సార్ కడప జిల్లా గొంటువారిపల్లి గ్రామానికి చెందిన కల్లూరి అసానయ్య (26) మాజీ వాలంటీరు. గ్రామంలో ఉపాధి లేకపోవడంతో అసానయ్య హోసూరుకు వచ్చాడు, కామరాజ్‌నగర్‌లో అద్దె గదిలో నివాసముంటూ వచ్చాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం దారుణ హత్యకు గురై కనిపించాడు. స్థానికులు హడ్కో పోలీసులకు ఫిర్యాదు చేయగా చేరుకుని పరిశీలించి మృతదేహాన్ని క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విచారణ చేపట్టగా గత కొద్దిరోజులుగా అతని బంధువు చిన్నబాలు తరచూ వచ్చి అసానయ్యను కలిసి వెళ్లేవాడు, ఇరువురూ కలిసి ప్రైవేట్‌గా హాస్టల్‌ను నిర్వహించాలని అనుకున్నారు. చిన్నబాలు వైఖరి నచ్చని అసానయ్య ఓ భవనాన్ని అద్దెకు తీసుకొని 1వ తేదీ నుంచి సొంతంగా హాస్టల్‌ను ప్రారంభించాడు. ఇది నచ్చని చిన్నబాలు హత్య చేసి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుని కోసం గాలిస్తున్నారు.

ఇంట్లో నగలు చోరీ

హోసూరు: ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని దుండగులు తాళాలు పగులగొట్టి నగలు దోచుకెళ్లిన ఘటన బాగలూరు పరిధిలో చోటు చేసుకొంది. వివరాల మేరకు హోసూరు తాలూకా బాగలూరు సమీపంలోని కర్నపల్లి గ్రామానికి చెందిన శారద (35) అనే మహిళ రెండు రోజుల క్రితం ఇంటికి తాళం వేసుకొని బెంగళూరుకెళ్లింది. ఈమె శుక్రవారం వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. బీరువాలో ఉన్న 14 పొన్ల బంగారు నగలు కనిపించలేదు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

ప్రేమ గొడవలో కిడ్నాప్ డ్రామా

క్రిష్ణగిరి: ప్రేమ వ్యవహారంలో ప్రియుని తల్లిదండ్రులను కిడ్నాప్ చేసిన ఘటనలో నిందితుల కోసం బేరికె పోలీసులు గాలిస్తున్నారు. వివరాల మేరకు కోలారు జిల్లా మాలూరు తాలూకా తిమ్మనాయకనహళ్లి గ్రామానికి చెందిన మునిరత్న తమ్ముడు తరుణ్ కుమార్ (19), బేరికె సమీపంలోని ఎలువపల్లి గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలికను ప్రేమిస్తూ వచ్చాడు. గత 4వ తేదీన బాలికను తీసుకెళ్లాడు. బాలిక సోదరి మోనిక (21), ఆమె భర్త పవన్‌కుమార్ (26)లు ఇందుకు ప్రతీకారంగా మెనసనదొడ్డిలో ఉండే తరుణ్‌కుమార్ తల్లిదండ్రులు అప్పయ్య, వరలక్ష్మమ్మను కారులో కిడ్నాప్ చేసి హోసూరు పట్టణలో వదిలిపెట్టి వెళ్లిపోయారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని మోనిక, పవన్‌కుమార్‌ల కోసం గాలిస్తున్నారు.

నవ వధువు అపహరణ

హోసూరు: పెళ్లయిన 15 రోజులైన నవ వధువును కిడ్నాప్ చేశారని భర్త క్రిష్ణగిరి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలు.. క్రిష్ణగిరి జిల్లా ఎం.సి. పల్లి ప్రాంతానికి చెందిన మోహన్ కుమార్ (26), అదే ప్రాంతానికి చెందిన షర్మిళ(19)లు ప్రేమించుకొన్నారు. 15 రోజుల క్రితమే పెళ్లి చేసుకొన్నారు. శుక్రవారం భార్యాభర్తలిరువురూ క్రిష్ణగిరిలోని బంధువుల ఇంటికెళ్లారు. అక్కడ గుర్తుతెలియని దుండగులు షర్మిళను కిడ్నాప్ చేశారు. భర్త క్రిష్ణగిరి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసి, క్రిష్ణగిరి పాతపేటకు చెందిన ఆరిఫ్ (25), అనుచరులతో కలిసి కిడ్నాప్ చేశాడని పేర్కొన్నాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

హోసూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేసే సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని క్రిష్ణగిరి వ్యవసాయ శాఖ ఉపడైరెక్టర్ పచ్చయప్పన్ సూచించారు. వ్యవసాయ విస్తరణ పథకం ద్వారా పలవనపల్లి గ్రామంలో జరిగిన శిక్షణా శిబిరానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడుతూ... రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని, ప్రధానంగా పంటల బీమా, పీఎం కిసాన్ యోజన పథకాలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని, భూసార పరీక్షలు నిర్వహించి పంటలను సాగుచేయడం ద్వారా అధిక దిగుబడిని పొందవచ్చునని, సంయుక్త వ్యవసాయం ద్వారా ఎక్కువమంది లబ్ధిపొందేందుకు అవకాశం ఉందని, కలైనర్ సంయుక్త వ్యవసాయ పథకం ద్వారా కంది, కారామణి, వేరుసెనగ పంటలకు రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు చైతన్యం కల్పించారు. హోసూరు వ్యవసాయ శాఖ ఉపడైరెక్టర్ భువనేశ్వరి, లక్ష్మణకుమార్, మురుగేషన్, కన్నియప్పన్, గోవిందస్వామి, సుగుణ తదితరులు పాల్గొని శిక్షణ ఇచ్చారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

హోసూరు: సమాజానికి ప్రమాదకరంగా మారిన బాల్య వివాహాలను అరికట్టాలని కలెక్టర్ శరయు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రం క్రిష్ణగిరిలో జరిగిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో స్త్రీ విద్యను అభివృద్ధి పరచాలని, బాల్య వివాహాలను సంపూర్ణంగా నిర్మూలించాలని, మహిళలకు ఎదురయ్యే లైంగిక దాడులను అరికట్టాలని, మహిళలకు రక్షణ కల్పించాలని పిల్లల తల్లిదండ్రులు, ప్రజల మధ్య చైతన్య కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యావంతులైన మహిళలకు జిల్లా యంత్రాంగం, ఉద్యోగ అవకాశాల కేంద్రం, ప్రతిభా శిక్షణలు, పారిశ్రామిక రంగం ద్వారా పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా మహిళా రక్షణపై పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధికారులు శక్తి, సుభాషిణి, జగవీరపాండ్యన్ తదితరులు పాల్గొన్నారు.



మహిళా రక్షణపై పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తదితరులు

వ్యక్తిపై వేటకొడవలితో దాడి

కెలమంగలం: ఆర్థిక లావాదేవీల్లో ఏర్పడిన గొడవల్లో బంధువుపై వేటకొడవలితో దాడి చేసిన నిందితున్ని తళి పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు.. డెంకణీకోట తాలూకా తళి సమీపంలోని కొడియాలం గ్రామానికి చెందిన దేవరాజ్ (28) అదే గ్రామానికి చెందిన బంధువు నారాయణప్ప(55)ల మధ్య ఆర్థిక లావాదేవీలు ఉన్నాయి. శుక్రవారం సాయంత్రం ఇదే విషయంగా గొడవ జరిగింది. తీవ్ర ఆవేశంతో నారాయణప్ప దేవరాజ్‌పై వేటకొడవలితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని డెంకణీకోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తళి పోలీసులు కేసు నమోదు చేసుకొని నారాయణప్పను అరెస్ట్ చేశారు.

క్రీడల్లోనూ రాణించాలి



ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం

బనశంకరి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, ఆ విధంగా తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించాలని జయనగర నియోజకవర్గ గ్యారంటీ పథకాల అమలు సమితి అధ్యక్షుడు ఎన్. నాగరాజు పిలుపునిచ్చారు. జయనగర మూడోబ్లాక్‌లోని రాణికిత్తూరు చెన్నమ్మ క్రీడామైదానంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న 16వ రాష్ట్రస్థాయి పాఠశాల విద్యార్థుల ఒలింపిక్ క్రీడలు ముగింపు కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్. నాగరాజు పాల్గొని విజేతలకు ట్రోఫీలు, బహుమతులు ప్రదానం చేసి మాట్లాడారు. కంప్యూటర్లు, మొబైళ్ల వ్యసనం నుంచి బయటకు వచ్చి క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేత సుకేశ్, క్రీడాశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఏనుగు అర్జున స్మారకానికి భూమిపూజ

బనశంకరి: అడవి ఏనుగులు జనారణ్యంలోకి రావడానికి కారణాలపై అధ్యయనం చేసి శాశ్వత పరిష్కారం కనుక్కుంటామని అటవీ శాఖ మంత్రి ఈశ్వర్‌ఖండ్రే తెలిపారు. హాసన జిల్లా యసళూరు అటవీ పరిధిలో గత డిసెంబరు 4న అడవి ఏనుగు బంధించే సమయంలో ప్రాణాలు కోల్పోయిన దసరా ఏనుగు అర్జున స్మారకానికి శనివారం మంత్రి ఈశ్వర్‌ఖండ్రే భూమిపూజ చేసి మాట్లాడారు. ఆగస్టు 12న ప్రపంచ ఏనుగుల దినోత్సవం సందర్భంగా బెంగళూరులో అంతర్జాతీయ సమ్మేళనం నిర్వహిస్తామని, ఈ సమ్మేళనంలో ప్రపంచ వ్యాప్తంగా నిపుణులు విచ్చేస్తారని తెలిపారు. సమ్మేళనంలో వన్యజీవి మానవ సంఘర్షణ నియంత్రణ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చిస్తామన్నారు. అర్జున స్మారకాన్ని డిసెంబరు 4 తేదీ ప్రథమ వర్ధంతి లోగా నిర్మించాలని అధికారులకు సూచించారు.



భూమిపూజలో మంత్రి ఈశ్వర్‌ఖండ్రే తదితరులు

క్లుప్తంగా...

అత్యాశతో కూడిన డిమాండ్లు సరికాదు

తెలుగు రాష్ట్రాల సీఎంల భేటీపై మంత్రి సత్యకుమార్



సాక్షి, అమరావతి: విభజన సమస్యల పరిష్కారం కోసం రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య సమావేశంలో కొన్ని అత్యాశతో కూడిన డిమాండ్లు తెరపైకి తీసుకురావడం సరికాదని బీజేపీ నాయకుడు, ఏపీ ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ వ్యాఖ్యానించారు. ఆయన శనివారం విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ 'విభజన చట్ట ప్రకారం మాత్రమే ఆస్తులు, ఆదాయ, సహజ వనరుల పంపకాలు జరగాలి. చట్టం పరిధి దాటి వచ్చే డిమాండ్లు చేయడం సరికాదు. కొత్తగా ఏమైనా ఉంటే చర్చ మాత్రం జరగాలని కోరుకోవచ్చు. విభజన చట్టంలోని 9, 10 షెడ్యూల్స్‌లో పేర్కొన్న అంశాలపై మంచి వాతావరణంలో చర్చల కోసం ఏపీ సీఎం చంద్రబాబు లెటర్ రాయటం... దానికి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్పందించడం బాగుంది. ఈ సమావేశంతో రెండు రాష్ట్రాల మధ్య సమస్యలు పరిష్కారమవుతాయని భావిస్తున్నా' అని సత్యకుమార్ పేర్కొన్నారు.

పోర్టులు, టీటీడీ ఆస్తుల్లో వాటాలు కోరటం ఆందోళనకరం

మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ



సాక్షి, అమరావతి: విభజన సమస్యల పరిష్కారానికి రెండు రాష్ట్రాల సీఎంల సమావేశం నేపథ్యంలో పోర్టుల్లో, టీటీడీ ఆస్తుల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వాటాలు కోరుతున్నట్టుగా వస్తున్న వార్తలు ఏపీ ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయని మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. పారదర్శకతకోసం, ప్రజలకు వాస్తవాలు తెలియడానికి ముఖ్యమంత్రుల సమావేశాన్ని ప్రత్యక్ష ప్రసారం చేస్తే బాగుంటుందని సూచించారు. ఈ అంశంపై శనివారం ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై టీడీపీ శ్రేణుల దాడి



చికిత్స పొందుతున్న హరిబాబు

పూతలపట్టు (చిత్తూరు జిల్లా): ఒంటరిగా వెళ్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త కాళ్లు, చేతులు కట్టేసి టీడీపీ కార్యకర్తలు దాడి చేసిన దారుణ ఘటన చిత్తూరు జిల్లా యాదమరి మండలం మాదిరెడ్డిపల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన హరిబాబు వైఎస్సార్‌సీపీ కార్యకర్త. అతడు శనివారం సాయంత్రం మామిడితోపులోని పశువులను తోలుకొని ఇంటికి వెళ్తుండగా దారి మధ్యలో పాలమడుగు, మట్టికామాచాపురం గ్రామాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు చిట్టిబాబు, రమేష్ దాడిచేశారు. హరిబాబు చేతులు, కాళ్లు కట్టేసి కర్రలు, పైపులతో చితకబాదారు. అనంతరం ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తీవ్రంగా గాయపడ్డ హరిబాబును చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం తమిళనాడులోని వెల్లూరులో ఉన్న ఒక ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు.

వైఎస్సార్‌సీపీ నేత కారుపై దుండగుల దుశ్చర్య

పెట్రోల్ పోసి తగలబెట్టిన వైనం



దగ్ధమైన కారు ముందు భాగం

రణస్థలం: శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలంలోని నారువ పంచాయతీలోని వైఎస్సార్‌సీపీ నేత ఆళ్ల అసిరయ్య కారును గుర్తు తెలియని దుండగులు పెట్రోల్ పోసి కాల్చివేశారు. జేఆర్ పురం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. నారువలో ఇంటి ముందు ఉన్న కారు కాలిపోతోందని శుక్రవారం అర్ధరాత్రి అసిరయ్యకు ఎదురింటి వాళ్లు ఫోన్ చేసి చెప్పారు. దీంతో వెంటనే ఆయన మోటార్ ఆన్ చేసి నీరు చల్లి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. ప్రమాదస్థలంలో అగ్గిపుల్లలు, పెట్రోల్ వేసిన ఖాళీ బాటిల్ కనిపించాయి. కాలకృత్యం తీర్చుకోవడానికి ఎదురింటి వాళ్లు లేవడంతో ఈ విషయం తెలిసిందని అసిరయ్య చెప్పాడు. రణస్థలం అగ్నిమాపక అధికారి అశోక్ ఘటనాస్థలాన్ని పరిశీలించి నివేదిక తయారు చేస్తామని తెలిపారు. సీఐ రామచంద్రరావు, క్లూస్ టీం ప్రమాదస్థలాన్ని పరిశీలించారు. అసిరయ్య ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ గోవిందరావు చెప్పారు. ఘటనాస్థలాన్ని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ పరిశీలించారు. 20 ఏళ్లుగా ఎచ్చెర్ల నియోజకవర్గం ప్రశాంతంగా ఉందని కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాతే ఇలాంటి దారుణాలు చూస్తున్నామని అన్నారు. అసిరయ్యకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఉసూరుమనిపించారు

ఏపీ, తెలంగాణ సీఎంల భేటీలో విభజన అంశాలపై నామమాత్రంగా చర్చ



సమావేశంలో ఏపీ, తెలంగాణ సీఎంలు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు

సాక్షి, అమరావతి: విభజన సమస్యల పరిష్కారమే అజెండాగా హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో ఏర్పాటు చేసిన తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం పక్కదారి పట్టింది. కీలకమైన విభజన అంశాలపై కాకుండా ఇతర అంశాలపై అత్యధిక సమయం వెచ్చించడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. రాష్ట్ర విభజన అంశాలపై పరిష్కారం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలతో పాటు ఇరు రాష్ట్రాల మంత్రులు, ఉన్నతాధికారులు శనివారం హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. దాదాపు గంటా నలభై నిమిషాలు సాగిన భేటీలో ఏ విషయంపై కూడా ఓ అంగీకారానికి రాలేదు. ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారులు, ఇరు రాష్ట్రాల మంత్రులతో రెండు కమిటీలు వేయాలని నిర్ణయించి చేతులు దులుపుకున్నారు. మిగిలిన సమయం అంతా డ్రగ్స్, సైబర్ క్రైమ్, మూసీ నది పరిరక్షణ తదితర అంశాలపై కేటాయించడంపై ఉన్నతాధికారులు విస్మయం వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారానికి మంత్రులతో ఒక కమిటీ, అధికారులతో మరో కమిటీ వేయాలని నిర్ణయించారు. అధికారుల కమిటీ రెండు వారాల్లోగా సమావేశమై చర్చలు జరపనుంది. ఈ కమిటీ స్థాయిలో పరిష్కారం కాని అంశాలపై రెండు రాష్ట్రాల మంత్రుల కమిటీ చర్చిస్తుందని ఇరు రాష్ట్రాలు నిర్ణయించాయి. మంత్రుల కమిటీ నిర్ణయాలను రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు అంగీకరించనున్నారు. వీరి స్థాయిలో కూడా ఫలితం తేలకపోతే ఇరు రాష్ట్రాల సీఎంలు మళ్లీ భేటీ అయ్యి చర్చిస్తారు. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీ అనంతరం తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్‌లు సమావేశ వివరాలను విలేకరులకు వివరించారు.

పలు ప్రశ్నలపై దాటవేత

పోలవరం ముంపు మండలాలు, విద్యుత్ బకాయిలు వంటి అంశాలపై చర్చించారా అని ఇరు రాష్ట్రాల మంత్రులను విలేకరులు ప్రశ్నించగా.. భట్టి విక్రమార్క జోక్యం చేసుకుంటూ.. నేరుగా సమాధానం ఇవ్వకుండా అన్ని విషయాలు చర్చించామన్నారు. విలేకరులు మరో ప్రశ్న వేస్తుండగానే సమావేశం ముగించి వెళ్లిపోయారు. అంతకు ముందు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కాళోజీ నారాయణరావు రాసిన 'నా గొడవ' పుస్తకాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహూకరించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డికి వెంకటేశ్వరస్వామి ఫొటో బహూకరించి, రేవంత్, భట్టిలకు చంద్రబాబు శాలువా కప్పి సత్కరించారు. ఈ సమావేశంలో ఏపీ నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు మంత్రులు కందుల దుర్గేష్, సత్యప్రసాద్, బీసీ జనార్ధన్‌రెడ్డి, సీఎస్, ఇతర అధికారులు, తెలంగాణ నుంచి సీఎం రేవంత్ రెడ్డితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, సీఎస్, సీనియర్ అధికారులు పాల్గొన్నారు. కాగా, రాష్ట్ర విభజన అంశాలపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో చర్చలు జరిపానని ఏపీ సీఎం చంద్రబాబు శనివారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇరు రాష్ట్రాలకు మేలు కలుగుతుందనే నమ్మకం ఈ సమావేశం ద్వారా కలిగిందన్నారు.

డ్రగ్స్ ఫ్రీ స్టేట్‌గా చేయడానికి కలిసి పనిచేస్తాం

పదేళ్లుగా పరిష్కారం దొరకని సమస్యలకు ఈ సమావేశంలో పరిష్కారం దొరుకుతుందని అనుకోలేదు. వీటి పరిష్కార మార్గం కోసం కలిసి పని చేయాలని ఇరు రాష్ట్రాలు నిర్ణయం తీసుకున్నాయి. ఈ సమస్యలను త్వరితగతిన పరిష్కరించుకోవడం కోసం సీఎస్ స్థాయి అధికారులతో కూడిన ఒక కమిటీ, మంత్రుల స్థాయిలో ఇంకో కమిటీ వేశాం. ఇరు రాష్ట్రాల నుంచి ముగ్గురు ఉన్నతాధికారులతో కూడిన కమిటీ రెండు వారాల్లోగా సమావేశం అవుతుంది. ముందుగా అధికారుల స్థాయిలో పరిష్కారమయ్యే అంశాలను చర్చిస్తాం. అక్కడ ఫలితం రాకపోతే ఆ తర్వాత మంత్రుల స్థాయిలో చర్చలు ఉంటాయి. మంత్రుల స్థాయిలో కూడా పరిష్కారం కాకపోతే తిరిగి ముఖ్యమంత్రులు సమావేశమై చర్చిస్తారు. ఈ సమావేశంలో విభజన సమస్యల పరిష్కారంతో పాటు డ్రగ్స్ నిర్మూలన, సైబర్ క్రైమ్‌ను అరికట్టడం వంటి అంశాలపై కీలక నిర్ణయం తీసుకున్నాం. తెలంగాణను డ్రగ్స్ ఫ్రీ రాష్ట్రంగా చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించుకొని అందుకోసం ఏడీజీ స్థాయి అధికారులతో ప్రత్యేక కమిటీ వేశారు. అదే విధంగా ఆంధ్రప్రదేశ్ కూడా ఏడీజీ స్థాయి అధికారులతో ఒక కమిటీ వేసి డ్రగ్స్ నిర్మూలనకు సహకరించాలన్న కోరికను అంగీకరించింది. తెలంగాణ సరిహద్దు రాష్ట్రాల నుంచి మత్తు పదార్థాలను అరికట్టడంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో కలిసి పని చేస్తున్నాం.

– తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

పిల్లల స్కూల్ బ్యాగుల్లో గంజాయి

విభజన చట్ట సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లేఖ రాయగానే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుకు వచ్చి సమావేశం ఏర్పాటు చేయడం అభినందనీయం. ఇరు రాష్ట్రాల ప్రయోజనాలు దెబ్బ తినకుండా చర్చలతో సత్వరం పరిష్కరించుకునే దిశగా అడుగులు వేస్తాం. ఇరు రాష్ట్రాలు కలిసి అభివృద్ధి చెందేలా తరచూ ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సమావేశం అవుతారు. తెలంగాణ కోరిన విధంగా రాష్ట్రంలో గంజాయి సరఫరా నియంత్రణకు ఇప్పటికే చర్యలు చేపట్టాం. ఆరుగురు మంత్రులతో సబ్ కమిటీ వేశాం. ఏపీలో 8వ తరగతి విద్యార్థుల బ్యాగుల్లో కూడా గంజాయి దొరుకుతోంది. ఏపీలో అత్యధికంగా సాగవుతున్న గంజాయి తమ రాష్ట్రానికి వస్తోందని తెలంగాణ ఆందోళన వ్యక్తం చేసింది. ప్రజలు హర్షించేలా విభజన సమస్యలను పరిష్కరిస్తాం.

– ఏపీ మంత్రి అనగాని సత్యప్రసాద్

ఏపీ పరువు తీసిన చంద్రబాబు

రాష్ట్రం నుంచి డ్రగ్స్ రవాణా అవుతున్నాయట!

సాక్షి, అమరావతి : తెలంగాణ ప్రభుత్వంతో చర్చల పేరుతో వీసమెత్తు ప్రయోజనాన్ని కూడా సాధించలేకపోయిన ముఖ్యమంత్రి చంద్రబాబు హైదరాబాద్‌లో ఆంధ్రా ప్రజల పరువు తీశారు. రాష్ట్ర విభజన సమస్యల పరిష్కారం సంగతి అటుంచితే అసలు రాష్ట్రంలో పెద్దగా లేని డ్రగ్స్.. ఏపీలోనే ఉత్పత్తి అవుతున్నట్లు ఒప్పుకోవడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. చంద్రబాబు బృందం తెలంగాణ రాష్ట్రంతో చర్చించేందుకు వెళ్లిన ఉద్దేశం ఏమిటి? చివరికి ఏం సాధించారు? వంటి ప్రశ్నలు సాధారణ ప్రజలు నుంచి వస్తున్నాయి. ఒక్క విభజన సమస్య గురించి కూడా గట్టిగా మాట్లాడకుండా డ్రగ్స్ గురించి చర్చించడం, హైదరాబాద్‌లో ఉన్న డ్రగ్స్ దందా అంతటికీ ఏపీయే మూలమని స్వయంగా అంగీకరించడం విడ్డూరం. టీడీపీ రెండు రోజుల నుంచి రెండు రాష్ట్రాల మధ్య చర్చలు పేరుతో నానా హడావుడి చేసింది రాష్ట్రం పరువు తీసేందుకేనా అనే చర్చ మొదలైంది.

బాబు గురించి అంత బిల్డప్ ఇచ్చింది ఇందుకేనా?

విభజన సమస్యల పరిష్కారానికి చంద్రబాబు చొరవ తీసుకుని తన శిష్యుడిగా ఉన్న తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో చర్చలకు వెళుతున్నారని, రెండు రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలన్నీ పరిష్కారమైపోతాయని టీడీపీ శ్రేణులు ఊదరగొట్టాయి. ఎల్లో మీడియా అయితే చంద్రబాబు దార్శనికత, సుదీర్ఘ అనుభవంతో రెండు రాష్ట్రాల మధ్య సుహృద్భావ వాతావరణాన్ని నెలకొల్పుతున్నారంటూ బీభత్సమైన బిల్డప్ ఇచ్చింది. కానీ సమావేశంలో రెండు రాష్ట్రాలకు సంబంధించిన నెలకొన్న ప్రధాన సమస్యల గురించి లోతుగా చర్చించలేదు. హైదరాబాద్‌ను అతలాకుతలం చేస్తున్న డ్రగ్స్‌పై, అక్కడ డ్రగ్స్ సంస్కృతి పెరగడానికి ఏపీలో గంజాయి ఉత్పత్తి అవడమే కారణమని చర్చించడం విస్మయ పరుస్తోంది. స్వయంగా రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఉమ్మడి మీడియా సమావేశంలో ఈ విషయాన్ని ఒప్పుకోవడం దారుణం అని రాష్ట్ర ప్రజలు అభిప్రాయపడుతున్నారు. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేరుగా ఏపీ పేరు చెప్పకుండా సరిహద్దు రాష్ట్రాల నుంచి డ్రగ్స్ వస్తున్నాయని చెప్పగా, టీడీపీ మంత్రి అనగాని మాత్రం ఏపీలో డ్రగ్స్ ఉత్పత్తి అయి హైదరాబాద్‌కి వస్తున్నాయని.. తమ రాష్ట్రంలో 8వ తరగతి పిల్లల స్కూల్ బ్యాగులో గంజాయి దొరుకుతోందని చెప్పి రాష్ట్రం పరువును తెలంగాణ రాష్ట్ర బజారులో నిలబెట్టారు.

హైదరాబాద్ డ్రగ్ సంస్కృతికి ఏపీకి సంబంధం ఏమిటి?

హైదరాబాద్ డ్రగ్ కల్చర్‌కి, ఏపీలో అక్కడక్కడా దొరుకుతున్న గంజాయికి సంబంధమే లేదని అనేకసార్లు తేటతెల్లమైంది. హైదరాబాద్‌లో కొకైన్, హెరాయిన్ వంటి డ్రగ్స్ విరివిగా దొరుకుతాయి. ఏపీలో వాటి జాడే లేదు. కొకైన్, హెరాయిన్ వంటి విదేశాల నుంచి దిగుమతయ్యే డ్రగ్స్ కూడా ఏపీ నుంచే వస్తున్నాయని స్వయంగా మంత్రి చెప్పడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. వైఎస్సార్‌సీపీ హయాంలో గంజాయి పెరిగిందని ఎప్పటి నుంచో చేస్తున్న దుష్ప్రచారాన్నే పక్క రాష్ట్రంతో చర్చల్లో కూడా వల్లె వేయడం రాజకీయ స్వప్రయోజనాల కోసమేనని స్పష్టమవుతోంది. తాము అధికారంలో ఉన్న రాష్ట్రంలో గంజాయి ఉందని చెప్పడం.. పక్క రాష్ట్రంలోని వేదికపై అంగీకరించడం ఆత్మహత్యాసదృశంగా మేధావులు వ్యాఖ్యానిస్తున్నారు.

ఏపీ ప్రజల ఆత్మగౌరవాన్ని మూసీలో కలిపేసిన చంద్రబాబు

చర్చల ద్వారా ఏపీకి సంబంధించి ఎటువంటి సానుకూలత సాధించలేకపోగా, మన గౌరవానికి భంగం కలిగించేలా చంద్రబాబు, ఆయన మంత్రుల బృందం వ్యవహరించినట్లు స్పష్టమవుతోంది. రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని ప్రశ్నించకుండా ఏపీలోని పోర్టులు, టీటీడీ ఆస్తుల్లో వాటా ఇవ్వాలని, పోలవరం విలీన గ్రామాలను తిరిగి ఇచ్చేయాలని తెలంగాణ పెట్టిన డిమాండ్లపైనా నోరు మెదపక పోవడం రాష్ట్రానికి తీరని ద్రోహం చేసినట్లేనని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం రేవంత్‌రెడ్డి, చంద్రబాబు వ్యక్తిగత ప్రయోజనాల కోసమే తప్ప రెండు రాష్ట్రాల ప్రయోజనాల కోసం ఈ చర్చలు జరిగినట్లు ఎక్కడా కనిపించలేదంటున్నారు. అందులోనూ రేవంత్ పైచేయి సాధించి ఏపీ నెత్తిన డ్రగ్స్ ఉత్పత్తి చేస్తున్నారనే అపవాదు మోపారు. దీనికి అంగీకరించిన చంద్రబాబు రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవాన్ని హైదరాబాద్ మూసీ నదిలో కలిపేశారనే సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.

గంజాయి దందాపై గత సర్కారు ఉక్కుపాదం

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గంజాయి సాగును పూర్తిగా నిర్మూలించాలని అప్పటి సీఎం వైఎస్ జగన్ పోలీసు యంత్రాంగాన్ని విస్పష్టంగా ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేకంగా 'స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో'ను నెలకొల్పి విస్తృత అధికారాలు కల్పించారు. ఇందులో భాగంగా 'ఆపరేషన్ పరివర్తన్' అనే కార్యక్రమం ద్వారా గంజాయి సాగు వల్ల అనర్థాలపై ఆంధ్ర–ఒడిశా సరిహద్దుల్లో విస్తృత అవగాహన కల్పించారు. ఆ తర్వాత శాటిలైట్ ఫొటోలతో ఆంధ్ర–ఒడిశా సరిహద్దు ప్రాంత్రాన్ని జియో మ్యాపింగ్ చేశారు. ప్రత్యేక యంత్రాలతో రెండు దశల్లో ఏకంగా 11,550 ఎకరాల్లో గంజాయి పంటను ధ్వంసం చేశారు. ఏకంగా 4.50 కోట్ల గంజాయి మొక్కలను తొలగించి దహనం చేశారు. అంతర్రాష్ట్ర చెక్ పోస్టులు, ఇతర చెక్ పోస్టులను ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు నిర్వహించింది. మొత్తం 4.50 లక్షల కేజీల గంజాయి, 131 లీటర్ల ద్రవ రూప గంజాయిని స్వాధీనం చేసుకుంది. 13,210 మందిని అరెస్ట్ చేయడంతోపాటు 2,950 వాహనాలను జప్తు చేసింది. గిరిజనులకు ప్రత్యామ్నాయం చూపింది. రూ.144కోట్లతో ఆపరేషన్ నవోదయం పేరుతో ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. వివిధ పంటల సాగు చేపట్టేలా ప్రోత్సహించింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన చర్యలకు జాతీయ స్థాయిలో ప్రశంసలు లభించాయి. కాగా, గతంలో చంద్రబాబు ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రంలో గంజాయి దందా యథేచ్ఛగా కొనసాగింది. చంద్రబాబుకు అత్యంత సన్నిహితులైన టీడీపీ కీలక నేతలు నర్సీపట్నం కేంద్రంగా గంజాయి సిండికేట్‌ను నిర్వహించారు.

కాలయాపనకే తప్ప.. కార్యాచరణ లేదు

- మాజీ మంత్రి పేర్ని నాని, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ప్రకటన



పేర్ని నాని



గడికోట శ్రీకాంత్‌రెడ్డి

సాక్షి, అమరావతి: రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం జరిగిన తీరు, తీసుకున్న నిర్ణయాలను గమనిస్తే అదంతా కాలయాపనకే తప్ప.. కార్యాచరణ లేదనే విషయం స్పష్టమవుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభిప్రాయపడింది. అధికారులతో కమిటీ ఏర్పాటుచేస్తూ తీసుకున్న నిర్ణయం విభజన సమస్యల పరిష్కారంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని వెనక్కిలాగే నిర్ణయంగా చూడాల్సి వస్తోందని పేర్కొంది. ఇందుకు సంబంధించి వైఎస్సార్‌సీపీ స్పందనను మాజీమంత్రి పేర్ని నాని, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి శనివారం రాత్రి మీడియాకు ఓ ప్రకటన విడుదల చేశారు. అందులో వారు ఏం పేర్కొన్నారంటే..

- రెండు రాష్ట్రాల మధ్య ఉన్న వివాదాలేంటి? అపరిష్కృత అంశాలేంటి? పంచాల్సిన ఆస్తులేంటి? ఎందుకు ముందుకెళ్లడంలేదు? వీటిపై కోర్టుల్లో ఉన్న కేసులేంటి? అనే వాటిపై రెండు రాష్ట్ర ప్రభుత్వాలకూ స్పష్టత కూడా ఉంది. కొత్తగా రెండు రాష్ట్రాల మధ్య అపరిష్కృత అంశాల గుర్తింపునకు మళ్లీ కమిటీ అన్నట్లుగా చెప్పడం విభజిత సమస్యల పరిష్కారంలో మరింత జాప్యానికే దారితీస్తుందన్న సంకేతాన్ని ఇద్దరు సీఎంల సమావేశం ఇచ్చిందని అభిప్రాయపడుతున్నాం.
- పార్లమెంటు చేసిన విభజన చట్టంలోని అంశాల అమలుపై కేంద్ర ప్రభుత్వం గతంలో సీనియర్ అధికారి షీలా బేడీ కమిటీని ఏర్పాటుచేసింది. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ఆస్తుల వివాదంపై కూడా ఈ కమిటీ పలు సిఫార్సులు చేసింది. వీటిపై అనేక దఫాలుగా పదేళ్లపాటు చర్చలు జరిగాయి. కొన్ని సిఫార్సులను తెలంగాణ ప్రభుత్వం అంగీకరించినప్పటికీ ఆచరణకు నోచుకోలేదు. చర్చలను ఆ దశ నుంచి ముందుకు తీసుకెళ్లాల్సిందిపోయి మళ్లీ కమిటీ ఏర్పాటు చేయడమంటే వ్యవహారాన్ని మళ్లీ మొదటికి తీసుకెళ్లడమేనని భావిస్తున్నాం.
- ఇక తిరుపతిలో జరిగిన దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో అపరిష్కృత అంశాలపై దృష్టిపెట్టాలని, దశాబ్దకాలంగా అంగుళం కూడా ముందుకు పడకపోవడంతో ఏపీకి తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆ రోజు ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వైఎస్ జగన్ కేంద్ర హోంమంత్రి ఎదుట గొంతెత్తారు. దీనిపై ప్రత్యేక దృష్టిపెట్టి నిర్ణీత కాలపరిమితిలోగా సమస్యలు తీరుస్తామని హోంమంత్రి హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో కూడా రెండు రాష్ట్రాలకు చెందిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, అధికారులు కూడా విభజిత సమస్యలపై చర్చల ప్రక్రియ వేగం అందుకుంది. వీటిని కూడా ముందుకు తీసుకెళ్లే అంశాలపై దృష్టిపెట్టకుండా మళ్లీ కమిటీని ఏర్పాటుచేయడమంటే.. మళ్లీ వెనక్కి లాగడమే అవుతుందని భావిస్తున్నాం.
- పైగా ఇప్పుడు కమిటీ ఏర్పాటు అన్నది కేంద్ర ప్రభుత్వంతో సంబంధంలేకుండా, వారి ప్రమేయంలేకుండా ఏర్పాటవుతోంది. విభజన చట్టం చేసింది పార్లమెంటు, దాన్ని అమలు చేయాల్సింది కేంద్ర ప్రభుత్వం అయినప్పుడు, కేంద్ర ప్రభుత్వం ప్రమేయం లేకుండా కమిటీ ఏర్పాటు అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది.
- ఇక రాష్ట్రానికి రావాల్సిన దాదాపు రూ.7వేల కోట్ల విద్యుత్ బకాయిల విషయంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చింది. తద్వారా ఆ బకాయిలు చెల్లింపునకు ఆదేశాలు కూడా ఇచ్చింది. తర్వాత ఈ వ్యవహారం కోర్టుకు చేరింది. దీనిపై దృష్టిపెట్టి పరిష్కారం సాధించే ప్రయత్నం ఇప్పుడు జరిగిన సమావేశంలో పెద్దగా జరిగినట్లు లేదు.
- ముఖ్యంగా నీటి ప్రాజెక్టుల నిర్వహణకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ తీవ్ర అన్యాయాన్ని ఎదుర్కొంటోంది. రాయలసీమ ప్రాంతం గొంతెండుతున్న పరిస్థితుల్లో కూడా విద్యుత్ రూపేణా తెలంగాణ రాష్ట్రం శ్రీశైలం ఎడమ కాల్వ నుంచి నీటిని ఇష్టానుసారం విడిచిపెడుతోంది. దీనిపై తక్షణం పరిష్కారానికి ప్రయత్నించి ఒక నిర్ణయాన్ని తీసుకోకుండా సమావేశం అసంపూర్తిగా ముగియడం రాష్ట్రానికి అన్యాయం చేసినట్లే.
- ఏపీ భూభాగంలో ఉన్న నాగార్జునసాగర్ కుడికాల్వ, స్పిల్‌వే భాగాన్ని వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు ఏపీ ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకుంది. ఈ సమస్యను పరిష్కరిస్తామని కేంద్ర హోంశాఖ ఇచ్చిన హామీ మేరకు సంయమనం పాటించాం. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో చంద్రబాబు దీనిపై కూడా దృష్టిపెట్టిన దాఖలాలు కనిపించకపోవడంతో విభజిత సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వ చిత్తశుద్ధిపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.
- ఇప్పుడు ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో ఏపీ పోర్టులు, తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్తుల్లోనూ తెలంగాణ వాటా కోరినట్లుగా మీడియా సంస్థలు వార్తలను ప్రసారం చేశాయి. అలాగే, ఏడు మండలాల్లోని కొన్ని గ్రామాలను కూడా విలీనానికి ఏపీ సుముఖంగా ఉన్నట్లుగా కూడా ప్రచారం జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు దీనిపై తీవ్ర ఆందోళనలో ఉన్నారు. దీనిపై ఏపీ ప్రభుత్వం నుంచి ఒక మంత్రి కాని, ఒక అధికారి కాని ఎలాంటి ప్రకటనా చేయకపోవడం ప్రజల అనుమానాలను బలపరిచినట్లే అవుతుందని వైఎస్సార్‌సీపీ భావిస్తోంది.

బిక్కుబిక్కు మంటూ.. రాత్రంతా అడవిలోనే..

- టీడీపీ అరాచకానికి బెంబేలెత్తిన సుబ్రమణ్యం రెడ్డి కుటుంబం
- ఆయన్ని తీవ్రంగా హింసించిన టీడీపీ గూండాలు
- ఇటుకల బట్టీ ధ్వంసం.. ఇటుకల తరలింపు
- టమాటా పంట మార్కెట్‌కు తీసుకెళ్లకుండా అడ్డు
- పోలీసులూ స్పందించకపోవడంతో ప్రాణ రక్షణ కోసం అడవిలోకి
- రాత్రంతా క్రూరమృగాల మధ్య అడవిలోనే..
- వైఎస్సార్‌సీపీ వారు శరణు కోరి టీడీపీలో చేరితే వదిలేస్తామంటున్న టీడీపీ నేతలు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: రాష్ట్రంలో అధికార పార్టీ అరాచకానికి భయపడి ఓ కుటుంబం రాత్రంతా అడవిలో తలదాచుకుంది. రాత్రివేళ్ల క్రూర మృగాలు, పాములు, ఇతర విష పురుగుల మధ్య అడవిలోనే బిక్కుబిక్కుమంటూ గడుపుతోంది. ప్రజాస్వామ్య దేశ చరిత్రలో ఇంతటి అరాచకం ఎప్పుడైనా కన్నామా? విన్నామా?.. కానీ ఇది పచ్చి నిజం. సోమల మండలం కమ్మపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత సుబ్రమణ్యంరెడ్డి కుటుంబం దీనగాథ ఇది. శుక్రవారం టీడీపీ గూండాలు పెద్ద సంఖ్యలో ఆయన ఇంటిపై దాడి చేశారు. సుబ్రమణ్యంరెడ్డిని బయటకు ఈడ్చుకు వచ్చి తీవ్రంగా కొట్టారు. రకరకాలుగా హింసించారు. ఆయన ఇటుకల బట్టీలోని ఇటుకలన్నింటినీ తరలించుకుపోయారు. బట్టీ మొత్తాన్ని ధ్వంసం చేశారు. సుబ్రమణ్యంరెడ్డి పొలంలో పండించిన టమాటా కోతకొచ్చింది. ఈ పంటను మార్కెట్‌కు తరలించకుండా టీడీపీ నేతలు అడ్డుపడుతున్నారు. ఆయన పశువులకు గడ్డి కూడా వేయకుండా టీడీపీ నేతలు అడ్డుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు. పోలీసులకు తెలిపినా స్పందన లేకపోవడంతో సుబ్రమణ్యం రెడ్డి కుటుంబం ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని సమీపంలోని అడవిలోకి పారిపోయింది. శుక్రవారం రాత్రంతా అడవిలోనే గడిపింది. శనివారం కొందరు వ్యక్తులు వారి వద్దకు వెళ్లి ఆ కుటుంబాన్ని బయటకు తీసుకువచ్చి వేరే ప్రాంతంలో ఉంచారు. ఆయన తమను శరణుకోరి.. టీడీపీలో చేరితే క్షమించి వదిలేస్తామని టీడీపీ నేతలు చెబుతున్నారు. లేదంటే విడిచిపెట్టే ప్రసక్తే లేదని అంటున్నారు. టీడీపీ నేతల తీరుపై పుంగనూరు ప్రజలు తీవ్రంగా మండిపడుతున్నారు. గతంలో ఎవరికి నచ్చిన పార్టీలో వారు పనిచేసే వారని, ఇటువంటి అరాచకం ఎప్పుడూ చూడలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చిత్తూరు జిల్లావ్యాప్తంగా దాడులు

టీడీపీ నేతలు వారిపై కేసులు రాకుండా బెంగళూరు నుంచి గూండాలను తెచ్చి దాడులు చేయిస్తున్నట్లు సమాచారం. నియోజకవర్గ పరిధిలో ఎవరెవరు వైఎస్సార్‌సీపీకి పనిచేశారో గుర్తించి మరీ దాడులు చేయిస్తున్నారు. కొద్ది రోజులుగా టీడీపీ నేతలు, వారి గూండాల దౌర్జన్యాలు, దాడులతో చిత్తూరు జిల్లా అరాచకానికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. పుంగనూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ అభిమానులు ఊర్లొదిలి వేరే ప్రాంతాల్లో తలదాచుకొంటున్నారు. ఇప్పటివరకు 55 కుటుంబాలు స్వగ్రామాలను వీడి వెళ్లాయి. శ్రీకాళహస్తి రూరల్ మండలం ఈశ్వరయ్యకాలనీ, వాగివేడు, నారాయణపురం గ్రామాల నుంచి 75 కుటుంబాలను టీడీపీ నేతలు వెళ్లగొట్టారు. వీరంతా తమను శరణు కోరి, టీడీపీలో చేరితేనే వారిని, వారి ఆస్తులను వదిలేస్తామని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.

రక్షణ కోరినా స్పందించని పోలీసులు

టీడీపీ కూటమి దాడులు, దౌర్జన్యాలపై అనేకమంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సానుభూతిపరులు పోలీసులకు ఫోన్లు చేసి ఫిర్యాదు చేశారు. ఫోన్ చేసిన సమయంలో ఇరువురి మధ్య సంభాషణలను బాధితులు రికార్డు చేసుకున్నారు. ఆ రికార్డులను వింటే.. రక్షణ కల్పించాల్సిన పోలీసులేనా అలా మాట్లాడేది అనిపించకమానదు. ఇంత జరుగుతున్నా పోలీసులు స్పందించకపోవడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూటమి నేతల దౌర్జన్యాలు, దాడులు ఆగకపోవడం, పోలీసులు స్పందించకపోవడంతో బాధితులు న్యాయస్థానాలను ఆశ్రయించటానికి సిద్ధమవుతున్నారు.

• తెలంగాణ

హీరో రాజ్ తరుణ్ కేసులో ట్విస్టులు

- ఆధారాలు ఇవ్వాలన్న పోలీసుల నోటీసుకు స్పందించని లావణ్య
- కేసు క్లోజ్ చేసే దిశగా నార్సింగి పోలీసులు

మణికొండ(హైదరాబాద్): హీరో రాజ్‌తరుణ్ కేసు పలు మలుపులు తిరుగుతోంది. రాజ్‌తరుణ్ తనను ప్రేమించాడని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి, ప్రస్తుతం మరో యువతి మోజులో పడి తనను పట్టించుకోవటం లేదని లావణ్య అనే యువతి నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. అయితే కేసుకు సంబంధించి ఆమె ఎటువంటి ఆధారాలు ఇవ్వలేదు. దీంతో నార్సింగి పోలీసులు ఆమెకు నోటీసు జారీ చేశారు. ఫిర్యాదుకు అనుగుణంగా ఆధారాలను సమర్పించాలని అందులో సూచించారు. ఆమెకు ఫోన్ చేసి విషయం తెలిపేందుకు యత్నించినా స్పందన లేకపోవటంతో ఆదివారం వరకు వేచి చూసి సోమవారం కోర్టు అనుమతితో కేసును మూసివేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిసింది. తన మాజీ ప్రియుడు తన వద్దకు రావటం లేదని, అతనితో కలిసి ఓ సినిమాలో నటిస్తున్న హీరోయిన్ మాల్వి మల్హోత్రా సోదరుడు తనను చంపేస్తానని బెదిరించాడని, వారికి రాజకీయ పలుకుబడి ఉందని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. వాటికి సంబంధించిన ప్రాథమిక ఆధారాలను ఆమె సమర్పిస్తే విచారణ చేపడతామని పోలీసు అధికారులు తెలిపారు. లేదంటే ఆమె తప్పుడు కేసు పెట్టిందనే ఉద్దేశాన్ని కోర్టుకు తెలిపి దాన్ని మూసివేస్తామని వారు పేర్కొన్నారు.

నిరాధార ఆరోపణ: సినీనటి మాలివి మల్హోత్రా

ఒక సినిమాలో కలిసి పనిచేసినంత మాత్రాన హీరోతో రిలేషన్‌ను అంటగట్టడం, వారి మధ్య ఉన్న గొడవకు తనను బాధ్యురాలిని చేయడం మంచి పద్ధతి కాదని రాజ్‌తరుణ్‌తో కలిసి నటించిన హీరోయిన్ మాలివి మల్హోత్రా శనివారం ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. లావణ్యతో కొన్ని సంవత్సరాలు రిలేషన్‌లో ఉన్న మాట వాస్తవమని రాజ్‌తరుణ్ మీడియాకు వెల్లడించారు. ఆమెకు డ్రగ్స్ అలవాటు ఉండటం, పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపడంతో తనకు చెడ్డ పేరు వస్తుందనే ఉద్దేశంతోనే తాను ఆమెకు దూరంగా ఉంటున్నానన్నారు. ప్రస్తుతం ఆమె గుంటూరుకు చెందిన మస్తాన్ సాయితో లివింగ్ రిలేషన్‌లో ఉందని చెప్పారు.

సాక్షి ఫ్యామిలీ
బెంగళూరు
ఆదివారం ॥ 7-7-2024

వైరల్





ఆహా నా డ్రెస్ అంటా.... ఏఐ డ్రెస్ అంటా...

గూగుల్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ క్రిస్టినా ఎర్నెస్ట్ సృష్టించిన 'వరల్డ్స్ ఫస్ట్ ఏఐ డ్రెస్' వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ రోబోటిక్ మిదాస్ డ్రెస్ వీడియో 3.6 మిలియన్‌ల వ్యూస్‌ను దక్కించుకుంది. ఈ బ్లాక్ డ్రెస్‌లో ఎన్నో రోబోటిక్ పాములు ఉన్నాయి. చాలామంది ఈ డ్రెస్‌కు 'ఎక్స్‌ట్రార్డినరీ' అని కితాబు ఇవ్వగా కొద్దిమంది మాత్రం 'బోరింగ్' అని పెదవి విరిచారు.

రోబో సూసైడ్?!


'పని ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న రోబో' వార్త ఇంటర్‌నెట్‌లో హల్‌చల్ చేస్తోంది. 'రోబో ఏమిటీ? ఆత్మహత్య ఏమిటీ!' అనే ఆశ్చర్యం మాట ఎలా ఉన్నా దీన్ని ఆ దేశ తొలి రోబో ఆత్మహత్యగా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. రోబో వెయిటర్ టెక్నాలజీకి ప్రసిద్ధి చెందిన కాలిఫోర్నియాకు చెందిన 'బేర్ రోబోటిక్స్' కంపెనీ ఈ రోబోను తయారుచేసింది. ఈ రోబో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఆరు వరకు పనిచేసేది. 'ఆత్మహత్య' అనే ప్రచారం మాట ఎలా ఉన్నా 'రోబో కుప్పకూలిపోవడానికి అసలు కారణం ఏమిటి?' అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

'టీ'పాట

'చాయ్ హోటల్‌కు ఎందుకు వెళతారు?' అనే ప్రశ్నకు-'చాయ్ కోసమే వెళతారు' అనే జవాబు మాత్రమే వినిపిస్తుంది. అయితే సూరత్‌లోని విజయ్‌భాయి పటేల్ అలియాస్ డాలీ చాయ్‌వాలా అలియాస్ సింగింగ్ చాయ్‌వాలా హోటల్‌కు 'పాట' కోసం వెళతారు. డాలీ చాయ్‌వాలా కస్టమర్‌లకు వేడి వేడి టీ అందిస్తూనే, మైక్రోఫోన్‌లో అద్భుతంగా పాడుతుంటాడు. ఆయన గానం వింటూ 'మరో చాయ్' అనే మాట కస్టమర్‌ల నోటి నుంచి వినిపించడం అక్కడ సాధారణ దృశ్యం. ఈ 'సింగింగ్ చాయ్‌వాలా'కు సంబంధించిన వీడియో క్లిప్‌ను ముంబైలోని సెలబ్రిటీ ఫొటోగ్రాఫర్ బయాని ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తే వైరల్ అయింది.



మోదీ గారూ రోడ్లు కిధర్ హై



సోషల్ మీడియా చేతిలోకి వచ్చాక సామాన్యులు ప్రశ్నించే పద్ధతులు మారాయి. ఏకంగా ప్రధాని మోదీని ఉద్దేశిస్తూ మధ్యప్రదేశ్‌కు చెందిన ఒక గ్రామీణ మహిళ విడుదల చేసిన వీడియో వైరల్ అయ్యింది. 'మధ్యప్రదేశ్ నుంచి 29 సీట్లు ఇచ్చాం. మరి మా రోడ్ల సంగతేంటి?' అని అడుగుతూ డొక్కు రోడ్ల మీద ఆమె ప్రయాణం చేస్తూ తీసిన వీడియో మోడి వరకు చేరేలా ఉంది.

పూర్వం ప్రధానికి కార్డు ముక్క రాసి పడేసేవారు జనం. ఇవాళ ఒక వీడియో చేసి వదులుతున్నారు. కార్డు రాస్తే ఎవరికీ తెలిసేది కాదు. కాని వీడియో లక్షలాది మంది కంట పడుతోంది. మధ్యప్రదేశ్‌లోని సిధి జిల్లా అటవీప్రాంతంతో, బొగ్గు గనుల నిక్షేపాలతో ఉంటుంది. కాని వెనుకబాటుతనం కూడా ఉంది. 'మేం అడవుల్లో ఉంటాం. అయితే మాకు రోడ్లు అక్కర్లేదా మోదీ గారూ' అని శివాని సాహు అనే మహిళ మోదీని ప్రశ్నించింది. 'మధ్యప్రదేశ్ మీకు 29 సీట్లు ఇచ్చింది. ఇప్పుడైనా రోడ్లు వేయండి. చూడండి రోడ్లు ఎలా ఉన్నాయో. మేము ఎం.ఎల్.ఎ, ఎం.పి, కలెక్టర్ అందరినీ కలిశాం. కాని ఏం ప్రయోజనం లేదు. వానొస్తే మా పరిస్థితి అధ్వానం. బస్సు మలుపు తిరగలేదు. పిల్లలు నడవడం కూడా వీలు కావడం లేదు. రోడ్లు వేయండి మోదీ గారూ' అని ఆమె వేడుకుంది. అంతే కాదు ' ఈ వీడియో మోదీ గారికి చేరేవరకు షేర్ చేయండి' అని కోరింది. దాంతో అందరూ షేర్ చేస్తున్నారు. ఈ వీడియో వచ్చాక సిధి జిల్లాలో పురోభివృద్ధి గురించి చర్చ నడుస్తోంది. అన్నట్టు ఇది నాటి మహా విదూషకుడు బీర్బల్ జన్మస్థలం. ఆయన మళ్లీ పుడితే ఇలాంటి ప్రభుత్వ పనితీరు చూసి ఎన్ని పరిహాసాలు ఆడేవాడో. మరెన్ని వ్యంగ్యాలు పోయేవాడో. వాతలు వేసేవాడో.

చీర కాల కోరిక నెరవేరింది ఇలా...

చీరకట్టుకోవాలనేది ఆ బామ్మ కల. బామ్మది ఇండియా అయితే ఆమె కల గురించి ఆశ్చర్యపోవాల్సిందే. 'అదేం భాగ్యం!' అనుకోవాల్సిందే. అయితే బామ్మగారిది ఇండియా కాదు ఇటలీ. ఇటాలియన్ డీజె, ఇన్‌ఫ్లుయెన్సర్ వోలీ ఎస్సే బామ్మ ఇరవై సంవత్సరాల క్రితం తన కుటుంబంతో మన దేశానికి వచ్చింది. ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలు ఆమెకు బాగా నచ్చాయి. ముఖ్యంగా చీర ఆమెకు బాగా నచ్చింది. అప్పటినుంచి చీర ధరించాలనే కోరిక మనసులో ఉండిపోయింది. 'ఈరోజు నీ కలను నిజం చేస్తాను' అని బామ్మను చీరతో సర్‌ప్రైజ్ చేసింది మనవరాలు వోలీ. చీర ధరించి తన చిరకాల కోరిక నెరవేర్చుకున్న బామ్మ కళ్లలోని వెలుగు చీరకు కొత్త అందం తెచ్చింది.



భ్రుకు టీ ముడిపడే సీన్!

శివుని జటాఝూటంలోని గంగ గురించి మనకు తెలుసు. అయితే ఇరానీ మోడల్ శిరోజాలలోని 'టీపాట్' వీడియో ఇప్పుడు వైరల్ అయింది. హెయిర్ స్టైల్లో ఎన్నో రకాలు ఉన్నాయి. అయితే 'టీ పాట్ హెయిర్‌స్టైల్' గురించి మాత్రం ఎప్పుడూ విని ఉండం. ఇరాన్‌కు చెందిన హెయిర్ స్టైలిస్ట్ సైదెహ్ 'టీపాట్ హెయిర్‌స్టైల్' వీడియోను చూసి నెటిజనులు 'ఆహో వోహో' అంటున్నారు. ఈ వీడియో నాలుగు మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది. హెయిర్ పీస్‌తో మోడల్ సబుర్ నగర్‌కు పోనీ టెయిల్ వేసింది. ఆ తరువాత మెటల్ వైర్లు, గ్లూగన్‌తో టీపాట్ స్ట్రక్చర్స్‌ను సెట్ చేసింది. ఈ శిరో టీపాట్‌లో టీ పోసి ఆ తరువాత కప్పులోకి ఒంపి తాగింది. 'ఫ్యాషన్ స్టైల్ అనేది ఎన్నో వెరైటీలకు కేంద్రం. హెయిర్ స్టైల్‌కు సంబంధించి సహజంగా ఉండేలా ఏదైనా చేయాలనుకున్నాను. రెండు రోజుల కృషి ఫలితమే ఈ విజయం. ఇంత స్పందన వస్తుందని ఊహించలేదు' అని తన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో చెప్పింది సైదెహ్.



టాటూస్‌తో క్యాన్సర్ రిస్క్!

పరిపరిశోధన



పచ్చబొట్లతో(టాటూస్) క్యాన్సర్ రిస్క్ పెరుగుతుందంటున్నారు పరిశోధకులు. ఇవి లింఫోమా అనే క్యాన్సర్‌ను కలగజేస్తాయని హెచ్చరిస్తున్నారు.

ఇటీవల స్వీడన్‌కు చెందిన కొందరు పరిశోధకుల సర్వేలో టాటూ వేయించుకోని వారితో పోలిస్తే పచ్చబొట్లు పొడిపించుకున్న వారిలోనే ఎక్కువగా లింఫోమా క్యాన్సర్ వచ్చినట్లుగా తేలింది. అంతే కాదు... టాటూ సైజ్ చిన్నదీ, పెద్దదీ అనే తేడా లేకుండా ఈ క్యాన్సర్ వృద్ధి చెందినట్లు పరిశోధకులు పేర్కొంటున్నారు.

''సైజూ, డిజైనుతో నిమిత్తం లేకుండా పచ్చబొట్టు దేహంలో తొలుత 'లో-గ్రేడ్ ఇన్‌ఫ్లమేషన్'కు కారణమవుతోంది. ఆ తర్వాత అది క్యాన్సర్‌ను ప్రేరేపిస్తుంది. పచ్చబొట్టు కోసం ఉపయోగించే సిరా చర్మంలోకి ఇంజెక్ట్ కాగానే దేహం దాన్ని ఫారెన్ బాడీగా గుర్తించి వ్యాధి నిరోధక వ్యవస్థను ప్రేరేపిస్తుంది. దీన్ని తొలగించే క్రమంలో ఆ సిరాలోని చాలా భాగం లింఫ్‌నోడ్స్‌కు చేరి అక్కడ డిపాజిట్ అవుతుంది. అదే క్యాన్సర్‌ను ప్రేరేపిస్తోంది'' అన్నది పరిశోధకుల మాట. పైగా చాలా చిన్నవయసులోనే టాటూ వేయించుకున్నవారు చాలాకాలం పాటు ఈ టాటూ సిరాకు ఎక్స్‌పోజ్ అయ్యే అవకాశం ఉందని, అది క్యాన్సర్‌కు దారితీయ వచ్చని వారు హెచ్చరిస్తున్నారు.

హెల్త్

కుక్క కాటా?



ఇటీవల వీధి కుక్కలు కాటు వేస్తున్న కేసులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. కొన్నిసార్లు పెంపుడు కుక్కలు కూడా కరుస్తుంటాయి. ప్రధానంగా చిన్నారులు అందులోనూ... 5 నుంచి 9 ఏళ్ల పిల్లలు ఎక్కువగా కుక్కకాటుతో గాయపడతారు. ఇక మహిళల కంటే పురుషులే కుక్కకాటుకు ఎక్కువగా గురవుతుంటారు. కుక్కకాటుకు గురైనప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ప్రథమ చికిత్స, తదుపరి చికిత్సలను తెలుసుకుందాం.

కుక్కల కోర పళ్ల మినహాయించి, మిగతావి చివర్లలో కోసుగా గీసుకు పోయేట్లు కాకుండా గుండ్రగా అరగదీసినట్లు ఉంటాయి. తమ పిల్లల్ని ఒక చోటినుంచి మరో చోటికి తీసుకెళ్లే సమయంలో గుచ్చుకుపోకుండా ప్రకృతి చేసిన ఏర్పాటిది. అయితే ఈ అంశమే కుక్క గట్టిగా కొరికినప్పుడు కోసుకుపోయినట్లు కాకుండా ఛిద్రమైనట్లుగా తీవ్రమైన గాయమయ్యేలా చేస్తుంది. ఆ గాయం తీవ్రతతో కండ, ఎముక, నరాలు, టెండన్స్, రక్తనాళాలు... ఇలా ఏదైనా ప్రభావితం కావచ్చు.

కుక్క కాటుకు గురవగానే చేయాల్సినవి...

● మొదట గాయం తీవ్రతను పరిశీలించాలి. లోతుగా గాయమైందా లేక పైపైన గీరుకున్నట్లుగా ఉందేమో చూడాలి. పైపైన గీరుకుపోయినట్లుగా ఉంటే... గాయాన్ని మరికాసేపు పరిశీలించాలి. అంటే... కొద్దిసేపటి తర్వాత ఆ గీరుకుపోయిన చోట నొప్పి, వాపు, వేడి (వార్మ్‌త్)గా ఉన్నట్లుగా ఉందా లేక రక్తస్రావం అవుతోందా అన్న విషయాలు పరిశీలించాలి. గాయం తీవ్రత కొద్దిగా లేదా ఓ మోస్తరుగా ఉంటే ఈ కింది జాగ్రత్తలు తీసుకోవచ్చు...

కుక్క కాటుకు తొలి జాగ్రత్తలివి...

● కుక్క కాటుతో గాయమైనప్పుడు మగ్‌తో నీళ్లు పోస్తూ లేదా నల్లా / కుళాయి కింది గాయాన్ని ఉంచి నీళ్లు పడుతుండగా సబ్బు/ డెటాల్/ అయోడిన్‌తో వీలైనంత ఎక్కువసేపు శుభ్రంగా కడగాలి. ఒకవేళ సబ్బు దొరక్కపోతే గాయం ప్రాంతమంతా శుభ్రంగా కడుక్కుపోయేలా నీరు ధారగా పడేలా చేయాలి ● గాయానికి ఎలాంటి కట్టూ కట్టకుండా ఓపెన్‌గా ఉంచాలి ● కుక్క కాటు తర్వాత రేబీస్ వచ్చే అవకాశాలు ఎక్కువ కాబట్టి తక్షణం డాక్టర్‌ను సంప్రదించి యాంటీరేబీస్ వ్యాక్సిన్‌ను అవసరాన్ని బట్టి మూడు లేదా ఐదు మోతాదుల్లో ఇప్పించాలి. పెంపుడు కుక్క కరిచినా కూడా డాక్టర్‌ను సంప్రదించి వీలైనంత త్వరగా ఈ వ్యాక్సిన్‌ను తీసుకోవాలి.



డాక్టర్ వెంకట్ నాని
సీనియర్ ఫిజీషియన్

రేబీస్ అంటే ఏమిటి? అప్రమత్తత ఎందుకు అవసరమంటే...

రేబీస్ అనేది కుక్కతో పాటు కోతి, ఎలుకల వంటి ఇతర జంతువులు కరచినప్పుడు వాటి లాలాజలంలో ఉండే ఒక రకం వైరస్ కారణంగా వచ్చే వ్యాధి. ఇది బాధితుల నాడీ వ్యవస్థను దెబ్బతీసే ప్రాణాంతకమైన వ్యాధి. అదృష్టవశాత్తు దీనికి వ్యాక్సిన్ ఉంది. కాబట్టి కుక్కకాటుకు గురైన వ్యక్తులు ఈ వ్యాక్సిన్ తప్పక తీసుకోవాలి.

కుక్కను పరిశీలించడమూ అవసరమే...

కుక్క కాటుకు గురైనప్పుడు... అది ఇంటి పరిసరాల్లోనే ఉండే కుక్క అయితే అది పిచ్చిదో కాదో తెలుసుకునేందుకు 10 రోజుల పాటు దాన్ని గమనిస్తూ ఉండటం అవసరం. కుక్కలో ఉండే రేబీస్ రెండు రకాలుగా ఉంటుంది. మొదటిది తీవ్రమైన రేబీస్, రెండోది మూగ (డంబ్) రేబీస్.

తీవ్రమైన రేబీస్ ఉన్న కుక్కలు

కుక్కల్లో తీవ్రమైన రేబీస్ ఉన్నప్పుడు వాటి ప్రవర్తన చాలా క్రోధపూరితంగా ఉంటుంది. చిన్నపాటి అలికిడికే మీదికి వచ్చేయడం, గుర్రుమనడం (గ్రౌలింగ్), మొరగడం, ఆ తర్వాత నీటికి తీవ్రంగా భయపడుతూ చివరికి మృతి చెందడం.

డంబ్ రేబీస్ ఉంటే...

వీటి శరీరం, కండరాలూ చాలా బలహీనంగా ఉంటాయి. తూలుతున్నట్లుగా నడుస్తాయి. నోట్లోంచి లాలాజలం వస్తుంటుంది. తర్వాత మృతి చెందుతుంది.

రేబీస్ ఉన్న కుక్క కరిస్తే... కుక్కకాటుకు గురైన వాళ్లలోనూ ఇవే లక్షణాలు కనిపించడంతోపాటు నీళ్లంటే భయపడటం, తీవ్రమైన యాంగ్జైటీ, విమాన ప్రయాణాలతోపాటు గాలిలో ఎగురుతూ వెళ్లే క్రీడల పట్ల భయాందోళనలు వ్యక్తం చేయడం (ఏరోఫోబియా), గుటక వేయడం కష్టం కావడం, నిద్రలేమి వంటి లక్షణాలతో పాటు తీవ్రమైన కేసుల్లో కోమాలోకి వెళ్లడం, గుండె ఆగి మరణించడం వంటి పరిణామాలు కనిపిస్తాయి. కాబట్టి వీలైనంత త్వరగా చికిత్స తీసుకోవడం మేలు.


చికిత్స: ● కుక్కకాటుకు గురైన వారి గాయాన్ని పరిశీలించి ఎంత లోతుగా గాయమైంది, నరాలు, రక్తనాళాలు తెగాయా లేక గాయం కండరానికే పరిమితమైందా అన్న అంశాల్ని చూసి, గాయం తీవ్రతను బట్టి చికిత్సను నిర్ణయిస్తారు. నరాలు, రక్తనాళాలు తెగితే, శస్త్రచికిత్స ద్వారా సరిచేస్తారు ● గాయానికి ఇన్ఫెక్షన్ రాకుండా తొలుత టీటీ ఇంజెక్షన్, తర్వాత యాంటీబయాటిక్స్ ఇస్తారు ● గాయం తీవ్రతను బట్టి ఇమ్యునోగ్లోబులిన్ ఇంజెక్షన్స్‌ను గాయం అయిన చోట రెండు డోసులు ఇచ్చాక, మిగతాది చేతికి ఇంజెక్ట్ చేస్తారు ● గాయం అయిన వైపు ఉండే చేతికి ఇమ్యునోగ్లోబ్యులిన్ ఇంజెక్షన్... ఆ రెండోవైపు చేతికి యాంటీ రేబిస్ వ్యాక్సిన్‌ను ఇవ్వాలి. పెంపుడు కుక్కలకూ యాంటీ రేబిస్ ఇంజెక్షన్ అంతే అవసరమని గుర్తించాలి.

అపోహ | వాస్తవం

సైక్లింగ్ వ్యాయామంతో...

సైక్లింగ్‌తో మోకాళ్లపై మరింత ఒత్తిడి పడి మోకాళ్ల అరగడం, దాంతో నొప్పులు రావడం సహజమనే అభిప్రాయం కేవలం అపోహ మాత్రమే.

సాధారణ వ్యక్తులతో పోలిస్తే ఈ వ్యాయామం చేసేవారిలో మోకాళ్ల నొప్పులు 17 శాతం తక్కువ. అంతే కాదు... ఆర్థరైటిస్‌తో మోకాలికి వచ్చే బాధలు కూడా వీళ్లలో 21 శాతం తక్కువ. ● సైక్లింగ్ కాలి కండరాల్లో ప్రధానమైన క్వాడ్రిసెప్స్ (తొడ కండరాలు), గ్లూటీ (పిరుదు కండరాలు), హ్యామ్‌స్ట్రింగ్స్ (తుంటిభాగంలోని తొడ కండరాలు), కాఫ్ (పిక్కలు) మజిల్స్ బలాన్ని పెంచుతుంది. ఊపిరితిత్తుల సామర్థ్యమూ పెరుగుతుంది. అలాగే పూర్తి శరీర సామర్థ్యాన్నీ (ఓవరాల్ ఎండ్యూరెన్స్) పెంచుతుంది ●అందుకే మోకాళ్లపై బరువు పడటానికి వీల్లేని వారు ప్రత్యామ్నాయంగా సైక్లింగ్‌ను ఎంచుకోవచ్చు.



ఓ చికిత్స ప్రక్రియపై వ్యాఖ్య... వాస్తవం!

వివాదం



సమంత సామాజిక మధ్యమాల్లో పెట్టిన ఒక పోస్ట్ వివాదాలకు దారితీసింది. ''వైరల్ ఫీవర్స్ ఉన్నప్పుడు మందులు వాడకుండా హైడ్రోజన్ పెరాక్సైడ్ ని నెబ్యులైజర్ సహాయంతో తీసుకుంటే అద్భుతమైన ఫలితాలు వస్తాయి'' అని చెబుతూ ఒక డాక్టర్ తనకి చెప్పినట్టు సమంత తెలిపారు. అయితే కొందరు వైద్య ప్రముఖులు దీన్ని ఖండించడంతో ఇప్పుడు ఈ పోస్టు వివాదానికి కారణమైంది. హైడ్రోజన్ పెరాక్సైడ్‌ని నెబ్యులైజ్ చేయటంలో కొన్ని ప్రమాదాలు పొంచి ఉన్నాయని 'ఆస్తమా అండ్ ఎలర్జీ ఫౌండేషన్ ఆఫ్ అమెరికా' 2021 లోనే సూచించిందనీ, అమెరికాలోని సీఓపీడీ ఫౌండేషన్ కూడా అది సరికాదని పేర్కొంది. ఈ విషయం వివాదాస్పదం కావడంతో సమంత వివరణ ఇస్తూ... 'వైద్యచికిత్స తీసుకుంటున్న క్రమంలో తాను ఎన్నో కష్టనష్టాలను ఓర్చుకున్న తర్వాత కొన్ని ప్రత్యామ్నాయ వైద్య విధానాలను (ఆల్టర్నేటివ్ మెడిసిన్స్) అనుసరించాననీ, దాంతో తనకు ఉపశమనం కలిగిందని మాత్రమే తను చెప్పదలుచుకున్నానన్నారు. తను చెప్పిన దాంట్లో ఏదైనా తప్పు ఉంటే వైద్యవర్గాలు దాన్ని చర్చించాలి గాని, తనని దోషిగా చూపే ప్రయత్నం చేయటం తగద'ని ఆమె పేర్కొన్నారు. అయితే సినీ ప్రముఖులు పూర్తి అవగాహన లేకుండా కేవలం తమకి అక్కరకు వచ్చిన వైద్య విధానాల్ని పాటించాలని సూచించకూడదు, తాము పాటించిన దానిని నలుగురిలో వ్యక్తపరచటానికి ప్రముఖులకు పూర్తి స్వేచ్ఛ ఉంటుంది. అయితే, హేతుబద్ధత లేని వైద్యవిధానాన్ని పాటించమని పదిమందికీ చెప్పడంవల్ల ప్రాణాపాయాలతో పాటు సమాజానికి నష్టం చేకూరే ప్రమాదమున్నందున దీన్ని భావ ప్రకటన స్వేచ్ఛగా భావించలేమని వైద్యవర్గాల వాదన.

హేతుబద్ధమైన సమాచారమే ఇవ్వాలి

ఇప్పుడున్న పరిస్థితుల్లో నకిలీ సమాచారాన్ని గుర్తించేందుకు ప్రజల దగ్గర సరైన వనరులు అందుబాటులో లేవు. ఒక ఆరోగ్య పరమైన సమాచారాన్ని నకిలీదా కాదా అన్న విషయాన్ని ఆయా రంగాల నిపుణులను సంప్రదించి, తెలుసుకోవటానికి ప్రయత్నించాలి. నకిలీ ఆరోగ్య సమాచారాన్ని బట్టబయలు చేయడంలో ప్రభుత్వ పాత్ర ఎంతో ఉంటుంది. ఎవరిని నమ్మాలో కచ్చితంగా తెలియనప్పుడు ప్రజలు ప్రభుత్వం వైపే చూస్తారు. కాబట్టి ఈ విషయంలో ప్రభుత్వాలు ఎంతో శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ఉన్న సమాచార యుగంలో హేతుబద్ధమైన సమాచారం ఎంతో బలమైనది. కొంతమంది వైద్యనిపుణులు కూడా కొన్నిసార్లు తప్పుడు సమాచారాల్ని ప్రజల ముందు ఉంచటం వల్ల ప్రభుత్వాల బాధ్యత మరింత కీలకం.



డాక్టర్
ఎం.ఎస్.ఎస్. ముఖర్జీ
సీనియర్ కార్డియాలజిస్ట్



వినేశ్ ఫొగాట్‌కు స్వర్ణం

భారత రెజ్లర్ వినేశ్ ఫొగాట్ పారిస్ ఒలింపిక్స్‌కు ముందు కీలక విజయాన్ని సొంతం చేసుకుంది. మాడ్రిడ్‌లో జరిగిన స్పెయిన్ గ్రాండ్‌ప్రిలో వినేశ్ స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. 50 కేజీల కేటగిరీ ఫైనల్లో వినేశ్ 10-5 స్కోరుతో మారియా తియుమెరికొవాపై విజయం సాధించింది. రష్యాకు చెందిన మారియా తటస్థ అథ్లెట్‌గా బరిలోకి దిగింది. ఫైనల్‌కు ముందు వినేశ్ సంపూర్ణ ఆధిపత్యంతో వరుసగా మూడు బౌట్‌లలో గెలుపొందింది. యుజ్‌నీలిస్ గజ్‌మన్ (క్యూబా)పై 12-4తో, ఆ తర్వాత మాడిసన్ పార్క్స్ (కెనడా)పై 'విన్ బై ఫాల్'తో, సెమీ ఫైనల్లో కేటీ డచక్ (కెనడా)పై 9-4తో వినేశ్ గెలిచింది.

రజావత్ సంచలనం

బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్-500 కెనడా ఓపెన్‌లో భారత షట్లర్ ప్రియాన్షు రజావత్ సంచలన విజయంతో సెమీ ఫైనల్లోకి ప్రవేశించాడు. పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ప్రపంచ 39వ ర్యాంకర్ ప్రియాన్షు 21-11, 17-21, 21-19 స్కోరుతో టాప్ సీడ్, వరల్డ్ నంబర్ 4 ఆండర్స్ ఆంటోనెసన్ (డెన్మార్క్)ను ఓడించాడు. మహిళల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో గాయత్రి గోపీచంద్ - ట్రిసా జాలీ (భారత్) జోడి 18-21, 21-19, 16-21తో పీ షన్ సీ - ఎన్ జు హంగ్ (చైనీస్ తైపీ) చేతిలో ఓడి నిష్క్రమించింది.

కుర్రాళ్లు నిలవలేకపోయారు...

- తొలి టి20లో ఓడిన భారత జట్టు
- 13 పరుగులతో జింబాబ్వే విజయం
- నేడు రెండో టి20 మ్యాచ్




ఐపీఎల్ అనుభవంతో జింబాబ్వే గడ్డపై అడుగు పెట్టిన భారత యువ బృందం అంతర్జాతీయ వేదికపై ఆ మెరుపులు చూపించలేకపోయింది. తమతో పోలిస్తే టి20 క్రికెట్‌లో తక్కువ అనుభవం ఉన్న బలహీన ప్రత్యర్థిని నిలువరించడంలో విఫలమైంది. తమ ప్రధాన ఆటగాళ్లతో బరిలోకి దిగిన జింబాబ్వే ఎనిమిదేళ్ల తర్వాత టీమిండియాపై విజయాన్ని నమోదు చేసింది. తక్కువ స్కోర్ల మ్యాచ్‌లో స్ఫూర్తిదాయక ఆటతో సొంత అభిమానుల్లో ఆనందం పంచింది. వరల్డ్ కప్ ఫైనల్ గెలిచిన టీమ్‌లోని ఒక్క ఆటగాడు కూడా ఈ మ్యాచ్‌లో ఆడకపోయినా... అధికారిక రికార్డుల ప్రకారం వరల్డ్ చాంపియన్ అయిన తర్వాత భారత్‌కు ఇది ఓటమి!

హరారే: సొంత గడ్డపై ఐదు టి20 మ్యాచ్‌ల సిరీస్‌లో జింబాబ్వే శుభారంభం చేసింది. శనివారం జరిగిన పోరులో జింబాబ్వే 13 పరుగుల తేడాతో భారత్‌పై విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వే 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 115 పరుగులు చేసింది. క్లైవ్ మదాండె (25 బంతుల్లో 29 నాటౌట్; 4 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా...మైర్స్ (23), బెన్నెట్ (22), మదివెరె (21) స్కోరులో తలా ఓ చేయి వేశారు. రవి బిష్ణోయ్ (4/13) అంతర్జాతీయ టి20ల్లో తన అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శన నమోదు చేయగా, సుందర్‌కు 2 వికెట్లు దక్కాయి. అనంతరం భారత్ 19.5 ఓవర్లలో 102 పరుగులకు ఆలౌటైంది. శుబ్‌మన్ గిల్ (29 బంతుల్లో 31; 5 ఫోర్లు), వాషింగ్టన్ సుందర్ (24 బంతుల్లో 27; 1 ఫోర్, 1 సిక్స్) మినహా అంతా విఫలమయ్యారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సికందర్ రజా (3/25), చటారా చెరో 3 వికెట్లతో భారత్‌ను దెబ్బ తీశారు. రెండో టి20 నేడు ఇక్కడే జరుగుతుంది. ఈ మ్యాచ్‌తో అభిషేక్ శర్మ, రియాన్ పరాగ్, ధ్రువ్ జురేల్ భారత్ తరఫున అంతర్జాతీయ టి20ల్లో అరంగేట్రం చేశారు.

రవి బిష్ణోయ్‌కు 4 వికెట్లు...

రెండో ఓవర్లోనే కయా (0) అవుటైనా...ఖలీల్ ఓవర్లో 4 ఫోర్లతో జింబాబ్వే బ్యాటర్లు 17 పరుగులు రాబట్టారు. అయితే ఆ తర్వాత ఈ జోరుకు బ్రేక్ పడింది. బిష్ణోయ్ తన తొలి రెండు ఓవర్లలో 2 వికెట్లతో జింబాబ్వేను దెబ్బ తీశాడు. 10 ఓవర్లలో స్కోరు 69/3కి చేరింది. ఆ తర్వాత ఒకే స్కోరు వద్ద రెండు వికెట్లు కోల్పోయిన జట్టు 74/5 వద్ద నిలిచింది. కొద్ది సేపటికే సుందర్ కూడా ఒకే ఓవర్లో 2 వికెట్లు తీసి ప్రత్యర్థిని పూర్తిగా నిలువరించాడు. ఇన్నింగ్స్ 16వ ఓవర్ వేసిన బిష్ణోయ్ కూడా మరో 2 వికెట్లు పడగొట్టడంతో జింబాబ్వే 100 లోపే ఆలౌట్ అయ్యేలా అనిపించింది. అయితే చటారా, మదాండె కలిసి తర్వాతి 27 బంతులను జాగ్రత్తగా ఆడి అభేద్యంగా 25 పరుగులు జోడించారు. 90/9 నుంచి స్కోరు 115 వరకు చేరింది. మ్యాచ్ తుది ఫలితంతో ఈ చివరి పరుగులే కీలకంగా మారాయి.



బిష్ణోయ్

టపటపా...

తొలి అంతర్జాతీయ మ్యాచ్‌లో అభిషేక్ శర్మ (0) నాలుగు బంతులు ఆడితే, రియాన్ పరాగ్ (2) ఆట మూడు బంతుల్లో ముగిసింది. రుతురాజ్ (7) విఫలం కాగా, రింకూ సింగ్ (0) పేలవంగా నిష్క్రమించాడు. దాంతో స్కోరు 22/4. మరో అరంగేట్ర ఆటగాడు ధ్రువ్ జురేల్ (6) విఫలం కావడంతో 9.5 ఓవర్లలో సగం టీమ్ పెవిలియన్‌కు! ఇదీ భారత జట్టు పరిస్థితి. మరో వైపు జాగ్రత్తగా ఆడిన కెప్టెన్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దేందుకు ప్రయత్నించాడు. అయితే రజా బౌలింగ్‌లో అతను వెనుదిరగడంతో 47/6 వద్ద భారత్ ఆశలు ఆవిరయ్యాయి. చివర్లో సుందర్ పోరాడినా లాభం లేకపోయింది. ఆఖరి ఓవర్లో 16 పరుగులు అవసరం కాగా 5 బంతుల్లో 2 పరుగులే చేసిన జట్టు చివరి వికెట్ కోల్పోయింది.

స్కోరు వివరాలు:

జింబాబ్వే ఇన్నింగ్స్: మదివెరె (బి) బిష్ణోయ్ 21; కయా (బి) ముకేశ్ 0; బెన్నెట్ (బి) బిష్ణోయ్ 22; రజా (సి) బిష్ణోయ్ (బి) అవేశ్ 17; మయర్స్ (సి) అండ్ (బి) సుందర్ 23; క్యాంప్‌బెల్ (రనౌట్) 0; మదాండె (నాటౌట్) 29; మసకద్జ (స్టంప్డ్) జురేల్ (బి) సుందర్ 0; జాంగ్వే (ఎల్బీ) (బి) బిష్ణోయ్ 1; ముజరబాని (బి) బిష్ణోయ్ 0; చటారా (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 115. వికెట్ల పతనం:** 1-6, 2-40, 3-51, 4-74, 5-74, 6-89, 7-89, 8-90, 9-90. **బౌలింగ్:** ఖలీల్ 3-0-28-0, ముకేశ్ 3-0-16-1, రవి బిష్ణోయ్ 4-2-13-4, అభిషేక్ 2-0-17-0, అవేశ్ 4-0-29-1, సుందర్ 4-0-11-2.

భారత్ ఇన్నింగ్స్: అభిషేక్ (సి) మసకద్జ (బి) బెన్నెట్ 0; గిల్ (బి) రజా 31; రుతురాజ్ (సి) కయా (బి) ముజరబాని 7; పరాగ్ (సి) (సబ్) మవుతా (బి) చటారా 2; రింకూ సింగ్ (సి) బెన్నెట్ (బి) చటారా 0; జురేల్ (సి) మదెవెరె (బి) జాంగ్వే 6; సుందర్ (సి) ముజరబాని (బి) చటారా 27; బిష్ణోయ్ (ఎల్బీ) (బి) రజా 9; అవేశ్ (సి) రజా (బి) మసకద్జ 16; ముకేశ్ (బి) రజా 0; ఖలీల్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (19.5 ఓవర్లలో ఆలౌట్) 102. వికెట్ల పతనం:** 1-0, 2-15, 3-22, 4-22, 5-43, 6-47, 7-61, 8-84, 9-86, 10-102. **బౌలింగ్:** బెన్నెట్ 1-1-0-1, మసకద్జ 3-0-15-1, చటారా 3.5-1-16-3, ముజరబాని 4-0-17-1, జాంగ్వే 4-0-28-1, రజా 4-0-25-3.

ప్రిక్వార్టర్స్‌లో జ్వెరెవ్

- నంబర్‌వన్ స్వియాటెక్ అవుట్
- వింబుల్డన్ టోర్నీ



లండన్: గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ వింబుల్డన్‌లో జర్మనీ స్టార్ అలెగ్జాండర్ జ్వెరెవ్ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. మరో వైపు మహిళల సింగిల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్ ఇగా స్వియాటెక్‌పై అనామక ప్లేయర్ యులియ పుతిన్‌త్సెవా (కజకిస్తాన్) సంచలన విజయాన్ని నమోదు చేసింది. శనివారం కూడా వర్షం అంతరాయం కలిగించడంతో మ్యాచ్‌లన్నీ ఆలస్యమయ్యాయి. పురుషుల సింగిల్స్‌లో జరిగిన మూడో రౌండ్ పోరులో నాలుగో సీడ్ జ్వెరెవ్ 6-4, 6-4, 7-6 (17/15)తో కామెరాన్ నోరీ (బ్రిటన్)పై గెలుపొందాడు. తొలి రెండు సెట్లను అలవోకగానే గెలుచుకున్న జర్మనీ స్టార్‌కు మూడో సెట్లో నోరీ నుంచి అనూహ్య ప్రతిఘటన ఎదురైంది. దీంతో సెట్ ఫలితం తేల్చేందుకు టైబ్రేక్ అనివార్యమైంది. మిగతా మ్యాచ్‌ల్లో వుగో హంబెర్ట్ (ఫ్రాన్స్) 7-6 (11/9), 6-3, 6-7 (5/7), 7-6 (8/6)తో బ్రాండన్ నకషిమా (అమెరికా)ను, బెన్ షెల్టన్ (అమెరికా) 6-7 (4/7), 6-2, 6-4, 4-6, 6-2తో షపొవలోవ్ (కెనడా)ను ఓడించగా, ఈ సీజన్ ఆస్ట్రేలియా ఓపెన్ చాంపియన్, టాప్ సీడ్ యానిక్ సినెర్ (ఇటలీ) 6-1, 6-4, 6-2తో కెక్మనొవిచ్ (సెర్బియా)పై అలవోక విజయం సాధించాడు.

మహిళల సింగిల్స్‌లో జరిగిన మూడో రౌండ్లో ప్రపంచ నంబర్‌వన్, తాజా ఫ్రెంచ్ ఓపెన్ చాంపియన్ ఇగా స్వియాటెక్ (పొలాండ్) 6-3, 1-6, 2-6తో యులియ పుతిన్‌త్సెవా (కజకిస్తాన్) చేతిలో కంగుతింది. మిగతా మ్యాచ్‌ల్లో జెలీనా ఒస్టాపెంకో (లాత్వియా) 6-1, 6-3తో బెర్నార్డ పెర (అమెరికా)పై సునాయాస విజయం సాధించింది. గత వింబుల్డన్ సెమీఫైనలిస్ట్ స్వితోలినా (ఉక్రెయిన్) 6-1, 7-6 (7/4)తో పదో సీడ్ జాబెర్ (ట్యూనిషియా)పై గెలుపొందగా, బార్బర క్రెజిసికొవా (చెక్ రిపబ్లిక్) 6-0, 4-3తో జెస్సికా బౌజస్ మనెరో (స్పెయిన్)పై ఆధిక్యంలో ఉన్న దశలో మనెరో మ్యాచ్ నుంచి తప్పుకుంది. మనెరో ఈ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ వొంద్రుసొవాపై సంచలన విజయం సాధించింది. ఎమ్మా రాడుకాను (బ్రిటన్) 6-2, 6-3తో తొమ్మిదో సీడ్ మరియా సకారి (గ్రీస్)ని కంగుతినిపించింది. ఈ సీజన్‌లో ఆస్ట్రేలియా, ఫ్రెంచ్ ఓపెన్‌లలో సెమీఫైనలిస్టుగా నిలిచిన కోకో గాఫ్ (అమెరికా) 6-4, 6-0తో సోనే కర్టల్ (బ్రిటన్)పై గెలిచింది. పురుషుల డబుల్స్‌లో రెండో సీడ్ రోహన్ బోపన్న-ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ 3-6, 6-7 (4/7)తో ఫ్రాంట్‌జెన్-జెబెన్స్ (జర్మనీ) జంట చేతిలో ఓడిపోవడంతో వింబుల్డన్‌లో భారత్ పోరాటం ముగిసింది.



సచిన్‌కు స్టాండింగ్ ఒవేషన్

భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ వింబుల్డన్ రాయల్ బాక్స్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచాడు. 'సెంట్రల్ కోర్టులోకి మళ్లీ మిమ్మల్ని ఆహ్వానించడం గర్వంగా ఉంది. మనతో క్రికెట్ చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన సచిన్ టెండూల్కర్ ఉన్నాడు' అని నిర్వాహకులు ప్రకటించగా... ప్రేక్షకులంతా గౌరవభావం ప్రదర్శిస్తూ స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చారు.

సెమీఫైనల్లో ఫ్రాన్స్

- షూటౌట్‌లో పోర్చుగల్‌పై విజయం
- యూరో కప్ ఫుట్‌బాల్


ఫ్రాన్స్ జట్టు విజయానందం

హాంబర్గ్: యూరో కప్ ఫుట్‌బాల్ టోర్నీలో మాజీ చాంపియన్ ఫ్రాన్స్ సెమీ ఫైనల్లోకి అడుగు పెట్టింది. క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ఫ్రాన్స్ 'షూటౌట్' ద్వారా మరో మాజీ విజేత పోర్చుగల్‌ను ఓడించింది. నిర్ణీత సమయంతో పాటు అదనపు సమయం ముగిశాక కూడా ఇరు జట్లు 0-0తో సమంగా నిలవగా షూటౌట్ అనివార్యమైంది. ఇందులో ఫ్రాన్స్ 5-3తో పోర్చుగల్‌పై విజయం సాధించింది. ఆల్‌టైమ్ గ్రేట్‌లలో ఒకడైన క్రిస్టియానో రొనాల్డో తన జాతీయ జట్టు తరఫున ఆఖరి మ్యాచ్ ఆడేశాడు. ఆరో సారి యూరో కప్‌లో బరిలోకి దిగిన రొనాల్డో ముందే ఇది తనకు చివరి యూరో అని ప్రకటించాడు. 2026 వరల్డ్ కప్‌లో 41 ఏళ్లు ఉండే అతను వరల్డ్ కప్ ఆడే అవకాశాలు దాదాపుగా లేవు!

పేరుకు రెండు పెద్ద జట్లే అయినా ఈ క్వార్టర్స్ పోరు పెద్దగా ఉత్కంఠ, మలుపులు లేకుండా సాగింది. ఇరు జట్లూ కూడా డిఫెన్స్‌కే ప్రాధాన్యనివ్వడంతో ఆటలో వేగం కనిపించలేదు. అటు రొనాల్డో, ఇటు ఎంబాపె కూడా పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. పోర్చుగల్ ప్లేయర్లలో బ్రూనో ఫెర్నాండెజ్, వితిన్హ కొట్టిన షాట్‌లను ప్రత్యర్థి గోల్‌కీపర్ మైక్ మెగ్నన్ నిలువరించగా... ఫ్రాన్స్ ఆటగాళ్లు రాండల్, కామవింగాలకకు గోల్స్ అవకాశం వచ్చినా కీపర్ రూబెన్ దయాస్‌ను దాటి బంతి వెళ్లలేకపోయింది. అదనపు సమయంలో రొనాల్డో కొట్టిన ఒక కిక్ కూడా గోల్ బార్ మీదనుంచి వెళ్లిపోయింది. ఇక ఆ తర్వాత ఇరు జట్లు జాగ్రత్తగానే ఆడాయి. షూటౌట్‌లో తొలి నాలుగు ప్రయత్నాల్లో ఫ్రాన్స్ తరఫున డెంబెలె, ఫొఫానా, కొండే, బార్కొలా గోల్స్ కొట్టగా...పోర్చుగల్ తరఫున రొనాల్డో, బెర్నార్డో సిల్వ, న్యూనో మెండెస్ గోల్ సాధించగా జోవో ఫెలిక్స్ విఫలమయ్యాడు. దాంతో స్కోరు ఫ్రాన్స్ పక్షాన 4-3తో నిలిచింది. ఐదో షాట్‌ను కూడా ఫ్రాన్స్ ప్లేయర్ హెర్నాండెజ్ గోల్ సాధించి తమ జట్టును గెలిపించాడు. మరో క్వార్టర్ ఫైనల్లో స్పెయిన్ 2-1 తేడాతో ఆతిథ్య జర్మనీని ఓడించింది. శనివారం జరిగిన క్వార్టర్స్‌లో ఇంగ్లండ్ షూటౌట్‌లో 5-3తో స్విట్జర్లాండ్‌ను ఓడించి సెమీస్ చేరింది.


రొనాల్డో

సినిమా


● జాన్వీ కపూర్
● ఎన్టీఆర్

మోడ్రన్ మాస్టర్


● రాజమౌళి

ప్రముఖ దర్శకుడు రాజమౌళి బయోగ్రాఫికల్ డాక్యుమెంటరీ 'మోడ్రన్ మాస్టర్స్: రాజమౌళి' పేరిట నెట్‌ఫ్లిక్స్‌లో ఆగస్టు 2 నుంచి స్ట్రీమింగ్ కానుంది. 'ఎక్స్' వేదికగా నెట్‌ఫ్లిక్స్ ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. ''ఒక వ్యక్తి... ఎన్నో బ్లాక్‌బస్టర్ సినిమాలు. అంతులేని ఆశయం. ఈ దిగ్గజ దర్శకుడు ఇంత గుర్తింపు తెచ్చుకోవడానికి ఎంత కష్టపడ్డారు? అనే అంశాలతో ఈ 'మోడ్రన్ మాస్టర్స్' రూపొందింది'' అంటూ రాజమౌళి బయోగ్రాఫికల్ డాక్యుమెంటరీని ఉద్దేశించి నెట్‌ఫ్లిక్స్ 'ఎక్స్'లో పేర్కొంది. రాజమౌళి జీవిత విశేషాలు, 'బాహుబలి, ఆర్ఆర్ఆర్' చిత్రాల మేకింగ్ గురించిన ఆసక్తికర సన్నివేశాలు ఈ డాక్యుమెంటరీలో ఉంటాయని తెలుస్తోంది. అంతేకాదు... ప్రభాస్, ఎన్టీఆర్, రామ్‌చరణ్, రానా వంటి స్టార్స్ రాజమౌళి గురించి ఏం అభిప్రాయపడుతున్నారు? అనే సంగతులు కూడా ఈ 'మోడ్రన్ మాస్టర్స్: రాజమౌళి'లో ఉంటాయట. ఈ బయోగ్రాఫికల్ డాక్యుమెంటరీని అనుపమా చోప్రా సమర్పణలో అప్లాజ్ ఎంటర్‌టైన్మెంట్, ఫిల్మ్ కంపానియన్ నిర్మించగా రాఘవ్ ఖన్నా దర్శకత్వం వహించారని, తన్వీ అజింక్యా సహ దర్శకులుగా వ్యవహరించారని తెలుస్తోంది.

ఆట పూర్తయింది


● రామ్‌చరణ్

'గేమ్ చేంజర్' ఆటను పూర్తి చేశారు రామ్‌చరణ్. ఆయన హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'గేమ్ చేంజర్'. ఈ చిత్రంలో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కాగా ఈ సినిమాలో రామ్‌చరణ్ వంతు షూటింగ్ శనివారంతో ముగిసిందని సమాచారం. హైదరాబాద్‌లో జరిగిన 'గేమ్ చేంజర్' సినిమా కీలక సన్నివేశాల చిత్రీకరణలో రామ్‌చరణ్ పాల్గొన్నట్లుగా తెలిసింది. పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ మూవీగా రానున్న ఈ సినిమాలో రామ్‌చరణ్ తండ్రీకొడుకుగా రెండు పాత్రల్లో కనిపిస్తారని టాక్. అంజలి, శ్రీకాంత్, ఎస్‌జే సూర్య, నవీన్‌చంద్ర, జయరాం, సునీల్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు తమన్ స్వరకర్త. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ సినిమా విడుదల తేదీపై త్వరలోనే ఓ స్పష్టత రానుంది.

దేవర ఆటా పాటా

'దేవర' రొమాంటిక్ మోడ్ ఇంకా కొనసాగుతున్నట్లుగా తెలుస్తోంది. ఎన్టీఆర్, జాన్వీ కపూర్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'దేవర'. కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో దేవరగా ఎన్టీఆర్ కనిపిస్తారు. ఇటీవల జాన్వీ, ఎన్టీఆర్ పాల్గొనగా ఈ సినిమాకు చెందిన ఓ పాటను థాయ్‌లాండ్‌లో చిత్రీకరించారు మేకర్స్. తాజాగా ఎన్టీఆర్, జాన్వీ కాంబినేషన్‌లో మరో రొమాంటిక్ సాంగ్‌ను చిత్రీకరించడానికి యూనిట్ ప్లాన్ చేసిందని సమాచారం.

ఇందుకోసం హైదరాబాద్ శివార్లలో ఓ స్పెషల్ సెట్‌ను రెడీ చేస్తున్నారని, వచ్చే వారం ఈ సెట్‌లో ఈ పాట చిత్రీకరణ జరుగుతుందని టాక్. ఇప్పటికే యాక్షన్ పార్ట్, టాకీ ఎక్కువ శాతం పూర్తి కావడంతో కొరటాల శివ పాటల చిత్రీకరణపై ఫోకస్ పెట్టినట్లుగా తెలుస్తోంది. సైఫ్ అలీఖాన్, శ్రీకాంత్, ప్రకాశ్‌రాజ్, షైన్ టామ్ చాకో, నరైన్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకు అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. కల్యాణ్‌రామ్ సమర్పణలో కె. హరికృష్ణ, మిక్కిలినేని సుధాకర్ నిర్మిస్తున్న 'దేవర' రెండు భాగాలుగా విడుదల కానుంది. తొలి భాగాన్ని సెప్టెంబరు 27న విడుదల చేయనున్నారు.


● శ్రుతీహాసన్

సమ్మర్‌లో ఎఫ్1 రేసింగ్



● బ్రాడ్ పిట్

హాలీవుడ్ ప్రముఖ నటుడు బ్రాడ్ పిట్ తాజా చిత్రంగా 'ఎఫ్1' ఖరారైంది. 'ఓబ్లీ ది బ్రేవ్, టాప్‌గన్: మేవరిక్' వంటి హాలీవుడ్ చిత్రాలకు దర్శకత్వం వహించిన జోసెఫ్ కొసిన్స్కి ఈ స్పోర్ట్స్ డ్రామా సినిమాను తెరకెక్కించనున్నారు. 'ఎఫ్1'ని అధికారికంగా ప్రకటించి, ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. ఫార్ములా వన్ రేసింగ్ నేపథ్యంలో ఓ రేసర్ కథగా ఈ సినిమా రూపొందనుంది. ఫార్ములా వన్ రేసింగ్‌లో ఉండే సవాళ్లు, రేసర్ల వ్యక్తిగత, వృత్తిపరమైన జీవన విధానాలను ఈ సినిమాలో చూపించనున్నారట జోసెఫ్. జెర్రీ బ్రూక్‌హైమర్, బ్రాడ్ పిట్ ఈ సినిమాను నిర్మించనున్నారు. 'ఎఫ్1' చిత్రం వచ్చే ఏడాది సమ్మర్‌లో విడుదల కానుంది.

హను-మాన్ మాకు ఓ వరం

- నిర్మాత చైతన్య



''మా ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలో నిర్మించే సినిమాలకు కథే హీరో. 'డార్లింగ్' సినిమాకూ అంతే. ఈ చిత్రంలో ప్రియదర్శి, నభా నటేశ్ అద్భుతంగా నటించారు. ఈ సినిమా ప్రేక్షకులకు తప్పక కనెక్ట్ అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు నిర్మాత చైతన్య. ప్రియదర్శి, నభా నటేశ్ లీడ్ రోల్స్‌లో నటించిన రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ మూవీ 'డార్లింగ్'. అశ్విన్ రామ్ దర్శకత్వంలో కె. నిరంజన్ రెడ్డి, చైతన్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 19న విడుదలవుతోంది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో చైతన్య మాట్లాడుతూ– ''డార్లింగ్ కథను నిరంజన్‌రెడ్డి గారే ఓకే చేశారు. మాది ప్రేమ వివాహం. దర్శకుడు రామ్ అశ్విన్‌ది కూడా ప్రేమ వివాహం. సో.. ప్రేమ నేపథ్యంలో రామ్ చెప్పిన 'డార్లింగ్' సినిమా పాయింట్‌కు నిరంజన్ కనెక్ట్ అయ్యారు. సింపుల్‌గా ఉండే అబ్బాయి పాత్రలో ప్రియదర్శి, కొంచెం హైపర్ యాక్టివ్‌గా ఉంటూ స్వతంత్ర భావాలు కలిగిన అమ్మాయి పాత్రలో నభా కనిపిస్తారు. ఇక 'హను-మాన్' సినిమా మాకు ఓ వరంలా లభించింది. సంక్రాంతి సమయంలో విడుదల కావడం, అంత పెద్ద హిట్ కావడం అనేది ఆ హనుమంతుడి దయ వల్లే జరిగిందని భావిస్తున్నాం. 'హను-మాన్' సీక్వెల్ 'జై హనుమాన్' ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. నావరకైతే 'జై హనుమాన్'లో చిరంజీవి, రామ్‌చరణ్‌గార్లు అయితే బాగుంటుందని అనుకుంటున్నా. సాయితేజ్‌గారితో ఓ సినిమా ప్రకటించాం. ఇంకో పది సినిమాలు ప్రొడక్షన్‌లో ఉన్నాయి. వచ్చే మూడేళ్లలో మా బేనర్ నుంచి పది సినిమాలు రిలీజ్ అవుతాయి'' అని చెప్పుకొచ్చారు. ఇంకా మాట్లాడుతూ– ''రెండు మాస్టర్స్ డిగ్రీలు చేశాను. టెక్నికల్ సపోర్ట్ ఉంది. సో.. బిజినెస్‌ను నేను బాగా హ్యాండిల్ చేయగలుగుతున్నాను. ఇందుకు మా ఫ్యామిలీ సపోర్ట్ కూడా ఉంది'' అన్నారు.

హారర్ మూవీకి సై

గ్లామర్, డీ-గ్లామర్... ఏ పాత్రని అయినా సునాయాసంగా చేసేస్తారు శ్రుతీహాసన్. అయితే ఇప్పటివరకూ సినిమా మొత్తం పూర్తిగా తన చుట్టూ తిరిగేలా ఉన్న కథల్లో ఈ బ్యూటీ కనిపించలేదు. అంటే... పూర్తి స్థాయి ఫీమేల్ ఓరియంటెడ్ మూవీ శ్రుతీహాసన్ చేయలేదనే చెప్పాలి. ఇప్పుడు ఏకంగా కథానాయిక ప్రాధాన్యంగా సాగే రెండు చిత్రాల్లో ఆమె కనిపించే చాన్స్ ఉంది. ఒకటి 'చెన్నై స్టోరీ'. ఈ సినిమా గురించి ఇప్పటికే అధికారిక ప్రకటన వచ్చింది. అయితే ఈ సినిమా నుంచి శ్రుతి తప్పుకున్నారనే వార్త కూడా ఉంది. ఆ విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. ఇక మరో హీరోయిన్ ఓరియంటెడ్ మూవీ విషయానికొస్తే... శ్రుతీహాసన్ హీరోయిన్‌గా యూవీ క్రియేషన్స్ బేనర్ ఈ సినిమాని ప్లాన్ చేస్తోందట. హారర్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ చిత్రం సాగుతుందని, పూర్తి స్థాయి హీరోయిన్ ఓరియంటెడ్ మూవీ అని సమాచారం. ఈ చిత్రాన్ని కొత్త దర్శకుడు తెరకెక్కిస్తారనే ప్రచారం జరుగుతోంది. మరి... వార్తల్లో ఉన్న ప్రకారం యూవీలో సినిమాకి శ్రుతీహాసన్ సై అన్నారా? అనేది నిర్మాణ సంస్థ కానీ శ్రుతి కానీ చెబితేనే తెలుస్తుంది.

ప్రేమించానే పిల్లా


● రవితేజ మహాదాస్యం, అనన్య నాగళ్ల

వెన్నెల కిశోర్, అనన్య నాగళ్ల లీడ్ రోల్స్‌లో రైటర్ మోహన్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్'. సీయా గౌతమ్, స్నేహా గుప్తా, రవితేజ మహాదాస్యం తదితరులు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ క్రైమ్ కామెడీ థ్రిల్లర్‌ని లాస్య రెడ్డి సమర్పణలో వెన్నపూస రమణా రెడ్డి నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్, టైటిల్ సాంగ్ విడుదల అయ్యాయి. ఈ చిత్రంలో రవితేజ మహాదాస్యం, అనన్య మధ్య సాగే 'ప్రేమించానే పిల్లా...' పాటను శనివారం విడుదల చేశారు. చిత్ర సంగీత దర్శకుడు సునీల్ కశ్యప్ స్వరపరచిన ఈ మెలోడీ సాంగ్‌కు పూర్ణాచారి సాహిత్యం అందించగా రాహుల్ సిప్లిగంజ్ పాడారు.

మనిషి కాదు... శివుడి అంశ


● షెరాజ్

ఉమ్మడి కుటుంబంలో ఎదరయ్యే సవాళ్లు, పాత సంప్రదాయాలు వంటి అంశాల నేపథ్యంలో రూపొందిన సినిమా 'పౌరుషం: ది మ్యాన్ హుడ్'. సుమన్ తల్వార్, మేకా రామకృష్ణ, షెరాజ్, అశోక్ ఖుల్లార్, ఆమని, గీతా రెడ్డి, జ్యోతీ రెడ్డి లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. లాస్ ఏంజిల్స్‌లో ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేయగా, డాక్టర్ ఒలంపియా ఏ. జెలినీ, హాలీవుడ్ హీరోయిన్- సింగర్ ల్యూబా పామ్, అంబర్ మార్టినెజ్, సాగే, హాలీవుడ్ లక్స్ ఏంజెల్స్ స్టూడియోస్ కో- ప్రొడ్యూసర్ లెన్నీ విటుల్లి అతిథులుగా హాజరయ్యారు. 'ఫ్రెండ్‌షిప్ అయినా లవ్ అయినా నన్ను చూసిన వెంటనే కళ్లలో మెరుపులు రావాలి', 'వాడు మనిషి కాదు... శివుడి అంశ' అనే డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

రాష్ట్రంలో విధ్వంస పాలన

కూటమి సర్కార్‌పై వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడు పి.గౌతమ్‌రెడ్డి మండిపాటు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విధ్వంస పాలన సాగిస్తోందని వైఎస్సార్ టీయూసీ అధ్యక్షుడు పి.గౌతమ్‌రెడ్డి మండిపడ్డారు. తమ సహనాన్ని చేతగానితనంగా తీసుకోవద్దని చంద్రబాబును హెచ్చరించారు. స్వాతంత్ర్య సమర యోధుడు, కేంద్ర మాజీ మంత్రి, దేశ మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ.. సామాజిక అణిచివేత, కుల వివక్షకు వ్యతిరేకంగా బాబూజగ్జీవన్‌రామ్ అలుపెరుగని పోరాటం చేశారని కొనియాడారు. వేంపల్లిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త అజయ్‌కుమార్ రెడ్డిపై టీడీపీ నేతల దాడి దారుణమన్నారు. చంద్రబాబు, లోకేశ్ రెడ్‌బుక్ పేరుతో రాష్ట్రవ్యాప్తంగా భయానక వాతావరణం సృష్టించేందుకు ఈ తరహా దాడులు చేయిస్తున్నారని దుయ్యబట్టారు. టీడీపీకి ఓటు వేయలేదన్న కారణంతో ఆస్తులను ధ్వంసం చేసి.. దొంగ కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మందపాటి శేషగిరిరావు, జి.శ్రీనివాసరావు, ఎ.నారాయణమూర్తి, కొమ్మూరి కనకారావు, పెదపాటి అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాలో ఎగువన పెరిగిన ప్రవాహం

సాక్షి, అమరావతి: కృష్ణా నదిలో ఎగువన వరద ప్రవాహం పెరిగింది. మహారాష్ట్ర, కర్ణాటకల్లో రెండ్రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో కృష్ణా ప్రధాన పాయతోపాటు ప్రధాన ఉపనది తుంగభద్రలోనూ వరద పెరిగింది. కృష్ణా ప్రధాన పాయపై కర్ణాటకలోని ఆల్మట్టి డ్యామ్‌లోకి శనివారం 62,073 క్యూసెక్కులు వస్తుండటంతో నీటి నిల్వ 54.31 టీఎంసీలకు చేరుకుంది. ఆల్మట్టి నిండాలంటే ఇంకా 75 టీఎంసీలు అవసరం. తుంగ జలాశయంలో నీటిమట్టం గరిష్ట స్థాయికి చేరుకోవడంతో గేట్లు ఎత్తేసి వరద జలాలను దిగువకు వదిలేస్తున్నారు. దాంతో తుంగభద్ర డ్యామ్‌లోకి 25,556 క్యూసెక్కులు చేరుతోంది.

నారాయణలో ఫ్యాకల్టీగా ఐఐటీయన్లు

సాక్షి, హైదరాబాద్: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు నారాయణ విద్యాసంస్థ నడుం బిగించింది. ఇందులో భాగంగా విద్యార్థులకు అర్థవంతంగా, విశ్లేషణాత్మకంగా బోధించే ఉపాధ్యాయులను, అధ్యాపకులను ప్రఖ్యాత విద్యాసంస్థలైన ఐఐటీ, ఎన్‌ఐటీలలో బీటెక్, ఎంటెక్, ఎమ్మెస్సీ పూర్తి చేసిన 180 మంది ప్రతిభావంతులను క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ద్వారా ఎంపిక చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపింది. 'నారాయణాస్ నవతరం' పేరు మీద ప్రత్యేకంగా రిక్రూట్‌మెంట్ ప్రక్రియ చేపట్టినట్లు పేర్కొంది. ఈ సందర్భంగా నారాయణ విద్యాసంస్థల సీఈఓ పునీత్ మాట్లాడుతూ నవతరం అభ్యర్థులను ప్రోత్సహించేందుకు నారాయణ విద్యాసంస్థ చొరవ తీసుకుందన్నారు.

ఈ నెలలో వరుస అల్పపీడనాలు!



వీటివల్ల రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు

సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం: జూలై నెలలోకి అడుగుపెట్టినా సరైన వర్షాలు కురవక ఇబ్బందులు పడుతున్న రాష్ట్ర ప్రజలకు వాతావరణ శాఖ చల్లటి కబురందించింది. ఈ నెలలో వరుసగా మూడు అల్పపీడనాలు ఏర్పడే సూచనలు కనిపిస్తున్నట్లు వాతావరణ శాఖ నిపుణులు తెలిపారు. వాతావరణం పూర్తిగా అనుకూలిస్తే ఈ అల్పపీడనాలు ఏర్పడి, రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వెల్లడించారు. శుక్రవారం తూర్పు మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం శనివారానికి పశ్చిమ మధ్య బంగాళాఖాతం, దక్షిణాంధ్ర తీరంలో సముద్ర మట్టానికి 5.8 నుంచి 7.6 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి ఉంది. ఇది మరింత బలపడి అల్పపీడనంగా ఏర్పడే సూచనలు కనిపిస్తున్నాయి. ఉపరితల ఆవర్తన ప్రభావంతో ఆది, సోమవారాల్లో రాష్ట్రవ్యాప్తంగా ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు, అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. అనేక చోట్ల ఉరుములతో కూడిన జల్లులు పడతాయని తెలిపింది. అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని, గంటకు 40 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. రాయలసీమ జిల్లాల్లోనూ పలుచోట్ల తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు, అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది.

మరోవైపు.. ఈ నెల 15న వాయువ్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడి, ఏపీ వైపుగా వస్తుందని అంచనా వేస్తున్నారు. దీంతోపాటు 23న తూర్పు బంగాళాఖాతంలో ఏర్పడే ఆవర్తనం అల్పపీడనంగా బలపడే సూచనలున్నాయని, ఇది క్రమంగా వాయుగుండంగా మారి ఆంధ్రప్రదేశ్ వైపు ప్రయాణించే అవకాశం ఉందని వాతావరణ శాఖ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇలా వరుసగా ఏర్పడే ఆవర్తనాలు, అల్పపీడనాలతో రాష్ట్రంలో ఈ నెలలో విస్తారంగా వర్షాలు కురిసే సూచనలున్నాయని చెబుతున్నారు. ఇవి లోటు వర్షపాతం నుంచి అధిక వర్షపాతాన్ని నమోదు చేస్తాయని భావిస్తున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ మొదలైనందున, ఈ వర్షాలు అన్నదాతలకు మేలు చేస్తాయని అధికారులు చెబుతున్నారు.

మహిళా సంఘమిత్రపై దాడి

కుప్పం మండలం గోనుగూరులో ఘటన

కుప్పం రూరల్ (చిత్తూరు జిల్లా): ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం మండల పరిధిలో అధికార పార్టీ ఆగడాలు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. తాజాగా కుప్పం మండలం గోనుగూరుకు చెందిన సంఘమిత్రను ఎలాంటి కారణం లేకుండా తొలగించడమే కాకుండా ఆమెపై దాడి చేసిన ఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కుప్పం మండలం గోనుగూరులో సంఘమిత్రగా ఉమ పనిచేస్తోంది. ఈ క్రమంలో గ్రామంలో పొదుపు సంఘం సమావేశం జరుగుతుండటంతో ఉమ అక్కడ ఖాతాలు రాసేందుకు వచ్చింది. అప్పటికే అక్కడ భాగ్యలత అనే మరో మహిళ ఖాతాలు రాస్తూ కనిపించింది. నువ్వెందుకు రాస్తున్నావని ఉమ.. ఆమెను ప్రశ్నించింది. దీంతో భాగ్యలత, ఆమె తల్లి పద్మ ఒక్కసారిగా ఉమపై దాడికి పాల్పడ్డారు. «నిన్ను ఎప్పుడో తొలగించామని.. నువ్వు ఎవరు మమ్మల్ని ప్రశ్నించడానికి» అంటూ నానా దుర్భాషలాడారు. గ్రూప్ మహిళలు కలుగజేసుకుని ఉమను వారి బారి నుంచి రక్షించారు. దీంతో ఆమె ఏడ్చుకుంటూ వెళ్లిపోయింది.

టీడీపీ నేతల ప్రోద్బలంతోనే..

కాగా భాగ్యలత 2019 వరకు సంఘమిత్రగా పనిచేశారు. ఆ సమయంలో గ్రూపుల్లో లావాదేవీలు తేడా రావడంతో ఆమెను అప్పటి అధికారులు విధుల నుంచి తొలగించారు. అప్పటి నుంచి ఉమను నియమించి 21 గ్రూపుల నిర్వహణ బాధ్యత ఆమెకు ఇచ్చారు. ఆమె మహిళలు రూ.7 లక్షల వరకు పొదుపు చేసేందుకు కృషి చేసి అందరి మన్ననలు పొందింది. జూన్ 4న ఎన్నికల ఫలితాలు వచ్చిన మరుసటి రోజే టీడీపీ నాయకులు అనధికారికంగా ఉమను తొలగించి భాగ్యలతను నియమించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే ఉమపై దాడి చేసినట్టు తెలుస్తోంది.

ప్రజలకు ఉపయోగపడే పనులు చేస్తే కేసు పెడతారా?

ఆర్‌అండ్‌బీ అధికారులపై కర్నూలు జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి అసహనం

దాతల సహకారం అందించడం కూడా నేరమేనా అని ప్రశ్న

కర్నూలు(అర్బన్): ప్రజలకు ఉపయోగపడే మంచి పనులు చేస్తే కేసు పెడతారా? కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్‌ఆర్) కింద దాతలు ఆర్థిక సహకారం అందించడం కూడా నేరమేనా?.. అంటూ ఆర్ అండ్ బీ అధికారులపై కర్నూలు జిల్లా పరిషత్ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి అసహనం వ్యక్తంచేశారు. కర్నూలు జిల్లా పరిషత్ మినీ సమావేశ భవనంలో శనివారం జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించారు. చైర్మన్ పాపిరెడ్డి మాట్లాడుతూ అవుకు నుంచి తాడిపత్రికి వెళ్లే రహదారి



ఎఫ్‌ఐఆర్ కాపీలను చూపుతున్న జెడ్పీ చైర్మన్

తుమ్మలపెంట–సాయిబాబా దేవాలయం మధ్య రెండు కిలో మీటర్ల మేర పూర్తిగా శిథిలమైందని తెలిపారు. ప్రజల విజ్ఞప్తి మేరకు ఈ రోడ్డును ఐదు నుంచి ఏడు మీటర్లకు విస్తరించి అభివృద్ధి చేసేందుకు అల్ట్రాటెక్ సిమెంట్ పరిశ్రమ యాజమాన్యం సీఎస్‌ఆర్ కింద రూ.75 లక్షలను కేటాయించిందని చెప్పారు. ఈ పనులను చేపట్టే బాధ్యతను ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించిందన్నారు. ఇటీవల రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించడంతో పలువురిపై ఆర్‌అండ్‌బీ ఇంజనీర్లు కేసు పెట్టారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. తమ అనుమతి లేకుండా రోడ్డును తవ్వినందున కాంట్రాక్టర్‌కు నోటీసు ఇవ్వాలని, లేదంటే జరిమానా విధించాలని, అదీకాకపోతే యథాతథంగా రోడ్డును వదిలేయాలని ఆదేశించాలని, కేసు పెట్టడం ఏమిటని ఆర్‌అండ్‌బీ నంద్యాల ఎస్ఈ బి.శ్రీధర్‌రెడ్డిపై అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయంలో పూర్తిగా విచారించి త్వరలో జరగనున్న జెడ్పీ సర్వసభ్య సమావేశం నాటికి కేసును ఉపసంహరించుకోవాలని సూచించారు.

'సాక్షి' విలేకరిపై జనసేన ఎమ్మెల్యే దాడి

- గదిలో నిర్బంధించి.. చంపేస్తానని బెదిరించిన ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్
- అక్రమ మట్టి తవ్వకాలపై వార్త రాసినందుకు తీవ్ర హెచ్చరికలు

రాంబిల్లి (అనకాపల్లి జిల్లా): అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండల సాక్షి విలేకరి, యలమంచిలి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు బుదిరెడ్డి అప్పారావుపై జనసేన ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ దాడికి పాల్పడ్డారు. శనివారం దిమిలి గ్రామంలో తన నివాసంలో అప్పారావు తనపై దాడి ఘటనను మీడియాకు వివరించారు.



బుదిరెడ్డి అప్పారావు

'ఈ నెల 3వ తేదీ బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ నా మొబైల్‌కు ఫోన్ చేశారు. నేను లిఫ్ట్ చేయకపోవడంతో తర్వాత ఆయన పీఏ చంద్రారావుతో ఫోన్ చేయించారు. అయినప్పటికీ నేను ఫోన్ తీయలేదు. మళ్లీ 20 నిమిషాల తర్వాత ఎమ్మెల్యే ఫోన్ చేసి మీతో మాట్లాడాలని, అచ్యుతాపురంలోని ఎస్టీబీఎల్ లేఅవుట్‌లో ఉన్న తన స్వగృహానికి రావాలని చెప్పారు. దానికి నేను రానని చెప్పాను. అయితే వెంటనే పంపించేస్తానని.. రాంబిల్లి మండలం కొత్తూరు వరకు కారు పంపిస్తానని ఎమ్మెల్యే చెప్పారు. అయినప్పటికీ నేను రానంటే రావాలని ఒత్తిడి తెచ్చారు. తప్పనిసరి పరిస్థితిల్లో నా స్వగ్రామం దిమిలి నుంచి బైక్‌పై కొత్తూరుకు వెళ్లాను. అప్పటికే అక్కడ బ్లాక్ స్కార్పియోతో ఎమ్మెల్యే డ్రైవర్ జగదీష్ ఉన్నాడు. నన్ను కారు ఎక్కించుకుని ఎస్టీబీఎల్‌లో అచ్యుతాపురం సీఐ బుచ్చిరాజు ఇంటి ముందు దింపారు. అక్కడ 40 నిమిషాలు ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ కోసం ఎదురుచూశాను. అప్పటికి కూడా ఎమ్మెల్యే నుంచి ఎటువంటి సమాచారం లేకపోవడంతో నేను వెళ్లిపోతానని ఎమ్మెల్యే పీఏకు ఫోన్ చేసి చెప్పాను. దానికి పీఏ తన రూమ్ పక్కనే ఉందని, అక్కడకు రమ్మని చెప్పారు. నేను అక్కడికి వెళ్లగా గదిలో ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ ఉన్నారు. తాను లోపలకు వెళ్లగానే రూమ్ డోర్ మూసేశారు' అని అప్పారావు వివరించారు.

చంపేస్తానని హెచ్చరించారు..

'నన్ను గదిలో బంధించి 'యథేచ్ఛగా తరలిస్తున్న అక్రమ మట్టి తవ్వకాలు' పేరిట సాక్షిలో ఎందుకు వార్త రాశావు? అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. అలాగే ఎన్నికలకు ముందు సాక్షిలో ప్రచురించిన కథనాలపై నిలదీశారు. తనకు టికెట్ రాకుండా అడ్డుకోవడానికి ప్రయత్నించావంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. టికెట్ వచ్చాక ఎన్నికల్లో ఓడించడానికి కథనాలు రాశావంటూ మండిపడ్డారు. ఆ కథనాలు నేను రాయలేదని, విశాఖ ప్రధాన కార్యాలయం నుంచి సీనియర్లు రాశారని సమాధానమిచ్చినా ఆయన వినిపించుకోలేదు. వారం క్రితం 'యథేచ్ఛగా మట్టి దందా' పేరుతో ఎందుకు వార్త రాశావని బెదిరించారు. దానికి నేను సమాధానంగా అక్రమంగా మట్టి దందా చేస్తే ఖచ్చితంగా రాస్తానని.. ఇదే వార్త సాక్షితో పాటు ఈనాడులో కూడా వచ్చిందని చెప్పాను. దీంతో వెంటనే ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ నాపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ 'నిన్ను చంపేస్తాను' అని హెచ్చరించారు. నా తల్లిని తిట్టడంతోపాటు నీ సంగతి తేలుస్తానంటూ కోపంతో మెడ పట్టుకుని చంపేస్తా అని బెదిరించారు. ఆ క్షణంలో నాకు ప్రాణహాని ఉందని గ్రహించి అక్కడ నుంచి ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకుని బయటపడ్డాను. నాకు, నా కుటుంబానికి పోలీసులు రక్షణ కల్పించాలని విన్నవిస్తున్నా' అని అప్పారావు తెలిపారు.

దారి ఆక్రమించారని మహిళ నిరసన

తనను మునిసిపల్ కమిషనర్ దూషించారని ఆరోపణ

కుప్పం రూరల్: రోడ్డు సమస్య పరిష్కరించాలంటూ ఓ మహిళ ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేసిన ఘటన చిత్తూరు జిల్లా కుప్పం పట్టణంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కుప్పం కొత్తపేటకు చెందిన సోమశేఖర్ భార్య హిమబిందు తమ ఇంటికి వెళ్లే దారిని ఆక్రమించారని మునిసిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసింది. ఆ దారిలో కొంతమంది నిర్మాణాలు చేపడుతున్నారని, తమకు దారి సౌకర్యం కల్పించాలని కోరింది. ఈ నేపథ్యంలో మునిసిపల్ కమిషనర్ తనతో ఫోన్‌లో అసభ్యకరంగా మాట్లాడారని, రోడ్డు సమస్యను పరిష్కరించలేదని ఆమె నిరసనకు దిగింది. విషయం తెలుసుకున్న కుప్పం పోలీసులు మహిళను అక్కడి నుంచి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి రోడ్డు మూసివేసిన వ్యక్తులపై కేసు నమోదు చేశారు. మునిసిపల్ కమిషనర్‌పై శాఖాపరమైన చర్యలకు సిఫార్సు చేసినట్టు తెలిసింది. శనివారం సాయంత్రం కమిషనర్ మీడియాతో మాట్లాడుతూ.. ఈ విషయంలో తన తప్పు ఏమీలేదని, హిమబిందు తనకు కూతురు లాంటిదని వివరణ ఇచ్చారు.



ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న హిమబిందు

క్లుప్తంగా...

గ్రీన్ ఫీల్డ్ హైవే క్యాంప్ ఆఫీస్ కాల్చివేత

- వైఎస్సార్ జిల్లాలో టీడీపీ నేతల దుశ్చర్య
- కాంట్రాక్టు పనులు అప్పజెప్పనందుకే..
- రూ. 30 లక్షల మేర నష్టం


దగ్ధమవుతున్న గ్రీన్ ఫీల్డ్ హైవే క్యాంప్ ఆఫీస్

వేముల: వైఎస్సార్ జిల్లాలో టీడీపీ నేతలు మరో దుశ్చర్యకు పాల్పడ్డారు. వేముల మండలం నల్లచెరువుపల్లి గ్రామ సమీపంలోని గ్రీన్ ఫీల్డ్ హైవే క్యాంప్ ఆఫీసును శనివారం రాత్రి కాల్చివేశారు. టీడీపీ వారు తన ఆఫీసును కాల్చివేసినట్లు కాంట్రాక్టర్ శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. తాము ఇక్కడ 4 కిలోమీటర్ల గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు ఏప్రిల్‌లో చేపట్టామన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక పనులు ఆపివేయాలని, తమకు అప్పజెప్పాలని ఒత్తిడి తెచ్చారన్నారు. రెండు కిలోమీటర్ల పనులు ఇస్తామని చెప్పినప్పటికీ, నాలుగు కిలోమీటర్లూ తామే చేసుకుంటామని పట్టుబట్టారన్నారు. ఇందుకు తాను ఒప్పుకోకపోవడంతో ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని తెలిపారు. ఆదివారం నుంచి పనులు ప్రారంభించేందుకు సిద్ధమవుతుండగా క్యాంప్ ఆఫీసును కాల్చివేశారని తెలిపారు. సుమారు రూ.30 లక్షల మేర నష్టం వాటిల్లిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

శ్రీకాకుళం ఆర్జీయూకేటీ క్యాంపస్ డైరెక్టర్ రాజీనామా


ధనబాలాజీ

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఎస్ఎం పురం) క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధనబాలాజీ శనివారం రాజీనామా చేశారు. సంబంధిత లేఖను ఆయన చాన్స్‌లర్‌కు పంపారు. క్యాంపస్ డైరెక్టర్‌గా గతేడాది నవంబర్ 18న ఆయన బాధ్యతలు స్వీకరించారు. మూడేళ్ల పదవీకాలానికిగాను ఆయన డైరెక్టర్‌గా నియమితులయ్యారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి కార్యాలయం నుంచి హెచ్చరికలు రావటంతో స్వచ్ఛందంగా తప్పుకున్నారు. ఇప్పటికే ఇదే క్యాంపస్ నుంచి ఓఎస్‌డీగా పనిచేస్తున్న ప్రొఫెసర్ సుధాకర్‌బాబు గత నెల 22న స్వచ్ఛందంగా తప్పుకున్న సంగతి తెలిసిందే.

వైద్యుల సమస్యలు పరిష్కరించండి

గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న జీడీఏ ఏపీ సభ్యులు బాబ్జి శ్యామ్‌కుమార్ తదితరులు

లబ్బీపేట (విజయవాడతూర్పు): ప్రభుత్వ వైద్యుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు కోరారు. రాష్ట్ర సచివాలయంలోని మంత్రి చాంబర్‌లో శనివారం వైద్యుల సంఘం ప్రతినిధులు మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సత్యకుమార్ యాదవ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. అనంతరం తమ సమస్యలను వివరించారు. ప్రభుత్వ వైద్యులు ఎక్కువ మంది సభ్యులుగా ఉన్న తమ సంఘానికి గుర్తింపు ఇవ్వాలని కోరారు. బోధనావైద్యుల పీఆర్‌సీ ఎరియర్స్, డీహెచ్, వైద్య విధాన పరిషత్ వైద్యుల టైమ్‌బౌండ్ స్కేల్స్, పదోన్నతుల సమస్యను పరిష్కరించాలని కోరారు. ఉద్యోగుల సీనియారిటీకి ఆటంకంగా మారి, అడ్డగోలుగా పదోన్నతి పొందడానికి అవకాశం కల్పిస్తున్న జీవోను రద్దు చేయాలని, టీచింగ్ వైద్యుల పదవీ విరమణ వయసు పెంచాలని విజ్ఞప్తి చేశారు. డీహెచ్, డీఎంఈలలో ఉన్నట్లుగానే ఏపీవీవీపీలో కూడా హెచ్‌వోడీగా వైద్యులనే నియమించాలని వారు కోరారు. మంత్రిని కలిసిన వారిలో ఆ సంఘ ప్రతినిధులు డాక్టర్ ఐ.బాబ్జి శ్యామ్‌కుమార్, డాక్టర్ పి.రత్నబాబు, డాక్టర్ మోదిని వెంకట్రావు, డాక్టర్ లీలాప్రసాద్ తదితరులు ఉన్నారు.

ప్లాస్టిక్ ప్రాసెసింగ్‌లో ఉచిత శిక్షణ

సాక్షి, అమరావతి: సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (సీపెట్)లో ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు సంస్థ ఏర్పాట్లు చేసింది. జాతీయ ఎస్సీ, ఎస్టీ హబ్ (ఎస్ఎస్‌హెచ్) పథకంలో భాగంగా పాలిమర్ టెక్నాలజీలో 'మెషీన్ ఆపరేటర్-ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్'లో శిక్షణ ఇవ్వనున్నట్టు సంస్థ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శేఖర్ తెలిపారు. ఈ ప్రాజెక్టుకు ఎంఎస్ఎంఈ-నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ సహకారం అందిస్తోందన్నారు. పదో తరగతి కనీస విద్యార్హత ఉండి, 18 సంవత్సరాల వయసుగల ఎస్సీ, ఎస్టీ యువతకు ఐదు నెలలు శిక్షణ ఉంటుందని, అనంతరం వీరికి సర్టిఫికెట్‌తో పాటు అనంతపురం, హైదరాబాద్, బెంగళూరు, హోసూర్, చెన్నై వంటి పట్టణాల్లో ఉన్న ప్రముఖ ప్లాస్టిక్, అనుబంధ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. వివరాలకు 78935 86494 నంబర్‌లో సంప్రదించాలని శేఖర్ విజ్ఞప్తి చేశారు.

మంత్రిగారూ.. ఇవిగో పులిహోరలో పురుగులు

కర్నూలు సిల్వర్ జూబ్లీ కాలేజీ హాస్టళ్లలో పురుగుల బియ్యంతోనే అన్నం


ఆహారంలో వచ్చిన పురుగు

- కుళ్లిన వంకాయలు, టమాటాలతో కూరలు
- విద్యార్థులు స్వయంగా ధర్నాలో ప్రదర్శించారు
- వాస్తవాలు తెలుసుకోకుండా 'సాక్షి'పై మంత్రి నాదెండ్ల అక్కసు


ఈ పులిహోర తినేది ఎలా..

కర్నూలు(సెంట్రల్): 'అయ్యా మంత్రి మనోహర్ గారు... మీరు నాణ్యమైన బియ్యం సరఫరా చేస్తే పులిహోరలో పురుగులు ఎందుకు వస్తాయి?.. అన్నం ఎందుకు ముక్కిపోయి ముద్దగా ఉంటుంది. కుళ్లిపోయిన కూరగాయలతో కూరలు చేసే దుస్థితి ఎందుకు వస్తుంది...' అని కర్నూలు సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాల విద్యార్థులు మండిపడుతున్నారు. తమ కళాశాల మేనేజ్‌మెంట్ బాలుర, బాలికల హాస్టళ్లలో పురుగుల బియ్యంతో అన్నం వండుతున్నారని, కుళ్లిన కూరగాయలతో కూరలు చేస్తున్నారని, నాలుగైదు రోజులకొకసారి నీళ్లు వస్తుండడంతో స్నానాలు కూడా చేయకుండా కాలేజీకి వెళ్తున్నామని శుక్రవారం కర్నూలు కలెక్టరేట్ ఎదుట దాదాపు 700మంది సిల్వర్ జూబ్లీ కళాశాల విద్యార్థులు ధర్నా చేశారు. విద్యార్థుల ఆవేదనను వివరిస్తూ 'అన్నమో చంద్రబాబూ' అంటూ 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై శనివారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పందించారు. సిల్వర్ జూబ్లీ కళాశాలకు నాణ్యమైన బియ్యం సరఫరా చేశామని విజయవాడలో ఒక ప్రకటన విడుదల చేశారు. 'సాక్షి'లో అసత్యాలు ప్రచారం చేస్తున్నారని అక్కసు వెళ్లగక్కారు. అదేవిధంగా ఈ ఘటనపై విచారణ చేయాలని కర్నూలు ఆర్డీవో, పౌరసరఫరాల సంస్థ డీఎంను ఆదేశించారు. అతి ప్రధానమైన కిలో బియ్యం రూపాయికే ఇచ్చే ప్రతిపాదనపై మాత్రం మంత్రి స్పష్టత ఇవ్వలేదు. ఉన్నత విద్యాశాఖ నుంచి ప్రతిపాదనలు వచ్చాయని, త్వరలోనే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని పేర్కొన్నారు. దీంతో మంత్రి ప్రకటనపై విద్యార్థులు తీవ్రంగా మండిపడుతున్నారు. నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేస్తే శుక్రవారం ఉదయం వండిన పులిహోరలో పురుగులు ఎలా వచ్చాయని ప్రశ్నిస్తున్నారు. అన్నంలో పురుగులు వస్తున్నాయని, కుళ్లిన కూరగాయలతో వంట చేస్తున్నారనే విషయాన్ని తాము సాక్ష్యాధారాలతో కళ్లకు కట్టినట్లు ధర్నాలో వివరించినా మంత్రి వాస్తవాలు తెలుసుకోకుండా అన్నీ బాగానే ఉన్నట్లు ప్రకటన ఇవ్వడం మంచిది కాదని, వెంటనే తమ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని పలువురు విద్యార్థులు డిమాండ్ చేశారు.


కుళ్లిన వంకాయలు

బుగ్గన చొరవతో రూపాయికే కిలో బియ్యం ఇచ్చేలా ఉత్తర్వులు

సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాల హాస్టల్ విద్యార్థులు నెలకు ఒక్కొక్కరూ రూ.430 మెస్ చార్జీల కోసం చెల్లిస్తారు. దానిలో అత్యధిక భాగం బియ్యం కొనుగోలుకే సరిపోతుంది. ప్రస్తుతం కళాశాల మేనేజ్‌మెంట్ కిలో బియ్యం రూ.45 చొప్పున కొనుగోలు చేస్తోంది. ఈ క్రమంలో మెస్‌చార్జీల డబ్బులన్నీ బియ్యం కొనుగోలుకే సరిపోతుండడంతో గ్యాస్, నూనె, కూరగాయలు, ఇతర సరుకుల కొనుగోలుకు డబ్బులు సరిపోవడం లేదు. ఈ విషయాన్ని గత ప్రభుత్వంలో ఆర్థికశాఖ మంత్రిగా ఉన్న బుగ్గన రాజేంద్రనాథ్ ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వైఎస్ జగన్ స్పందించి సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలకు రూపాయికే కిలో బియ్యం ఇవ్వాలని ఆదేశిస్తూ 2024, మార్చి ఒకటో తేదీన మెమో నంబర్ 976211/సీఈ/ఏ1/2019 జారీ చేశారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం దానిని అమలు చేయకపోవడంతోనే విద్యార్థులు అల్లాడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

'పది'లో పాఠ్యాంశంగా పాడేరు మోదకొండమ్మ జాతర



సాక్షి, పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పాడేరు మోదకొండమ్మతల్లికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అరుదైన గౌరవం ఇచ్చింది. విద్యార్థులకు అమ్మవారి విశిష్టతను తెలిపేలా పదో తరగతి తెలుగు వాచకంలో పాఠ్యాంశంగా చోటు కల్పించింది. తెలుగు పరిమళం పేరిట ముద్రించిన తెలుగు వాచకంలోని 14వ పేజీలో ఈ కథనం ఉంది. రాష్ట్రంలోని అన్ని సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా టెన్త్ తెలుగు వాచకం రూపొందించాలని అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాఠశాల విద్యాశాఖను ఆదేశించారు. ఈ మేరకు రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ, పాఠ్యపుస్తక అభివృద్ధి సంస్థ, సమగ్ర శిక్ష అధికార యంత్రాంగం, పలు విశ్వ విద్యాలయాల తెలుగు పండితులు 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి తెలుగు వాచకంలో ప్రాధాన్యం కల్పించారు. అమ్మవారి జాతర విశిష్టతను వివరించారు. దీనిపై మోదకొండమ్మ తల్లి ఆలయ కమిటీ చైర్మన్, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు, ఆలయ కమిటీ మాజీ చైర్‌పర్సన్, మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, డాక్టర్ తమర్బ నరసింగరావు, ఆలయ కమిటీ ప్రతినిధులు కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, కిముడు కోటిబాబునాయుడు, ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యం హర్షం వ్యక్తం చేశారు.

రక్తమోడిన రహదారులు

రాష్ట్రంలో శనివారం వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు మృత్యువాత పడగా మరో 22 మందికి గాయాలయ్యాయి.

- వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురు మృతి
- 22 మందికి గాయాలు



మృతి చెందిన నరసింహారెడ్డి, రామానుజమ్మ

పెద్దపంజాణి: చిత్తూరు జిల్లా బసవరాజు కండ్రిగ సమీపంలో యాత్రికులతో వెళ్తున్న బస్సు బోల్తా పడిన ఘటనలో ఇద్దరు దుర్మరణం పాలు కాగా, మరో 21 మంది గాయపడ్డారు. శనివారం వేకువజామున ఈ ఘటన చోటుచేసుకుంది. పెద్దపంజాణి పోలీసుల కథనం ప్రకారం.. సత్యసాయి జిల్లా రామగిరి మండలం పేరూరు పరిసర గ్రామాలకు చెందిన 45 మంది తమిళనాడు రాష్ట్రంలోని ఆధ్యాత్మిక క్షేత్రాలను దర్శించుకోవాలనుకున్నారు. అనంతపురానికి చెందిన ఖాన్ ట్రావెల్స్ బస్సు మాట్లాడుకుని, ఐదుగురు టూర్ నిర్వాహకులతో శుక్రవారం రాత్రి బయలుదేరారు.

అతివేగమే ప్రమాదానికి కారణం

బస్సు శనివారం వేకువజామున పెద్దపంజాణి మండల పరిధి పలమనేరు-పుంగనూరు మార్గంలో బసవరాజు కండ్రిగ సమీపానికి చేరుకుంది. బస్సును డ్రైవర్ అతివేగం, అజాగ్రత్తగా నడపడంతో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో సత్యసాయి జిల్లా రొద్దం మండలం చిన్నగువ్వలపల్లికి చెందిన తిమ్మారెడ్డి భార్య రామానుజమ్మ (58), కర్ణాటక రాష్ట్రంలోని తుముకూరు జిల్లా మురారాయనపల్లికి చెందిన నరసింహారెడ్డి (68) అక్కడికక్కడే మృతి చెందారు. బస్సులోని 21 మంది గాయపడ్డారు. సమాచారం అందుకున్న పెద్దపంజాణి పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని క్షతగాత్రులను పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలకు పోస్టుమార్టం జరిపించి బంధువులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

అన్నమయ్య జిల్లాలో ఘోరం



రామాపురం: కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారిపై అన్నమయ్య జిల్లా రామాపురం మండలం చిట్లూరు పంచాయతీ దళితవాడ సమీపంలో శనివారం తెల్లవారుఝామున ఘోర ప్రమాదం జరిగింది. ముందు వెళ్తున్న ట్యాంకర్‌ను కారు ఢీకొనడంతో నలుగురు మృతి చెందారు. ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుల్లో కడప నాగరాజుపేటకు చెందిన హోంగార్డు పూజారి ఆంజనేయులునాయక్ (28), కడప రాజారెడ్డివీధికి చెందిన కారు డ్రైవర్ పఠాన్ అఫ్రోజ్‌ఖాన్ (35), కడప నాగరాజుపేటకు చెందిన మారాబత్తుల జితేంద్ర కుమార్ (24), కడప ఐటీఐ సర్కిల్‌కు చెందిన షేక్ హలీమ్ (35) ఉన్నారు. కడప రవీంద్ర నగర్‌కు చెందిన షేక్ ఖాదర్‌బాషాకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. కడప పట్టణానికి చెందిన ఈ ఐదుగురూ శుక్రవారం అర్ధరాత్రి కారులో కడప నుంచి బయలుదేరి రాయచోటి వైపు కారులో వెళ్తుండగా, రామాపురం మండలం చిట్లూరు దళితవాడ సమీపంలోని వంతెన వద్ద ఆ కారు ముందు వెళ్తున్న ట్యాంకర్‌ను వెనుక వైపు ఢీకొట్టింది. ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో రాయచోటి ఆస్పత్రికి తరలిస్తుండగా జితేందర్‌కుమార్ మార్గంమధ్యలో మృతి చెందాడు. లక్కిరెడ్డిపల్లె సీఐ గంగనాథబాబు, రామాపురం ఎస్ఐ వి.లక్ష్మీప్రసాద్‌రెడ్డి సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాశ్రేయస్సుకు కొత్త చట్టాలు దోహదం

- భారత న్యాయ వ్యవస్థలో ఇది నూతనోధ్యాయం
- ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె. మన్మథరావు



ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ డాక్టర్ కె.మన్మథరావుకు, జస్టిస్ బి.శ్యాంసుందర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం: ప్రజా శ్రేయస్సు, సంక్షేమానికి నూతన చట్టాలు దోహదపడతాయని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ కె. మన్మథరావు అన్నారు. అనంతపురం బార్ అసోసియేషన్ హాలులో శనివారం నూతన క్రిమినల్ చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ డాక్టర్ కె. మన్మథరావు, జస్టిస్ బి.శ్యాంసుందర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జస్టిస్ మన్మథరావు మాట్లాడుతూ.. భారత న్యాయ వ్యవస్థలో నూతన అధ్యాయానికి తెరలేచిందన్నారు. భారత న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియమ్ (బీఎస్ఏ) చట్టాలు అమల్లోకి వచ్చాయన్నారు. జీరో ఎఫ్ఐఆర్, పోలీస్‌స్టేషన్‌కు వెళ్లకుండానే ఆన్‌లైన్‌లో ఫిర్యాదు, ఎస్సెమ్మెస్ లాంటి ఎలక్ట్రానిక్ మాధ్యమాలతో సమన్ల జారీ వంటి అత్యాధునిక పద్ధతులు కొత్త చట్టాల కారణంగా మనుగడలోకి వచ్చాయన్నారు.

ఇక విచారణలు వేగవంతం..

కొత్త చట్టాల ప్రకారం క్రిమినల్ కేసుల్లోనూ విచారణ త్వరితగతిన జరగడానికి వీలు కలుగుతుందని జస్టిస్ మన్మథరావు చెప్పారు. ఈ సందర్భంగా క్రిమినల్ మేజర్ యాక్ట్ పుస్తకాలను కేవలం రూ.300 నామమాత్రపు ధరతో జూనియర్ న్యాయవాదులకు జస్టిస్ మన్మథరావు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో విజయనగర లా కళాశాల అధ్యాపకురాలు జొన్నా సోని చట్టాల్లో వచ్చిన మార్పులను వివరించారు. ఈ తరగతులు ప్రతి శుక్ర, శనివారాల్లో ఉంటాయని, జూనియర్ న్యాయవాదులు సద్వినియోగం చేసుకోవాలని న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు టి. గురుప్రసాద్ తెలిపారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీనివాస్, విశ్రాంత జిల్లా న్యాయమూర్తి జి. గోపాలకృష్ణమూర్తి (హైదరాబాద్), బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు ఆలూరి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కోర్టు హాలులో న్యాయమూర్తులతో జస్టిస్ మన్మథ రావు సమీక్ష నిర్వహించారు. అంతకుముందు.. జస్టిస్ కె. మన్మథరావు, జస్టిస్ శ్యామ్‌సుందర్‌లను అనంతపురం జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

రాజ్యాంగ హక్కులపై మాట్లాడితే దేశద్రోహుల ముద్ర

- కేంద్ర సమాచార మాజీ కమిషనర్ ప్రొ.మాడభూషి శ్రీధర్
- ఆయన రచించిన 'భారత రాజ్యాంగ పీఠిక' పుస్తకావిష్కరణ



సీతంపేట (విశాఖ ఉత్తర): రాజ్యాంగ హక్కుల గురించి ఎవరు మాట్లాడినా.. వారిని దేశద్రోహులుగా ముద్ర వేయడం మన పాలకులకు ఆనవాయితీగా అయిపోయిందని కేంద్ర సమాచార మాజీ కమిషనర్ ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ అన్నారు. పౌర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో విశాఖలోని ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయమూర్తి అధ్యక్షతన శ్రీధర్ రాసిన 'భారత రాజ్యాంగ పీఠిక' పుస్తకాన్ని రైటర్స్ అకాడమీ వ్యవస్థాపకుడు వి.వి.రమణమూర్తి ఆవిష్కరించారు. నాగార్జున విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు వి.అంజిరెడ్డి పుస్తక సమీక్ష చేశారు. పుస్తక రచయిత శ్రీధర్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ పీఠిక అంటే ఏమిటో ప్రతి ఒక్కరూ చదివి మననం చేసుకోవాలన్నారు. చట్ట సభలకు ఎన్నికైన ప్రజా ప్రతినిధులు రాజ్యాంగం మీద ప్రమాణం చేసి రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారని, ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రజలందరికీ అర్థమయ్యే సరళమైన భాషలో పుస్తకం రాశాన ని చెప్పారు. పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

ఆ చట్టాలు మరింత బానిసత్వంలోకి నెట్టేసేలా ఉన్నాయి

హైకోర్టు మాజీ అదనపు అడ్వకేట్ జనరల్ సత్యప్రసాద్


మాట్లాడుతున్న సత్యప్రసాద్

ఒంగోలు: కేంద్రం అమల్లోకి తీసుకువచ్చిన 3 చట్టాలు బానిసత్వంలోకి మరింత నెట్టేసేలా ఉన్నాయని హైకోర్టు మాజీ అదనపు అడ్వకేట్ జనరల్, ఏపీ హైకోర్టు డిజిగ్నేటెడ్ సీనియర్ కౌన్సిల్ ఎ.సత్యప్రసాద్ పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలు రెడ్‌క్రాస్ భవన్‌లో జరిగిన ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) 5వ మహాసభలకు ఆయన హాజరయ్యారు. స్వాతంత్య్రం వచ్చిన తొలినాళ్లలో చట్టసభలకు స్వాతంత్రోద్యమ నాయకులు వెళ్లారని, అందువల్ల ఏదైనా చట్టం చేయాల్సి వస్తే దానిపై విశ్లేషణాత్మక చర్చలు జరిగేవన్నారు. కానీ నేడు ఇండియన్ పీనల్ కోడ్, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్‌లపై పార్లమెంట్‌లో కనీస చర్చలు కూడా లేకుండా అమల్లోకి రావడం బాధాకరమన్నారు. సింగపూర్, ఆస్ట్రేలియా, మలేషియా వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా ఈ తరహా చట్టాలే నేటికీ అమలవుతున్నాయని చెప్పారు. చట్టాల పేర్లు ప్రజలకు అర్థం అయ్యే రీతిలో ఉండాలన్నారు. నూతన చట్టాల రాకతో న్యాయాధీశులపై తీవ్రమైన భారం పడుతుందని, దీనివల్ల అనేక సమస్యలు వస్తాయన్నారు. ఐలు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, ఏపీ బార్ కౌన్సిల్ మెంబర్ సుంకర రాజేంద్ర ప్రసాద్ నూతన మూడు చట్టాలు-అవగాహన అనే అంశంపై మాట్లాడారు. ఐలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లూరి మాధవరావు మాట్లాడుతూ ప్రాథమిక హక్కులకు భంగం కలిగినా ప్రశ్నించలేని పరిస్థితులు నెలకొంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఒంగోలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగిశెట్టి మోహన్‌దాస్, ఐలు జిల్లా అధ్యక్షులు షేక్ రహీం, కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.



కూరగాయల ధరల పెరుగుదలతో 10% పెరిగిన భోజనం ధరలు

శాకాహార భోజనం మరింత ప్రియం

- టమాటా, ఉల్లిపాయ, బంగాళదుంపలకు రెక్కలు
- బియ్యం, కందిపప్పు ధరల్లో కూడా పెరుగుదల
- ఇదే సమయంలో తగ్గిన మాంసాహార భోజన రేట్లు
- నిత్యావసర ధరలపై ఆసక్తికర క్రిసిల్ నివేదిక

సాక్షి, అమరావతి: కూరగాయల ధరలు, ఇతర నిత్యావసర వస్తువుల ధరలకు రెక్కలతో ఓ పక్క శాకాహార భోజన ధరలు పెరుగుతుంటే అదే సమయంలో బాయిలర్ చికెన్ ధరలు తగ్గడంవల్ల మాంసాహార భోజన ధరలు తగ్గాయి. దేశవ్యాప్తంగా సగటున చూసుకుంటే గతేడాది ఇదే సమయంతో పోలిస్తే శాకాహార భోజన ధరలు పది శాతం పెరిగితే మాంసాహార భోజన ధరలు నాలుగు శాతం తగ్గినట్లు క్రిసిల్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. క్రిసిల్ ప్రతినెలా విడుదల చేసే 'రోటీ రైస్ రేట్' పేరిట విడుదల చేసిన నివేదిక ప్రకారం..

ప్లేట్ రోటీ రూ.26.7 నుంచి రూ.29.4కు పెరుగుదల

గతేడాది జూన్‌లో సగటున రూ.26.7గా ఉన్న ప్లేట్ రోటీ ధర (రోటీ, కర్రీ, పెరుగుకప్పు) ఇప్పుడు రూ.29.4కు పెరిగింది. శాకాహార భోజన ధరలు పెరగడంలో కూరగాయలు కీలక భూమిక పోషించినట్లు క్రిసిల్ పేర్కొంది. ఎందుకంటే.. 2023తో పోలిస్తే టమోటా ధరలు 30 శాతం, ఉల్లిపాయలు 46 శాతం, బంగాళాదుంప 59 శాతం పెరగడం ప్రధాన కారణంగా పేర్కొంది. వేసవిలో అకాల వర్షాలకు తోడు రబీ సాగు తగ్గడంతో బంగాళదుంప, ఉల్లిపాయల ధరలు కూడా పెరగడానికి కారణంగా పేర్కొంది. అలాగే, టమోటా అత్యధికంగా పండే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో అసాధారణ స్థాయిలో ఉష్ణోగ్రతల నమోదవడంతో టమోటా దిగుబడులు పడిపోయాయి. ఇదే సమయంలో బియ్యం ధరలు 13 శాతం, కందిపప్పు ధర 22 శాతం పెరిగినట్లు క్రిసిల్ పేర్కొంది.

ప్లేట్ చికెన్ థాళీ ధర ఢమాల్..

మరోవైపు.. 2023లో రూ.60.5గా ఉన్న ప్లేట్ చికెన్ థాళీ ధర ఇప్పుడు రూ.58కు పడిపోయింది. చికెన్ థాళీ ధరలో 50 శాతం వాటా ఉండే బాయిలర్ చికెన్ ధర గతేడాదితో పోలిస్తే 14 శాతం తగ్గడం దీనికి కారణంగా క్రిసిల్ పేర్కొంది. ఒక సాధారణ కుటుంబంలో ఒక వెజ్ లేదా నాన్ వెజ్ థాళీ చేసుకోవడానికి సగటున అయ్యే వ్యయం ఆధారంగా క్రిసిల్ ఈ నివేదికను రూపొందించింది.

గుంతకల్లు డీఆర్ఎం అరెస్ట్

కోర్టులో హాజరు.. 14 రోజుల రిమాండ్


కోర్టులో న్యాయమూర్తి ఎదుట హాజరైన రైల్వే అధికారులు

కర్నూలు(లీగల్)/గుంతకల్: రైల్వే కాంట్రాక్టర్లకు సహాయపడుతూ అవినీతికి పాల్పడుతున్నారని గుంతకల్ రైల్వే డివిజనల్ మేనేజర్ వినీత్ సింగ్‌తో పాటు సీనియర్ ఫైనాన్స్ మేనేజర్ ప్రదీప్ బాబు, సీనియర్ డివిజనల్ ఇంజనీర్ యు.అక్కిరెడ్డి, కార్యాలయ ఇంజనీరింగ్ సెక్షన్ సూపరింటెండెంట్ ఎం.బాలాజీ, మరో ఇంజనీరింగ్ అధికారి లక్ష్మీపతి రాజుతో పాటు సీఎస్ఆర్ ప్రాజెక్టు కాంట్రాక్టర్లు ఎస్.రహంతుల్లా, రమేష్ కుమార్‌రెడ్డిలను సీబీఐ అధికారులు శుక్రవారం రాత్రి గుంతకల్లులో అరెస్టు చేశారు. అనంతరం శనివారం సాయంత్రం ఇన్‌చార్జి సీబీఐ కోర్టు, 6వ జిల్లా అదనపు జడ్జి పి.పాండురంగారెడ్డి ముందు హాజరుపరిచారు. అరెస్టయిన నిందితులను న్యాయమూర్తి 14 రోజుల పాటు రిమాండ్‌కు ఆదేశించారు. కొంతకాలంగా రైల్వే టెండర్ల విషయంలో డీఆర్ఎం తదితరులు కాంట్రాక్టర్లకు అనుకూలంగా వ్యవహరిస్తూ వారి నుంచి పెద్ద మొత్తంలో బహుమతులు అందుకున్నట్లు సీబీఐ అధికారులకు సమాచారం వచ్చింది. రెండు రోజులుగా ఈ అధికారులు, ఉద్యోగుల ఇళ్లల్లో సీబీఐ సోదాలు నిర్వహించింది. అలాగే పలువురు కాంట్రాక్టర్లను అదుపులోకి తీసుకొని ప్రశ్నించింది. కాంట్రాక్టర్లు ఇచ్చిన సమాచారం మేరకు డీఆర్ఎం వినీత్ సింగ్ ఇంట్లో సోదాలు జరిపిన సీబీఐ బృందానికి దాదాపు రూ.20 లక్షలు విలువ చేసే డైమండ్, బంగారు ఆభరణాలు బెడ్‌రూమ్, బాత్‌రూమ్‌ల్లో లభించాయి. కేసు దర్యాప్తులో భాగంగా మరికొంతమందిని అరెస్టు చేసినట్లు సీబీఐ అధికారులు తెలిపారు. నిందితులను కస్టడీకి ఇవ్వాలంటూ సీబీఐ కోరగా న్యాయమూర్తి తిరస్కరించారు. ప్రత్యేక పిటిషన్ దాఖలు చేస్తే విచారించి ఆదేశాలు జారీ చేస్తామన్నారు. దీంతో వారిని రిమాండ్ నిమిత్తం కర్నూలు జిల్లా జైలుకు తరలించారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

షెడ్లు కూల్చరాదని మాజీ మంత్రి ధర్నా



ధర్నాలో పాల్గొన్న శ్రీరాములు తదితరులు

సాక్షి,బళ్లారి: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఆవరణలోని డాక్యుమెంట్ రైటర్ల షెడ్లను కూల్చరాదని మాజీ మంత్రి శ్రీరాములు డిమాండ్ చేశారు. ఆయన శనివారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద డాక్యుమెంట్ రైటర్లు, సహాయకులు చేపట్టిన ధర్నాలో పాల్గొని వారికి సంఘీభావం తెలిపారు. డాక్యుమెంటు రైటర్లు అనుమతి లేకుండా నిర్మించుకున్న షెడ్లను తొలగించాలని అధికారులు నోటీసులు ఇచ్చారు. ప్రస్తుతం ఆ షెడ్ల స్థానంలో పార్కింగ్ వ్యవస్థ ఏర్పాటుతో అభివృద్ధి పనులు చేసేందుకు చర్యలు చేపట్టడంతో డాక్యుమెంటు రైటర్లు ఆందోళన బాట పట్టడంతో మాజీ మంత్రి వారికి అండగా నిలిచి భరోసా కల్పించారు. ఈసందర్భంగా సండూరు బీజేపీ ఇంచార్జి కే.ఎస్.దివాకర్, కార్పొరేటర్లు ఎన్.గోవిందరాజులు, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా ఏకగ్రీవం



బసనగౌడను అభినందించిన నేతలు

రాయచూరు రూరల్: విధాన పరిషత్‌కు జరిగిన ఉప ఎన్నిక నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నుంచి బసనగౌడ బాదర్లి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈసందర్భంగా రాయచూరు లోక్‌సభ సభ్యుడు కుమార నాయక్, మాన్వి శాసన సభ్యుడు హంపయ్య నాయక్, మాజీ శాసన సభ్యుడు రాజా రాయప్ప నాయక్ పుష్పగుచ్ఛాలతో అభినందించారు.

హాస్టల్ భోజనం వికటించి 30 మందికి అస్వస్థత



చికిత్స పొందుతున్న విద్యార్థులు

రాయచూరు రూరల్: హాస్టల్‌లో భోజనం వికటించి 30 మంది ఆస్పత్రి పాలైన ఘటన జిల్లాలోని మాన్వి పట్టణంలో శనివారం చోటు చేసుకుంది. సంగాపుర రోడ్డులోని రాజలబండ మొరార్జి దేశాయి(గురుకుల) పాఠశాలలో 199 మంది విద్యార్థులున్నారు. తాగునీటి ట్యాంకులో అధికంగా బ్లీచింగ్, క్లోరిన్ పౌడర్లు కలిపిన నీటితో వంట చేశారు. అనంతరం బాలబాలికలు భోజనం తిన్న తరువాత అస్వస్థతకు గురై వాంతులు, విరోచనాలు కావడంతో విద్యార్థులను ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సల కోసం చేర్పించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

హుబ్లీ: సెంట్రల్ అసెంబ్లీ నియోజకవర్గంలోని 59, 43, 44, 39, 49వ వార్డుల పరిధిలోని నవీన్ పార్క్, వసంతనగర్, ముదుగల్ లేఅవుట్, కుబేరపురం, మధుర చేతన కాలనీ, బాదామి నగర్, ఆంజనేయ లేఅవుట్, రాఘవేంద్ర కాలనీ, ఫారెస్ట్ కాలనీ, లక్ష్మీనారాయణ ప్రధాన రోడ్డు నుంచి టెండర్ షూర్ రోడ్డు వరకు ఎమ్మెల్యే మహేష్ టెంగినకాయి శనివారం పర్యటించి రోడ్ల స్థితిగతులను పరిశీలించారు. ప్రజా పనుల శాఖ, ఎల్‌అండ్‌టీ, కార్పొరేషన్ సంబంధిత శాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్యే ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. ప్రతి వార్డులో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్పొరేటర్లు ఉమా ముకుంద, బీరప్ప కండేకర, సీమా, సమాజ సేవకులు, తెలుగు బిడ్డ డాక్టర్ చిగురుపాటి డీఎస్‌వీ ప్రసాద్‌తో పాటు పార్టీ ప్రముఖులు పాల్గొన్నారు.

కమిషనర్ బదిలీకి డిమాండ్



మాట్లాడుతున్న మహావీర్

రాయచూరు రూరల్: నగరసభ కమిషనర్ గురుసిద్దయ్యను బదిలీ చేయాలని ఉస్మానియా కాయగూరల విక్రయదారుల సంఘం అధ్యక్షుడు మహావీర్ పేర్కొన్నారు. శనివారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడాది క్రితం అధికారం చేపట్టిన సిద్దయ్య నగరంలో స్వచ్ఛతను కాపాడడంలో విఫలమయ్యారన్నారు. మ్యుటేషన్, ఖాతా, ఇతర పనులు చేయడంలో నిర్లక్ష్యం వహించడాన్ని ఖండించారు. ఏడాది నుంచి నగరసభ అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు ఎన్నికలు నిర్వహించాలన్నారు. జిల్లా ఇంచార్జి మంత్రిగా రాయచూరు జిల్లా వారినే నియమించాలన్నారు. ఏపీఎంసీలో దుకాణాలు కేటాయించే విషయంలో ఏపీఎంసీ నియమాలను తుంగలో తొక్కి ఇష్టమొచ్చిన వారికి కేటాయించారన్నారు.

పాతికేళ్ల నాటి పథకం పూర్తయ్యేదెన్నడో?

- నత్తనడకన గిణిగేరా–మహబూబ్‌నగర్ రైలు మార్గ పనులు
- ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా నిర్మాణ వైనం



రాయచూరులోని జంక్షన్ రైల్వే స్టేషన్



నిర్మాణం పూర్తయిన ప్రతిపాదిత రైలు మార్గం

రాయచూరు రూరల్ : కర్ణాటకలోని కొప్పళ జిల్లా గిణిగెరా నుంచి తెలంగాణలోని మహబూబ్‌నగర్ వరకు రైలు మార్గ నిర్మాణ పనులు పాతికేళ్ల నుంచి నత్తనడకన సాగుతున్నాయి. రైలు మార్గ నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు తయారైంది. పట్టాల మీద రైలు పోతే చూద్దామన్న ఈ ప్రాంత ప్రజల ఆశలు ఇక్కడి లోక్‌సభ సభ్యుల నిర్లక్ష్యంతో ఎండమావిగానే ఉండి పోయింది. మొదట్లో మునిరాబాద్–మహబూబ్ నగర్ వరకు అనుకున్న రైలుమార్గ నిర్మాణం మూడొంతులు పూర్తయింది. 1998లో రూ.498.98 కోట్లతో భారీ ప్రాజెక్టును రూపొందించారు. ఆ స్థాయిలో నిధులు విడుదల చేయాల్సి ఉండగా కేంద్ర రైల్వే శాఖ పేరుకు మాత్రమే గతంలో బడ్జెట్‌లో రూ.4 కోట్లు మంజూరు చేసి చేతులు దులుపుకుంది. ఈ రైలు మార్గం నిర్మాణానికి 1060 హెక్టార్ల భూమి స్వాధీనం చేసుకున్నా రైతులకు పరిహారం అందించలేదు. 33 పెద్దవి, 234 చిన్న వంతెనలను నిర్మించాల్సి ఉంది. 40 ఏళ్ల నుంచి ఎంపీలు ఈ విషయంలో శ్రద్ధ కనబరచలేక పోయారు. దేవెగౌడ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు రాయచూరు ఎంపీ రాజా రంగప్ప నాయక్, కొప్పళ ఎంపీ బసవరాజ రాయరెడ్డిలతో 1998లో రూ.30 కోట్లతో ప్రారంభమైన పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. కొప్పళ జిల్లాలోని బూదగుంప, జబ్బలగుడ్డ, చిక్కబెణకల్, గంగావతి, కారటగి, సింధనూరు వరకు తాజాగా పనులు పూర్తయ్యాయి. అయితే సింధనూరు నుంచి మాన్వి మీదుగా రాయచూరు వరకు మరో 87 కి.మీ.మేర రైలు మార్గ నిర్మాణ పనులు పూర్తి కావాల్సి ఉంది.

> **“నిర్మాణ పనులు వేగం పుంజుకోవాలి**
>
> కొప్పళ జిల్లా గిణిగెరా నుంచి తెలంగాణలోని మహబూబ్ నగర్ వరకు ప్రతిపాదిత రైలు మార్గ నిర్మాణపు పనులు త్వరగా చేపట్టాలి. 1998లో ప్రారంభమై నత్తనడకన సాగుతున్న ఈ రైలు మార్గ నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలి.
>
> – బాబూరావ్, మాజీ రైల్వే బోర్డు సభ్యుడు”

జనస్పందనలో అర్జీల వెల్లువ



ప్రజల గోడును ఆలకిస్తున్న అధికారి దివాకర్, చిత్రంలో ఎమ్మెల్యే నేమిరాజ నాయక్

హొసపేటి: విజయనగర జిల్లా కొట్టూరు తాలూకాలో శనివారం జిల్లాధికారి ఎంఎస్ దివాకర్ పర్యటించి కొట్టూరులోని ఏపీఎంసీ ఆవరణలోని హాల్‌లో ఏర్పాటు చేసిన జనస్పందన కార్యక్రమంలో ప్రజల సమస్యలను ఆలకించారు. తాగునీటి సరఫరా, రోడ్ల మెరుగుదల, విద్యుత్ కనెక్షన్, వివిధ భవనాల మంజూరు సహా పలు సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై అధికారులు నివేదించారు. అధికారుల సమక్షంలో కలెక్టర్ ప్రజల ఫిర్యాదులపై చర్చించి కొన్ని ఫిర్యాదులను అక్కడికక్కడే పరిష్కరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయా శాఖలకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సమాచారం అందించారు. ఎమ్మెల్యే నేమిరాజ నాయక్, జెడ్పీ సీఈఓ నోంగ్‌జోయ్ మహమ్మద్ అలీ అక్రమ్ షా, జిల్లా ఏఎస్పీ ఖలీల్ పాషా, జిల్లా స్థాయి వివిధ శాఖల అధికారుల సమక్షంలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. సంయుక్త వ్యవసాయ సంచాలకులు శరణప్ప ముద్దగల్, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామచంద్రప్ప, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ శంకర్ నాయక్, ఆహార పౌర సరఫరాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ మల్లికార్జున, మహిళా శిశు అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్వేత, ఇతర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

క్లీన్‌చిట్‌తో సీఎం సమావేశం జరపాలి

హుబ్లీ: డబ్బులిచ్చి ప్రజలను తరలించి ఎవరైనా శక్తిని ప్రదర్శించవచ్చు. అహింద సమావేశంతో శక్తి ప్రదర్శన చేయాలనుకుంటున్న సీఎం సిద్దరామయ్య ముందుగా తనపై వచ్చిన అవినీతి ఆరోపణల నుంచి నిర్దోషిగా బయటపడి సమావేశం నిర్వహిస్తే ఎవరికీ అభ్యంతరం ఉండదని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. ఆయన శనివారం నగరంలో మీడియాతో మాట్లాడారు. తన స్వార్థానికి ఏ సామాజిక వర్గాన్నీ ఉపయోగించుకోరాదన్నారు. సీఎంపై డీసీఎం, డీసీఎంపై సీఎం పరస్పరం కత్తులు దూసుకొనే ప్రక్రియను మొదలుపెట్టారని ఎద్దేవా చేశారు. అంతేగాక ముఖ్యమంత్రి, ఆయన కుమారుడి అనుమతి మేరకే భారీ స్థాయిలో ముడా స్కాం జరిగిందన్నారు. ఈ కేసును సీబీఐతో దర్యాప్తు జరిపించకుంటే సీఎం సిద్దరామయ్య లోహియావాది లేదా సమాజవాదినని చెప్పుకునేందుకు అర్హుడు కాదని సీఎంపై మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం దివాళా దిశగా సాగుతున్నా తమ జేబులు నింపుకుంటున్నారని, ఇదే వారికి చివరి అవకాశం అన్నారు. సీఎం అవినీతిలో నిండా మునిగి ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని ఆయన దుయ్యబట్టారు.

రిజర్వేషన్ల కోసం పోస్ట్‌కార్డు ఉద్యమం

హుబ్లీ: రిజర్వేషన్ హక్కును ప్రభుత్వానికి ప్రతిపాదించాలని ఎమ్మెల్యేలను డిమాండ్ చేస్తూ పంచమసాలి ఆందోళనకారులు పోస్టుకార్డు ఉద్యమాన్ని నగరంలో ప్రారంభించారు. మంజునాథ్‌నగర్‌లోని కుందగోళ ఎమ్మెల్యే ఎంఆర్ పాటిల్ నివాసానికి శనివారం ఉదయం భేటీ చేసిన పంచమసాలి పీఠాధిపతి బసవజయ మృత్యుంజయ స్వామీజీ ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. ఈ వర్షాకాలంలో నిర్వహించే అసెంబ్లీ సమావేశాల్లో సంబంధిత సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు ఏక తాటిపై నిలిచి ముక్తకంఠంతో రిజర్వేషన్ కోసం గళమెత్తాలని స్వామీజీ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సుమారు 20 మంది సంబంధిత ఎమ్మెల్యేల నివాసాలకు వెళ్లి ఈ అభియాన్‌ను చేపడతామన్నారు. ఇప్పటికే ధార్వాడ రూరల్ ఎమ్మెల్యే వినయ్ కులకర్ణి, రాష్ట్ర మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్‌ను గతంలోనే ఈ విషయమై డిమాండ్ చేశామన్నారు. మిగిలిన ఎమ్మెల్యేల నివాసాలకు వెళ్లి ఈ డిమాండ్‌ను త్వరలోనే అసెంబ్లీలో వినిపించేలా ఎమ్మెల్యేలందరిపై ఒత్తిడి తెస్తామన్నారు.

నా తండ్రి స్ఫూర్తిని కొనసాగిస్తా



మాట్లాడుతున్న డాక్టర్ ఆకాశ్

హొసపేటి: తాను వైద్య వృత్తిలోకి రావడానికి తన తండ్రి స్ఫూర్తి కారణం అని నగర ప్రసిద్ధ వైద్యులు డాక్టర్ ఆకాశ్ తెలిపారు. ప్రపంచ వైద్యుల దినోత్సవం సందర్భంగా మంగళవారం ఆయన ఆశ్రయ ఆస్పత్రిలో విలేకరులతో మాట్లాడారు. తన తండ్రి డాక్టర్ కుమారస్వామి కూడా నగరంలో అత్యల్ప ఫీజుతో రోగులకు వైద్యసేవలు అందించారని గుర్తు చేశారు. తన తండ్రి స్ఫూర్తితోనే తాను కూడా నగరంలో గొప్ప వైద్యునిగా రోగులకు నిరంతరంగా సేవలను అందిస్తున్నానన్నారు. వైద్య వృత్తి ఎంతో పవిత్రమైందన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగుల ఆరోగ్య సమస్యలను తెలుసుకొని సరైన మందులను అందించాలన్నారు. రాబోయే రోజుల్లో తన ఆస్పత్రిని గొప్ప ఆస్పత్రిగా తీర్చిదిద్దుతానన్నారు. ప్రజలు ఆరోగ్యానికి నిత్యం కనీసం గంట పాటు యోగా, ధ్యానం, వాకింగ్, వ్యాయామం చేయాలన్నారు.


బాబూజీ ఆశయాలు అనుసరణీయం




విగ్రహానికి పుష్పాంజలి ఘటించిన అధికారులు

రాయచూరు రూరల్: నేటి ఆధునిక సమాజంలో బాబూ జగ్జీవన్ రామ్ ఆశయాలు, ఆదర్శాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని అదనపు జిల్లాధికారి దురుగేష్ అన్నారు. శనివారం నగరంలోని బాబూ జగ్జీవన్ రామ్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి మాట్లాడారు. కుల, మత, వర్గ, వర్ణ వ్యవస్థల నిర్మూలనకు ప్రథమ ఆద్యత కల్పించడంతో పాటు దేశంలో ఆహార పదార్థాల కొరత ఏర్పడినప్పుడు హరిత విప్లవాన్ని సృష్టించిన మహనీయుడన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ శివకుమార్, జెడ్పీ సీఈఓ రాహుల్ తుకారాం పాండే, ఏసీ మెహబూబి, సాంఘీక శాఖాధికారి మహేష్, ఆర్టీఏ కమిషనర్ మహబూబ్ జిలాని, నగరసభ కమిషనర్ గురుసిద్దయ్య, తహసీల్దార్ సురేష్‌వర్మ, రాజేంద్ర జాలదార్‌లున్నారు.

తాగునీటి కోసం పంప్‌హౌస్ ముట్టడి



పంప్‌హౌస్‌ను ముట్టడించిన ప్రజలు



ట్యాంక్ నుంచి వృథాగా పోతున్న నీరు

రాయచూరు రూరల్: తాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ నగరంలోని పలు వార్డుల ప్రజలు శనివారం హైదరాబాద్ రోడ్డులోని పంప్‌హౌస్‌ను ముట్టడించారు. ఎల్‌బీఎస్ నగర్, షియా తలాబ్, మక్తల్‌పేట, మడ్డిపేట, గంజ్ ఏరియా, అంద్రూన్ కిల్లా, బైరూన్‌కిల్లా, మచ్చి బజార్ కాలనీ వాసులు ఆందోళనకు దిగి మూడు గంటల పాటు ప్రజలు నిరసన తెలిపారు. ఆ సమయంలో నీటిని పంప్‌హౌస్ నుంచి ఇతరులకు ప్రభుత్వ భూముల్లో కూరగాయల సాగుకు వదులుతున్న సిబ్బంది వైనం వెలుగు చూసింది. తాగునీటిని సరఫరా చేసే పంప్‌హౌస్ నుంచి నీటిని సరఫరా చేసే పంపుసెట్లు పని చేయడం లేదని కింది స్థాయి సిబ్బంది చెప్పగా, మోటార్లు బంద్ చేసి కేబుల్‌ను తొలగించడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు. నగరసభ ఇంజినీర్ వచ్చి మోటార్లకు కేబుల్‌ను అమర్చాలన్నారు. నగర ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతుంటే నగరసభ సిబ్బంది డబ్బులకు కక్కుర్తి పడి తాగునీటిని ట్యాంక్ నుంచి పంటలు పండించుకోవడానికి నీటిని వదులుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సమస్యలు సత్వరం పరిష్కరించండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గవియప్ప

హొసపేటి: అవసరమైన చోట డ్రైనేజీ, సీసీ రోడ్లు నిర్మించాలని, తాగునీటి ఇబ్బంది తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే హెచ్‌ఆర్ గవియప్ప ఆదేశించారు. తాలూకాలోని నాగేనహళ్లి గ్రామంలో శనివారం తన అధ్యక్షతన జరిగిన జనసంపర్క సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా ఎమ్మెల్యే గ్రామాన్ని సందర్శించి మౌలిక వసతులను పరిశీలించారు. ఇదే సందర్భంగా ప్రభుత్వ సీనియర్ ప్రాథమిక పాఠశాల భవనాలను ప్రారంభించారు. అంగన్‌వాడీలను సందర్శించి చిన్నారులకు చిరుధాన్యాల ముద్దలు తినిపించారు. అనంతరం ఎమ్మెల్యే గ్రామంలో జనసంపర్క సమావేశాన్ని ప్రారంభించి ప్రజల సమస్యలను ఆలకించి మాట్లాడారు. అంతకు ముందు గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకు గ్రామస్తుల నుంచి ఘన స్వాగతం లభించింది. జీపీ అధ్యక్షుడు ఎం.దుర్గప్ప, ఉపాధ్యక్షురాలు డీ.సవితా, టీపీ ఈఓ హరీశ్, చంద్రశేఖర్, అల్లాభక్షి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మొక్కల పంపిణీ

పర్యావరణ సంరక్షణకు విద్యార్థులు విరివిగా మొక్కలను నాటి పెంచాలని ఎమ్మెల్యే గవియప్ప తెలిపారు. శనివారం నగరంలో డాక్టర్ పునీత్ రాజ్‌కుమార్ జిల్లా స్టేడియంలో విద్యార్థులతో మొక్కలు నాటించిన అనంతరం మాట్లాడారు. పూర్వ ప్రాథమిక పాఠశాలలో ప్రత్యేక వనమహోత్సవం సందర్భంగా చిన్నారుల పేరిట మొక్కలు నాటించడం అభినందనీయం అని తెలిపారు. అనంతరం వివిధ మొక్కలను నాటి నీరు పోశారు. పాఠశాల ఉపాధ్యాయులు, అటవీ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎల్‌ఐసీ పాలసీలపై జీఎస్టీ ఎత్తేయాలి



ఎంపీ తుకారాంకు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగ సంఘ ప్రముఖులు

బళ్లారి రూరల్ : భారతీయ జీవిత బీమా సంస్థ(ఎల్‌ఐసీ)లో పాలసీదారులపై విధించే 18 శాతం జీఎస్టీని ఎత్తివేయాలని బళ్లారి ఎల్‌ఐసీ బ్రాంచుల ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏఐఐఈఏ) దేశవ్యాప్తంగా చేపట్టిన ఎంపీలకు వినతిపత్రం అందజేత కార్యక్రమంలో భాగంగా శనివారం సండూరుకు వెళ్లి బళ్లారి ఎంపీ ఈ.తుకారాంకు వినతిపత్రాన్ని అందజేశారు. సంఘం ప్రముఖులు మాట్లాడుతూ పొదుపు, జీవిత భద్రత కోసం ఎల్‌ఐసీ పాలసీని, ఆరోగ్య బీమా తీసుకొనే పాలసీదారులపై విధించే 18 శాతం జీఎస్టీని ఎత్తివేయాలని కోరారు. అదేవిధంగా పాలసీదారులకు అనుకోని సంఘటనలు జరిగినప్పుడు అందజేసే మొత్తంపై పన్నును ఎత్తివేయాలని, ఎల్‌ఐసీలో పన్నువసూలుపై ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఎల్‌ఐసీ సంస్థ ఈ నిర్ణయాలు తీసుకొంటే ప్రజల్లో సామాజిక భద్రత పెంపొంది అధికసంఖ్యలో ప్రజలు పాలసీలు తీసుకోవడానికి ముందుకొస్తారన్నారు. ఈ నేపథ్యంలో ఎల్‌ఐసీ సంస్థ మరింత అభివృద్ధిని సాధిస్తుందన్నారు. ఎల్‌ఐసీ ఉద్యోగుల డిమాండ్లపై పార్లమెంట్‌లో ఎంపీలు సంబంధిత మంత్రితో చర్చించి తమ గళాన్ని వినిపించాలన్నారు. యూనియన్ రాయచూరు డివిజన్ అధ్యక్షుడు కామ్రేడ్ శరణుగౌడ, కామ్రేడ్ ఎం.రవి, బళ్లారి బ్రాంచ్–1,బ్రాంచ్–2 ఉద్యోగుల సంఘ ప్రముఖులు పాల్గొన్నారు.

విద్యా, ఆరోగ్య, ఉద్యోగ రంగాలకు పెద్దపీట



మాట్లాడుతున్న నితీష్

రాయచూరు రూరల్: జిల్లాలో విద్యా, ఆరోగ్య, ఉద్యోగ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తామని జిల్లాధికారి కె.నితీష్ పేర్కొన్నారు. శనివారం జిల్లాధికారి కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించి విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మహత్తర పథకం మేరకు జిల్లాను ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దడమే తన కర్తవ్యమన్నారు. జిల్లాలో వెనుకబడిన, మైనార్టీలు, ఎస్సీ, ఎస్టీ జనాభా అధికంగా ఉన్నారన్నారు. చిత్రదుర్గ నవోదయలో విద్యనభ్యసించానని, యూపీఎస్సీలో 8వ ర్యాంక్ పొందానన్నారు. జిల్లాలో సమస్యల పరిష్కారానికి ప్రామాణిక ప్రయత్నం చేస్తామని, ప్రజల సహకారం అవసరమన్నారు.

108 సిబ్బంది ఔదార్యం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గాయపడిన వ్యక్తి

రాయచూరు రూరల్: రైలు నుంచి జారి పడి గాయపడిన వ్యక్తిని ఆస్పత్రిలో చేర్చి 108 అంబులెన్స్ సిబ్బంది ఉదారత చాటారు. శుక్రవారం రాత్రి సైదాపుర నుంచి రాయచూరుకు రైలులో వచ్చిన వ్యక్తి దిగుతూ కాలు జారి కింద పడి గాయపడ్డాడు. ఈ నేపథ్యంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తిని అంబులెన్స్ సిబ్బంది రిమ్స్ ఆస్పత్రిలో చేర్చారు. క్షతగాత్రుని లగేజీ, ఇతర వస్తువులను రిమ్స్ అధికారులకు పైలెట్ ఖాసిం అలీ, ఈఎంటీ ఎండీ హైమద్ అలీ అప్పగించారు.

అక్రమాల అడ్డాగా బుడా కార్యాలయం

- డెవలపర్స్‌ను బ్రోకర్లుగా పెట్టుకున్న వైనం
- బుడా మాజీ అధ్యక్షుడు నారా ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న నారా ప్రతాప్‌రెడ్డి

సాక్షి,బళ్లారి: తాను కూడా బుడా అధ్యక్షుడిగా, రాష్ట్రంలో నగరాభివృద్ధి ప్రాధికారాలకు అధ్యక్షుడిగా కూడా పని చేసినా గతంలో ఎక్కడా, ఎన్నడూ జరగని అవినీతి అక్రమాలు బుడా కార్యాలయంలో జరుగుతున్నాయని బుడా మాజీ అధ్యక్షుడు నారా ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. గత రెండేళ్ల నుంచి బుడా కార్యాలయంలో జరిగిన అవినీతి, అక్రమాలపై సమగ్ర తనిఖీ చేపట్టాలని ఒత్తిడి చేశారు. బుడా కమిషనర్ రమేష్ అనే వ్యక్తి ఒకరు కాదు ఇద్దరు కాదు ఏకంగా 12 మంది పీఏలను పెట్టుకుని కమీషన్లు దండుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయన్నారు. అన్ని వ్యవస్థలను తన గుప్పెట్లో పెట్టుకుని వ్యవహరిస్తున్నారని ఆయన అన్నారు.

పీఏలతో కమిషనర్ కమీషన్ల వసూలు

మూడు రోజులు బళ్లారి, మరో రెండు రోజులు గదగ్, మిగిలిన రోజులు హొసపేటిలో ఉంటూ ఆయన అక్రమాలకు తెర తీశారన్నారు. బుడా కార్యాలయంలో అక్రమాలపై లోకాయుక్త ఎస్పీకి ఫిర్యాదు చేశామన్నారు. సింగిల్ లే అవుట్లు వేసి, బుడాకు కూడా ఆదాయం రాకుండా తన స్వంత లాభం కోసం పని చేస్తున్నారని మండిపడ్డారు. డెవలపర్స్‌ను కూడా బ్రోకర్లుగా పెట్టుకుని పనులు చేస్తున్నారన్నారు. బుడాలో డబ్బులు ఇస్తేనే పనులు చేస్తున్నారని, ప్రతి పనికి ఓ రేటు ఫిక్స్ చేశారని గుర్తు చేశారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు ఫోన్ చేశారని అబద్ధాలు, ఏదో ఒకసాకు చెబుతూ తన అక్రమాలకు అడ్డు అదుపూ లేకుండా చేసుకుని పెద్ద ఎత్తున డబ్బులు పోగేసుకుంటున్నారన్నారు.

గత రెండేళ్ల అవినీతిపై దర్యాప్తునకు ఒత్తిడి

బుడాను అక్రమాల అడ్డాగా చేసుకున్న విషయంపై సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్ఎండీసీపై కేంద్ర మంత్రి కుమారస్వామి శ్రద్ధ పెట్టాలని విన్నవించారు. అన్ని విధాలుగా భూమి కూడా ఉందని, ఎన్ఎండీసీ– జిందాల్ ఇరుగు పొరుగున ఉన్నట్లు అవుతుందన్నారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి హుబ్లీ–ధార్వాడకు మాత్రమే మంత్రిగా ఉన్నారన్నారు. ఆయన ఇతర ప్రాంతాల్లోని సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. కార్పొరేషన్‌కు ఫారం–2లకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, ఎన్ని రిజిస్ట్రేషన్లు జరిగాయో పరిశీలిస్తే రిజిస్ట్రేషన్ కార్యాలయంలో జరిగిన అక్రమాలు కూడా బయటకు వస్తాయని, ఈ విషయాన్ని తాను స్వయానా జిల్లాధికారికి కూడా ఫిర్యాదు చేశానన్నారు.

తుంగభద్రకు జలకళ



తుంగభద్ర డ్యాం

హొసపేటి: రైతుల జీవనాడి తుంగభద్ర ఇప్పుడిప్పుడే జలకళ సంతరించుకుంటోంది. రుతుపవనాల కారణంగా ఇప్పటికే నదీ పరివాహక ప్రాంతాల్లో జోరుగా వర్షాలు కురుస్తుండటంతో శనివారం డ్యాంకు 46,300 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరడంతో నీటి నిల్వ 13.901 టీఎంసీలకు చేరుకుంది. జలాశయానికి ఎగువన శివమొగ్గ, శృంగేరి, తీర్థహళ్లి, ఆగుంబే తదితర ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో తుంగభద్రకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. డ్యాంలోకి వరద ప్రవాహం పెరుగుతుండటంతో తుంగభద్ర ఆయకట్టు రైతుల్లో ఖరీఫ్ ఆశలు చిగురిస్తున్నాయి. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ సారి జలాశయానికి ముందుగానే వరద నీరు వచ్చి చేరుతోంది. ఈ సారైన పంటల సాగుకు అవసరమైన సాగునీరు లభిస్తుందని ఆయకట్టు రైతులు ఆశిస్తున్నారు. ప్రస్తుతం జలాశయం నీటిమట్టం 1593.19 అడుగులకు చేరుకుంది. మరి కొద్ది రోజుల పాటు డ్యాంలోకి వరద నీరు భారీగా వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే శివమొగ్గ జిల్లాలో తుంగా డ్యాం నుంచి దిగువకు నీటిని విడుదల చేసిన విషయం తెలిసిందే. గత ఏడాది ఇదే సమయంలో జలాశయానికి కేవలం 193 క్యూసెక్కుల వరద మాత్రమే వచ్చేదని తుంగభద్ర బోర్డు అధికారులు తెలిపారు.

జిల్లాధికారిగా నితీష్ బాధ్యతల స్వీకారం



నూతన జిల్లాధికారిగా బాధ్యతలు స్వీకరించిన నితీష్

రాయచూరు రూరల్: రాయచూరు నూతన జిల్లాధికారిగా కె.నితీష్ అధికార బాధ్యతలు చేపట్టారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్ చేతుల మీదుగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు జిల్లాధికారి దుర్గేష్, ఏఎస్పీ శివకుమార్, జెడ్పీ సీఈఓ రాహుల్ తుకారాం పాండేలున్నారు.

రూ.24 లక్షల సెన్సర్ల చోరీ

హుబ్లీ: ధార్వాడ తాలూకా ముమ్మిగట్టి సమీపంలోని టాటా మోటార్స్ కంపెనీలో లక్షల విలువ చేసే సామగ్రి చోరీకి గురైన ఘటన శుక్రవారం జరిగింది. సదరు కంపెనీలో భద్రపరిచిన బస్సులకు వినియోగించే రూ.24 లక్షల విలువ చేసే సెన్సర్‌లను చోరీ చేశారు. ఘటనపై గరగ పోలీసులకు ఆ కంపెనీ సీనియర్ అధికారులు ఫిర్యాదు చేయగా, ఆ స్టేషన్ సీఐ సమీర్‌ఉల్లా దర్యాప్తు ప్రారంభించారు.

వాల్మీకి కుంభకోణంలో ఇద్దరికి నోటీసులు జారీ

రాయచూరు రూరల్: మహర్షి వాల్మీకి అభివృద్ధి మండలిలో జరిగిన రూ.187 కోట్ల అవినీతిపై విచారణకు మాజీ మంత్రి, బళ్లారి గ్రామీణ ఎమ్మెల్యే నాగేంద్రకు, అభివృద్ధి మండలి అధ్యక్షుడు, రాయచూరు గ్రామీణ శాసన సభ్యుడు బసనగౌడ దద్దల్‌కు సిట్ అధికారులు శుక్రవారం రాత్రి నోటీసులు జారీ చేశారు. ఈమేరకు శనివారం పాత్రికేయులకు విడుదల చేసిన ఓ ప్రకటనలో 9వ తేదీ మంగళవారం విచారణకు హాజరు కావాలని అధికారులు సూచించారు.

రౌడీమూకల ఆటకట్టుకు కార్యాచరణ

హుబ్లీ: ప్రజలను నానావిధాలుగా వేధించే రౌడీమూకలను ఆటకట్టించేందుకు జంట నగరాల పోలీస్ కమిషనర్ శశికుమార్ శ్రీకారం చుట్టారు. పాత హుబ్లీ స్టేషన్ పరిధిలోని పోలీస్ ఏరియా డ్యామినేషన్ కార్యాచరణ చేపట్టి ఆ స్టేషన్ పరిధిలో 33 మంది రౌడీషీటర్లను, గతంలో నేరాల్లో పాల్గొన్న 17 మంది, గంజాయి విక్రయాలకు పాల్పడిన 5 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ రౌడీల ఇప్పటి, గత చరిత్ర నడవడికపై సమగ్రంగా ఆయన పరిశీలించారు. కొత్త లేఅవుట్లు, నడిరోడ్డులో మందు బాబుల ఆట కట్టించారు. ఈ మేరకు 24 మంది మందుబాబులను అదుపులోకి తీసుకున్నారు. ఎవరైనా కానీ చట్టానికి వ్యతిరేకంగా నడుచుకుంటే కఠిన చర్యలు తప్పవని కొత్త కమిషనర్ శశికుమార్ హెచ్చరికలు జారీ చేశారు.